భారతి

సాహిత్య మాసపత్రిక
నవంబరు 1978

జనఘోష
ప్రసాద్

ఆ ఆదిదేవుడే అతని వాడు
సోమరాజు

ఆగదు ఆ రైలు వేగం
సుధాకరరావు

నా మోనా లిసా
కేఎస్వీ

రేపు
లూసన్
(పార్థసారధి)

ఆరవ ప్రణాళిక
తిలక్

ఇంద్రపాల నగర శాసనం
కీ॥ శే॥ రామారావు

హిందూగణ తంత్రాలు
వెంకటేశ్వర్లు

ఇంకా కిశోరుబాబు, అశోకుబాబు, భానుమూర్తి, రాజు, శివారెడ్డి, లక్ష్మణశాస్త్రి నారాయణరావు, దత్త ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

నవంబరు 1978

సంపుటము : 55   సంచిక : 11

విడిపత్రిక వెల రూపాయిన్నర

చిన్న రైతులకు పెద్దఎత్తున సహాయం

ఈనాడు మన సన్నకారు రైతులు అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర వహిస్తున్నారు ఆంధ్రప్రదేశ్ లో యిప్పుడు అమలులోఉన్న సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ కార్యక్రమాలు, లాభసాటిగాని రైతుల, వ్యవసాయ కూలీల పథకం, పశుపోషణ కార్యక్రమాలు ఇవన్నీ సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన రైతులు, సన్నకారు రైతుల సంక్షేమానికి ఉద్దేశించబడినాయి.

1978 జనవరి ఆఖరు నాటికి సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థవారు అన్ని విధాల సహాయం అందజేయడానికి **6.58** లక్షల మంది రైతులను గుర్తించారు. క్షామపీడిత ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం అమలు నిమిత్తం జిల్లాలలో **1974-75** నుంచి **1977-78** మధ్యకాలంలో రూ. **22.54** కోట్ల మొత్తం సహాయక గ్రాంటుగా ఇచ్చారు.

తత్ఫలితంగా చెరువులు, బావులు, అడవుల పెంపకం, పాడి పశువుల పంపిణీవంటి కార్యక్రమాల అమలులో ప్రోత్సాహకరమైన ఫలితాలను సాధించాం. ఇందువల్ల విస్తరిస్తున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సన్నకారు రైతులు కీలకపాత్ర వహించగలుగుతున్నారు.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హైదరాబాదు.

19/78-79

విషయానుక్రమణిక

నవంబరు 1978

*

భాను మతి: అంతర్యావిష్కరణ

భానుమూర్తి

పుర భామల వివిధ కళా కౌశల ప్రదర్శనోత్సవంలో —
సరస్వతీ స్వరూపంలో సాక్షాత్కరించిన సరసమతివి
సౌమ్యత దేహమంతా అలముకొన్న అతిలోక సౌందర్యవతివి
విలాస విభ్రమాలు మేననలందుకొన్న అపురూప లావణ్యవతివి
ధీమంతుని ధీరోదాత్త మధురోహలకు దీప్తినిచ్చే ధీధితివి
భాస్వంతుని భావోద్వేగాని కుజ్జ్వలత నొసగే భానుని మతివి.

నా సుమనస్సరోవరంలో వికసించిన సహస్రదళ పద్మకాంతివి
మామక హృదయ క్షేత్రంలో తత్క్షణమే ప్రభవించిన ప్రణయ రసానుభూతివి
మదీయ మన్మథన సారావిర్భూత కళాప్రత్యక్ష రూపరతివి
నా జీవన సాహితీ తపః ఫలసిద్ధికి సద్యోదార్శనిక క్రాంతివి

మున్నెపుడో అన్నాడట సాహసికవిసత్తము డొకడు, 'వాణి నా రాణి' అని
అది యథార్థమో యా బ్రహ్మల అపవాదో తెలియదు — కాని
నా ప్రాక్తన జన్మ పుణ్యవశ వాగ్విభూతికి నీవే పట్టమహిషివి
నా నిగూఢాలోచనా వ్యవసాయ పరిపాకానికి ఆధార జీవనము నీవు.

వాగధిష్ఠాన దేవిగా రూపుదాల్చిన నువ్వెన్నడూ నాదానివేనని
నాడే గాఢాభినివేశంతో హృదయ నిక్షిప్తమైన ఆత్మీయత అంతర్యానికి ఆవిష్కరణ నేడు.
ఇదంతా సరసులు నా భామ నుతి అనుకున్నా సక్రమంగా నా భానుమతి
ప్రసన్న దరహాస ముఖరుచితో సమ్మతి నిస్తేనే యీ కృతి జన్మకు సార్థకత.

వేడికోలు

శ్రీ కే. కిశోరుబాబు

రామ ప్రభూ!
నా గర్వం
పరశు రాముడు
బుద్ధి
మంథర
హృదయం
అహల్య

శ్రీ కే. అశోకుబాబు

మనస్సు
శబరి కొరికిన ఎంగిలిపండు
భక్తి ఉడుత
కరుణ జూపినా
కాలరాసినా
భారం నీదే!

ఆగదు ఆ రైలువేగం!

శ్రీ మేకా సుధాకరరావు

ఈ జీవిత కాలమనే రైలులో
పయనిస్తున్న నన్ను — మధ్య
మీ స్టేషనులో ఎక్కి కలిశావు.

కలిసిన మనుషులు, పెనవేసుకున్న మనసులు
నెరపిన స్నేహం
కడుదూరంగా తీసుకుపోతూంది రైలు !

నా గమ్యం చేరువైనది
నీ గమ్యం దూరమైనది !

తోవలో నన్ను రాల్చి
ముందుకు పోతుంది నీ రైలు !

నిజానికి నా గమ్యం అగమ్యం
మరి నీదికూడ అదే గమ్యం !

అందుకే — స్థిత ప్రజ్ఞనివంటి
రైలంటే నాకు గౌరవం —

కలిపి స్నేహం పెంచుతుంది
వేరుచేసి మనసులు త్రుంచుతుంది !

అయినా —
ఆ సంతోష సంతాపాలేవీ అంటవు —
తానలా పోతూనే ఉంటుంది.
ఆ రైలువేగం ఆగదు !
నా రాగం దాగదు !

రైలు సాగేకొలదీ చేరువైపోతూన్న
నా స్టేషను ఎప్పుడో చటుక్కున వచ్చేస్తుంది
నిద్రపోతున్న నిన్ను లేపడం ఇష్టంలేక -

ఇష్టమున్నా లేకున్నా
నేను దిగి వెళ్ళిపోవాలి !

ఇది తప్పదని తెలుసు
అయినా తప్పుకోలేదు మనసు !
అదేనేమో ఈ జీవితపు సొగసు ! !

నేను......

శ్రీ బి. ఎస్. రాజు

దూది పింజల్లాంటి
తెల్లని మేఘాలన్నీ కలసి
నల్లని మబ్బులుగామారి --
పండు వెన్నెల నిచ్చే
నిండు చంద్రుడ్ని
నాకు కనుమరుగు చేసినపుడు
నేను ...
తళుక్కున మెరిసే
మెరుపునై

దిగంతాల్లో గర్జించే
ఉరుమునై
కారుమబ్బులను
ప్రశాంత ఆకాశమునుండి
కరగించివేసి
బిటలుగా మారిన
భూదేవి నోట్లో నీళ్ళునింపి
కర్షకుల మోములపై
చిరునవ్వులు చిందింప జేస్తాను.

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

శాంతరస విమర్శము

'రసో వై సః' అను వేదవాక్యముచేత రసమునకు బ్రహ్మరూపత్వము చెప్పబడినది. కనుక బ్రహ్మమువలె రసముగూడ స్వప్రకాశమే. ఈ విషయము సహృదయులైన భావుకులకు ప్రత్యక్షమే. రసశాస్త్రకారులైన భరత మున్యాదులు లౌకిక రసమును ప్రతిపాదించి 'గుడజిహ్వికాన్యాయము'చేత ప్రాకృతులకు గూడ అప్రాకృతమగు రసమునందు ప్రవృత్తి కలిగించుటకు ప్రయత్నించినారు.

సాహిత్య సముద్రమునందు ఓలలాడినవారి మనస్సు పరిశుభ్రమైయుండును. వారికి అన్ని రసముల రుచి తెలియును. కనుక వారు శాంతరసమును అంగీకరించియే తీరుదురు. దానిని రససముదాయమునుండి యెందరు తొలగించినను, ఆ రసముయొక్క మహిమయే దానికి రససముదాయమునందు పునః ప్రతిష్ఠ చేకూర్చుచున్నది.

క్రీ॥ శ॥ 9వ శతాబ్దికి పూర్వమందుండిన ఆచార్యులు శాంతరసమునకు శ్రవ్యకావ్యమునందు గూడ స్థానము కల్పించలేదు. 9వ శతాబ్దియందు ఆనందవర్ధనాచార్యుడు శాంతరసమునకు రసత్వము సాధించెను. దశరూపకాది గ్రంథకర్తలగు ధనంజయాదులు 10వ శతాబ్దియందు దృశ్యకావ్యమునందు గూడ శాంతరసమును నిరాకరించినారు. ఆ తరువాతి ఆచార్యులగు అభినవగుప్త పాదాదులు శాంతమునకు రసత్వము గట్టిగా సాధించిరి.

తొమ్మిదవ శతాబ్దికి పూర్వముండిన శాంతరస విరోధులైన విద్వాంసులందు మూడు మతములున్నవి.

1) భరతముని నాట్యశాస్త్రమునందు శాంతరసోచితములైన ఆలంబనోద్దీపన విభావములను, సంచారి భావములను, స్థాయి బావమును ప్రతిపాదించలేదు కనుక అతని మతమునందు దృశ్యకావ్యములందు శాంతము రసము కాదని తన్మతానుయాయులైన విద్వాంసులుగూడ శాంతరసమును అంగీకరించలేదు.

2) రాగద్వేషములను ఛేదించుటయే 'శమము' అనబడును:

''న యత్ర దుఃఖం న సుఖం న చింతా
న ద్వేషరాగౌ న చకా చిదిచ్ఛా''

అను ప్రమాణమునుబట్టి, యవి యేవియు లేకుండుటయే 'శమము' అని వారి బావము. 'రాగద్వేషములు—తృష్ణ' వీనిని ఉచ్ఛేదించుట అసంభవము. అవి అనాది కాలమునుండి ప్రాణులను ఆశ్రయించి వచ్చుచున్నవి. అందువలన 'శాంతమునకు రసత్వము సంభవించదు' అని కొందరి మతము.

3) ఇక మూడవవారు : 'శాంతరసమును వీరరసమునందే అంతర్భవింపజేయుట ఉచితము. దానికి పృథక్సత్త స్వీకరింపదగదు' అని అనెదరు.

క్రీ॥ శ॥ దశమ శతాబ్దికి చెందిన 'దశరూపక' కర్త, ధనంజయుడు, దాని వ్యాఖ్యానమగు 'అవలోకము'ను రచించిన 'ధనికుడు'న్ను దృశ్యకావ్యములందు (నాటక—నాట్యములు) శాంతరసము ఉండనే ఉండదు. ఎందుకనగా, 'శమము' సర్వవ్యాపార విలయ రూపమే యగును. దృశ్యకావ్యము అభినేయము గనుక, అది సమస్త వ్యాపార ప్రవర్తక మగును సమగ్ర వ్యాపారములను అభినయించు నటునియందు వ్యాపార విలయాత్మకమగు శమము కలుగుట అసంభవమే యగును. కనుక నాటక—నాట్యములయందు శాంతరసము సర్వథా సంభవించదు. దీనికి ప్రమాణముగా —

''శాంతస్య శమసాధ్యత్వాత్ నటేచ తద సంభవాత్।
అష్టావేవ రసా నాట్యే, న శాంతస్తత్రయుజ్యతే॥''

అను ప్రాచీనాచార్యుల వచనమును చూపినారు. దశరూపకమునందు:

''శమమపి కేచిత్ ప్రాహుః పుష్టిర్నాట్యేషు నైతస్య''

అని ధనంజయుడు చెప్పినాడు. ఈ భావమును వివరించుచు ధనంజయుడు—''శమమును స్థాయిభావముగా స్వీకరించినచో, దానికి స్థాయిత్వము కుదురదు. ఎందుకనగా, అది విరుద్ధములు—అవిరుద్ధములునైన భావములను ఉచ్ఛేదించదు. శమముగాని లేక నిర్వేదముగాని శాంతరస స్థాయిభావమైనప్పుడు అది, విరుద్ధావిరుద్ధ భావములను ఛేదించవలెను. అది అట్లు చేయజాలదు గనుక, శమమునకు గాని, లేక నిర్వేదమునకు గాని స్థాయిత్వము సిద్ధించదు. శమ—నిర్వేదాదులను నాటకమునందు పోషించుట వైరస్యమునకు దారి తీయును. కాబట్టి స్థాయి భావములుగూడ ఎనిమిదే యగును'' అని ఈ విధముగ 'ధనంజయ—ధనికులు' శాంతరసమును అంగీకరించక రసములు ఎనిమిదే యనిరి.

నవమ శతాబ్దివాడైన ఆనందవర్ధనుడు తన 'ధ్వన్యాలోకము'నందు 'శాంతోఽపి నవమో రసః' అని చెప్పి, పూర్వమతత్రయమును ఈ క్రింది విధముగా ఖండించెను:

1) శాంతరసము అలోక సామాన్యులగు మహానుభావుల చిత్తవృత్తి విశేషము. ఇది తృష్ణాక్షయ రూపమగు సుఖమును పరిపోషించును. ఆ సుఖము ఇతర సుఖము లన్నిటికన్న మిన్నయైనది:— ఎట్లనగా,

''యచ్చ కామసుఖం లోకే యచ్చదివ్యం మహత్సుఖం।
తృష్ణాక్షయ సుఖస్యైతే నార్హతః షోడశం కలాం॥''
అని చెప్పి, అట్టి శమముగాని నిర్వేదముగాని తప్పక ప్రతీయ మానమగును. ''అది యందరికిని అనుభవనీయముకాదు. దానిని భరతాదులు ప్రతిపాదించలేదు'' అని దానిని త్రోసి పుచ్చుటకు వీలులేదు.

2) అలౌకిక సామాన్య మహానుభావులయందు రాగద్వేషతృష్ణాదుల క్షయము గోచరించును గనుక, దానికి శాంతరస సత్తారూపమగు స్థాయిత్వము కలదు. అట్టి స్థాయియే శమము.

3) ఇట్టి స్వతంత్ర రసము వీరరసములో నంతర్భూతము కాద గదు. వీరరసము అహంకారమయము. శాంతరసము అహంకార విలయ స్వరూపము. ఇట్టి విరుద్ధ రసములకు ఐక్యము సంభవించదు. ఐనను వీర—శాంతములకు ఐక్యము కల్పించ వచ్చు ననినచో, వీరరౌద్రములకు గూడ కల్పింపవచ్చును. దయా — ధర్మ — దాన వీరాదులు అహంకార రహితము లైనప్పుడు శాంతరస భేదములు, అహంకార సహితము లైనప్పుడు వీరరస ప్రభేదములు ననుట చెల్లును.

క్రీ॥ శ॥ పదుమూడవ శతాబ్ది పూర్వార్ధమునందు వెలసిన 'సాహిత్య దర్పణ' కారుడగు 'విశ్వనాథ కవిరాజు' పై మతమును ఈ క్రిందివిధముగా సమర్థించెను:—

''నిరహంకార రూపత్వం దయా వీరాది రేష నో'' అని. ఇతర విద్వాంసులు గూడ సమర్థించిరి:—

''సర్వాకార మహంకార రహితత్వం వ్రజంతి చేత్।
తత్రైవాంతర్భవిష్యంతి దయావీరాదయస్తథా॥'' అని.

ఆలంకారిక శిరోమణులగు ''శ్రీ మదభినవగుప్త, పాదాచార్య, మమ్మటభట్ట, విశ్వనాథ కవిరాజ, పండితరాజ జగన్నాథాదులు'' 'ధనంజయ — ధనిక' మతమును ఈ క్రింది విధముగా ఖండించిరి :—

అభినవ గుప్తుల మత మేమనగా, ''కామాదుల యందు సముచితములైన రత్యాది శబ్దవాచ్యములగు చిత్తవృత్తులు కవి వ్యాపారము చేత, నట వ్యాపారము చేతను ఒక యోగ్యతను సంతరించుకొని, దానికి అనువగు హృదయము గల సామాజికులకు శృంగారాది రూపమగు రసత్వమును కూర్చు విధమువనే, మోక్షోచితమగు శమచిత్త వృత్తిగాని, లేక నిర్వేద చిత్తవృత్తిగాని శాంత రూపమైన రసత్వమును కూర్చుననుటలో ఏమాత్రము సందేహము లేదు.

అభినవగుప్త పాదాచార్యులు క్రీ॥ శ॥ దశమ శతాబ్దియంతము లోను, ఏకాదశతమ శతాబ్దయాదిలోను, భరతముని నాట్య శాస్త్రమునకు 'అభినవ భారతీ' అను వ్యాఖ్యానమును, ఆనందవర్ధనాచార్యుల 'ధ్వన్యాలోక'మునకు 'లోచనము' అను వ్యాఖ్యానమును రచియించిరి. ధ్వని శాస్త్రమునకు గాని, రస శాస్త్రమునకు గాని, నాట్య శాస్త్రమునకు గాని వానికి మించిన వ్యాఖ్యలు లేవు.

క్రీ॥ శ॥ పదకొండవ శతాబ్దిలో 'కావ్య ప్రకాశము' ను రచించిన 'మమ్మట భట్టు' లక్షణోదాహరణాది నిరూపణము ద్వారా శాంతమునకు రసత్వము స్థాపించెను. పై యిద్దరి ఆచార్యుల మతమును విశ్వనాథ కవిరాజు అనుసరించినాడు.

క్రీ॥శ॥ 17 వ శతాబ్ది వాడైన పండితరాజు జగన్నాథుడు ధనంజయ — ధనికుల మతమును ఈ క్రింది విధముగా ఖండించెను:

'అభినయ వ్యాపారమును సలుపు నటుని యందు సర్వ వ్యాపార విలయాత్మకమగు శమము సంభవించదు' అను ధనంజయ — ధనికుల మతము సరికాదు ఎందుకనగా, రసాభివ్యక్తి నటుని యందు కలుగదు. సామాజికుని యందే అది కలుగును. కనుక సామాజికుని యందు శాంతరసము అభివ్యజ్యమాన మగుటకు విరోధమేమియు నుండదు, అని చెప్పి, దీనికి ప్రమాణముగా —

''అష్టావేవరసా నాట్యే ష్వితి కేచి దచూచుదన్।
తదచారు; యతః కంచిన్నరసం స్వదతే నటః॥''

అని 'సంగీత రత్నాకర' శ్లోకమును చూపెను.

'నటునియందు శమము ఉండదు గనుక నతడు శమమును అభినయించజాలడు' అనుట గూడ తప్పు. ఎందుకనగా — నటుని యందు రతి — క్రోధాదులు గూడ నుండవు. అవి లేకున్నను, నతడు వానినభినయించునట్లే శమమును గూడ శిక్షాభ్యాస పాటవము చేత నభినయించగలడు.

శాంతరసము

''న యత్ర దుఃఖం న సుఖం న చింతా
న ద్వేష రాగౌ న చ కాచిదిచ్ఛా।
రసస్స శాంతః కథితో మునీంద్రైః
సర్వేషు భావేషు సమ ప్రమాణః॥''

అని శాంతరస లక్షణము.

శాంతరసమునకు ఆలంబన విభావము — సర్వ వస్తువుల యందు తుచ్ఛత్వ బుద్ధిగాని, పరమాత్మ స్వరూపముగాని యగును. ఉద్దీపన విభావములు —పుణ్యాశ్రమాదులు, మహాపురుష సంగాదులు నగును. అను భావములు — రోమాంచాదులు. సంచారి భావములు హర్ష — స్మరణాదులు. స్థాయి భావము — శమముగాని, నిర్వేదముగాని యగును.

శాంతరసము కుందేందువుల వలె ధవళ వర్ణముగలది. దానికి శ్రీమన్నారాయణుడు దైవతము. అది ఉత్తమ ప్రకృతి యుక్తము. ఇట్టి శాంతరసమునకు ఉదాహరణముగా మమ్మట

భట్టు తన 'కావ్య ప్రకాశము' నందు ఈ క్రింది శ్లోకమును చెప్పెను :—

''అహౌ వా హారే వా కుసుమశయనే వా దృషది వా
మణౌ వా లోష్టే వా బలవతి రిపౌ వా సుహృది వా।
తృణే వా స్త్రైణే వా మమ సమదృశో యాంతి దివసాః
క్వచిత్పుణ్యారణ్యే శివ శివ శివేతి ప్రలపతః॥'' అని.

ఇచట మిథ్యయగు ప్రపంచము ఆలంబన విభావము. పుణ్యారణ్యము ఉద్దీపన విభావము. విరుద్ధ వస్తువులయందు సమదృష్టి అను భావము. మతి — ధృతి—హర్షములు వ్యభిచారి భావములు. శమముగాని లేక నిర్వేదము గాని స్థాయి భావము. తజ్ఞులగు సామాజికులచేత శాంతరసము అనుభూయమానమగును. ఈ శాంత రసమునకు ప్రత్యుదాహరణముగా పండితరాజ జగన్నాథుడు ఈ క్రింది శ్లోకమును ఉదాహరణముగా చెప్పెను :—

''సురస్రోతస్విన్యాః పులిన మధితిష్ఠన్ నయనయోః
విధాయాంతర్ముద్రా మథ సపది విద్రావ్య విషయాన్।
విధూతాం తర్ధ్వాంతో మధురమధురాయాం చితి కదా
నిమగ్నః స్యాం కస్యాంచన నవనభస్యాంబుదరుచి॥'' అని.

ఇందు విభావాదులు ఉన్నప్పటికిని, శాంతరసము లేదు. ఇది కేవలము కవిగతమైన వాసుదేవ విషయక రతి భావమే. దానికే యిచట ప్రాధాన్యము కలదు. కనుక నిది 'భావధ్వని' యనబడును.

శాంతమునందు శమముగాని, లేక నిర్వేదముగాని స్థాయి భావ మగును. 'శమస్థాయి భావము శాంతము' అని విశ్వనాథ కవి రాజు చెప్పెను.

''నిర్వేదస్థాయి భావోఽస్తి శాంతోఽపి నవమో రసః''
అని మమ్మటాచార్యుడును చెప్పెను ఈ యిరువురిలో వైమత్యము గోచరించుచున్నను, ఈ రెంటి స్వరూపమును చూచినచో, రెండును ఒకటే యని తెలియనగును. ఎట్లనగా—

''శమో నిరీహావస్థాయాం స్వాత్మవిశ్రామజం సుఖమ్''
అని విశ్వనాథుని శమ లక్షణము.

మహాభారతమునందు శాంతము ప్రధాన రసము. వీర— రౌద్రాదులు అంగరసములు. అందలి పాండవాది చరితము అవసాన విరసము, అవిద్యా ప్రపంచమున్ను గనుక —

''భగవాన్ వాసుదేవోఽత్ర కర్త్యతేహి సనాతనః''

అని మహాభారతారంభమునందే వ్యాసభగవానుడు ప్రతిజ్ఞచేసెను. చివరకు 'హరివంశ' కథనము గూడ శాంతరసమునే మహాభారతము నందు ధ్రువీకరించుచున్నది. భగవద్గీత గూడ 'మధ్యమణి న్యాయము'గా మహాభారతములో నున్నది. కనుక, భగవద్గీతా శాంతరసజ్యోతి అంతటను వ్యాపించినట్లే, వ్యాసభగవానుడు మహాభారతమునందలి ఆది — మధ్యావసానములు శాంతరసముతోనే యభివర్ణించి, పాండవాది వృత్తములు హేయములు అని నిరూపించెను.

మహాభారతమునందు వర్ణింపబడిన 'దేవతా—తీర్థ—తపశ్చర్యాఽఽదులు, పాండవాది చరిత వర్ణనాదులు పరబ్రహ్మప్రాప్త్యుపాయములుగానే యున్నవి. పాండవాదుల చరిత వర్ణనము సాక్షాత్తుగా వైరాగ్యజనకము. వైరాగ్యము మోక్షమునకు మూలము. మోక్షమే పరబ్రహ్మ ప్రాప్తిగదా!

అహంకార రహితమైన 'దయా వీరరసము' జీమూతవాహనుని యందు అభివర్ణింపబడినది గనుక, శ్రీహర్షరాజకవిచే రచింపబడిన 'నాగానంద' నాటకమునందుగూడ శాంతమే ప్రధాన రసము.

భవభూతి మహాకవి 'ఏకోరసః కరుణ ఏవ' అని చెప్పెను. భోజరాజు ''శృంగార ఏవ రసనాత్ రసమామనామ'' అని చెప్పెను. ఇతరులు, కొందరు 'అద్భుతమే రసము' అని యనిరి. దానికి కారణము, సర్వరససారభూతమైనది చమత్కారమే కనుక, ఆ చమత్కారము అద్భుత రసమువలననే కలుగును గనుక, 'అద్భుతమే రసము' అని 'నారాయణుడు' అనెను. ఆలంకారిక మూర్ధన్యుడగు అభినవగుప్తపాదాచార్యుడు 'అన్ని రసములకన్న శాంతరసమే ప్రధానము' అనెను. దానికి కారణము ఆ యాచార్యుడు ఇట్లు చెప్పెను :

ధర్మార్థ కామమోక్షములలో తొలి మూడు పురుషార్థములు 'ధర్మార్థకామములు ప్రవృత్తి ధర్మరూపములు. చతుర్థ పురుషార్థమగు మోక్షము నివృత్తి ధర్మరూపము. కనుక నది ప్రధానము. వ్యాసభగవానుని మతముగూడ నిదియే.

సాధారణముగా రసములన్నియు పురుషార్థ ప్రధానములే యగును. శృంగార — హాస్యములు కామప్రధానములు. వానికి విపరీతము కరుణరసము. రౌద్రరసము అర్థప్రధానము — వీరరసము ధర్మప్రధానము. వానికి విపరీతములు భయానక—బీభత్స రసములు. శాంతరసము మోక్షప్రధానము. కనుక, ప్రవృత్తి ధర్మాత్మక త్రివర్గ ఫలప్రదములగు నితర రసములకన్న నివృత్తి ధర్మరూప మోక్ష ఫలప్రదమగు శాంతరసము ప్రధానము — రసరాజమునదియే. కనుకనే —

''యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్।
తృష్ణాక్షయ సుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్॥''
అని పెద్దలు చెప్పిరి.

శ్రీ కందుల నాగభూషణం

హైందవ తర్కశాస్త్ర పరిచయం

ఈనాటి శాస్త్రీయ పోకడలకు సరిపోయే ఆనాటి భావాలు

(గత సంచిక తరువాయి)

3. తర్కం

3. 1 సుజ్ఞానార్జనతత్వం (Epistemology) :

ఆమోదయోగ్యమైన పద్ధతుల్లో జ్ఞానార్జనచేసి వాటిలోని దోషాలను విచారించి, తొలగించి, సుజ్ఞానాన్ని సంపాదించాలనీ, ఈ సందర్భంలో మనం కొన్ని ప్రమాణాలను అనుసరిస్తామనీ యిదివరకే తెలుసుకొన్నాం.

3. 2 మాటలవల్ల మనకు కలిగేజ్ఞానం:

ఘటము అనే మాటను తీసికొందాం. చిన్న, పెద్ద, పగిలిన, వంకరపోయిన, మొదలైన అనేక రకాల కుండలలో దేనినైనా ఘటం అనే అంటాం. కనుక వీటికి అన్నింటికి వర్తించే ఘటత్వ భావం ఒకటి ఉందన్నమాట. ఘటం అనేమాట మనలో ఘటత్వ భావాన్ని కలిగిస్తుంది ఎవరైనా 'ఆ కుండను తీసికొని రా' అని మనని ఆదేశిస్తే, మొదట మనలో ఘటత్వభావం కలిగి ఆ వస్తువు కోసం వెదకి, దాన్ని గుర్తించి తీసుకురావటం జరుగుతుంది.

అంటే మనకు ముందుగా స్ఫురించేది ద్రవ్యత్వమో, గుణత్వమో, కర్మత్వమో, యిటువంటివి మరి ఏవైనానో, లేక వాటి అభావత్వమో అయివుంటుంది. భాషకూ, వ్యక్తియొక్క భావనకూ అన్వయం సరిగా పెరిగిన కొద్దీ యీ పై విధంగా జరుగుతుంది. జ్ఞానాన్ని సక్రమంగా అభివృద్ధి చేసుకోటానికి సరియైన భాష చాలా అవసరమని వేరే చెప్పనక్కరలేదు.

3. 3 తర్కశాస్త్రంలో వాడే కొన్ని ముఖ్య పదాలు :

1. కారణం : కారణం అనేది ఫలితానికి అతి సన్నిహితంగా ఉంటుంది. ఫలితానికి ముందుగా ఇది జరుగుతుంది. పైగా ఇది ఫలితానికి 'న - అన్యథా – సిద్ధి' అనే గుణాన్ని సమకూర్చేదై ఉంటుంది. న – అన్యథా – సిద్ధి అంటే, యీ కారణం లేకుండా, మరి ఏ యితర కారణమైనది ఉన్నప్పటికి ఫలసిద్ధి కలుగదు అన్నమాట.[6]

2. కార్యం :– కారణం లేకపోతే దేని అభావం తప్పకుండా ఫలితంగా వస్తుందో అది కార్యం.

3. హేతువు :– మామూలు భాషలో చెప్పాలంటే హేతువును కారణం అనే చెప్పాల్సి వస్తుంది.

4. సాధ్యం :– పరామర్శవల్ల హేతువు నుంచి పొందగలిగే ఫలితాన్ని సాధ్యం అంటాం.

5. నిగమనం (conclusion) :—మామూలుగా నిగమనం, సాధ్యం, ఫలితం అనే మాటలు సమానార్థకాలుగా తీసికోవచ్చు.

గమనిక 1 : నిర్వచనాలన్నీ తృప్తికరమైనవని భావించకూడదు. ప్రతిసారి నిశదీకరింపబడని వేరే మాటలు, భావాలు వాడితేనే కాని నిర్వచనాన్ని చెప్పలేము. చాలావరకు ఇవి మన భావనలో ఇదివరకే ఉన్నయ్యనే కారణంగా కొత్త మాటలను నిర్వచనాల్లో వాడుతాం. ఆ కారణంగానే వాటిని గ్రహించగలుగుతుంటాం కూడాను.

గమనిక 2 : కార్యం అనేమాట మామూలు వాడుకలో ఏదోపని అనే భావాన్ని కల్పిస్తుంది. సర్వాన్ని ఏడు పదార్థాలుగా అన్నంభట్టు విభజించాడని చెప్పాం ఏ పదార్థంవల్ల జరిగినా అది కార్యమే. అయినా, మన అలవాటుకు సరిపోయేటట్టు సాధ్యం, ఫలితం అనే మాటలనే ఎక్కువగా వాడుదాం.

---

6 న–అన్యథా–సిద్ధి అనే మాటను అన్నంభట్టు తర్కదీపికలో యిచ్చిన నిర్వచనంలో చేర్చాడు. అందువల్ల కారణం ఏకైకంగా ఉండాలనే అతడు భావించాడని చెప్పాలి.

3. 4 కారణ, కార్యాలను గురించిన కొన్ని అభిప్రాయాలు :

సాంఖ్యులది పరిణామవాదం. వారి భావన ప్రకారం, ఏదో గుప్త రూపంలో ఇదివరకే లేనిది అమాంతంగా సృష్టి కాజాలదు. అందువల్ల గుప్త రూపంలో కార్యం కూడా కలిసి ఉండటం జరిగి, పరిణామంగా కార్యం సిద్ధిస్తుందని వీరి ఉద్దేశ్యం. దీనిని 'సత్కార్య వాదం' అంటారు. అంటే, కార్యం కారణములోనే ఉంది అని ఉద్దేశ్యం.

నైయ్యాయికులది అసత్కార్య వాదం. కార్యం అనేది రూపొందకమునుపు ఉండనటువంటిదై, అమాంతంగా సిద్ధిస్తుందని వీరి ఉద్దేశ్యం.

సాంఖ్యుల, నైయ్యాయికుల, కారణ కార్యాల రెండింటినీ నిజమైనవాటిగానే తీసికొంటారు.

బౌద్ధులు కారణం నిజం కాదనీ, కార్యమే నిజమనీ వాదిస్తారు. ఇక వేదాంతులు కారణమే నిజమనీ, కార్యం నిజం కాదనీ అంటారు. కారణంలో మార్పు లేకుండానే, మనస్సునుబట్టి కార్య భావం కలుగుతుందని వేదాంతుల వాదం

హిందూ పండితుల ప్రతిభ ఎక్కువే అయినా, తగినన్ని సందర్భాలు పరిశీలించకుండానే విస్తృతీకరణను చాలాసార్లు వీరు చేసారనిపిస్తుంది. పైగా, అనేక కారణాలు కలిసి పనిచేస్తే, వాటి యొక్క ఫలితాలు మిళితమై వస్తాయి కదా! ఆ విధమైన మిశ్రమ ఫలితాలను పరిశీలించటానికి తగిన ప్రక్రియను వీరు రూపొందించ లేదు.

3. 5 శాస్త్రంలో కృషి నిలిచిపోవటం:

నవీనశాస్త్ర విధానాలకు కావలసిన మౌలిక భావాలు చాల వరకు అన్నంభట్టు కాలంనాటికే ఏర్పడివున్నా, తగినంత మేరకు కృషి జరుగకపోవటం తీరనిలోటైంది. దీనికి కారణం పండితులు లౌకిక దృష్టితో శాస్త్రాలను అభ్యసించి కృషి చేయకపోవటంకాదు. పరమార్థం లక్ష్యంగా పెట్టుకొని ప్రారంభించిన తత్త్వ పరిశీలనలలో (లౌకిక) శాస్త్ర విషయాలు యిమిడి ఉన్నాయని మాత్రమే ఇది వరకుచెప్పాం. అంతేకాని, మతముమీది ఆసక్తివల్ల లౌకికదృష్టితో శాస్త్రాభివృద్ధిని చేయుటకు హిందూ పండితులు సాహసించలేదని అనుకోటానికి అవకాశం లేదు. ఆదినుంచి పండితులు వారి భావాలను వ్యక్తం చేయటానికి ఏవిధమైన భయాన్ని చూపలేదు. సాంఖ్య, న్యాయ, పూర్వ మీమాంసల కాలంలోనేకాక, ఇటీవల కూడా హిందూ పండితులు నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. 16వ శతాబ్దిలో గదాధరుడనే ఉద్దండ న్యాయపండితుడు మరణ శయ్య మీద నుండగా సృష్టికి మూలం ఏమిటి అని అతనిని అడిగినప్పుడు, నిర్భయంగా ''పీలవః,పీలవః, పీలవః''అంటే ''అణువులు, అణువులు, అణువులు'' అని జవాబిచ్చాడట.

17వ శతాబ్దం తరువాత తర్క శాస్త్రంలో కృషి నిలిచిపోవటానికి కారణాలు వేరే ఏవో ఉండాలి. దేశంలో రాజకీయ అస్థిరత్వం, పండితులకు ఆదరణ లేకపోవటం వాటిలో ముఖ్యమైనవని ఊహించటం సమంజసమనిపిస్తుంది.

3. 6 క. వర్జిత మధ్యమ తర్కం

(Logic of the excluded middle) ·

దేన్నైనా తీసికొంటే ఒకే కాలమందు అది ఒక విధమైనదిగా ఉండటమో, ఉండకపోవటమో, ఏదో ఒకటే, సంభవించాలి అనే విషయాన్ని స్వీకృతంగా తీసికొని నిర్మించే తర్కాన్ని వర్జిత మధ్యమం అందాం. మనం సాధారణంగా వాడేది వర్జిత మధ్యమ తర్కమే.

3. 6 ఖ. అవర్జిత మధ్యమ తర్కం

(Logic of the included middle):

ఒకవ్యక్తి కాని, వస్తువు కాని ఒక విధమైనదిగా ఉండటమూ, ఉండకపోవటమూ, రెండూ ఏకకాలమందే సంభవిస్తున్నట్లుగా ఒప్పుకోవలసివచ్చే సందర్భాలు అప్పుడప్పుడు వస్తాయి. అప్పుడు మనం అవర్జిత మధ్యమాన్ని స్వీకరించవలసివస్తుంది.

ఉదాహరణలు :

1. ప్రతి సూత్రానికి మినహాయింపు (exception) ఉంటుందనే సూత్రాన్ని తీసుకొందాం. ఇదీ సూత్రమే కనుక దీనికీ మినహాయింపు ఉంటుంది అంటే మినహాయింపులేని సూత్రం ఉంటుందన్నమాట. ఈ మినహాయింపులేని సూత్రము కూడా సూత్రమే కనుక మొట్టమొదట వివరించిన సూత్ర న్యాయం దీనికి వర్తించి, యిది మినహాయింపు ఉన్న సూత్రం కూడా అవుతుంది.

2. సమితి అంటే ఒక సమూహం. దానిలోని వస్తువులను, లేక వ్యక్తులను మూలకాలంటాం. మూలకాలు ఏవైనా కావచ్చు. మనం ఊహించగల సమితుల నన్నింటిని తీసికొందాం. ఈ విధంగా మనం ఊహించిన సమితులలో ప్రతి సమితిని ఒక మూలకంగా తీసికొని, యీ కొత్త మూలకాలతో (అంటే, సమితిలకు వ్యక్తిత్వం యిచ్చి, వాటితో) ఒక సమితిని కొత్తగా నిర్మించామనుకొందాం. ఈ కొత్త సమితి పాత సమితులలో ఒకటికాక వాటి గుంపు అయి ఉంటుంది. కాని, పాత సమితుల్లో అన్ని సమితులు ఉన్నాయని నిర్వచించాం. కనుక, వాటిలో యీ కొత్త సమితి ఒకటై ఉంటుందని కూడా ఫలితం వస్తుంది. అందువల్ల యీ కొత్తగా నిర్మితమైన సమితి పాత గుంపులో ఉందీ, లేదూ కూడాను. ఈ ఉదాహరణను బెర్ట్రాండ్‌రస్సెల్ చెప్పాడు.

3. ఒక ఊరిలో ఒకే మంగలివాడు ఉన్నాడు. ఆ వూరిలో స్వంత క్షౌరం చేసుకొనేవారూ, మంగలిచేత క్షౌరం చేయించుకోనివారూ ఉన్నారు. స్వంతంగా చేసుకొనేవారికి మంగలి క్షౌరం చేయడు. స్వంత క్షౌరం చేసికొననివారికి మాత్రమే మంగలి క్షౌరం చేస్తాడు. ఇప్పుడు మంగలివాని సంగతి ఏమిటని ప్రశ్నవేస్తే, స్వంత క్షౌరం చేసుకొనే యెడల, తనకు తాను క్షౌరం చేసుకోడనీ, స్వంత క్షౌరం చేసుకోనియెడల తనకు తానే క్షౌరం చేసుకొంటాడనీ ఫలితం వస్తుంది. ఇతనికి స్వంత క్షౌరం చేసికోటం, చేసికోక పోవటం, రెండూ వర్తిస్తాయి. కొన్ని నిబంధనలకు లోబడి ఉండే గణితశాస్త్రంలోని ప్రతి ప్రశ్నకు జవాబును ఔననో, కాదనో, అసందిగ్ధంగా చెప్పే టట్లు, స్వయం విరోధంలేని తర్క విధానాన్ని తయారు చేయటానికి వీలులేదని గోడెల్ (Godel) అనే పండితు డీనాడు నిరూపించాడు. అసందిగ్ధంగా ఔననో కాదనో జవాబు ఇవ్వాల్సివచ్చే ప్రతి ప్రశ్నకు జవాబును చెప్పగలిగే విధంగా తర్క విధానాన్ని రూపొందించినట్లయితే, ఆ విధానంలో దోషం ఉండితీరుతుందని కూడా నిర్ధారించాడు. అంటే, కొన్ని సందర్భాల్లో సర్వాన్ని ఒకే మూసలో పోయ లేకపోవచ్చు అటువంటప్పుడు మూసలో యిమడని వాటిని విడివిడిగా పరిశీలించి నిర్ధారించుకోవాలి వేదాంత విషయాలలో కొన్నిసార్లు అవర్జిత మధ్యమ తర్కం వాడటం జరుగుతుంది. అప్పుడు మనం కొంత తికమక పడవచ్చు. సర్వమూ సృష్టికర్త సృష్టించాడని అంటామనుకోండి. అప్పుడు సృష్టికి పూర్వం సృష్టికర్త ఉన్నట్లా లేనట్లా అనే ప్రశ్న వస్తుంది.

ప్రతిదీ, అన్నీ, సర్వమూ అని చెప్పే కొన్ని సందర్భాలలోనూ, అసంఖ్యాకమైనన్ని (infinite number of) మూలకాలు గల సమితులను గురించి చర్చచేసే కొన్ని సందర్భాలలోనూ, మన నిర్వచనాలలో గుప్తంగా వేరే భావాలు కూడా యిమిడిఉండే సందర్భాలలోనూ, అవర్జిత మధ్యమ తర్కం అవసరం కావచ్చు.

ఉండుట (Being), అగుచుండుట (Becoming) అనే రెండు భావాల భేదం కూడా కొన్నిసార్లు యీ అవర్జిత మధ్యమ తర్కానికి కారణం కావచ్చు. దీన్ని గురించి జగ్‌జిత్‌సింగ్ తన 'Great Ideas of Modern Mathematics'లో కొంత విపులంగా సంఖ్యలను గురించిన చర్చలో వివరించాడు.

అందువల్ల ఏఏ సందర్భాల్లో అవర్జిత మధ్యమతర్కాన్ని ఎంతెంతవరకు స్వీకరించవచ్చునో పరిశీలించి, తెలుసుకొంటె, ఆ నిర్ణయాల ఆధారంగా ఇబ్బందులను చాలావరకు అధిగమించ గలుగుతాం.

4. పరార్థహేతు-సాధ్య తర్క విధానం
(Syllogism)

4. 1 హిందువుల సిలొజిజం
(Syllogism) :

ఇకమీదట వర్జిత మధ్యమతర్కాన్ని గురించే చర్చిద్దాం — అనుమాన ప్రమాణమే తర్కశాస్త్రానికి జీవం అని మళ్ళీ ఒకసారి గుర్తుచేసుకొందాం. హేతువు నుంచి మనం సాధించగల ఫలితాన్ని సాధ్యం అంటామని ఇదివరకే చెప్పాం. తనలో తనే పరామర్శించుకొని, హేతువు నుంచి సాధ్యాన్ని తెలుసుకొంటే, అది స్వార్థ (స్వ—అర్థ) హేతు—సాధ్య తర్కవిధానమౌతుంది. ఇంకొకరికి తెలియపర్చటానికై హేతు — సాధ్య వివరణచేస్తే, అది పరార్థ (పర — అర్థ) హేతు — సాధ్యతర్క విధానమౌతుంది ఈ పరార్థ హేతు—సాధ్య తర్కవిధానాన్నే ఆంగ్లంలో సిలొజిజం (syllogism) అంటారని చెప్పవచ్చు. హిందూ పండితులు దీన్ని వివరించటంలో మొదట ప్రతిజ్ఞ అనే వాక్యంతో మొదలుపెడ్తారు.

ఉదాహరణ : కొండమీద నిప్పు ఉంది, అనే ప్రతిజ్ఞా వాక్యాన్ని చెప్పటంతో మొదలుపెట్టవచ్చు స్వార్థచింతనలో ప్రతిజ్ఞను తప్పనిసరిగా మొట్టమొదట చెప్పనక్కరలేదు కదా ! అందువల్ల మనం ప్రతిజ్ఞను మొదటి అవయవంగా ఉండే విధానాన్ని పరార్థహేతు — సాధ్య తర్కంగానే చెప్పుకోవాలి. ఈ విధానానికి ఉండే పంచ అవయవాలు సాధారణంగా యీ కింది క్రమంలో ఉంటాయ్ ఈ క్రమాన్ని ఉదాహరణలతో వివరించే ముందు 'పక్ష', 'సపక్ష' అనే పదాలకు అర్థం తెలుసుకోవాలి. 'పక్ష' అంటే యాదార్థమైన ఉదాహరణకు చెందే ప్రదేశము, కాలము మొదలైన విషయములను గురించి తెలిపే వివరణ. 'సపక్ష' అంటే బాగా అన్వయమయ్యే విధముగా పక్షమును కలిగినది.

ఉదాహరణ 1 :

కొండమీద అగ్ని ఉంది (ప్రతిజ్ఞ) మొదటి అవయవం
ఎందుకనగా, పొగ ఉంది (హేతువు) 2 వ అవయవం
పొగ ఉన్నచోట అగ్ని ఉంటుంది (వ్యాప్తి) 3 వ అవయవం
వంట యింట్లోవలె (సపక్ష దృష్టాంతం) 4 వ అవయవం
కనుక కొండమీద అగ్ని ఉంది (సాధ్యం లేక నిగమనం) 5 వ అవయవం

ఉదాహరణ 2 :

రామారావు మర్త్యుడు
ఎందుకనగా, మానవుడు
మానవుడైనవాడు మర్త్యుడు
ప్రసాదరావు వలె
కనుక రామారావు మర్త్యుడు

అరిస్టాటిల్ చెప్పిన సిలాజిజమ్‌లో ప్రతిజ్ఞ, దృష్టాంతం ఉండవు. అంటే, మూడే అంగాలుంటయ్ అన్నమాట. ప్రతిజ్ఞ నిజంగా చూస్తే, అనవసరమే. ఎందుకంటే అదీ సాధ్యము, ఒకటే కనుక ! ప్రతివాదిని ఓడించటానికి ఉపయోగించే రూపంలో యీ పరార్థ హేతు–సాధ్యవాదాన్ని [సిలాజిజమ్‌ని] మొదట వాడుకలోకి తెచ్చి ఉంటారు. వాగ్వివాదాలలో భాషాచాతుర్య ప్రదర్శనానికి (rhetoric) ప్రతిజ్ఞతో ప్రారంభించటం ఒక చమక్.

(స) పక్షదృష్టాంతము వ్యాప్తిలో యిమిడి ఉందనే దృష్టితో దీన్ని కూడా వదలివేయవచ్చు. అప్పుడు హిందూ పండితుల సిలాజిజమ్ అరిస్టాటిల్ వివరించిన మూడు అంగాల రూపంలోకే వస్తుంది. కాని, సపక్ష దృష్టాంతాన్ని హైందవ తర్కం కలిగి ఉండటం చరిత్రాత్మకంగానూ, తత్వాత్మకంగానూ కూడా కొన్ని విషయాలను స్పష్టం చేస్తుంది.

4. 2 చరిత్రాత్మక అంశాలు :

1. ఉపమాన ప్రమాణంతో మొదలై, క్రమంగా అనేక ఉదాహరణల సేకరణను ఆధారం చేసికొని, యీ హేతు–సాధ్య తర్కవిధానం అవతరించిందని ఇదివరకే చెప్పాం.

2. విస్తృతీకరణకు(Universalization by induction) ముందు చేయవలసిన పరిశీలన అంతా చేయటం అయింది అనే ధైర్యభావం హైందవ తర్కపండితుల్లో కనపడదు. అందువల్లనే సపక్షదృష్టాంతాన్ని చెప్పి తమని తాము కాచుకొనేవారేమో అనిపిస్తుంది.

4. 3 తత్వాత్మక అంశాలు :

1. వ్యాప్తి నిజమైన పరిస్థితులకే చెందాలని వారి ఉద్దేశ్యం అని తెలుస్తోంది. సపక్షదృష్టాంతం ఒకటైనా ఉండాలి అనగానే ఇది స్పష్టమౌతోంది.

ఒక్క సపక్ష దృష్టాంతాన్నైనా ఇవ్వకపోతే, వ్యాప్తికి వినియుక్తశక్తి (Applicability to reality) ఉందో లేదో వెంటనే తెలియదు కదా !

2. విస్తృతీకరణ (Induction) ను హిందూపండితులు తర్కంలోకి తీసికొనివచ్చారనే విషయంలో ఏమీ సందేహములేదు. అయితే, వారు దాన్ని హేతు–సాధ్య తర్క విధానంలో (Deductive procedure) వాడుకోటానికి మాత్రమే తర్కంలోకి తీసికొని వచ్చారు. అంతేకాని, విస్తృతీకరణను తర్కశాస్త్రంలో ఒక ముఖ్య భాగంగా గుర్తించి, ఆ విధంగా చెప్పేందుకు వీలైన దృష్టాంతాలేవేవో, వాటిని గురించిన ఏ న్యాయాన్నైనా ఏవిధంగా అన్వేషించాలో, ఆ విషయాలను తెలుసుకోవాలనే దృష్టితో హిందూ పండితులు కృషిచేయలేదనే చెప్పాల్సివస్తుంది.

4. 4 వ్యాప్తి విధానాలు :

అన్వయ – వ్యతిరేకి, కేవలాన్వయి, కేవల వ్యతిరేకి అని వ్యాప్తిలో మూడు విధానాలున్నాయి.

4. 4. 1 అన్వయ-వ్యతిరేక వ్యాప్తి :

పొగ ఉన్నచోట నిప్పు ఉంటుంది అనే వ్యాప్తిని అన్వయ వ్యాప్తి అంటాం. వ్యాప్తిలో అభావాన్ని ఏమీ చెప్పటం లేదు.

దీన్నే వ్యతిరేక భావంతో తిప్పి చెప్పవచ్చు. నిప్పును వ్యాప్యమనీ, పొగను వ్యాపకమనీ కొందరు అంటారు. మరికొందరు పొగనే వ్యాప్యమనీ, నిప్పును వ్యాపకమనీ అంటారు. దీనిమీది అభిప్రాయభేదాలు ఒకప్పుడు తీవ్రమైన వాదోపవాదాలకు దారి తీసాయి. నిర్వచనాత్మకమైన విషయంలో పోట్లాట వృధాశ్రమ. మొదటిగా పండితులు పెట్టిన పేరును ఏ అర్థంతో పెట్టారో తరువాతివారు కూడా దాన్నే వాడుకుంటే, ఆ మాటకు అర్థం అలాగే రూఢమౌతుంది. ఏది వ్యాప్యమైనా, ఏది వ్యాపకమైనా వ్యతిరేకవిధంగా (అంటే వాటి అభావాలద్వారా) వ్యాప్తిని తిప్పి చెప్పినప్పుడు ఆ రెండు తారుమారౌతయ్.

ఉదా : నిప్పులేకపోతే పొగలేదు. అన్వయిలో పొగ ఉండటం హేతువైతే, యిప్పుడు దాని అభావం హేతువుకాక సాధ్యంగా మారిపోయింది.

ఈ వ్యాప్తిని అన్వయిగానూ, వ్యతిరేకిగానూ కూడా చెప్ప వచ్చును గనుక, దీనిని అన్వయ–వ్యతిరేకి అంటారు.

4 4. 2 కేవలాన్వయి

(Unconditional universality)

వ్యాప్తిని తెలిపే వాక్యంలో ఏ నిబంధన లేకుండా ఉండి, అది అన్ని సందర్భాల్లోనూ వర్తించేయెడల, ఆ వ్యాప్తిని కేవలాన్వయి అంటాం. ఇది మనకు ఏరకమైన కొత్త జ్ఞానాన్నీ కలిగించదు. ఆంగ్లంలో దీన్ని tautology అంటారు.

4. 4. 3 కేవల వ్యతిరేకి (uniqueness by elimination of all other possibilities)

వ్యాప్తి ఏ ఇతర విధంగానూ ఉండటానికి వీలులేనిదైతే, దాన్ని కేవల వ్యతిరేకి అంటాం. అంటే దీనికి ఉదాహరణ ఒకటే కటి ఉంటుందన్నమాట.

పృధివికి ఒక్కదానికే గంధం (వాసన) కలిగి ఉండే స్వభావం ఉందని హిందూపండితులు నిర్వచించారు. గంధంకాక మిగతా ఏ స్వభావాలను (శేక స్వభావాన్ని) కలిగిఉండే వస్తువును తీసికొన్నా, అది పృధివికాక వేరొకటై ఉంటుందనే విషయం స్పష్టమేకదా !

'ఏదైనా గంధం కలిగిఉంటే, అది పృథివి' అనే వ్యాప్తికి దృష్టాంతం పృధివి ఒక్కటే. ఈ విధమైన వ్యాప్తిని కేవల వ్యతిరేకి అంటాం.

గమనిక : కేవలాన్వయి సర్వత్ర వర్తిస్తుంది కనుకనూ, కేవల వ్యతిరేకికి ఒకే ఒకటి తప్ప మరి ఏ యితర దృష్టాంతాలు ఉండవు కనుకనూ, యీ రెండు వ్యాప్తుల నుంచి ఏ సిలోజిజమ్‌ను నిర్మించటానికి వీలులేదు.

4. 5. రిడక్షియోయాడ్ అబ్‌సర్డం

(Reductio ad absurdum)

పాశ్చాత్యులలో కొందరు Reductio ad absurdum అనేదే హిందూపండితుల తర్కశాస్త్రమని భావించారు. ఇది కొంతవరకే ఒప్పుకోవచ్చు. కాని తర్కశాస్త్రమంతా కలిసి రిడక్షియోయాడ్ అబ్సర్డమ్ అనటం సరికాదు. రిడక్షియోయాడ్ అబ్సర్డంలో ఒన సాధ్యాన్ని ఒక ప్రతిజ్ఞరూపంలో చెప్తాం. ఈ ప్రతిజ్ఞకు భంగాన్ని[7] ఆరోపిస్తే, పరస్పరం విరోధించే విషయాలను చూప గలుగుతాం కనుక, ప్రతిజ్ఞ భంగం కావటానికి వీలులేదని నిర్ణయిస్తాం ఈ విధంగా వివరిస్తే, రిడక్షియోయాడ్ అబ్సర్డం ప్రతిజ్ఞతో మొదలై సాధ్యంతో అంతం కావటము అనే రెండు భాగాలలోనూ సిలోజిజమ్‌ను పోలిఉంటుంది హేతు—సాధ్య తర్క విధానంతో కొంత భాగం మాత్రమే రిడక్షియోయాడ్ అబ్సర్డం అని గ్రహించటం ఏమంత కష్టంకాదు. ఇది ఎప్పుడు కేవల వ్యతిరేకి అవుతుందో పరిశీలిద్దాం. ప్రతిజ్ఞ సిద్ధించటానికి వీలైన విధాలన్నింటినీ వివరించి, ఒకటి తరువాత ఒకదానిని తీసికొని, అది విరోధానికి దారి తీస్తుందనిచూపి, దాన్ని వర్జిస్తూ పోగా, చివరికి మిగిలిపోయిన ఒక్కవిధమూ ప్రతిజ్ఞను భంగంచేయటానికి వీలులేదని నిరూపిస్తే, ఈ తర్కవిధానం కేవల వ్యతిరేకి అవుతుంది. దీనిలో వాడిన హేతువాదం రిడక్షియోయాడ్ అబ్సర్డం అయితే, అది కేవల వ్యతిరేకికి సమానమై ఉంటుంది

4. 6. అనుపలబ్ధిని గురించి మీమాంసికుల భావన:

ఏ వాక్యంలోనైనా ఒక హేతువుద్వారా సాధ్యంగా చెప్పబడిన విషయం, ఆ హేతువును నిర్దేశించకపోయినప్పటికీ, తెలుసుకోటానికి వీలయ్యేదైతే, ఆ విషయాన్ని 'ఉపలబ్ధి' అని వ్యవహరించటం కద్దు. ఉదా : 'కొండమీద పొగ ఉంది కనుక నిప్పు ఉంది' అనే వాక్యంలో, పొగ ఉండటం అనే హేతువును తీసివేసినా, కంటితో చూడటంవల్ల, నిప్పున్నట్లు తెలుసుకోటానికి వీలు అవుతుంది. అంటే, 'కొండమీద పొగఉంది కనుక నిప్పుఉందనేది' ఉపలబ్ధి అన్న మాట.

నైయ్యాయికులకు అస్తిత్వభావము, అభావము, రెండు కూడా సమాన ప్రతిపత్తిగల పదార్థాలే కనుక వారికి అభావం ఏ సమస్యను తెచ్చిపెట్టదు.

కాని మీమాంసికులు భావ, అభావాలు రెండూ సమాన ప్రతిపత్తి గలిగినట్లు భావించరు. అందువల్ల అభావాన్ని తెలిపే సందర్భం వారికి భేదంగా కనిపిస్తుంది. అభావాన్ని హేతువాదంతో సాధించినప్పుడు, ఆ నిరూపణా విధానాన్ని మీమాంసికులు ఉపలబ్ధికి ప్రతిగా సరిపోయే 'అనుపలబ్ధి' అనే పేరుతో వ్యవహరించటమే కాక, యీ అనుపలబ్ధిని ఒక ప్రత్యేకమైన (అంటే వేరుగా ఇంకొకటైన) ఉపపత్తి (Proof) గా తీసికొన్నారు.

4. 7. సద్ధేతువు:

హేతువు అనగానే సాధ్యానికి హేతువు అన్నమాట. లౌగాక్షి భాస్కరుడు 'తర్కకౌముదిలో' సద్హేతు గుణాలను ఐదింటిని చెప్పినట్లు తెలుస్తోంది. అవి—

1. సపక్షం ఉండటం
2. సపక్ష దృష్టాంతం ఉండటం,
3. వ్యతిరేక దృష్టాంతం లేకుండా ఉండటం,
4. ఏ బలవత్తరమైన కారణంవల్లనూ వ్యతిరేకభావం కలుగకుండా ఉండటం,
5. విరోధించే ఎదురు కారణం లేకుండా ఉండటం

4. 8. అరిస్టాటిల్ వివరించిన నాలుగు కారణాలు :

అరిస్టాటిల్ (Causesని) కారణాలను నాలుగు విధాలుగా విభజించాడు.

1 **Formal cause**— ఈ మాటకు హైందవతర్కవేత్తలు వాడిన పదంలేదు. మనం దీన్ని రూపమాత్రమైన కారణం అనవచ్చునేమో.

---

7 ప్రతిజ్ఞను రూఢిచేయటానికై, అది భంగమైతే వచ్చే విరోధాలను చూపుతామనికదా చెప్పాం. అంటే ప్రతిజ్ఞలో ఫలితభాగం నిజమైనా, దాని అభావాన్ని ఆరోపించి ఏమౌతుందో చూస్తామన్నమాట ఈ ఆరోపణా ప్రక్రియకూడా తర్కంలో యిమిడి ఉండేందుకై అన్నంభట్టు తర్కానికి 'వ్యాప్య—ఆరోపేణ వ్యాపక—ఆరోపణం' అనే నిర్వచనాన్ని యిచ్చాడేమో ననిపిస్తుంది.

నిజమైనప్పుడు ఆరోపణ అంటే వివరణ అనీ, నిజం కానప్పుడు ఆరోపణ అంటే ఆపాదించటమనీ అర్థం చేసుకోవాలి.

2. Material cause—దీనిని హిందూ పండితులు సమవాయ లేక ఉపాదాన కారణమంటారు.

3. Efficient cause—దీనిని హిందూపండితులు నిమిత్త కారణం అంటారు.

4. Final cause— ఈ మాటకు మళ్ళీ సరిగా నప్పే మాటను హిందూ తర్కశాస్త్రవేత్తలు ఎక్కడా వాడినట్లులేదు.

దీనిని సర్వానికి మూలమై మన గ్రహింపునకు అందని కారణం అని వివరించవచ్చునేమో అనిపిస్తుంది.

4. 9. హేత్వాభాసాలు (హేతు-అభాసాలు)

వ్యభిచారం (Discrepancy), విరోధం (Contradiction), ప్రతిపక్షం(Counter-balance), అసిద్ధం(Inconclusiveness,) బాధితం (Absurdity) అనే ఐదు హేత్వాభాసాలను అన్నంభట్టు పేర్కొన్నాడు. సాధ్యం సందిగ్ధంగా ఉంటే, అది వ్యభిచారానికి ఒక ఉదాహరణ సాధ్య అభావం ఎక్కువ బలమైన కారణంతో నిర్ధారించగలిగితే, అది ప్రతిపక్షానికి ఉదాహరణ అవుతుంది బాధితము అనే అభాసానికి 'అగ్ని చల్లగా ఉంటుంది' అనే వ్యాప్తి ఉదాహరణ. 'చల్లదనము' అనే సాధ్యం తప్పు అనే విషయాన్ని అగ్నిని ప్రత్యక్షంగా ముట్టుకోటంవల్ల తెలుసుకోగలం

ఒక్కొక్కప్పుడు ఈఅభాసాలు ఉపాధికారణంగా వస్తాయి.[8] ఉపాధి అంటే దగ్గరగా ఆవరించి ఉండే పరిస్థితి (లేక పరిస్థితులు) (Environmental or conditions) అని చెప్పవచ్చు.

తర్కంలో దోషాలను ఎన్ని విధాలుగా విభజించాలి అనేది పరిశీలించే పండితుని దృక్కోణంమీద ఆధారపడి ఉంటుంది.

వైశేషికుడైన కణాదుడు దోషాలను మూడు రకాలుగానే విభజించాడు ఈ పద్ధతినే బౌద్ధులు కూడా ఆమోదించారు.

5. ఈనాటి శాస్త్రీయపోకడలకు సరిపోయే ఆనాటి భావాలు

5. 1. అర్థాపత్తిని ప్రమాణంగా తీసికోటం

కొన్ని వ్యతిరేకాలుగా అనిపించేవి ఏకకాలమందే సంయుక్తంగా వర్తిస్తున్నట్లు మన అనుభవంలోకి వస్తే, శాస్త్ర పురోగమనానికి వాటిని అన్వయపరిచే ఊహను చెయ్యాలి. ఈ ఊహ మనకు యిదివరకు ఉన్న జ్ఞానానికి కూడా అన్వయం కావాలి. లేకపోతే, యీ కొత్త ఊహనుబట్టి వెనకటి విజ్ఞానంలో సరిపోయేటట్టుగా మార్పులు చెయ్యటానికి తగిన ఊహ అయి ఉండాలి యీ కొత్త ఊహ. ఈరకంగా కొత్త అనుభవాలనిబట్టి ఊహిస్తూ, అన్వయించుకొంటూ, సరిదిద్దుకొనే (Trial and error) పద్ధతిని వాడుకొంటూ, ముందుకు సాగిపోవటం అవసరమని హిందూ పండితులు గ్రహించారనే చెప్పాలి.

5. 2. విస్తృతీకరణ (Induction),

విస్తృతీకరణ అని యిదివరకే వివరించిన విధానాన్ని హిందూ పండితులు హేతుసాధ్య తర్కంద్వారా వచ్చే ఫలితాలను సంపాదించటానికే అనుసరిస్తూ వచ్చారు. ఒక నమూనాను (Modelని) తయారుచేసి, దాన్నుంచి వచ్చే ఫలితాలను చర్చించటం యీనాటి ప్రక్రియలలో అతిముఖ్యమైన వాటిల్లో ఒకటిగా పరిగణిస్తున్నాం కదా! ఊహించిన ధర్మాన్ని హేతువాదంద్వారా పరిశీలించటం సాంఖ్యక (Statistical) శాస్త్రంలో ఉన్న విషయమే. దీన్ని Inductive inference అంటారు. నమూనాను నిర్మించటం (Model building), దాని వ్యాప్తిని గురించి పూర్తిగా తెలియకుండానే వాడుకచేసి, అదే నిజమైతే వచ్చే ఫలితాలను మనకు తెలిసిన వివరాలతో పోల్చి చూసుకొని, తాత్కాలిక నిర్ణయాలను చేసికొని, జ్ఞానాన్ని పెంపొందించుకోటానికి హిందూ పండితులు ప్రయత్నించారనే భావం మనకు అప్పుడప్పుడు కలుగుతుంది.

5. 3. అభావాన్ని ఒకభావంగా ప్రవేశపెట్టటం :

సంఖ్యలలోకి శూన్యసంఖ్యనూ, భావాల్లోకి అభావాన్ని ప్రవేశపెట్టి, లేదనే విధంగాకాక, శూన్యం లేక అభావం ఉందనే విధంగా చెప్పటం హిందూ పండితుల ప్రత్యేకత.

సంఖ్యా గణితం అంటే రెండు రకాలుగా చెప్పవచ్చు. మామూలుగా వాడుకొనే గణితమూ (Arithmetic), ప్రత్యేకంగా ఉన్నత స్థాయికి చెందే గణితము (Theory of Numbers). శూన్యమనే సంఖ్యను ప్రవేశపెట్టితేనే కాని ఈ రెండూ పురోగమించి

---

8 ఉపాధివల్ల వచ్చేందుకు వీలయ్యే అభాసుకి ఈ కింది ఉదాహరణను హైందవ తార్కికులు తరుచు యిస్తుంటారు. పొగ ఉంటే నిప్పు ఉందనికాక, "నిప్పు ఉంటే పొగ ఉంటుంది" అని అన్నామనుకోండి. దీని వ్యాప్తిలో ఇమిడి ఉండేందుకు వీలయ్యే హేత్వాభాసాలలో ఉపాధివల్ల వచ్చే దొకటుంది. కట్టెలు తడిసినవైతే, వాటి నిప్పు పొగకి హేతువౌతుంది. కాని, ఎండుకట్టెలు మండుతుంటే, పొగ ఉండకపోవచ్చు కట్టెలు తడిగానో, ఎండుగానో ఉండే పరిస్థితి యీ ఉదాహరణలో ఉపాధి. (కట్టెల) ఉపాధినిబట్టి నిప్పు ఉన్నా పొగ ఉండకపోవచ్చు. కనుక మనం చెప్పిన విషయంలో ఉపాధివల్ల హేతువు అభాసు చెందవచ్చు

ఉండేవి కావనే నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ పునాదిని వేసినకీర్తి హిందూ పండితులదే.

నవీన (విశ్లేషణ) గణితం (Modern Analysis) లో సమితుల తత్వం (Set-theory) అతి ముఖ్యమైనది. మూలకము ఒకటి కూడా లేని సమితి (Empty set లేక null set) అనే అభావాన్ని కూడా ఒక సమితిగా వ్యవహరిస్తేనేకాని ముందుకు పోలేము అనే విషయం యీనాడు గణితవేత్తలకు బాగా తెలుసును.

5. 4. రాజా రామన్న సూచించిన నవీన శాస్త్రపు సమానార్థక పదాలు :

డా॥ రాజారామన్న భవన్స్ జర్నల్లో (Vol. 22, No 14 Feb 1. 1976) అన్నంభట్టు తర్క సంగ్రహంలో వాడుకచేసిన కొన్ని పదాలనూ, నవీన శాస్త్రాల్లో వాటికి సమానమైన ఆంగ్లపదాలనూ వివరించాడు. వాటిలో కొన్నింటినిమాత్రం యీకింద తిరిగి ఉదహరిస్తున్నాను :

కర్మ=Dynamics

సామాన్య=Intersection with sets (of properties of all other matters).

విశేష=Disjoint set of properties with respect to other matter

ఉత్క్షేపణ=Directed motion (Vector)

గమనాని=Random motion

ఇటువంటి వివరాలనుబట్టి 17వ శతాబ్దం నాటికే ఎన్నో నవీన శాస్త్రీయ భావాలు హిందూ పండితులలో ఉన్నట్లు విశదమౌతుంది. కాని లోపించినది సర్వతోముఖమైన కృషి.

5. 5. మనస్సే ప్రధానమనిచెప్పే వేదాంతుల భావం :

వేదాంతులు మనస్సే ప్రధానమని చెప్తారు స్థూలదృష్టితో చూస్తే ఇది ఘాటికి నూరుపాళ్లా నిజం కాదేమో ననిపిస్తుంది. కాని, సూక్ష్మవిషయాలలో, ఉదాహరణకు అణు (atomic) శాస్త్ర విషయాలలో, మానవుడు ఒక ప్రయోగం ద్వారానో, మరింకో విధంగానో, జోక్యం కలుగ చేసుకోకపోతే, నాటంతట అవే స్పష్టం కాని పరిస్థితులు కొన్ని ఎదురౌతాయని నవీన భౌతికశాస్త్రం (Modern Physics) ద్వారా మనకు తెలుసును. అణుశాస్త్రంలోని యీనాటి అనిశ్చితత్వం (indeterminacy) మన మనస్సుకు సంబంధించినది. అసలు ప్రకృతిలో నిశ్చితత్వము ఉన్నది కాని, మనకు ప్రయోగంద్వారా తెలియవచ్చే జ్ఞానంలో అనిశ్చితత్వం ఉందంటారు కొందరు. అసలు ప్రకృతిలోనే అనిశ్చితత్వం ఉందంటారు మరికొందరు[9] ఇట్టి సందర్భం వెలుతురు కణరూపమైనదా లేక తరంగరూపమైనదా అనే చర్చలో వస్తుందని ఇదివరకే చూచాం.

ఇక, ఏ వస్తువులోనైనా, మన ప్రయోగం [చివరికి దాన్ని చూడటం కూడా.] ఎంతో కొంత మార్పు కలిగిస్తుంది. కనుక మనం పరిశీలించే వస్తువు ఏది? ప్రయోగానికి ముందరనున్నదేనా? కాదా? ఇట్టి సూక్ష్మవిషయాలను మనస్సే ఏదో విధంగా నిర్ణయించుకోవాలి.

5. 6 న్యాయ స్వతంత్రత

(Autonomy or extent of validity of a law) :

ఒక న్యాయము (law) ఎంత ఎక్కువ తరుచుగా (More relatively frequent గా) వర్తిస్తుంటే, దాని స్వతంత్రత (autonomy) అంత ఎక్కువ అని యీనాడు 'అర్థమితీ' శాస్త్రంలో (Econometrics) చెపుతుంటాం వ్యాప్యమేది ? వ్యాపకమేది ? అని ఆనాడు హిందూ తర్కవేత్తలలో చెలరేగిన వివాదంలో ఒక పక్షంవారు పైన చెప్పిన న్యాయ స్వతంత్రత అనే భావాన్నే ఆధారంగా చేసికొని, వారి వాదాన్ని నడిపారు రూపాయి డబ్బులూ, పావులా డబ్బులూ, యీ రెండింటిలో దేనికి విస్తరణలో ఎక్కువ ప్రాముఖ్యత ఉంది? అనే ప్రశ్నను తీసుకోండి. కావటం రూపాయి డబ్బులే ఎక్కువ. అయినప్పటికి, పావలా ఉన్నప్పుడల్లా రూపాయి ఉండనక్కరలేదు, కాని రూపాయి డబ్బులుంటే, పావలా ఉన్నట్టే కదా అనే కారణంగా పావలా ఉండటమే ఎక్కువ విస్తృతమైన సంభవం (event) అని వారు గ్రహించారు.

'పావలాను కలిగి ఉండుట' అనే న్యాయం వర్తించే సందర్భాలు —

'రూపాయిని కలిగి ఉండుట' అనే న్యాయం కంటే ఎక్కువ తరుచుగా జరుగుతుంటాయి. కనుక మొదటి న్యాయానికే స్వతంత్రత ఎక్కువ అని ఆనాడే ఈ పక్షంవారు వివరించారు.

ఎక్కువ తరుచుగా అనేభావాన్నే యీనాడు పౌనః పున్యాత్మక సంభావ్యత(Frequency theoretic probability) అంటున్నాం.

6. ముగింపు మాటలు

6. 1 పూర్వీకుల ఔన్నత్యాన్ని గురించి ఎందరు తెలుసుకోవాలి ?

మన పూర్వీకుల ఔన్నత్యాం తెలిసికోటం అతి ముఖ్యం. అది మనకొక ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని యిస్తుంది. ఇంకొకరు మనని చులకనచేస్తే వారిని సహేతుకంగా ఎదుర్కోగలం.

---

9 ప్రకృతిలోనే అనిశ్చితత్వం ఉందనే వారిలో హైసెన్‌బర్గ్ ముఖ్యుడు. అనిశ్చితత్వ న్యాయం (Law of uncertainty) ఒక్కటే నిశ్చితమైనదని చమత్కరించాడు. ఇది ఎలెక్ట్రాన్ల స్థల (Position), గతిభారము (Momentum) లకు సంబంధించిన విషయమైనందున దీన్ని ఇంతటితో వదలివేద్దాం.

అయితే అన్నివిషయాలు పూర్వులకు తెలిసినవేనని వాటినే మనం పట్టుకు కూచుంటే, మనం మన పండితులను అవమానించటమే అవుతుంది వారూ అలాగే తలచి ఊరుకొని ఉంటే, మనం ఆది మానవులుగానే ఉండేవాళ్లం కదా! కనుక మనం ఎప్పటికప్పుడు శాస్త్రాలు అభివృద్ధి చెందిన స్థాయిని తెలుసుకొని, నిరంతరం ముందంజవేస్తూ మిగతావారి కంటె, పై చేయిగా ఉండేందుకు కృషి చేస్తూనే ఉండాలి. మన సామర్థ్యాలు ఎవరి సామర్థ్యాలకూ తీసిపోవు అనే నమ్మకం కలగటమే మన ప్రాచీన పండితులు సాధించిన విజయాలు మనకిచ్చే అభయం.

6. 2 తర్క సాధన ప్రయోజనం :

శాస్త్రములలోనైనా సరే, మత విషయాలలోనైనా సరే, మరి ఏ యితర విషయాలలోనైనా సరే, నమ్మకంతో ముడిపడి ఉండటానికి అవసరంలేని ప్రతి అంశాన్ని, పెద్దలు చెప్పిన సంగతులను వీలైనంత వరకు తెలిసికొని, స్వతంత్ర బుద్ధితో హేతు బద్ధంగా పరామర్శించి, విమర్శించి, నిర్భయంగా తేల్చుకోవాలనేది నిర్వివాదాంశం. యావజ్జీవనం కృషిచేసిన మతాచార్యులనేకులు ఈ విషయాన్ని చాటటానికి వెనుదీయలేదు. 'నిశ్చితం యుక్తియుక్తం చ యత్తద్భవతి నేతరత్' (మాండూక్యోప నిషత్తు, 3వ ప్రకరణం, 23వ శ్లోకం, 2వ పాదం). ఇక్కడ యుక్తి అంటే సద్హేతువు అని చెప్పాలి ఈ పాదానికి తెలుగులో ఈవిధంగా అర్థం చెప్పాలి – "సద్హేతువు చేత కూడా రూఢి అయ్యేదే నిజము. ఇతరమైనది నిజము కాదు."

తరుచు, అహేతుకమైన దురాచారాలు ప్రబలినప్పుడే, కొత్త మత మనేది వస్తుంటుంది. మళ్లీ కొన్నాళ్లకు దీనిలో పటుత్వం కూడా పోతుంటే మార్పు అవసరం అవుతుంది.

కనుక, మంచి మార్పులను ప్రవేశపెట్టటానికి జంకకుండా, అనవసరమైన మార్పులను మార్పుల కోసమే చేస్తూ, శక్తి సామర్థ్యాన్నీ, కాలాన్నీ, వ్యర్థం చేయకుండా, సుజ్ఞానార్జనకే సత్కృషిని జరపాలి.

యాదృచ్ఛికంగా (ఛాన్స్‌వల్ల) కొన్ని సంఘటనలు జరుగుతుంటాయి. వీటివల్ల తర్కశాస్త్రం భంగపడుతోందని తలచ కూడదు. ఈనాడు సంభావ్యతా (probability) సాంఖ్యక (statistical) శాస్త్రాలను తర్కబద్ధంగా ఎలా వాడుకోవాలో నిర్ణయించటమే కాక, చాలా విరివిగా వాడుతున్నారు.

ఆలోచనను ఆధారంగా చేసుకొని, నిర్భయంగా జరిపే సత్కృషి సాధించలేనిదేమీ లేదేమో అనిపిస్తుంది.

తర్కసాధనమే మనోబలాన్ని సమకూర్చే మహదౌషధం. తర్కబద్ధమైన విచారణ ద్వారా లభించే నిర్ణయాలను ఆధారంగా చేసుకొని, మనో స్థైర్యంతో పురోగమించటమే మన కర్తవ్యం.

ప్రతి వ్యక్తి తన నిర్ణయానికి పూర్వం జరుప వలసిన విమర్శనను గురించి భగవద్గీతలో వాసుదేవుడు అర్జునునకు (18వ అధ్యాయం, 63వ శ్లోకంలో) "విమృశ్యైః తదశేషణ యథేచ్ఛసి తథా కురు" (అంటే పూర్తిగా విమర్శించిన తరువాత నీకు నచ్చిన విధంగానే నడుచుకో) అని చెప్పిన వాక్యాన్ని గుర్తు చేసుకొందాం.

సంప్రదించిన కొన్ని పుస్తకాలు

1 అన్నంభట్టు–తర్క సంగ్రహం : భండార్కర్ ఓరియంటల్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్ వారి ప్రచురణ, 1974.

2 పావులూరి మల్లన్న పావులూరి గణితం: (తాలూకా ప్రతి, ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీ, వాల్తేరు.)

3 భగవద్గీత

4 భవన్స్ జర్నల్ – సంపుట 22, సంఖ్య 14, ఫిబ్రవరి 1, 1976 రాజా రామన్నగారి ఉపన్యాసం.

5 మాండూక్యోపనిషత్తు – రామకృష్ణ ఆశ్రమము వారి ప్రచురణ (మైసూరు).

6 చర్ల గణపతిశాస్త్రి – న్యాయమీమాంస దర్శనం, లలితా ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్, 1977.

7 Godel, K. – On Formally undecidable propositions of principia Mathematica and related systems (translated by D. Metzler) Edinburgh, Oliver & Boyd, 1962.

8 M. Hiriyanna – Essentials of Indian Philosophy.

9 Jagjit Singh – Great Ideas of Modern Mathematics.

10 Satchidanda Murty – Revelation and Reason in Advaita Vedanta.

(అయిపోయింది)

విద్యా ప్రమాణాలందు ఆదరాభిమానాలున్న వారందరికి

ఇది అంకితం

శ్రీ బి. ఎ. ఎల్. నారాయణరావు

భాషా శాస్త్రానికి కొన్ని ఇతర శాస్త్రాలతో ఉన్న సంబంధం

భావాలని అందించేది భాష. అంటే ఇతరులకి మన ఆలోచనలని తెలియచెయ్యటానికీ, ఇతరులు తమ ఆలోచనలని మనకు తెలియచెయ్యటానికీ భాష ముఖ్య సాధనం. ఒక గొప్ప రచయిత రాసినట్లుగా లేక మరొక గొప్ప ఉపన్యాసకుడు ప్రసంగించినట్లుగా సామాన్యులు భాషని ఉపయోగించలేకపోయినా భాషని వాడటమే చేతకానివాళ్ళెవరూ ఉండరు—భౌతిక మానసిక లోపాలున్న దురదృష్టవంతులు తప్ప. దీనినిబట్టి మానవుడి మేధస్సు — అతి సామాన్యుడి మేధస్సుకూడా — ఎంత అద్భుతంగా పనిచేస్తుందో, మనకి తెలియజేస్తున్నది భాషాశాస్త్రం ఇటీవల పాశ్చాత్యదేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో భాషా శాస్త్రజ్ఞులు భాషాస్వరూపాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలు కనుక్కొన్నారు. ప్రతిరోజూ ఇంకా కనుక్కొంటూనే ఉన్నారు. అయినా, భాషా నిర్మాణంలో ఉన్న కిటుకులు అన్నీ తెలిసిపోయినాయని చెప్పటం సాహసమే. భాషాశాస్త్రజ్ఞులకి ఇతర శాస్త్రాలతో పరిచయంవల్లనూ, ఇతర శాస్త్రవేత్తలు భాషా శాస్త్రాన్ని చదువుకొనటంవల్లనూ మనిషిని గురించీ, అతను వాడే భాషని గురించీ మనకి చాలా తెలుస్తున్నది.

II. భాషాశాస్త్రానికి తత్వశాస్త్రంతో ఉన్న సంబంధం

మనిషి ఒక భాషని ఏ విధంగా నేర్చుకోగలుగుతున్నాడు అనే విషయాన్ని గురించి తత్వశాస్త్రంలో అనుభూతి వాదులకీ (Empiricists), అంతశ్శక్తివాదులకీ (Rationalists) వివాదం ఉన్నది. వీళ్ళలో అనుభూతివాదులు ఇలా అంటారు :

మానవుడు తను పుట్టింది మొదలు ఈ ప్రపంచంలో పొందిన అనుభవాల పరంపరవలననే జ్ఞానాన్ని సంపాయిస్తాడు. భాషతో పరిచయం ఏర్పడి, వినికిడివలనా, పునరుక్తివలనా తన మాటలకి ఇతరులు ఇచ్చే బహుమతులవలనా, శిక్షలవలనా భాషా జ్ఞానాన్ని సంపాయిస్తాడు.

ఈ ఎంపిరిసిస్ట్ల సిద్ధాంతంలో అప్పుడే పుట్టిన పిల్లవాడి మెదడు 'ఖాళీపలక' (Tabularasa) లాంటిది. దానిమీద ఏ రచనలూ, ముద్రలూ ఉండవు. కేవలం పరిస్థితుల ప్రాబల్యంవల్లనే తనకు అనుకూలమైన విషయాలు నేర్చుకొంటాడు. అనుకూలం కానివి నేర్చుకోడు.

అంతశ్శక్తివాదులు అన్న రేషనలిస్ట్ల వాదం దీనికి పూర్తిగా విరుద్ధం. వీరు అంటారు కదా :

పిల్లవాడు తను విన్నశబ్దాలను — అంటే వాటి కూర్పుని మాత్రమే — విన్నవి విన్నట్లుగా వల్లించే యంత్రంగాడు. పుట్టినప్పటినుంచీ పిల్లవాడు తన నిశిత పరిశీలనతో తనచుట్టూ ఉన్న పరిసరాలను గమనించి, విషయాలని నేర్చుకొంటూ ఉంటాడు. ఈ నేర్చుకొనేశక్తి పిల్లవాడికి పుట్టుకతోనే వస్తుంది.

రేషనలిస్ట్లు భాషాజ్ఞానాన్ని సంపాయించటానికి అంతశ్శక్తిని కారణంగా చెబుతున్నారు.

ప్రపంచంలో ఒక ప్రాంతంలో పుట్టిన పిల్లవాడు ఆ ప్రాంతీయ భాషని సునాయాసంగా, దాదాపు పూర్తిగా, మూడు నాలుగేళ్ళకే నేర్చుకోగలగటానికి ఇదే కారణం అయి ఉండాలంటారు. ఈ వాదన మనకి సమంజసంగానే కనిపిస్తుంది. అయినా పిల్లవాడు ఎంత శక్తిమంతుడైతే మాత్రం ఏం లాభం? తను నేర్చుకోవలసిన భాషతో పరిచయమయ్యే అవకాశం లేకపోతే భాషని నేర్చుకోలేడు. తనచుట్టూ ఉన్న పెద్దలు భాషని వాడకపోయినా, తనకి వాళ్ళమాటలు ఎప్పటికీ వినబడకపోయినా, పరిస్థితుల ప్రాబల్యం వలన మనుష్యులతో సంబంధం లేకుండా ఏకాకిగా పెరిగినా భాషని నేర్చుకోలేడు.

భాషతో అనుభవం లేకుండా కేవలం బుద్ధికుశలతవల్లనే భాషలో నైపుణ్యం సంపాయించటం కష్టం. అలాగే శబ్దాలనీ, అర్థాలనీ, పదాలనీ కూర్చి చిన్నవాక్యాలని నిర్మించటమూ, పెద్ద వాక్యాలని నిర్మించటమూ కేవలం అనుభవంవల్లనే నేర్చుకోలేడు పిల్లవాడు. వల్లెవేసే అభ్యాసంవల్ల 'చిలక పలుకులు' రావచ్చునేమోగానీ భాషాజ్ఞానం రాదు. పిల్లవాడు తన బుద్ధికుశలతని కూడా ఉపయోగించాలి. విత్తనం పెరగటానికి మట్టీ, నీళ్ళూ, సూర్యరశ్మీ కావాలి; విత్తనంలో సత్తాకూడా ఉండాలి. ఆ స్వశక్తి లోపిస్తే మొక్క పెరగదు, ఎంత అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ. భాషని బాగా నేర్చుకోవటానికి అవకాశమూ, అనుభవమూ

కావాలి, బుద్ధికుశలతా కావాలి. ఎంపిరిసిస్ట్ల వాదంలో కొంత నిజం ఉన్నది. రేషనలిస్ట్ల వాదంలో కూడా కొంత నిజం ఉన్నది రెండ వైపులూ కలిసి ఉంటేనే నాణేనికి అస్తిత్వం వస్తుంది. దాని స్వరూపం తెలుస్తుంది.

తత్త్వ శాస్త్రజ్ఞులు చేసిన పరిశోధనలవలన భాషని నేర్చుకోవటంలో ఉన్న విశేషాలూ, సాధకబాధకాలూ భాషాశాస్త్రజ్ఞుల దృష్టికి వచ్చి, వారి భాషాశాస్త్ర విజ్ఞానం పెరిగింది. అలాగే తత్త్వ శాస్త్రజ్ఞులు వారి శాస్త్రంలో కొన్ని విషయాలని చర్చించేటప్పుడు తమ భావాలని సూటిగా, స్పష్టంగా చెప్పాలని కోరుకొంటారు. అయితే, ఇటువంటి స్పష్టత మామూలుగా జనం వాడే భాషలో సాధ్యం కాదని తెలుసుకొన్నారు. దానికోసం ప్రత్యేకమైన సంకేతాలనీ, పదజాలాన్నీ రూపొందించుకొని తత్త్వ శాస్త్రజ్ఞులు వారి భావాలను తూచినట్లు చెప్పుకోగలుగుతున్నారు. అపార్థాలూ, పెడర్థాలూ, నానార్థాలూ, అనర్థాలూ రాకుండా వారు చెప్పదలిచిన విషయాన్ని తత్త్వ శాస్త్రజ్ఞులు సమగ్రంగా, శక్తివంతంగా చెప్పుకోగలుగుతున్నారు.

మామూలు భాష స్వరూపం తెలిస్తే గానీ అందులో ఏ లోపాలని సవరించటానికి వీలు ఉన్నదో, మరే ఇతర లోపాలని సవరించటానికి వీలులేదో గమనించటం కష్టం. ఆ లోపాలు లేకుండా ఇంకొక ప్రత్యేక సాంకేతిక భాషని రూపొందించుకోవటమూ కష్టమే — భాషా స్వరూప జ్ఞానం లేకపోతే.

దీనివల్ల, తత్త్వశాస్త్రంతో పరిచయం భాషా శాస్త్రజ్ఞులకీ, భాషా శాస్త్రంతో పరిచయం తత్త్వ శాస్త్రజ్ఞులకీ ఉండటం మంచిదని తేలింది.

III భాషా శాస్త్రానికీ, మానసిక శాస్త్రానికీ ఉన్న సంబంధం

మనిషికి తన పరిసరాలను గురించి తెలుసుకోవటమూ, తనకు ఇతరులతో ఉన్న సంబంధాన్ని గురించి తెలుసుకోవటమూ, తన ప్రత్యేకతని గుర్తించుకోవటమూ చాలా అవసరం. ఈ చరాచర సృష్టిమీద తన ప్రభావాన్నీ తనమీద దానికున్న ప్రభావాన్నీ, తన బుద్ధి చాతుర్యంవల్లనే తెలుసుకోగలుగుతున్నాడు మానవుడు. ఆ 'బుద్ధి' పనిచేసే తీరుని ఆ వ్యక్తి వాడే భాషనిబట్టీ, వాడని భాషనిబట్టీ తెలుసుకోవచ్చుననీ మానసిక శాస్త్రవేత్తల (PSYCHOLOGISTS) నమ్మకం.

పిల్లలు తమ మాతృభాషని ఒక్కసారిగా కాకుండా, దశలవారీగా నేర్చుకొంటారు. కొన్ని విషయాలు ముందు నేర్చుకొంటారు. ఇంకొన్ని విషయాలు తర్వాత నేర్చుకొంటారు. ఈ విధంగా ఒక భాషని నేర్చుకోవటంలో ఒక వ్యక్తి కనబరచే నేర్పునీ, లోటుపాట్లనీ గమనించి, వీటికి సారధి అయిన ఆ వ్యక్తి మనస్సుని పరిశీలించటం సులభం అంటారు మానసిక శాస్త్రవేత్తలు. ఒక పిల్లవాడి బుద్ధి పనిచేసే తీరునీ, ఆ బుద్ధి ఏ విధంగా పరిపక్వం అవుతున్నది అనే విషయాన్నీ, ఆ పిల్లవాడు వాడే భాషని బట్టి తెలుసుకోవటానికి అవకాశం ఉంటుంది అని వాళ్ళు అంటారు

తీవ్రమైన ప్రమాదాలలో మెదడు గాయపడిన వాళ్ళు వాడే భాషలోని లోపాలవలన మెదడులో ఏ ప్రదేశం దెబ్బతిన్నదో తెలుసుకోవచ్చు. అటువంటి దెబ్బ తగిలిన వాళ్ళలో కొందరికి జ్ఞాపకశక్తి లోపించవచ్చు. ఆ గాయం ఫలితాలు ఇంకా ఎన్నిచోట్ల కనబడతాయో శాస్త్రజ్ఞులు ఊహించి, నిర్ణయించవచ్చు.

తమ మాతృ భాషని సరిగా నేర్చుకోలేని పిల్లలు చాలా అరుదు — ప్రత్యేక కారణాలుంటే తప్ప, కాబట్టి మాతృ భాషని నేర్చుకోవటంలో అసాధారణమైన ఆలస్యం జరిగితే, దానికి కారణం వినికిడిలోపమో, మరేలోపమో నిర్ణయించి, తగిన చర్యలు తీసుకోవచ్చు

మానసిక రుగ్మత ఉన్నవాళ్ళు అనేక రకాలుగా ఉంటారు. కొంతమంది అతిగా మాట్లాడితే మరికొందరు అసలు మాట్లాడరు వాళ్ళని ఏవో భయాలు పట్టుకొని పీడిస్తుంటాయి. ఇంకా కొంత మంది ఊహాలోకాల్లో విహరిస్తుంటారు అటువంటి వాళ్ళ ఊహలకి ఆకారం కల్పించే భాషనీ, వాళ్ళ వాడనలో కనబడే అసాధారణమైన పొందికనీ, ఆలోచనల ధోరణినీ తెలుసుకొన్న వైద్యులు వాళ్ళని మామూలు మనుషులుగా చేయటానికి ఏం చేయాలో నిర్ణయించుకోవచ్చు.

దీనిని బట్టి భాషా శాస్త్రజ్ఞానమున్న మానసిక శాస్త్రవేత్తలూ, మానసిక శాస్త్ర విషయాలతో పరిచయమున్న భాషా శాస్త్రజ్ఞులూ సమాజానికి చాలా ముఖ్యం అని తేలింది.

IV భాషా శాస్త్రానికీ, మానవ శాస్త్రానికీ ఉన్న సంబంధం

మన నాగరికత 'అభివృద్ధి' చెందేకొద్దీ మన సమస్యలు కూడా ఎక్కువ అవుతున్నాయి. మనకు అర్థం పర్థం తెలియని ఆచారాలతో, నీతులతో, నియమాలతో, చట్టాలతో మన జీవితాలు ముడి వేసుకొని పోయినట్లు అనిపిస్తుంది.

దీనికి ఎక్కని ఉదాహరణ నాగరిక సమాజాలు 'పెళ్ళి' పేరుమీద చేసే తతంగం, పెళ్ళి అంటే ఒక పురుషుడూ, ఒక స్త్రీ కలిసి జీవించటానికి నిర్ణయించుకోవటం — సెక్సుకీ, స్నేహానికీ, సంతానానికీ, ఈ పెళ్ళిళ్ళు యావజ్జీవితానికీ సంబంధించినవనీ, లేకపోతే జన్మజన్మలకూ సంబంధించినవనీ దాదాపు ప్రతి మతమూ ఇంతో అంతో చెబుతుంటుంది. అలాగే విడాకులని గురించీ, మళ్ళీ పెళ్ళి చేసుకోవటాన్ని గురించీ, పుట్టుకని గురించీ, చావుని గురించీ, మర్యాదలని గురించీ, వేడుకలని గురించీ, బోలెడంత రభసా, బోలెడన్ని కట్టుకథలూ·

ఈనాటి నాగరికతకు దూరంగా ఉన్నవాళ్ళని మనం 'మోటు' వాళ్ళు అనుకొంటూ ఉంటాం. అలాంటి 'ఆటవికులు' ఈ రకం సమస్యలతో సతమత మవుతున్నట్లు కనబడదు వాళ్ళు ఎంతో స్వేచ్ఛగా ఉన్నట్లు అనిపిస్తుంది వాళ్ళ కుటుంబాలనీ, బంధుత్వాలనీ, వేడుకలనీ, బాధ్యతలనీ గమనిస్తే సమాజం సరిగ పనిచేయటానికి అవసరమైనవి ఏవో మనకు సులువుగా తెలుస్తాయి దానివల్ల మన సమాజంలో మనం చేసే పనులవల్ల కలిగే ప్రయోజనాలూ, అనర్థాలూ మనకి తెలుస్తాయి. ఆచారాలూ, వ్యవహారాలూ, వావి – వరుసలు రకరకాలుగా ఉంటాయని తెలుస్తుంది. మనం 'నీతి' అనుకొన్నది ఇంకొకళ్ళకి 'బూతు' కావచ్చుననీ, అలాగే మనం 'బూతు' అనుకొన్నది ఇంకొకళ్ళకు 'నీతి' కావచ్చుననీ తెలుస్తుంది. ప్రకృతికీ, మనిషికీ ఉన్న అనుబంధం అర్థం అవుతుంది. 'మనమే నాగరికులం; మిగతా వాళ్ళంతా మోటువాళ్ళు' అనుకొనే దురహంకారం క్రమంగా తగ్గిపోతుంది.

అయితే, ఇంకొక సమాజపు జీవన విధానాలని గురించి పూర్తిగా నేర్చుకోవాలంటే వాళ్ళు మాట్లాడే భాష మనకి తెలియాలి. వాళ్ళ భావాలని అప్పుడు మనం స్పష్టంగా, సులభంగా తెలుసుకోవచ్చు. ఇంతవరకూ లిపిలేని భాషలను కూడా నేర్చుకొనే పద్ధతులూ, వాటికి వ్యాకరణాలను వ్రాసి, వర్ణించే పద్ధతులూ భాషా శాస్త్రజ్ఞులకు తెలుసు.

ఈ పరిశీలనలో ఆచారాలలో పోలికలూ–భేదాలూ ఉన్నట్లే, భాషా నిర్మాణంలోనూ, భావాన్ని అందించే పద్ధతులలోనూ మన భాషకీ, వాళ్ళ భాషకీ ఉన్న పోలికలూ–భేదాలూ కూడా తెలుస్తాయి. వాళ్ళ భాషకి వ్యాకరణం లేదనుకోవటం అపోహ అనీ, వాళ్ళ జీవన విధానం మనకి మోటుగా కనిపించినందున వాళ్ళ భాష కూడా మోటుది అనుకోవటం తప్పు అని తెలుస్తుంది. వాళ్ళ భాషా స్వరూపాన్ని పరిశీలిస్తే మనం వాడని ధ్వనులు కూడా వాళ్ళభాషలో వాడతారనీ వాళ్ళ వాక్య రచన మనం ఊహించినట్లు ఉండదనీ తెలుస్తుంది. ఈ ప్రపంచాన్ని గురించీ, వస్తుతత్వాలని గురించీ వాళ్ళకున్న అభిప్రాయాలు వాళ్ళ వాక్య నిర్మాణంలో ప్రతిబింబిస్తున్నాయా అనిపిస్తుంది. మనం అనుకొన్న 'కర్త' 'కర్మ' 'క్రియ'లు మనం అనుకొన్నట్లుగా కాకుండా ఆ భాషలో మరో విధంగా ఉంటాయి. మన భాషలో ఒక జాబితాలో నామవాచకాలనీ, వేరొక జాబితాలో సర్వనామాలనీ, ఇంకో జాబితాలో క్రియాపదాలనీ ఏర్పాటు చేస్తే, వాళ్ళ నామవాచకాల, సర్వనామాల, క్రియా పదాల జాబితా వేరొక రకంగా ఉంటుంది. వాక్య రచనలో ఏ విషయాలని స్పష్టంగా, వాచ్యంగా చెప్పాలో, వేటిని చెప్పక్కరలేదో నిర్ణయించటంలో ఒక భాషకీ, ఇంకో భాషకీ భేదాలుంటాయని తెలుస్తుంది రాతకోతలున్నవాళ్ళకే సాహిత్యం ఉంటుందనుకోవటం తప్పని తెలుస్తుంది. కాయితమూ, కలమూ, లిపీ, పుస్తకాలూ, ప్రెస్సులూ మొదలయిన హంగులు లేకపోయినా, సాహిత్యం పుట్టటానికీ, పెరగటానికీ, ప్రజలలో ప్రచారం పొందటానికీ ఏమీ లోటు లేదని తెలుస్తుంది. చేవ ఉన్న సాహిత్యానికి చావు ఉండదని మనకి అర్థం అవుతుంది.

ఈ విధంగా మనలని మనం అర్థం చేసుకోవటానికీ, మన సంస్కృతిని అర్థం చేసుకోవటానికీ, మన ఆలోచనలలో కొత్త వెలుగులు వెలిగించటానికీ మానవశాస్త్రం (ANTHROPOLOGY) తో పరిచయమున్న భాషా శాస్త్రజ్ఞులూ, భాషా శాస్త్రంతో పరిచయమున్న మానవశాస్త్రజ్ఞులూ చాలా అవసరం అని తేలింది.

V భాషా శాస్త్రానికి సామాజిక శాస్త్రంతో ఉన్న సంబంధం

ఒక సమాజంలో ఏయే సందర్భాలలో ఎటువంటి భాషను ఉపయోగిస్తున్నారో తెలుసుకోవటం భాషా శాస్త్రజ్ఞులకూ, సామాజిక శాస్త్రజ్ఞుల (SOCIOLOGISTS) కూ కూడా అవసరం. సమాజపు సమస్యలని అర్థం చేసుకోవటానికీ, భాషయొక్క పూర్తి స్వరూపాన్ని తెలుసుకోవటానికీ ఈ రెండు శాస్త్రాల కలయిక ఉపయోగపడుతుంది.

సమాజపు స్వరూపం ఇంతో అంతో భాషలో ప్రతిఫలించి ఉంటుంది. ఉదాహరణకి తెలుగులో '<u>వాడు, అతను, ఆయన, వారు</u>, అని ఒక వ్యక్తిని అనటంలో మాట్లాడేవాడి ఉద్దేశంలో ఆ వ్యక్తికి గల స్థానం తెలుస్తుంది. చిన్నపిల్లలనీ, సమవయస్కులనీ, చనువు గల వారినీ <u>వాడు</u> అంటాం అంత చనువు లేనివారిని <u>అతను</u> అంటాం. <u>వాడు, అతను</u> అని పై అధికారి కిందివాళ్ళని అనటం కూడా జరుగుతుంది. <u>ఆయన</u> అని మనకు గౌరవమున్న వ్యక్తినీ, ఏదో విధంగా మనకంటె పెద్ద అని మనం అనుకొంటున్న వ్యక్తినీ, మనకి కొంచెం చనువు తక్కువగా ఉన్న వ్యక్తినీ అంటాం పెద్ద హోదా ఉన్న అధికారినిగానీ, పండితుడినిగానీ, పరిచయంలేని గొప్ప వ్యక్తులని గానీ <u>వారు</u> అంటాం. దీన్నిబట్టి తెలుగు సమాజంలో వ్యక్తులకు ఉన్న స్థానాన్ని మనం వాడే సర్వనామాల ద్వారా తెలుసుకోవచ్చు ఈ సందర్భాలన్నింటిలోను ఇంగ్లీషులో విచక్షణ లేకుండా <u>he</u> అంటారు. అలాగే ఇంగ్లీషులో <u>uncle</u> అంటే, తెలుగులో <u>పెద్దమామ, చిన్నమామ, బుల్లిమామ, పెదనాన్న, చిన్నాన్న, బాబాయి</u>, అని సంబంధాలూ వరసలూ స్పష్టంగా తెలిపే పదాలు వాడతాము. దీనికి కారణం బహుశ మన ఉమ్మడి కుటుంబాలలో బంధువరాన్నంతా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం అయి ఉండవచ్చు.

ఈ విధంగా కుటుంబ వ్యవస్థని గురించీ, సమాజపు స్వరూపాన్ని గురించీ భాష ద్వారా తెలుసుకోవచ్చు ప్రాంతీయ దురభిమానాల వలనా, భాషా దురభిమానాల వలనా దేశంలో అల్లకల్లోలాలు రేగి సాంఘికంగానూ, రాజకీయంగానూ కొత్త

సమస్యలు బయలుదేరతాయి. జాతీయ భాషను నిర్ణయించటం లోనూ, ప్రాంతీయ భాషలకు సరియైన గుర్తింపు వచ్చేటట్లు చేయటంలోనూ, అధికార భాషను ఎన్నుకొనటంలోనూ ఎన్నో సమస్య లున్నాయి. అలాగే గ్రాంధిక భాషనే వాడాలని కొందరూ, వ్యావహారిక భాషనే వాడాలని మరికొందరూ, శిష్ట వ్యావహారికం వాడాలని ఇంకొందరూ ఆందోళన చేస్తున్నారు ఈ భాషలకి వాడే లిపిని గురించి కూడా తర్జనభర్జనలున్నాయి భారతీయ భాషలన్నిటికీ దేవనాగరి అనువైనదని కొందరూ, రోమన్ లిపి మంచిదని మరి కొందరూ వాదిస్తున్నారు. తమ సంస్కృతినీ, నాగరికతనీ, సమాజాన్నీ తమ భాష మాత్రమే భద్రంగా కాపాడుతుందనీ, మార్పు మంచిదికాదనీ, మరొక భాషకి ప్రాబల్యం ఎక్కువైతే తమ భాష నాశనం అవుతుందనీ, ప్రజలు నమ్ముతారు. ఇటు వంటి నమ్మకాలే దూరాలోచనలేని వారిచేత ఏదో ఒక పని చేయించ టానికీ, అలజడికీ కారణాలు అవుతాయి. ప్రజలలో బయలుదేరే అనవసరపు ఉద్రేకాలనీ, ఉద్యమాలని అణచటానికి, వాళ్ళని తొందరగా అక్షరాస్యులుగానూ, విద్యావంతులుగానూ, వివేకవంతులు గానూ చేయాల. దీనికి భాషని సాధనంగా వాడుకోవచ్చు.

భాషను బోధించే పద్ధతులలోనూ, పాఠ్యాంశాలలోనూ చేయాల్సిన మార్పులని గురించీ, ప్రచార సాధనంగా ఒక భాషని వాడుకోవాలంటే చేయాల్సిన మార్పులను గురించీ, ప్రాంతీయ పురోభివృద్ధికీ, దేశపురోభివృద్ధికీ సహాయకారిగా ఏ భాషను ఏ పరి స్థితులలో వాడాలి అనే విషయాన్ని గురించీ ఆలోచించాలి. ప్రపంచ లోని ప్రజలంతా వాడటానికి యోగ్యమైన భాషను గురించి వివేచన చేయాలి దీనివల్ల మానవుడిని పురోగామిగా గానీ, విధ్వంసకుడిగా గానీ మార్చగల శక్తి భాషకు ఉన్నదనీ, అటువంటి భాషను గురించిన వివేచన చేయగలవాళ్ళు సామాజిక శాస్త్రంతో పరిచయమున్న భాషా శాస్త్రజ్ఞులూ, భాషా శాస్త్రంతో పరిచయ మున్న సామాజిక శాస్త్రజ్ఞులూ అని తేలింది.

VI గణితశాస్త్రంతో భాషా శాస్త్రానికున్న సంబంధం

అన్ని శాస్త్రాలకూ తల్లివంటిది గణితశాస్త్రం. మానవుడు తనకు పరిచితమైన వాటిని పరిశీలించి, అపరిచితమైన వాటి ఉనికినీ, లక్షణాలనీ, తన ఊహాశక్తితో సాధించగల ప్రజ్ఞ గణిత శాస్త్రం (MATHEMATICS) లో మనకు ప్రముఖంగా కనబడు తుంది.

నోమ్ ఛామ్‌స్కీ (Noam Chomsky) అనే అమెరికన్ భాషాశాస్త్రవేత్త వ్యాకరణశాస్త్ర నిర్మాణానికి గణితశాస్త్రజ్ఞులు వాడే సూత్రపద్ధతి సముచితమైనదని నిర్ణయించాడు. ఈ పద్ధతిలో భాషాయంత్ర స్వరూపాన్ని శికమకలు లేకుండా సూచించ వచ్చునని ఋజువు చేశాడు. తనకు పూర్వం ఉన్న భాషాశాస్త్ర వేత్తలు ఒక భాషకి వ్యాకరణం నిర్మించటంలో చేస్తున్న తప్పులనీ, వాటికిగల కారణాలనీ, ఆ తప్పులవల్లనే కలిగే కొత్తసమస్యలనీ, ఆ పొరపాట్లు దిద్దుకోవాలంటే చేయాల్సిన పనినీ, ఊహించాల్సిన విధానాన్నీ చూపించాడు. తనకు పూర్వం ఉన్న భాషా శాస్త్రజ్ఞులు ఊహించటానికి కూడా వీలులేని సమస్యల్ని ఊహించటమేకాక, పరిశీలించవచ్చుననీ, తలెత్తిన సమస్యల్ని ఆధునిక భాషాశాస్త్ర సహాయంతో సంతృప్తికరంగా పరిష్కరించవచ్చుననీ రుజువుచేశాడు.

గణితశాస్త్రజ్ఞులు దేనినైనా పరిశీలించి వర్ణించదలుచు కొంటె కొన్ని ఆచారాలూ, పద్ధతులూ అవలంభిస్తారు. ఏ కారణం వల్లనైనా పరిశీలించవలసిన వస్తువు దొరకకపోయినా, అందు బాటులో లేకపోయినా, దానికి ఒక నమూనాని తమ ఊహలతో తయారుచేస్తారు. ఇలా ఊహలతో ఆకారం కల్పించిన ఈ నమూనా లోని భాగాలనూ, అవి పనిచేసే తీరునీ నిర్ణయిస్తారు. ఇటువంటి నమూనాలోని అతి చిన్న భాగాలని కూడా సూచించి, అవి ఏ సూత్రాలను అనుసరించి పెద్దభాగాలు అవుతాయో, ఈ పెద్ద భాగాలను మరికొన్ని సూత్రాలవలన ఎలా మార్చవచ్చునో, సంబంధాలు ఏ పద్ధతిలో స్పష్టం అవుతున్నాయో తీర్మానిస్తారు.

దీనితో పరిశీలించదల్చుకొన్న వస్తువుకూ, నమూనాకు ఉన్న పోలికలనుబట్టి, ఆ వస్తుతత్వాన్ని గురించి తీర్మానిస్తారు.

భాషాపరంగా చూస్తే, వ్యాకరణం అనే యంత్రం మూలంగా ధ్వనులని, పదాలనీ కలిపేపద్ధతిని, వాక్యాన్ని తయారుచేసే పద్ధతినీ, అలా తయారైన వాక్యాలని మరికొన్ని సూత్రాల సహాయంతో ఇతర రకాలైన వాక్యాలుగా మార్పుచేయటాన్నీ తెలుసుకొంటాం అన్నమాట.

పైకి చాలా చిన్న వాక్యంగా తయారైనా, దాని వెనక దాక్కొని ఉన్న నిర్మాణ సూత్రాల పరంపరనూ, మార్పిడిసూత్రాల పరంపరనూ ఈ వ్యాకరణ యంత్రంలో ఎలా ఇమడ్చవచ్చునో తెలుస్తుందన్నమాట ఇంకా ఏ సిద్ధాంతం ఇచ్చిన అధికారంతో వ్యాకరణ యంత్రాలని ఇటువంటి నమూనాల సహాయంతో కను క్కొనవచ్చునో తెలుస్తుందన్నమాట

వ్యాకరణానికి కావల్సిన సామగ్రిని నిర్ణయించటం, నిర్మాణ సూత్రాలనీ, మార్పిడి సూత్రాలనీ నిర్ణయించి వర్ణించటం, భాషా శాస్త్రజ్ఞులు చేయగలుగుతారు. పరిచితమైన వస్తుజాలాన్ని ఉపయోగించుకొని, గణితశాస్త్రమూ, తదితరశాస్త్రాలూ అందించే పరికరాల సహాయంతో అపరిచిత భాగాలను ఊహించి, వాటికి ఆకారం కల్పించటం భాషాశాస్త్రజ్ఞులు మాత్రమే చేస్తారనుకో కూడదు.

గణిత శాస్త్రజ్ఞులు ఆకారమున్న వస్తువులనీ, ఆకారంలేని వస్తువులనీ పరిశీలించి, నమూనాలుచేసి, తమ మేధాశక్తితో ఆ వస్తువుయొక్క రూపాన్నీ, స్వభావాన్నీ, గుణాలనీ, దోషాలనీ, సాధించి నిర్ణయిస్తారు. ఈ నమూనాలద్వారా లక్షణ నిర్ణయం జరిగి, లాభాలేవో, నష్టాలేవో తెలుస్తాయి.

ఈ విధంగా వ్యాకరణయంత్రపు నమూనాని నిర్మించటం ఇతర శాస్త్రాలలోని నమూనా నిర్మాణాన్ని పోలి ఉంది. అంటే, ఆ నిర్మాణ పద్ధతులలోనూ, సిద్ధాంతాలని పరిశీలించే విధానాల లోనూ భాషాశాస్త్రానికీ, ఆ ఇతర శాస్త్రాలకీ పోలిక ఉన్నదన్న మాట మిగతా రంగాలను అన్వేషించి, వాటి నిర్మాణంలోని మర్మాలని గ్రహించగల మేధా సంపత్తికీ, భాషని పరిశీలించి, దానికి వ్యాకరణాన్ని నిర్ణయించే మేధాసంపత్తికీ సంబంధం ఉన్నది అన్నమాట.

వ్యాకరణాన్ని నిర్ణయించటానికి కావలసిన సామగ్రిని ఛామ్‌స్కీ నిర్దేశించి, అటువంటి వ్యాకరణం భాషా నిర్మాణంలోని విశేషాలను గుర్తించి ప్రదర్శించి, విశదీకరించగలదని తన 'జెనరేటివ్ ట్రాన్స్‌ఫర్‌మేషనల్ గ్రామర్' (నిర్వచనాత్మక పరివర్తన వ్యాకరణం*) ద్వారా నిరూపించాడు. దీనితో భాషాశాస్త్రంలో విప్లవం తీసుకొని వచ్చాడు. భాషాశాస్త్ర చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రవేశపెట్టాడు. దీన్నిబట్టి భాషాశాస్త్రజ్ఞులకి గణిత శాస్త్రంతో పరిచయమూ, గణితశాస్త్రజ్ఞులకి భాషా శాస్త్రజ్ఞులతో పరిచయమూ ఉంటే నిర్మాణమార్మికతలని గురించి ఎక్కువగా తెలుసుకోవచ్చని తేలింది

VII భాషా శాస్త్రానికి, భౌతిక శాస్త్రానికీ ఉన్న సంబంధం

ధ్వని పుట్టటం, వ్యాపించటం, చెవినిబడి అర్థం అవటం — అంతా ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతుంది. భౌతిక శాస్త్రంతో పరిచయం ఉన్నవాళ్ళు ధ్వని పుట్టటానికి వీచేగాలి, ఊగే తీగెలూ, ధ్వని తరంగాలను కంపింపజేసి ప్రకటించే గదీ ముఖ్యం అంటారు.

మన శరీరంలో కూడా ఈ భౌతిక నియమాలను అనుసరించే ధ్వని బైటకు వస్తుంది.

మన ఊపిరి తిత్తులు పంపే గాలి ద్వారా, గొంతులో ఉన్న స్వర పేటికలోని తీగెలు క్షణ క్షణానికీ వాటి పొడుగునూ, వెడల్పునూ, లావునూ మార్చుకొంటూ రకరకాల వేగాలతో కంపిస్తాయి. ఆ కంపనలని గొంతులోనూ, నోటిలోనూ జల్లించినట్లు కొన్నిటిని విపులీకరించీ, మరి కొన్నిటిని క్లుప్తీకరించీ ఆ ధ్వనిని ప్రసారయోగ్యం చేస్తాము. నాలుకని పైకీ, కిందికీ, ముందుకూ, వెనకకూ కదిలించటం ద్వారా మనం మాట్లాడేటప్పుడు ధ్వనులలో రూప భేదాలు తెస్తాము అలాగే లోపల నుంచి వచ్చే శబ్ద తరంగాలని పూర్తిగా వదిలివేసో, కాస్త ఆపివేసో, పూర్తిగా ఆపివేసో ధ్వనులలో రూపభేదాలు తెస్తాము. ఈ పనికి స్వర పేటికనీ, కొండ నాలుకనీ ఉపయోగిస్తాము. నాలుకని కూడా, నాలుక వెనకభాగాన్ని పైకి జరిపో, ముందు భాగాన్ని పైకి జరిపో, లేకపోతే నాలుక కొనతో నోటి కప్పులోని ప్రదేశాలు తాకిగానీ, పండ్ల వరసని తాకిగానీ, లేకపోతే కింది పండ్ల వరసతో పై పెదవిని తాకిగానీ, లేకపోతే పెదవుల ఆకారంలో మార్పులు తెచ్చి, గుండ్రం చేసీ, వెడల్పు చేసీ, నోటిని పూర్తిగా తెరిచీ, కొద్దిగా మాత్రమే తెరిచీ — ఇటువంటి ప్రక్రియల వలన ధ్వని తరంగాలు కంపించే గది సైజుని మార్చినందువలన ధ్వనిని పుట్టించి, వ్యాపింప చేస్తున్నాం.

గాలిలో ఈ ధ్వని తరంగాలు ప్రయాణం చేస్తాయి. వినేవాడి చెవిలోని పొరని ముందుకూ వెనకకూ కంపింపచేసి, దానిని అంటుకొని ఉన్న నరాల ద్వారా మెదడుకు సందేశాన్ని అందజేసి మనకు వినబడిన మాటల అర్థాన్ని మనం తెలుసుకొనేటట్లు చేస్తాయి ధ్వని తరంగాలు ఈ విధంగా పుట్టటం, వ్యాపించటం, ధ్వనులను మనకి వినిపించి, అర్థమయేలాగా చేయటం, యంత్రాల సాయంతో పట్టుకొని, భాషా శాస్త్రజ్ఞులూ, భౌతిక శాస్త్రజ్ఞులూ పరిశీలించవచ్చు.

ధ్వని పుట్టి బైటపడే విధానాన్ని ఉచ్చారణ శాస్త్రంతోనూ, [1] ధ్వని తరంగాలు వ్యాపించటాన్ని ధ్వనియంత్రం శాస్త్రంతోనూ, [2] ధ్వనులని విని, విడగొట్టి, కలిపి అర్థం చేసుకోవటాన్ని అవగాహన ధ్వని శాస్త్రంతోనూ [3] పరిశీలించవచ్చు.

మనుష్యులలో స్వర పేటికల నిర్మాణం రక రకాలుగా ఉంటుంది. ఈ కారణం వల్లనే రక రకాల స్వరాలతో మాట్లాడుతారు మనుషులు. ప్రతివారూ ఉపయోగించటానికి వీలైన రేడియో, గ్రామఫోన్, మైక్రోఫోన్, టెలిఫోన్ మొదలైన యంత్రాలు వర్ణోచ్చారణలోని భేదాలవల్ల సక్రమంగా పనిచేయకపోవచ్చు. అపుడు దానికి తగిన మార్పులూ, చేర్పులూచేస్తే, ఎవరు ఉపయోగించినా సరిగా పని చేస్తుంది. దీనికి ధ్వని శాస్త్రం తెలియాలి.

మామూలు టైప్ రైటర్‌లో వేళ్ళతో కీ బోర్డులోని అక్షరాలను నొక్కటంవలన, ఆ అక్షరాలను ముద్రించటం జరుగుతుంది. అలా వేలితో తాకకుండా, నోటితో చెబితే చెప్పిన దానిని వెంటనే ముద్రించే వాయిస్ టైప్ రైటర్ నిర్మించాలంటే ధ్వని శాస్త్రం తెలియాలి.

వేలిముద్రలద్వారా వ్యక్తులని నిస్సందేహంగా గుర్తించగలిగినట్లు, వాళ్ళ గొంతునిబట్టికూడా వాళ్ళని గుర్తించవచ్చు. నేర పరిశోధనలో ఇలా స్వరలక్షణాలను గుర్తుపట్టగల యంత్రం ఉపయోగిస్తుంది.

ఈ విధంగా భాషాశాస్త్ర పరిచయమున్న భౌతిక శాస్త్రజ్ఞులూ భౌతిక శాస్త్రంతో పరిచయమున్న భాషా శాస్త్రజ్ఞులూ ధ్వనులు పుట్టటాన్నీ, వ్యాపించటాన్నీ, అర్థం అవటాన్నీ, భాషా స్వరూపాన్నీ తెలుసుకొన్నందువల్ల ప్రజలకు సౌకర్యాలు కలగజేయగలరని స్పష్టమవుతున్నది.

---

* ఇక్కడ నిర్వచనాత్మకమంటే పద్యమయ వ్యాకరణమని అపోహ పడకూడదు. సుస్పష్టంచేసే వ్యాకరణం అని మాత్రమే గ్రహించాలి.

1 Articulatory Phonetics.

2 Acoustic Phonetics

3 Auditory Phonetics.

VIII భాషాశాస్త్రానికీ, ఇంజినీరింగ్‌కీ ఉన్న సంబంధం

కంప్యూటర్ శాస్త్ర విభాగంలో కృత్రిమ భాషల అధ్యయనం చేస్తారు. ఏదో ఒక మానవ సమాజం వాడే భాషలని 'సహజ' భాషలు అని వ్యవహరిస్తారు భాషాశాస్త్రజ్ఞులు. కేవలం ఒక ప్రణాళికా స్వరూపాన్ని యంత్రానికి అందించేటందుకు శాస్త్రజ్ఞులు వాడే భాష 'కృత్రిమ' భాష. దీనిని 'యంత్రప్రసంగం' అని కూడా అనవచ్చు.

ఒక భాషలోని భావాన్ని మరొక భాషలోకి తొందరగా, తప్పులు లేకుండా అనువాదం చేయగల్గిన నేర్పు యంత్రాలకు కలగజేయాలంటే, సహజ భాషాస్వరూపమూ, కృత్రిమ భాషాస్వరూపమూ రెండూ తెలిసి ఉండాలి. సహజ భాషలో మానవుడు చెప్పగలిగిన భావాలన్నీ కృత్రిమ భాషలో సంపూర్ణంగా చెప్పగలగాలి. పదాలను ఎన్నుకోవటంలోనూ, వాక్యాలను నిర్మించటంలోనూ, మనుషులకు తెలిసిన మెళుకువలు యంత్రానికి అర్థం అయే విధంగా బోధించగలిగి ఉండాలి. భాషాశాస్త్ర జ్ఞానమూ, సాంకేతిక శాస్త్ర జ్ఞానమూ రెండూ ఉన్నవారే ఇటువంటి పనులు చేయగలుగుతారు. కృత్రిమ భాషలోని లోటుపాట్లను గమనిస్తే సహజ భాషలో దాక్కొనిఉన్న నిర్మాణ రహస్యాలు బైటపడతాయి.

దీనివల్ల భాషాశాస్త్రంతో పరిచయం ఉన్న ఇంజనీర్లూ, ఇంజనీరింగ్ శాస్త్రంతో పరిచయం ఉన్న భాషాశాస్త్రజ్ఞులూ అవసరం అని స్పష్టమవుతున్నది.

IX భాషాశాస్త్రానికీ సాహిత్యానికీ ఉన్న సంబంధం

అన్ని వాక్యాల నిర్మాణంలోనూ సాధారణ నియమాలను పాటించవలసి ఉన్నప్పటికీ, తమకే స్పష్టంగా తెలియని కొన్ని కారణాలవలన కొందరు కొన్ని రకాల ధ్వనుల కూర్పునీ, పదబంధాలనీ, వాక్యాల పొందికనీ విశేషంగా ఆదరిస్తారు. ఈ విధంగా కొంత మంది మెప్పు పొందిన ప్రయోగాలు 'సాహిత్యం'గా చెలామణి అవుతాయి.

ఇలా ఆదరించబడిన భాషా భాగాన్ని పరిశోధించి, దాని నిర్మాణాన్ని, అది సాధించదల్చుకొన్న ప్రయోజనాన్ని గ్రహించవచ్చు. ఆ సాహిత్యానికి అటువంటి సామర్థ్యం ఎలా వచ్చిందో విశదీకరించితే సాహిత్య మర్మాలు తెలియనివాళ్ళు తెలుసుకొంటారు. సూచనగా తెల్సుకొన్న విషయాలను సూత్రీకరించి సుస్పష్టంగా చెప్పవచ్చు.

రచయితలు భాషనివాడే ప్రత్యేక పద్ధతులని గమనించినందువలన, రచయితల వివరాలు తెలియని రచనలను కూడా భాషాశాస్త్రజ్ఞులు పరిశీలించి, వాటిని ఏకాలంలో వ్రాసి ఉంటారో, ఎవరువ్రాసి ఉంటారో ఊహించవచ్చు.

భాషా నిర్మాణం తెలియనిదే సంతృప్తికరమైన సాహిత్య నిర్మాణం కష్టం. అలాగే సాహిత్యపు విలువలు, రచయితలు చూపించే విరుపులూ, మెరుపులూ, భాషా పారిశ్రామికులు తెలుసుకోవాలి. అపుడు వారికి వాక్య స్వరూపమూ, రూపభేదాలూ, అవతారభేదాలూ, నిర్మాణ స్వాతంత్ర్యానికున్న పరిధీ, పరిమితీ తెలుస్తాయి.

దీనివల్ల సాహిత్య జ్ఞానమున్న భాషాశాస్త్రజ్ఞులూ, భాషా శాస్త్ర జ్ఞానమున్న రచయితలూ అవసరమని తేలింది.

భాషాశాస్త్రాన్ని సులభంగా, సంపూర్ణంగా, శీఘ్రంగా సంతృప్తికరంగా తెలుసుకోవటానికి ఆ శాస్త్రానికి ఇతర శాస్త్రాలతో కల సంబంధం తెలుసుకోవటం ఎంత అవసరమో ఇక్కడ సూచించబడింది.

ప్రాచీన భారతదేశంలో వ్యక్తి సమగ్ర వికాసానికి అరవై నాలుగు కళల అధ్యయనం చేయాలని నిర్ణయించారు విజ్ఞానం విపరీతంగా పెరిగిపోతున్న ఈ రోజులలో విద్యావంతులు, ముఖ్యంగా భాషాశాస్త్ర విద్యార్థులూ, భాషా శాస్త్రవేత్తలూ కూపస్థ మండూకాలలాగా ఉండగలరా?

కృతజ్ఞత

— ఇంగ్లీషులో వ్రాసిన తమ పుస్తకాలద్వారా లింగ్విస్టిక్స్‌ని గురించి నేను తెలుసుకోవటానికి సహాయపడిన **Gleason, Lehman, Lyons, Langacker, Robins** మహాశయులకు;

— ప్రశంసనీయంగా వేధించి లింగ్విస్టిక్స్‌ని గురించి తెలుగులో నాచేత చెప్పించిన చి|| తాడంకి ఇందిరకి;

— ఈ వ్యాసం తెలుగులో రాసినందుకు సంతోషించి, చదివి, స్థాయిని, హాయిని పెంచటానికి చక్కని సూచనలిచ్చిన ఆచార్యులు శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి, శ్రీ జి. ఎన్. రెడ్డి, శ్రీ చేకూరి రామారావుగార్లకు;

— గణిత శాస్త్రానికి సంబంధించిన విషయాలను వివరించటంలోనూ, దురన్వయాలనూ, దూరాన్వయాలనూ సవరించటంలోనూ విశేష సామర్థ్యంకల శ్రీ సి. రామబ్రహ్మంకు చాలా కృతజ్ఞుణ్ణి. ఈ వ్యాసంలో ఇంకా మిగిలిఉన్న లోపాలు నా అజ్ఞానానికీ, మొండితనానికీ నిదర్శనాలు.

[రచయిత హైదరాబాదులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజిస్‌కి చెందినవారు]

శ్రీ బి. వెంకటేశ్వర్లు

పురాతన హిందూ గణ తంత్రాలు : ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలు

- ఒక తులనాత్మక పరిశీలన

ఉపోద్ఘాతం :

విభిన్న దేశాలలో ఏకకాలంలో రాజ్యావిర్భావంలోనూ, పరిణామాభివృద్ధి క్రమంలోనూ తోడ్పడిన శక్తులు స్వరూపంలోనూ, స్వభావంలోనూ ఒకే విధంగా వుంటాయా? దీనికి రెండు భిన్న రాజ్యాలలో ఏక కాలంలో వర్ధిల్లిన రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా అధ్యయనం చేయటం అవసరమౌతుంది. ఇట్టి అధ్యయనం రాజకీయ వ్యవస్థల ఆవిర్భావానికి, పరిణాభివృద్ధిక్రమానికి కారణాలైన శక్తులను సాధారణీకరించి, సమన్వయ పర్చటానికి వీలును కల్పిస్తుంది. తత్ఫలితంగా లభించిన విజ్ఞానాన్ని సూత్రీకరించి, తద్వారా వర్తమాన రాజకీయ వ్యవస్థలను అర్థం చేసుకొనటానికి, భవిష్యత్తులో నిర్మించుకోబోయే వ్యవస్థలను తీర్చి దిద్దుకోవటానికి వినియోగించుకో వీలుంటుంది. భవిష్యద్వర్తమాన వ్యవస్థలను తీర్చి దిద్దుకొనటానికి రాజనీతి శాస్త్రజ్ఞులకు రాజ్యాన్ని గురించిన చారిత్రక పరిశోధనావసరం ఎంతైనా వుంది. ఈ వుద్దేశ్యంతోనే ఈ వ్యాసంలో రెండు విభిన్న దేశాలలో ఒకే కాలంలో వర్ధిల్లిన రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా పరిశీలించే ప్రయత్నం జరిగింది.

క్రీ. పూ. 7 మరియు 2 శతాబ్దాల మధ్యకాలంలో గ్రీసు దేశంలో నగరరాజ్యాలు విలసిల్లాయి. ఈ నగర రాజ్యాలలో ప్రజల సామాజిక, రాజకీయ జీవనం ఎంతో వుత్కృష్టమైనదని చరిత్ర పేర్కొంటున్నది. ఈ కాలంలోనే గ్రీకు నాగరికత వుచ్చ దశలో వెలుగొందింది. దాదాపుగా యిదే కాలంలో భారతదేశంలో గణ తంత్రాలు వర్ధిల్లాయి. ప్రాచీన గ్రీకు నగర రాజ్యాల ప్రజల సామాజిక, రాజకీయ జీవన విధానానికి, పురాతన హిందూ గణ తంత్రాలలోని ప్రజల సామాజిక, రాజకీయ జీవన విధానానికి ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఈ రెండు దేశాలకు ఏ సంబంధాలు ఏర్పడక పూర్వమే [1] (లేక వున్నాయా?) రెండు దూర దేశాల ప్రజల సంపూర్ణ జీవన విధానంలో సామ్యాలు గోచరించడం ఎంతో ఆశ్చర్యకరమైన విషయంగా తోస్తుంది.

రాజ్యావతరణ :

తీవ్రంగా చీలివున్న ఏజియన్ సముద్రతీరం గ్రీకు నగర రాజ్యాల అవతరణలోనే కాక వాటి నాగరికతపై ఎంతో ప్రభావాన్ని కలిగివుంది. ఏజియన్ సముద్రం గ్రీసు దేశాన్ని చిన్న చిన్న ద్వీపాలుగనూ, ద్వీప కల్పాలు గానూ సృష్టించింది. "ఈ భౌగోళిక పరిస్థితి చిన్న చిన్న నగర రాజ్యాల ఏర్పాటుకు ఎంతో దోహదం చేయటమే కాక గ్రీకులు గొప్ప నావికులుగా తయారుకావటానికి తోడ్పడింది." [2] వీటిలో గ్రీకు నాగరిక జీవనానికి మూలాధారమైన 'క్రెట్' [3], ఏథెన్స్, స్పార్టా ముఖ్యమైనవి.

క్రీ పూ. 4 వ శతాబ్దం నాటికి – అలెగ్జాండర్ భారత దేశంపై దండెత్తే కాలం నాటికి – సింధులోయ ప్రాంతంలో గణ తంత్రాలున్నాయి కాని గ్రీకు చరిత్రకారులు తమ దేశంలోవలె ఇతర 'అనాగరిక' దేశాలలో గణతంత్రాలు లేదా ప్రజాస్వామ్యాలు వర్ధిల్లాయన్న నిజాన్ని అంగీకరించ నిరాకరించి 'రాజరికాలు కాని రాజ్యాలు' వున్నాయని పేర్కొనటం గణతంత్రాల వునికిని తెలియజేస్తుంది. [4]

గ్రీకు నగర రాజ్యాలలోవలెనే సార్వభౌమాధికారం ఒకే వ్యక్తిలో కాక పౌర సమూహంలో నిక్షిప్తమై వుండటాన్ని బట్టి పురాతన హిందూ గణతంత్రాలు ప్రజాస్వామ్య రాజ్యాలే. సార్వభౌమాధికారం కులీనుల పరం చేసిన స్పార్టా, పౌరులందరి పరం చేసి ప్రజాస్వామ్యంగా పేరువడసిన ఏథెన్స్ గణతంత్రాలే అయినట్లైతే, యిట్టి గణతంత్రాలు యివే గుణగణాలతో ప్రాచీన భారతంలోనూ వర్ధిల్లాయి. యౌదేయ, మాళవ, సిబి, క్షుద్రక, కథా, అంబష్ఠ, [5] శాక్య, లిచ్ఛవీ, అంధక వృష్ణి [6] మొదలైనవి స్పార్టా, ఏథెన్స్, క్రెట్, యూబోవా, లోక్రిస్, ఎటోలియా వంటి నగర రాజ్యాలే. గణతంత్రాలే.

అవతరణలోనూ, పరిణామాభివృద్ధి క్రమంలోనూ గ్రీకు, హిందూ గణతంత్రాలలో ఎన్నో సామ్యాలు కనిపిస్తాయి. గ్రీసు దేశంలో కొన్ని నగర రాజ్యాలు హోమర్ ఇలియడ్‌లోనూ, ఒడిస్సీలోనూ వర్ణించినట్లు పితృస్వామికాలు అంతమైన తర్వాత కులీనులు అధికారానికి వచ్చి, చివరకు ప్రజాస్వామ్యాలుగా అంతమైనాయి.[7] దీనికి ఏథెన్స్‌ను వుదాహరణగా పేర్కొనవచ్చును. మరి కొన్ని అంతర్గతమైన యిబ్బందుల ననుసరించి సైనిక రాజ్యాలుగా ఏర్పడ్డాయి. దీనికి స్పార్టా వుదాహరణ. హెలాట్స్ అనబడే ఒక స్థానిక తెగ ప్రమాదాన్నుంచి నగర రాజ్యాన్ని రక్షించుకోవటానికి తుదివరకూ స్పార్టా తన ప్రజలను సైనికులుగానే తీర్చి దిద్దింది.[8] భారతదేశంలో ఆర్యులు ద్రవిడులను వింధ్య దక్షిణ ప్రాంతాలకు, గంగా పరీవాహక ప్రదేశం వుత్తర ప్రాంతాలకు తరిమి ఆర్యావర్తంగా ప్రకటించుకొనటానికి డోరియన్ల మాదిరిగానే యుద్ధ విద్యలకు ప్రాధాన్యతనిచ్చారు. డోరియన్‌లు (స్పార్టా కులీనులు) తుదివరకు యుద్ధ నిపుణులే. అయినప్పటికీ సార్వభౌమాధికారం కులీనులలో నిక్షిప్తమై యుండటాన్ని బట్టి ఇదీ గణతంత్రమే. లేదా కులీన గణతంత్రంగా పేర్కొనవచ్చును.

హిందూ గణతంత్రాలు కూడా గ్రీకు నగర రాజ్యాలవలెనే వేదకాలం నాటి రాజరికాలు పతనమైన తర్వాత ఏర్పడ్డాయి. అప్పేర్పడ్డ యీ వ్యవస్థలు వైదిక ఆచారాలను కాలదన్నలేదు.[9] ఇవి 'గణ' తో ప్రారంభమైనాయి. 'గణ' అంటే సంఖ్య. గణతంత్రం అనగా అధిక జన పాలన.[10] కౌటిల్యుడు వర్ణించిన 'రాజ శబ్దోప జీవని సంఘాలు' ఏథెన్స్ వంటి గణతంత్రాలే. ప్రజాస్వామ్యాలు కూడా. ఈ గణతంత్రాలలోని 'రాజు'లే పౌరులు.[11] వీరు అన్ని అంశలలోనూ ఏథెన్స్‌లోని పౌరులవంటి వారు. పాణిని పేర్కొన్న 'ఆయుధ జీవని సంఘాలు', కౌటిల్యుడు వర్ణించిన 'శస్త్రోపజీవని సంఘాలు' స్పార్టా వంటి కులీన పాలన మరియు సైనిక పాలనా రాజ్యాలు. ఈ గణతంత్రాలలోని ప్రజలు యుద్ధ విద్యలే ముఖ్యంగా ఎంచేవారు.[12] అమరకోశం గణాలను రెండు రకాలుగా అభివర్ణించింది. — (1) 'రాజన్యకగణం' — ఇందులో కులీనులు మాత్రమే రాజ్యాధికారాన్ని కలిగివుండేవారు. (2) 'రాజకగణం' — ఇందులో ప్రజలందరూ రాజ్యాధికారంలో భాగం పంచుకునేవారు. వైశాలిలో పౌరుల సంఖ్య 7707. వీరిలో ప్రతివాడూ రాజుగా పిలువబడేవాడని లలిత విస్తర పేర్కొంటున్నది.[13] ఈ పైన పేర్కొన్న రెండు గణాలనే కౌటిల్యుడు 'శస్త్రోప జీవని సంఘాలు' గానూ, 'రాజ శబ్దోపజీవని సంఘాలు' గానూ వివరించాడు. స్పార్టా కులీన సైనిక పాలన, ఏథెన్స్ ప్రజాస్వామ్యమూ పైన పేర్కొన్న రెండు రకాల హిందూ గణ రాజ్యాలతో చక్కగా సామ్యీకరించవచ్చును.

సాంఘిక వర్గాలు : పౌరసత్వం

గ్రీకునగర రాజ్యాలలో పౌరసత్వం పుట్టుక ఆధారంగా వుండేది. ప్రతివ్యక్తి తన తల్లిదండ్రులు ఏ నగర రాజ్యానికి సంబంధించిన వారో ఆ నగర రాజ్యంలో పౌరసత్వపు హక్కు కలిగి వుంటాడు. పౌరసత్వం రాజ్యంలో సభ్యత్వానికి మూలాధారం.[14] పౌరుడంటే రాజకీయ కార్యనిర్వహణలో కొద్దో గొప్పో పాలుపంచుకునే అర్హత కలవాడు. వీరు సజాతి గ్రీకులై యుండాలి. లేదా సజాతి గ్రీకులైనందువలననే వీరు పౌరులు. స్త్రీలకు పౌరసత్వ అర్హతలేదు సమానత్వం పౌరులకే వర్తిస్తుంది.

గణతంత్రాలలో కూడా సమానత్వం పుట్టుక ఆధారంగానే వుంది ఇది గ్రీకునగర రాజ్యాలలోవలే కులీన సమానత్వమే.[15] వీరు 'రాజు'లు. వీరే పౌరులు. వీరంతా 'కుల' సభ్యులు. 'కులము' అనగా కుటుంబము. కుటుంబంలోని సభ్యులు అందరికి పౌరసత్వపు హక్కు లభిస్తుంది. ఇవి నిస్సందేహంగా కులీన కుటుంబాలే. స్త్రీలకు పౌరసత్వం లేదు. పౌరులు హిందువులే.[16] గణతంత్రాలలో సమానత్వం పౌరులకే పరిమితం. పౌరులందరూ, గ్రీకు నగర రాజ్యాలలోవలే సమానులే. నగరరాజ్యాలలోవలెనే గణతంత్రాలలో పౌరుల సంఖ్య అతి స్వల్పం. ఏథెన్స్‌లో విదేశీయులు (మెటిక్స్) బానిసలు; స్పార్టాలోని మధ్యతరగతి 'పెరిఓయ్'లు, స్థానిక హెలాట్లు, పౌరుల సంఖ్యకు ఎన్నో రెట్లు అధికం. రాజ్యకార్యకలాపాలలో ఏమాత్రం పాల్గొనటానికి అవకాశంలేని ఈ అత్యధిక ప్రజలస్థితి బానిసత్వమే. వీరే నగరరాజ్యాల ఆర్థిక వ్యవస్థకు మూలాధారమై, పౌరులచే పాలించబడటమే కాక, వారి ఆస్తిగా పరిగణించబడ్డారు. అయితే ఏథెన్స్‌లోని విదేశీయులు, స్పార్టాలోని పెరికోయ్‌లు, రాజ్యంలో ఏ గుర్తింపులేనివారైనా, మిగిలిన రెండు వర్గాలైన హెలాట్లు, బానిసలవలె నికృష్టమైన జీవనం గడపలేదు. వీరు వ్యవసాయం, వ్యాపారం చేస్తూ తగు స్వేచ్ఛను అనుభవించారు. ఈ రెండు వృత్తులు గ్రీకులచే నికృష్టమైనవిగా భావించబడ్డాయి. నగరరాజ్యంలోని ప్రజలు యీ విధంగా పౌరులు (స్వచ్ఛమైన గ్రీకులు), మధ్యతరగతివారు (స్పార్టాలోని పెరికోయ్‌లు, ఏథెన్స్‌లోని విదేశీయులు), బానిసలు (స్పార్టాలోని హెలాట్లు, ఏథెన్స్‌లోని బానిసలు) గా విభజింపబడివున్నారు. స్థూలంగా వీరిని రాజకీయాధికారంతో పాలించేవారు; రాజకీయాధికారం లేక, గ్రీకుజీవనాధారమైన మధ్యతరగతి, బానిసలు అనే రెండు వర్గాలుగా విభజింపవచ్చును.

క్రీ. పూ. 630 వరకూ ఆర్యుల వునికి సోకని కొని జాతులు క్రమేపీ ఆర్యుల ప్రభావానికి లోనుకావడం మొదలయ్యాయి. దీనికి పూర్వం గణాలలో వర్ణవ్యవస్థ మరో రూపంలోనైనా వుండి వుండాలి. లేనట్లైతే పౌరుల సంఖ్య తీవ్రంగా పరిమితమై ప్రజల వునికి తెలియకుండా పోవటానికి అవకాశం వుండేది కాదు. క్రీ. పూ 4వ శతాబ్దం నాటికి గణాలలో వైదికకాలంనాటి వర్ణవ్యవస్థ వేళ్ళూనింది శూద్రులకు పౌరసత్వం హక్కులేదు. గ్రీకు చరిత్రకారులు 'ఆక్సిడ్రకోయ్' గా పేర్కొన్న క్షుద్రక గణతంత్రంలోని ప్రజలు (లేదా పౌరులు) శూద్రులుకారు.[17] దీనినిబట్టి గణరాజ్యాలలో అధికారం అగ్రవర్ణులైన బ్రాహ్మణ, క్షత్రియులకే పరిమితమైయున్నదనేది స్పష్టం. వైశ్యులు, శూద్రులు కర్మ

కారులు. వీరి స్థితి గ్రీకునగర రాజ్యాలలోని మధ్యతరగతి, బానిస వర్గాలకు చెందిన విదేశీయులు, బానిసలు; పెరికోయ్‌లు, హెలాట్లతో సమానమైనదే.

బానిసవర్గాలు లేకుండా ప్రాచీన ప్రజాస్వామ్యాలు సాధ్యం కాలేదు.

గ్రీకునగర రాజ్యాలలోవలెనే హిందూ గణతంత్రాలలో అగ్రవర్ణులైన బ్రాహ్మణులు, క్షత్రియులు మూడవ, నాల్గవ వర్గాలైన వైశ్యులను (ఆర్యజాతికి చెందిన రైతు), అనార్యులైన దశ్యులను అణచివేశారు. వీరికి నగర రాజ్యాలలోని రెండవ, మూడవ వర్గాలకు వలెనే రాజ్యకార్యనిర్వహణలో పాలుపంచుకునే అవకాశాన్ని అగ్రవర్ణులు యివ్వలేదు.[18] గణతంత్రాలలో పౌరసత్వం ఆ విధంగా పై రెండు వర్గాలకే పరిమితమై గణసమాజం అడ్డంగా రెండు వర్గాలుగా (పాలించేవారు, పాలించబడేవారుగా) చీలివుంది. అయితే గణాలలోని వైశ్యులస్థితి, నగర రాజ్యాలలోని మధ్యతరగతికి చెందిన పెరికోయ్‌లు, విదేశీయుల స్థితివలె స్వేచ్ఛాపూరితమే కాని పౌరసత్వంలేదు. గ్రీకు నగర రాజ్యాలలోని పౌరులవలె (ప్రత్యేకించి స్పార్టా కులీనులు) గణతంత్రాల పౌరులు యుద్ధవిద్యలకు, రాజనైతిక విద్యాభ్యాసానికి మాత్రమే ప్రాముఖ్యత నిచ్చారు. నగర రాజ్యాలలో బానిసలపై, గణరాజ్యాలలో బానిస జీవనం గడిపిన వైశ్యులు, శూద్రులపై నగర జీవనాధారమైన శారీరక శ్రమను మోపి, పౌరులు కావలసినంత విరామ సమయంలో ప్రజలను పాలించటానికి కావలసిన యుద్ధవిద్యలు, రాజనీతిజ్ఞతను అభ్యసించారు. నగర రాజ్యాలలోవలెనే గణాలలో కూడా వ్యక్తికి పౌరుడుగా తప్ప వేరే గుర్తింపులేదు. అందువలననే పుట్టిన శిశువులపై రాజ్యానికి తప్ప తల్లిదండ్రులకు ఎట్టి అధికారములేదు. మానసికంగా, శారీరకంగా బలహీనులుగా జన్మించి, మంచి పౌరులుగా తయారు కావటానికి అవకాశంలేని శిశువులను చంపివేసే ఆదిమ సంప్రదాయం గ్రీకు నగర రాజ్యాలలోవలె గణాలలో కూడా ప్రాచుర్యంలో వుండటం గమనించదగిన విషయం.[19]

నగర రాజ్యాలలోవలెనే గణాలలో కూడా పౌరులు నిర్వహించే రాజకీయ పదవులలో వ్యత్యాసంలేదు. రెండు రాజ్యాలలోనూ ఎప్పుడైనా ఏ రాజకీయ పదవి నిర్వహించటానికైనా పౌరునికి అవకాశం వుంది. గణాలలోని రాజకీయ పదవులన్నీ 'కుల' పుత్రులకు, నగర రాజ్యాలలోని రాజకీయ పదవులన్నీ పౌరులకు పరిమితం. గణాలలో కులపుత్రులే సైనికాధికారులుగానూ, వృత్తి సంఘాధ్యక్షులుగానూ విధులు నిర్వహించేవారు. నగర రాజ్యాలలో మేజిస్ట్రేట్లు మొ॥న పదవులు పౌరులకే పరిమితం. రెండు రాజ్యాలలోని పౌరులు జీతాలను పొందారు.

పౌరులుగా పేర్కొనబడి గ్రీకు నాగరికత పుష్పదశకు కారకులుగా చరిత్ర పేర్కొంటున్న అత్యల్పసంఖ్యాకులైన సజాతిగ్రీకులు, భారతీయ సంస్కృతికి ఆర్య సంస్కృతి పునాదులపై స్థిరమైన కోటను నిర్మించిన[20] గణతంత్రాలలోని పౌరులైన సజాతి హిందువులు, అత్యధిక సంఖ్యలోవున్న బానిస వర్గాలకు నికృష్ట జీవనాన్ని ప్రసాదించి, తిరుగులేని సామాజిక, సాంస్కృతిక జీవనానికి పునాదులు వేయటానికి కావలసినంత విరామాన్ని పొందారు. అందుకే దీనిని 'విరామ సంస్కృతి'[21] గా పేర్కొనవచ్చును

గ్రీకు నగర రాజ్యాలలోనూ, హిందూ గణతంత్రాలలోనూ యిదే సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని స్పష్టంగా గమనించవచ్చు. రెండు నాగరికతలు 'ఆదిమ నాగరికతలు' గోచరిస్తాయి.

రాజ్య స్వభావం

గణరాజ్యం అంగాంగరాజ్యము. వ్యక్తియొక్క గుర్తింపుకు రాజ్యమే మూలాధారం. రాజ్యం లేనిదే వ్యక్తి వునికిలేదు గణతంత్రంలోని వ్యక్తి తప్పనిసరిగా 'రాజకీయజీవి.' రాజ్యంకోసం వ్యక్తి ఏ త్యాగం చేయటానికైనా సిద్ధపడాలి.[22] తండ్రి ఆజ్ఞమేరకు మృత్యువును కౌగలించుకోవటానికైనా సిద్ధపడిన నచికేతుని వృత్తాంతాన్ని 'కఠయన' తాత్వికులు వైభవంగా పొగడటం రాజ్యం యొక్క ఔన్నత్యాన్ని చాటుట కొరకే ననేది స్పష్టమే.[23] ప్రజల సాంఘిక, రాజకీయ, నైతిక, ఆర్థిక జీవనానికి రాజ్యమే మూలాధారం.[24]

గ్రీకు నగర రాజ్యాలు కూడా అంగాంగ రాజ్యాలే. రాజ్యమే వ్యక్తికి సర్వస్వం. రాజ్యం లేనిది వ్యక్తికి అర్థంలేదు పౌరుడు లేదా వ్యక్తి అంగాంగంలో ఒక అంగం మాత్రమే అంగాంగంలేనిది

అంగం నిరుపయోగం. పౌరుడు తన రాజ్య సంరక్షణకోసం ఏ త్యాగమైనా చేయవలసి వుంటుంది. పౌరజీవనానికి లేదా నాగరిక జీవనానికి రాజ్యంయొక్క ఆవశ్యకతను గురించి వివరిస్తూ పెరిక్లీజ్ ఏథేనియన్ పౌరుల నుద్దేశించి చేసిన ఆవేశపూరితమైన వుపన్యాసాన్ని పరిశీలిస్తే రాజ్యానికి పౌరునికి మధ్య గ్రీకులు భావించిన సంబంధం విశదమౌతుంది.

"I would have you day by day fix your eyes up on the greatness of Athens, until you become filled with the love of her; and when you are impressed by the spectacle of her glory, reflect that this empire has been acquired by men who knew their duty and had the courage to do it, who in the hour of conflict had the fear of dishonour always present to them, and who, if ever they failed in an enterprise, would not allow their virtues to be lost to their country, but freely gave their lives to her as the fairest offering which they could present at her feast."[25]

రూసో ఎమిలీలో వర్ణించిన స్పార్టన్ మాత తన కుమారులందరూ యుద్ధంలో మరణించారన్న వార్తనుతెచ్చిన సైనికునితో "తెలివి తక్కువవాడా! నే నడుగుతున్నది యుద్ధంలో ఎవరు గెలిచారని గాని ఎవరు చచ్చారని కాదు" అంటుంది.

కళలు, మతం, పర్వదినాలు అన్నీ రాజ్యానికి సంబంధించినవే.

"For the Greek the theory of city was at once ethics, sociology and economics as well as politics..."[26]

హిందూ గణ తంత్రాలలోనూ, గ్రీకు నగర రాజ్యాలలోనూ వ్యక్తికీ రాజ్యానికి వైరుధ్యంలేదు. వ్యక్తి రాజ్యానికి సమూనా. రాజ్యం వ్యక్తియొక్క విరాట్స్వరూపం.

ప్రభుత్వ వ్యవస్థ : స్వరూపము, స్వభావము

నగర రాజ్యాల, గణతంత్రాల ప్రభుత్వ వ్యవస్థలు స్వరూప, స్వభావాలలో ఒక్కటిగానే కనిపిస్తాయి

గణతంత్రాలు ప్రాతినిధ్య ప్రభుత్వ వ్యవస్థలు కలిగివున్నాయి. అయినా ఆధునిక కాలంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థలతో వీటిని పోల్చరాదు. వీటిని 'అల్పజన పాలనా' వ్యవస్థలుగా పేర్కొనవచ్చును. వ్యవసాయం వృత్తిగా గల వైశ్యులు, శూద్రులకు ప్రభుత్వంలో చోటులేదు. అధిక సంఖ్యాకులు వీరే. "వీరు కేవలం ప్రభుత్వ పుత్తరువులను ఆమోదించేవారు మాత్రమే"[27] కులీన కుటుంబాల సభ్యులందరూ 'సంఘం'లో సభ్యులు. కొన్ని గణతంత్రాలు ప్రజా స్వామ్యాలుగా చెప్పబడినప్పటికీ వీటిని ప్రత్యక్ష ప్రజాస్వామ్యాలని అపోహపడరాదు. 7707 మంది సభ్యులు గల వైశాలి గణంలో సభ్యులందరూ శాసన నిర్మాణంలో ప్రత్యక్షంగా పాలు పంచుకోలేదు. పూర్వకాలంలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాలు వర్థిల్లాయనేది — గ్రీసులో కాని, భారత దేశంలో కానీ— అపోహమాత్రమే, యదార్థంకాదు.[28] 'సంఘం' ఆధునిక కాలంలోని శాసనసభ వంటిది రాజ్య సార్వభౌమాధికారం యీ సంఘంలో నిక్షిప్తం చేయబడింది. సంఘంలో సభ్యులందరూ సమానమే. వీరందరూ ప్రత్యేకంగా నిర్మించబడ్డ 'సంస్థాగారం'లో సమావేశమై 'సంఘ ముఖ్యు'ని ఎన్నుకునేవారు అతని అధ్యక్షతన, నిర్దేశకత్వంలో సంఘం గణతంత్ర జీవన యంత్రాంగంగా పని చేసింది. గణత తంత్ర జీవనానికి అవసరమైన చట్టాలన్నీ యీ సంఘమే నిర్ణయిస్తుంది. సభలో గణపాలనకు సంబంధించిన విషయాలను సభ్యులు చర్చించి, ఓటింగ్‌కు పెట్టేవారు. 'బహుతర' నిర్ణయం చట్టమౌతుంది. ఇది గణ తంత్రాలలోని శాసన నిర్మాణ ప్రక్రియ. ఒకసారి చేసిన శాసనాన్ని తిరిగి మళ్ళీ ఏ సభ్యుడైనా, శాసన సభలో మరెవరైనా ప్రశ్నించ వీలులేదు. శాసనం డిక్రీవలె అమలు జరగవలసిందే.[29] ఈ శాసన సభలలో అధికార పక్షాలు, ప్రతిపక్షాలువుండేవి. 'కోరం' తప్పనిసరి. దీనికొరకు 'గణ పూరక' (Chief whip) వుండేవాడు.[30] ఓటును'ఛంద' అనేవారు. 'ఛంద' అనగా యిచ్ఛ అని అర్థం. ఒక విషయంపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా యిచ్ఛను తెలియజేయడం ఛంద లేక ఓటు చేయడం అవుతుంది. దీనికి కర్రముక్కలతో చేసిన పరికరాలకు రంగులువేసి వాడారు. వీటిని 'శలాక' అంటారు.[31] వివిధ విషయాలపై ఓటింగ్ యీ శలాకల ఆధారంగా, రంగునుబట్టి అనుకూలంగానో, ప్రతికూలంగానో ఓటు చేయవలసి వుంటుంది. సంపుంచే నియమించబడిన 'శలాక గ్రాహకుడు' యీ కార్యాన్ని నిర్వహించేవాడు. ఓటుచేయు విధానం మూడు రకాలుగా వుండేది. అవి 'గుల్హకం' (రహస్య ఓటింగ్ పద్ధతి), 'సకర్ణ జాపకము' (చెవిలో చెప్పడం) 'వివాటకం' (బహిరంగ ఓటింగ్ పద్ధతి) అనేవి. అనవసర విషయాలపై చర్చలలో కాలం వృథాకాకుండా కమిటీలను నియమించే పద్ధతి కూడా వుండేది. సభ్యులు సభామర్యాదలను పాటించకపోవడం అపగాధంగా భావించబడింది. సంస్థాగారంలో సభ్యులకు ఆసనాలు ఏర్పాటు చేయటానికి, రికార్డులను భద్రపర్చటానికి, మినిట్సు వ్రాయటానికి వేర్వేరుగా అధికారులున్నారు.

సమాఖ్య గణతంత్రంగా వర్థిల్లిన అంధక—వృష్ణిలో ప్రతిపక్షాలున్నాయి. 'అక్రూరవర్గ', "వాసుదేవ వర్గ' 'ఉగ్రసేన బభ్రు వర్గ', 'సిని వర్గ' మొ॥వి రాజకీయపక్షాలే[32] గణ సభ్యుల సంఖ్య 5000[33] నుండి 7707[34] వరకూ వున్నప్పటికీ సభ్యులందరూ సభకు హాజరు కాలేదు. వీటిలో వ్యక్తులకుకాక 'కులము'నకు మాత్రమే సభ్యత్వముండేది ఆధునిక కాలంలోని పార్లమెంట్లవలె గణతంత్రాల శాసన సభలు పార్టీ కట్టలతోనూ, ఆంతరంగిక తగా

దాల తోనూ, ఏంచగొండి వ్యవహారాలతోనూ నడిచాయి. గణతంత్ర ప్రభుత్వాలలో ఇది ఒక బలహీనమైన అంశం.[35]

గణ ప్రభుత్వాలలో కార్యనిర్వహణాధికారం కూడా శాసనసభల లోనే నిక్షిప్తమై యున్నప్పటికి కొన్ని గణాలలో 'ఎగువసభ'కు చెందిన పెద్దలు[36], మరికొన్ని గణాలలో ఎన్నుకోబడిన కౌన్సిల్‌చే నిర్వహించబడింది. ఎక్కువగా సంఘంచే ఎన్నుకోబడిన కౌన్సిళ్ళే సంఘ ముఖ్యుని అధ్యక్షతన కార్యనిర్వహణాధికారాన్ని నిర్వహించాయి. ఈ కార్యనిర్వహణ శాఖలు అయిదు లేక ఆర్గురు సభ్యులతో ఆ యా శాఖలైన విదేశీ వ్యవహారాలు, ట్రెజరీ న్యాయపాలన, రక్షణ, రెవెన్యూ మొదలైన విభాగాలుగా పనిచేశాయి. ఈ కార్యనిర్వహణశాఖ శాసన సభయైన సంఘమునకు బాధ్యత వహిస్తుంది. గణప్రభుత్వ వ్యవస్థకు అవసరమైన అధికారులందరినీ—పదిమంది సైనికాధి కారులతో సహా — సంఘమే ఎన్నుకుంటుంది. సైనికాధికారులు యుద్ధ విద్యలలో నేర్పరులు. అయినా వీరి నియామకానికి ఎన్నిక పద్ధతినే అవలంబించారు.[37] ఈ కార్యనిర్వహణ శాఖలను ఆధునిక పార్లమెంటరీ మంత్రివర్గాలతో పోల్చవచ్చును. ప్రభుత్వ నియామకాలన్నీ సంఘమే చేస్తుంది.[38] గణతంత్ర ప్రభుత్వాలు బాధ్యతాయుత ప్రభుత్వాలే.

గ్రీకు నగర రాజ్యాల ప్రభుత్వ వ్యవస్థ[39] ప్రాతినిధ్య ప్రభుత్వ వ్యవస్థయే. అయినా ఏథెన్స్‌లో గాని మరే నగర రాజ్యంలో గాని ప్రత్యక్ష ప్రజాస్వామ్యం వర్ధిల్లినదనేది అపోహ మాత్రమే ఏథెన్స్‌లోని 24 వేల మంది పౌరులు ఒకేసారి ప్రత్యక్షంగా ప్రభుత్వ పాలనలో పాలు పంచుకోవడం సాధ్యమైన పనికాదు అయితే పౌరులందరూ ప్రభుత్వ పాలనలో పాలుపంచుకోగల అర్హత కలవారే. ఏథెన్స్‌లో వర్ధిల్లిన ప్రజాస్వామ్యం ఆ విధంగా గణ తంత్రాలలోవలె అల్పజన ప్రజాస్వామ్యమే. పౌరులందరూ 'ఎక్లెజియా'లో సభ్యత్వం కలిగి వుండేవారు. ఈ 'ఎక్లెజియా' గణతంత్రాలలోని 'సంస్థాగారం' వలె ఆధునిక కాలంలోని శాసన సభ వంటిది. శ్రీది రాజ్యంలో సర్వం సహాధికారం కలిగిన ప్రభు త్వాంగం. ఈ సభ చేసిన నిర్ణయాలు సంస్థాగారం చేసిన శాసనాల వలె డిక్రీల వంటివే. వాటిని సవరించ వీలులేదు ఈ డిక్రీలను ఎదిరించటం — పౌరుడైనా సరే — ఒకవేళ తన వాదన తప్పైతే శిక్షకు సిద్ధపడి వుండాలి. ఎక్లెజియా చేసిన నిర్ణయాలు శాసనాల కంటె బలవత్తరమైనవి. సంస్థాగారం చేసిన నిర్ణయాలు యిట్టివే.

పాలనాధికారమంతా 500 మంది సభ్యులతో కూడిన సెనేట్‌లో నిక్షిప్తం చేయబడింది. వీరు ఎక్లెజియాచే చీటి పద్ధతిన ఎన్నుకోబడ్డవారు. అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తి వచ్చినప్పుడు అతనితో సంధి చేసుకొనుటకు వెళ్ళిన 200 మంది క్షుద్రక గణ పౌరులు ఇట్టి కౌన్సిల్‌కు చెందినవారే అయి వుండ వచ్చును. అంతేకాని జయస్వాల్ భావించినట్లు ఎగువసభ సభ్యులు కాకపోవచ్చును. వీరుకాక 10 మంది సైనికాధికారులు పౌరులచే ఎన్నుకోబడేవారు. వీరు తప్పనిసరిగా సైనిక విద్యలలో ఆరితేరిన వారైనా, జాతీయ విధాన నిర్ణయంలో కూడా పాలు పంచుకోవడమే కాకుండా జాతీయ విధానాన్ని స్వయంగా నిర్ణయించారు. ఏథెన్స్‌ను క్లిష్ట పరిస్థితుల్లో నాయకత్వం వహించిన పెరిక్లీజ్ సైనికాధి కారిగా ఎన్నుకోబడినవాడే. పైన పేర్కొనబడిన 500 మంది సభ్యులతో కూడిన సెనేట్ సోలన్ కాలంలో 'ఏరోపాగస్' లోని అర్చన్లను తొలగించి, వారి పీఠాన్ని తమ వశం చేసుకున్నారు వీరు అర్చన్ల న్యాయవిచారణాధికారాలను తీసుకొనలేదుకాని అటు తర్వాత అర్చన్ల ప్రాముఖ్యత సన్నగిల్లి కేవలం ఆత్మహత్యలకు సంబంధించిన కేసులను మాత్రమే విచారించే స్థితికి దిగజారింది.[40] ఈ విధంగా సోలన్ కాలంలో పెద్దల అధికారం సన్నగిల్లి, ప్రజాస్వామ్యం బహుతరం చేయబడింది. ఈ సెనేట్‌లో చీటీ పద్ధతి ద్వారా ఎథేనియన్ పౌరులందరూ కొంత కాలపరిమితికి ఎన్నిక కాబడగల అవకాశం కలిగివున్నారు.

ఈ కౌన్సిల్‌కు తీవ్రమైన అధికారాలున్నాయి. విదేశీ రాయ బారులను ఆహ్వానించడం వంటి ముఖ్యమైన అధికారాలే కాక పౌరులను శిక్షించడం, చంపివేయడం వంటి అధికారాలు కూడా వున్నాయి. కౌన్సిల్ న్యాయస్థానంగా కూడా పనిచేసిందనేది దీని వల్ల సుస్పష్టం. పన్నులు విధించడం, ప్రభుత్వ ఆస్తి రక్షణ, దేశ ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అజమాయిషీ యీ కౌన్సిల్‌కు వుంది. దేశ రక్షణ బాధ్యత యీ కౌన్సిల్‌దే. అన్ని ప్రభుత్వ శాఖలు యీ కౌన్సిల్‌కు అనుబంధింపబడి వున్నాయి ఇన్ని ముఖ్యమైన అధికారాలు గలిగిన యీ కౌన్సిల్ ఎక్లెజియా అజమాయిషీకి లొంగి పని చేసింది. ఎక్లెజియాకు బాధ్యత వహించిందన్నమాట. ఈ కౌన్సిల్, గణ తంత్రాలలో సంఘంచే ఎన్నుకోబడిన కౌన్సిల్ అధికారాలను కొద్దితేడాలో—న్యాయసంబంధ అధికారాలు తప్ప — దాదాపుగా ఒక్కటిగానే అనుభవించినట్లు రుజువవుతున్నది.

సంస్థాగారంలోవలెనే ఎక్లెజియాలోనూ రాజకీయ పక్షాలు పనిచేశాయి. కాని యివి అంతగా అభివృద్ధిచెందలేదు.[41]

చారిత్రక ప్రాముఖ్యత

స్వేచ్ఛాతత్వాన్ని గానం చేసిన ప్రాచీన గ్రీకునగరరాజ్యాల సామాజిక, రాజకీయ సాంప్రదాయం రోమన్లద్వారా ఖండాంతర ఐరోపాదేశాలలో విస్తరించింది. ఆధునిక ఐరోపా సంస్కృతికి పురాతన గ్రీకునగరరాజ్య నాగరికత చేసిన సేవను పొగుడుతూ ఇంగ్లీషు భావకవి పి బి షెల్లీ, 'ది హెల్లాస్' అనే గ్రంధానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో —

"We all are Greeks · our laws, our literature our religion, our arts have their root in Greece"[42] అన్నాడు. స్వేచ్ఛ, ధర్మం, రాజ్యాంగ ప్రభుత్వ సిద్ధాంతం, సమ న్యాయ పాలన మొదలైన ఆధునిక రాజనైతిక సిద్ధాంతాలు నగర రాజ్యాల ప్రసాదమే.[3] సమాజంలో మానవులమధ్య సంబంధాల

అధ్యయనాన్ని హేతుబద్ధ అధ్యయనానికి సానుకూలపరచిన మొట్టమొదటి రాజనీతి తత్వవేత్త ప్లేటో ఏథెన్స్‌లో జన్మించాడు. సాంఘికశాస్త్రాల అధ్యయనానికి యీ సిద్ధాంతం యొక్క ప్రాముఖ్యం విప్పి చెప్పనవసరం లేదు.

ఆధునిక ఐరోపా రాజనీతి తత్వాన్ని ప్రబలంగా ఆవరించి వున్న సమన్వాయపాలనా సిద్ధాంత కర్త అరిస్టోటిల్ గ్రీస్‌లోని 'స్టాజీరా'లో జన్మించి జీవితమంతా జ్ఞానసముపార్జనలో ఏథెన్స్‌లోనే గడిపాడు ఆధునిక కాలంలో విశ్వవిద్యాలయాల్లో అధ్యయనం చేయబడుతున్న దాదాపుగా అన్ని శాస్త్రాలకు అతనే పితామహుడు. అప్పటివరకూ అంగాంగంగా వున్న విజ్ఞానాన్నంతటినీ వివిధ శాస్త్రాలుగా వర్గీకరించిన ఘనత అరిస్టోటిల్‌కు దక్కుతుంది. విజ్ఞానాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయటం ఇతనితోనే మొదలైంది. అయోనియాలో జన్మించిన ప్రపంచపు మొట్టమొదటి చరిత్రకారుడు హెరొడోటస్, 'ఫిలిపినీసియన్ వార్' రాసి ఘనతకెక్కిన తూసిడిడిస్, జెనోఫాన్, గణితశాస్త్రవేత్త పైథాగరస్, వైద్య శాస్త్రజ్ఞుడు హిపోక్రటస్, మరెందరో శాస్త్రజ్ఞులు, తత్వవేత్తలు నగరరాజ్యాల కాలంలో గ్రీకు నాగరికత వైభవానికి కారణభూతులయ్యారు. ఈ నగరరాజ్యాల నాగరిత ప్రాముఖ్యతను గురించి పేర్కొంటూ ఆర్ ఆర్. మారెట్—

"To break through custom by the sheer force of reflection, and so to make rational progress possible, was the intelectual feat of one people, the ancient Greeks; and it is atleast highly doubtful if, without their leadership a progressive civilization would have existed to-day." [44]

ఉత్కృష్టమైన యిదే నాగరికత శంకాత్మక [సినిక్], జ్ఞానాత్మక [సోఫిస్ట్] భావనా సాంప్రదాయాలకు మూల పురుషుడు, ప్రపంచ తత్వవేత్తలలో అగ్రగణ్యుడుగా పేరు పొందిన సోక్రటీస్‌ను బలిగొన్న విషయం ఈ సంస్కృతియొక్క ఆదిమతకు నిదర్శనంగా నిలిచిపోయింది.

ఖండాంతర ఐరోపా దేశాల నాగరికతపై గ్రీకుల ప్రభావం ఎట్టిదో ప్రాచ్య, దూర ప్రాచ్య దేశాల సంస్కృతీ జీవనంపై గణ రాజ్య సంస్కృతీ ప్రభావం సరిగ్గా అట్టిదే. తరతరాలుగా భారతీయ హిందువులు పవిత్రంగా ఎంచు తున్న భగవద్గీత అంధక — వృష్ణి గణాధ్యక్షుడైన శ్రీకృష్ణునిచే ప్రవచింపబడినట్లు చెప్పబడుతున్నది ఇది హిందూ తత్వసమన్వయం. హిందూ తాత్విక భావనా సాంప్రదాయాలైన సాంఖ్యయోగ, వైశేషిక, పూర్వమీమాంస, వుత్తర మీమాంసలలోని మొదటి రెండు తాత్విక భావనా సాంప్రదాయాలు గీతలో క్షుణ్ణంగా చర్చింపబడ్డాయి. భగవద్గీతకుతోడు మరో 'అను గీత' కూడా శ్రీకృష్ణునిచే ప్రవచింపబడినట్లు చెప్పబడుతున్నది. హిందూ సంస్కృతిని, హిందూతత్వాన్ని అర్థం చేసుకోవాలంటే భగవద్గీత అధ్యయనం తప్పనిసరి.

చైనా, జపాన్, టిబెట్, జావా, బోర్నియో, సిలోన్ మొ॥న ప్రాచ్య, దూర ప్రాచ్య దేశాలను సంపూర్ణంగా ఆవరించిన బౌద్ధ తత్వం క్రీ. పూ 6వ శతాబ్దంలో లిచ్ఛవీ గణతంత్రం రాజధానియైన వైశాలిలో జన్మించిన గౌతమ బుద్ధునిచే ప్రవచింపబడింది. ఆర్య ధర్మంలోని ముఖ్యాంశాలైన యజ్ఞ యాగాదులు, కర్మ క్రతువులు, జంతు బలులు మొ॥న ఆది భౌతిక సిద్ధాంతాలను బౌద్ధం, హేతుబద్ధమైన, లౌకికమైన కార్య కారణ సిద్ధాంత రూపంలో ఎదుర్కొంది. కాని బ్రాహ్మణం దీనిని మననీయలేదు. [45] దీనిలోని సిద్ధాంతాలను భగవద్గీతలో క్రీ. పూ. 3వ శతాబ్దంలో బ్రాహ్మణులు చేర్చారు. కాని దూర ప్రాచ్య దేశాలలో బహుళ ప్రచారం చెందింది. ప్రపంచంలోని రెండవ పెద్దమతం బౌద్ధమే.

లిచ్ఛవీ గణతంత్రంలోనే జన్మించిన మహావీరుడు బుద్ధుని సమకాలీనుడే. ఇతడు ప్రవచించిన జైనం బౌద్ధంవలె సామాన్యమైన తత్వమే. బౌద్ధమూ, జైనమూ ఆర్య ధర్మాన్ని గణాలపై ప్రసరింపబడకుండా చేసిన ప్రయత్న ఫలితాలు. ఈ రెండు భావనా సాంప్రదాయాల మూలతత్వం సర్వమానవ సౌభ్రాతృత్వమూ, అహింసా, భౌతిక సుఖాల విలంబనయే.

ఈ విధంగా ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతీ జీవనంపై హిందూ గణతంత్రాల, గ్రీకు నగర రాజ్యాల సంస్కృతీ ప్రభావం అపారం.

ఈ రాజ్యాలెలా అంతరించాయి ?

రాజ్య పరిణామాభివృద్ధి క్రమంలో నగర రాజ్యాలు, గణతంత్రాలు ఒక దశ రాజ్య పరిణామాభివృద్ధిక్రమం నగరరాజ్యంతో అంతం కాదనే యధార్థం గ్రీకు రాజనీతి శాస్త్రజ్ఞుడు, రాజనీతి శాస్త్రానికి మూల పురుషుడైన అరిస్టోటిల్‌యొక్క వూహాగానానికి అందలేదు.[46] నగరరాజ్యాల భవిష్యత్తు కేవలం నగర ఆంతరంగిక వ్యవహారాలపై విజ్ఞతను కేంద్రీకరించడంపైననేకాక, యితర నగర రాజ్యాలతోగాని, లేదా యితర ఆసియా దేశాలతోగాని సత్సంబంధాలు నెలకొల్పుకోవడంపై కూడా ఆధారపడివుందనే యధార్థం[47] మాసిడోనియా ఫిలిప్ నగర రాజ్యాలను ఏకం చేసేంత వరకూ అరిస్టోటిల్‌కూడా తెలియనిది నగరరాజ్యాలు అంతరించేంత వరకు, అవి స్వయం సమృద్ధతను సాధించటం పెద్ద పెద్ద రాజ్యాలుగా ఏర్పడితే తప్ప సాధ్యం కాదనే విషయం నగరరాజ్య గ్రీకులకు అనూహ్యమైనదే [48] గ్రీకు సామ్రాజ్య చరిత్రలో మొదటి యుగానికి నాంది పలికిన అలెగ్జాండర్ వునికిని అరిస్టోటిల్ విస్మరించాడు.[52] నగరరాజ్య లోపాలను, వాటి పతనాన్ని గురించి పేర్కొంటూ ప్రొఫెసర్ ఫెర్గూసన్—''నగరరాజ్యం తన 'రాజకీయ ఒంటరితనాన్ని' (పొలిటికల్ అయిసోలేషన్) పరిరక్షించుకొనిదే, ఆర్థిక, రాజకీయ స్వయం సమృద్ధతను సాధించుకోలేదు. ఇట్టి 'రాజకీయ ఒంటరితనం' తన నాగరికతను, సంస్కృతీ వైభవాన్ని ప్రతిష్టంభనకు గురిచేస్తుంది. తన నాగరికతలోగాని,

సంస్కృతిలోగాని ఇట్టి తీవ్రమైన ప్రతిష్టంభన ఏర్పడనిదే రాజకీయ ఒంటరితనమూ సాధ్యంకాదు. పొరుగుదేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడమంటే తన రాజకీయ ఒంటరితనాన్ని విడనాడటమే కాక ఔత్సుకతతో కాపాడుకుంటున్న ప్రజల స్వేచ్ఛకు ఆటంకమేర్పడుతుంది. రాజకీయ ఒంటరితనంతో వైభవోపేతమైన నాగరికతను, సంస్కృతిని నిర్మించుకొనవలెననే తపన, ఆర్థిక, రాజకీయ స్వయం సమృద్ధతనుసాధించవలెననే కోర్కె, నగర రాజ్యాలలో అవి ఏర్పడిన తొలిదశనుండే ప్రారంభమైనాయి. నగరరాజ్యాలు తమ ప్రత్యేకతను నిలుపగల ఒంటరితనాన్ని కలిగివుంటూనే, ఆర్థిక రాజకీయ స్వయం సమృద్ధతను సాధించడం కోసంచేసిన ప్రయత్నంలో క్రీ పూ. 4వ శతాబ్దం మధ్యకాలంలో 'సమ్మేళనాలు' ఏర్పడ్డాయి. వీటిలో క్రీ పూ. 338 లో మాసిడోనియా ఫిలిప్ ఏర్పాటుచేసిన 'కోరింత్ సమ్మేళనం' (లీగ్ ఆఫ్ కోరింత్) ముఖ్యమైనది. ఈ సమ్మేళనాలను వాటి భవిష్యత్తుకు వాటిని వదలివేసినట్లైతే ప్రతిభావంతమైన సమాఖ్య రాజ్యాలుగా ఏర్పడటానికి అవకాశం వుండేదే.'' [50] కాని గ్రీకుల ప్రత్యేకతా భావం దీనిని సఫలం కానీయలేదు. అయినప్పటికీ క్రీ. పూ. 4 వ శతాబ్దారంభం నుండి పొరుగుదేశాల దండయాత్రల నుండి నగర రాజ్యాలను పరిరక్షించుకోవలసిన అవసరాన్ని కొందరు నొక్కి చెపుతూనే వున్నారు. వీరిలో ఆరేటరు, ఐసోక్రాట్‌లు ముఖ్యులు. వీరి ప్రయత్నం 'కోరింథ్ సమ్మేళనం'లో ఫలించింది. [51]

'నగర రాజ్యాల పతనానికి ముఖ్యమైన కారణం' ఆర్థికంగా రక్షితమైన జీవనవాంఛ (ఎకనామికల్లీ సెక్యూర్డ్ లైఫ్).

ధనిక వర్గాలకు నగర రాజ్యం రక్షణ కల్పించలేక పోయింది. అతి తక్కువ సంఖ్యలో వున్న ధనిక వర్గాలకు అతి ఎక్కువ సంఖ్యలో వున్న పేద ప్రజలు, బానిసలు ఎల్లప్పుడు సమస్యగానే పరిణమించారు. ప్లేటో, అరిస్టాటిల్ తీవ్రమైన ఆర్థిక అసమానతలు రాజ్య స్థిరతకు ప్రమాదకరమని, విప్లవాలకు దారితీసే అవకాశం ఎప్పుడూ వుంటుందని హెచ్చరికలు చేసినా నగరరాజ్యాలు ఖాతరు చేయలేదు ఒకవేళ చేసినా నగర రాజ్యాలకు యిట్టి విప్లవాలను ఎదుర్కొనే శక్తి కూడా లేదు. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ధనిక వర్గాలు ఎల్లప్పుడూ పెద్ద రాజ్యాల ఏర్పాటు పట్ల సుముఖంగానే వున్నాయి. అందుకే 'కోరింథ్ సమ్మేళనంగా' ఏర్పడిన నగర రాజ్యాలలోని ధనిక వర్గాలు యికపై రుణవిముక్తి కొరకు గానీ, భూసంస్కరణల కొరకుగానీ, వ్యక్తిగత ఆస్తి రద్దుకు గానీ, బానిసల విముక్తి కొరకు గానీ తలఎత్తే ఏ విప్లవాలనైనా అణచివేయగలందులకుగాను సమ్మేళన నాయకుడు అలెగ్జాండర్‌తో ఎన్నో ఒప్పందాలు చేసుకున్నారు [52] నగర రాజ్యాలు కోరింథ్ సమ్మేళనంగా ఏర్పడటానికి యింతకన్న బలమైన కారణమేదీ మరొకటి కనిపించదు.

గ్రీకుల ఆర్థిక, రాజకీయ సమస్యలు నగర రాజ్యం పరిష్కరించటానికి సాధ్యం కానివి. అలెగ్జాండర్ విజయాలతో ఏర్పడిన సమ్మేళనాలు కూడా వీటిని తీర్చలేకపోయింది నగర రాజ్యం తన చుట్టూ వున్న భిన్నమైన ఆర్థిక వ్యవస్థల మధ్య రాజకీయ, ఆర్థిక పరిపూర్ణతను సాధించటం అటుంచి, గ్రీకులకు కనీస పాలనను అందజేయలేకపోయింది.[53] తామే నాగరికులమనుకునే గ్రీకుల అహంభావాన్ని అనాగరికులు అణచివేశారు. (లేక అనాగరికులలో కలిసిపోయారా?).

నగర రాజ్యాలలోని బలవత్తరమైన యీ ఆంతరంగిక ఆర్థిక కారణాలు వాటి పతనానికి కారణమైనాయి. కోరింథ్ సమ్మేళనం ఏర్పడిన రెండు శతాబ్దాలకు, నానాటికి పెరుగుతున్న రోమన్ సామ్రాజ్యంలో ఇవి అంతర్లీనమై రూపుమాసి పోయాయి.

క్రీ. పూ. 4వ శతాబ్దం చివరి భాగంలో మౌర్య సామ్రాజ్య స్థాపనతో ఆరంభమైన గణరాజ్యాల పతనం, క్రీ. శ. 4 వ శతాబ్దంలో గుప్త సామ్రాజ్య స్థాపనతో పూర్తయింది దీనితో దాదాపుగా 1000 సంవత్సరాల గణతంత్రాల చరిత్ర ముగిసింది.

గణతంత్రాల గురించి మొట్టమొదటగా చెప్పుకోదగ్గ అధ్యయనం జరిపిన కె. పి. జయస్వాల్ గుప్త సామ్రాజ్య ప్రాభవమే గణతంత్రాల పతనానికి ఏకైక కారణంగా పేర్కొన్నాడు.[54] కాని గణతంత్రాల పతనం యధార్థంగా మౌర్యుల కాలంలోనే ఎక్కువగా జరిగింది. మౌర్యసామ్రాజ్య పతనం తర్వాత శుంగవంశ కాలంలో గణతంత్రాలు మరలా జీవాన్ని పుంజుకొన్నాయి ఈ గణాలు ఆ తర్వాత గుప్తుల సార్వభౌమాధికారాన్ని అంగీకరించినా స్వతంత్రంగానే వున్నాయి. అయినా అటు తర్వాత గుప్త సామ్రాజ్యంలో విలీనం కాకతప్పలేదు. ఇందుకు కారణం 4 వ శతాబ్దంలో గణాలు 'వారసత్వ రాజరికాలు'గా మారడం, గణాలలో ఎన్నుకోబడిన సైనికాధికారులు తామే రాజులుగా ప్రకటించుకోవడం కారణం అయివుండవచ్చునని ఆల్టేకర్ అభిప్రాయపడి, అయినా యీ విషయంలో ఇంకా పరిశోధన అవసరమని భావించాడు. రాజరికం దైవదత్తమనే ఆ కాలపు ప్రజల విశ్వాసం రాజరికాలు ఏర్పడటానికి కారణం కావచ్చుననీ, ఇట్టి రాజరికాలు గణాలను విదేశీ దాడులనుండి రక్షించేందుకు అవసరమని, ప్రజలు భావించి వుండవచ్చుననీ ఆల్టేకర్ అభిప్రాయం [55] గణరాజ్య పాలనలో ప్రజలు ఎక్కువగా (పౌరులని అర్థం) పాల్గొనే అవకాశం వుండటంవల్ల గణరాజ్యాల ఆంతరంగిక వ్యవహారాల రహస్య పరిరక్షణ కష్టతరమై బలహీనమైన రాజ్యాలుగా మారటం వేరొక కారణంగా చెప్పబడింది. కాని యివి ఏవీ చారిత్రకంగా తృప్తికరమైన కారణాలుగా కనిపించవు

వేదకాలం నాటి రాజరికాలు అంతమైన తర్వాత ఎన్నో కారణాలవల్ల చెల్లాచెదరైన రాజకుటుంబాలు గణాలుగా ఏర్పడ్డాయి. వైదిక క్రతువులను అంగీకరించని క్షత్రియులు, శూద్రులు యీ గణాలను స్థాపించుకున్నారు.[56] క్రీ. పూ. 7 వ శతాబ్దం నాటికి భారతదేశంలో వ్యవసాయం ప్రజల ముఖ్యవృత్తిగా బాగా అభివృద్ధి చెందింది. వ్యవసాయం కుటుంబ జీవనాధారమే కాక

ఆస్థి సంపాదనకు మూలాధారమైంది. అప్పటికే కాలువలు, చెరువులు మొ॥న నీటి వనరులను ప్రజలు ఏర్పరుచుకున్నారు.[57] క్రీ. పూ 321 లో చంద్రగుప్తమౌర్యుడు మౌర్య సామ్రాజ్యం స్థాపించే కాలం నాటికి, భూమి వ్యక్తిగత ఆస్తిగానూ, భూమి శిస్తు ప్రధానమైన ప్రభుత్వ ఆదాయంగానూ స్థిరపడింది. ఈ కాలం నాటికి వ్యావసాయికంగా ఎనలేని ప్రగతిని సాధించి ఆర్థికంగా బలపడిన గణాలు ప్రజలకు రాజకీయ సుస్థిరతను, రక్షణను కల్పించగల శక్తివంతమైన రాజ్యాలు కావు. రాజకీయ సుస్థిరతను, రక్షణను కల్పించగల పెద్ద సామ్రాజ్య స్థాపనావశ్యకత గణతంత్రాల ఆర్థిక, రాజకీయ సమస్యతో తప్పనిసరిగా ముడిపడి వుంది. ఆర్థిక సుస్థిరతను సాధించిన గణతంత్రాల జీవనం పరిమితమైపోయి, ఇంకా విస్తృతమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పడేందుకు అవకాశం యివ్వలేదు. అందుకే రొమిల్లాథాపర్ తన గ్రంథంలో[58] మౌర్యసామ్రాజ్య స్థాపనావశ్యకతను గురించిన కారణాన్ని విపులీకరించే ప్రయత్నంలో మౌర్యులు ప్రజల రాజకీయ ఆర్థిక పురోగతిని దృష్టిలో పెట్టుకుని సృష్టించిన దృఢమైన పాలనా వ్యవస్థలోని సదుపాయాలను గురించి క్షుణ్ణంగా చర్చించినది.

దృఢమైన రాజ్యంలేక, వ్యావసాయకంగా పురోభివృద్ధి చెందిన సంపన్న గణాలు, పరరాజ్యాల దాడులను ఎదుర్కోవడం సాధ్యంకాకనే పురాతన గ్రీకు నగర రాజ్యాలలో ఏర్పడిన 'కోరింథ్ సమ్మేళనం' వంటి సమ్మేళనాలుగా ఏర్పడ్డాయి. అంధక — వృష్ణి గణం యిట్టిదే. అలెగ్జాండర్‌ను ఎదిరించే సందర్భంలో ఎన్నో గణాలు సమ్మేళనాలుగా ఏర్పడ్డాయి. 'పంచగణ', 'సప్తగణ' అనేవి అయిదు గణాల, ఏడు గణాల సమ్మేళనాలే. అలెగ్జాండర్ దండయాత్రకాలం నాటికి ఇట్టి గణాలు ప్రస్తుత పంజాబురాష్ట్ర ప్రాంతంలో వున్నాయి.

పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ, అతి బలహీనమైన రాజకీయ వ్యవస్థ, వైదిక మతం పైబడి గణాలలోనికి చొచ్చుకు రావడం, అనేవి గణాలు రాచరికాలలో అంతర్లీనం కావటానికి తోడ్పడిన ముఖ్య కారణములుగా కనపడుతున్నాయి. స్వేచ్ఛాపూరితమైన చిన్నచిన్న గణాలు, విదేశీ ఆక్రమణనుండి తమను తాము రక్షించుకునేంత బలమైనవి కావు. సురక్షితమైన రాజ్యం పెద్దదైన సామ్రాజ్యమే. అయితే సామ్రాజ్యంలో అంతర్లీనం కావడం గణాల స్వేచ్ఛకు భంగకరం. ఈ అంతర్గత సంఘర్షణ గణాలు రాచరికాలవైపే తప్పనిసరిగా మొగ్గవలసిన పరిస్థితిని కల్పించింది. ఇది తప్పనిసరి. ఖచ్చితంగా యిట్టి పరిస్థితుల్లోనే ప్రాచీన గ్రీకునగర రాజ్యాలు మొదట గ్రీకు సమ్మేళనాల్లోనూ, తర్వాత రోమన్ సామ్రాజ్యంలో అంచెలంచెలుగా అంతర్లీనమైపోయాయి.

ప్రజలమధ్య విస్తృతమైన సాంఘిక, ఆర్థిక సంబంధాలను ఏర్పరచుకొనే వీలు కల్పించే సువిశాలమైన రాజ్యమూ, యితర రాజ్యాల దాడులనుండి ప్రజలను రక్షించగల పటిష్టమైన, బలమైన రాజకీయ వ్యవస్థా, వైదిక క్రతువులను తద్వారా వైదిక మతాన్ని ఎదుర్కోగల జైన, బౌద్ధ, మతాలు తమ వ్యవస్థలను పటిష్టం చేసుకునే ప్రయత్నంలో గణతంత్రాలలోని రాజకుటుంబాలు కనుగొన్న పరిష్కారాలు.

భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యాన్ని స్థాపించిన మౌర్య చంద్రగుప్తుడు 'మొరియా' తెగకు చెందినవాడు.[59] 'మొరియా' గణతంత్రమే.[60] గణాలను సమైక్యపరచి సామ్రాజ్యాన్ని స్థాపించటానికి చంద్రగుప్తుడు ఎన్నో విధాల కృషిచేశాడు. ఈ పద్ధతులన్నీ అర్థశాస్త్రం పేర్కొన్నది. లేకపోతే (మౌర్య సామ్రాజ్య స్థాపన జరగనట్లైతే), అలెగ్జాండర్ బియాస్‌నుండి వెనుకకు మరలకుండా గంగా పరివాహక ప్రదేశం వరకూ ఆక్రమించి భారతదేశంలో గ్రీకు సామ్రాజ్యాన్ని స్థాపించి ఉండేవారు. భారతదేశంలోని మొట్టమొదటి సామ్రాజ్యం గ్రీకు సామ్రాజ్యమే అయివుండేది.

మౌర్యచక్రవర్తులు' బిందుసారుడు, అశోకుడ, గుప్త చక్రవర్తులలో ఒకటవ చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, సామ్ర్యాజ్య విస్తరణ కార్యక్రమంలో గణతంత్రాలతో యుద్ధం చేయటం కంటే సద్భావంతోనే ఎక్కువగా జయించారు సముద్రగుప్తుడు లిచ్ఛవుల రాకుమారి కుమారిలదేవిని వివాహమాడి లిచ్ఛవులతో స్నేహం కలిపాడు. గణరాజ్యాల ఎల్లలను చెరిపివేయడమే సామ్రాజ్యాన్ని స్థాపించటంగా ద్యోతకమవుతుంది. ఈ మార్పు భారతదేశ రాజకీయ చరిత్రలో అత్యంత ప్రధానమైనది.

ఈ విధంగా పురాతన గ్రీకు నగర రాజ్యాలు గ్రీకు, రోమన్ సామ్రాజ్యాలలోనూ, ప్రాచీన హిందూ గణతంత్రాలు మౌర్యగుప్త, సామ్రాజ్యాలలో అంతర్లీనం కావడం రాజ్యపరిణామాభివృద్ధి క్రమంలో ఒక దశ, రాజకీయావశ్యకత.

NOTES

1. అలెగ్జాండర్ దండెత్తే కాలం నాటికి గ్రీసుదేశంతో భారతదేశానికి సంబంధాలున్నట్లు చారిత్ర కాధారాలేవీ లేవు.
2, ఎస్. హెన్రీలూకాస్ : ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ సివిలిసేషన్, న్యూయార్క్ 1953, పే. 121
3. విల్ డ్యూరాంట్ : ది స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ, న్యూయార్క్ 1961, పే. 1.
4. ఎ. ఎస్. ఆల్టేకర్ : స్టేట్ ఎండ్ గవర్నమెంట్ ఇన్ ఏన్షంట్ ఇండియా, న్యూఢిల్లీ 1959, పే. 111.
5. 'మాళవ' ను 'మల్లోయ్' అనీ; 'సి బి' ని 'సి వి' అనీ; 'క్షుద్రక'ను 'ఆక్సిడ్రకోవ్' అనీ; 'అంబష్ఠ'ను 'సంభస్త' అనీ గ్రీకులు పేర్కొన్నారు. ఇవి వాయవ్య ప్రాంతపు గణాలు.

6\. శాక్య, లిచ్ఛవీ ఈశాన్య భారతదేశంలో గంగానదికి వుత్తరాన వర్ధిల్లినాయి. వీటిని గురించి గ్రీకులకు తెలియదు.

7\. ఎస్. హెన్రీ లూకాస్ . ప. చె. పే. 139

8\. అంతే.

9\. కె. పి. జయస్వాల్ : హిందూ పాలిటీ, 1935 పే. 22

10\. అంతే పే. 24

'గణ' అనే మాటకు 'తెగ' అనే మోనియర్ విలియమ్స్ వాదాన్ని, డా. ఫ్లీట్ వాదాన్ని జయస్వాల్ నిరాకరించాడు. దీనిని ఆల్టేకర్ కూడా సమర్ధించాడు.
చూడు : స్టేట్ ఎండ్ గవర్నమెంట్ ఇన్ ఏంషంట్ ఇండియా.

11\. అంతే

12\. అంతే

13\. 'ఏకైక ఏవ మన్యతే అహం రాజా అహం రాజేతి' ఉదాహరణ : ఎ. ఎస్ ఆల్టేకర్ పయిన చెప్పినదాంట్లో పే. 114.

14\. జి. హెచ్. సబైన్ : ది హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థియరీ, 3 వ ప్రతి, ఢిల్లీ 1975 పే 5

15\. గణతంత్రాల గుణగణాలను పేర్కొన్న శాంతిపర్వం— "అన్యోన్యమ్ నాభి భాషన్తే తత్పరాభవ లక్షణమ్ జాత్యా చ సదృశ్యః సర్వేకులేన సదృశ్యస్తథా" అని వివరిస్తుంది.

16\. నేపాలీయులనీ, టిబెటన్లనీ అభిప్రాయం వున్నది. దీనిని జయస్వాల్ ఖండించాడు.

17\. మొదటిసారిగా రామకృష్ణభండార్కర్ 'క్షుద్రకులు' శూద్రులు కారని అంతకు ముందున్న అభిప్రాయాన్ని ఖండించాడు.

18\. డి. డి. కోశాంబి : ఏన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ, బొంబాయి, 1975, పే. 110

19\. 'కథా', 'సౌభూత' గణాలలో ఈ సాంప్రదాయం వున్నది. చూడు : కె. పి. జయస్వాల్ ప. చె. పే. 172

20\. భగవద్గీత కర్త శ్రీకృష్ణుడు అంధక—వృష్ణి గణాధ్యక్షుడు. బుద్ధుడు వైశాలి రాజధానిగా వర్ధిల్లిన లిచ్ఛవీ గణంలో జన్మించాడు.

21\. డి. డి. కోశాంబి ప. చె. పే. XII

22\. కె. పి. జయస్వాల్ : ప. చె. పే. 73

23\. కఠోపనిషత్తు పేర్కొన్న నచికేతుని వృత్తాంతం.

24\. సంస్థాగారం క్రీడాంగణం కూడా. పాచిక లాడేవారు, వక్తృత్వ పోటీలు జరిగేవి. ఈ పోటీలలో గెలిచినవారిని వలచుటకు అందగత్తెలు పోటీపడేవారు. సంస్థాగారాలు స్నాతక సభలుగా పనిచేశాయి. మత విషయాలు చర్చించారు. నిర్ణయాలు తీసుకున్నారు.

25\. ఉదాహరణ : జి. హెచ్ సబైన్ ప. చె. దాంట్లో పే. 12

26 అంతే

27\. బి. జి. గోఖలే : ఎంషంట్ ఇండియా; హిస్టరీ ఎండ్ కల్చర్, బొంబాయి 1959 పే. 113

28\. జి. హెచ్. సబైన్ ప. చె. పే. 6

29\. కె. పి. జయస్వాల్ ప. చె పే. 90

30 అంతే పే 93

31\. అంతే

32\. అంతే పే. 38

33 బియాస్ దగ్గరలో గ్రీకులు కనుగొన్న గణం. ఇందులో ఒక ఏనుగును రాజ్యానికి యివ్వగలవారు సభలో సభ్యులుగా వున్నారు.

చూడు : కె. పి. జయస్వాల్ ప. చె. పే. 76

34\. వైశాలి పౌరుల సంఖ్య.

35\. ఎ. ఎస్. ఆల్టేకర్. ప చె. పే. 128.

36\. అంబష్ఠలో ఎగువ సభకు చెందిన పెద్దలు రాజ్యకార్య నిర్వహణాధికార చెలాయించారని జయస్వాల్ అభిప్రాయం.
చూడు : కె. పి జయస్వాల్ ప. చె. పే. 74. వీరు శాసనసభ్యులేకాని ఎగువ సభకు చెందిన పెద్దలు కారని, తమ ప్రత్యేకతను ఎంతో జాగ్రత్తగా కాపాడుకునే 'రాజన్స్'లు ఎగువ సభను అంగీకరించి వుండకపోవచ్చుననీ ఆల్టేకర్ అభిప్రాయం. చూడు : ఎ. ఎస్. ఆల్టేకర్. ప. చె. పే. 126.

37\. బి.జి. గోఖలే . ప. చె. పే. 114.

38 అంధక — వృష్ణి అధ్యక్షుడైన శ్రీకృష్ణుడు తనకు ఏ అధికారమూ లేదని నారదునితో మొరపెట్టుకోవడం మహాభారతంలోని శాంతి పర్వంలో గమనించవచ్చును.
చూడు : కె పి. జయస్వాల్. ప. చె ఎపెండిక్స్ ఎ. పే. 372.

39\. క్లైస్థనీస్ తర్వాత సోలన్ ఏథేనియన్ రాజ్యాంగంలో ఎన్నో మార్పులు ప్రవేశపెట్టాడు. సోలన్ రాజ్యాంగాన్నే యిక్కడ పేర్కొనటం జరిగింది.

40\. డబుల్యు. ఎ. డన్నింగ్స్ : ఎ హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థియరీస్, ఎంషంట్ ఎండ్ మెడీవల్; అలహాబాదు, 1962 పే. 16.

41\. ఎన్ సైక్లోపీడియా బ్రిటానికా : సం. 10, పే. 761.

42\. ఉదాహరణ హెన్రీ. ఎస్. లూకాస్ : ప. చె. పే. 131.

3. జి. హెచ్ సబ్బైన్ : ప. చె. పే. 3.
44. ఉదాహరణ హెన్రీ. ఎస్. లూకాస్ : ప. చె. పే. 145.
45. బి. జి. గోఖలే : ప. చె. పే. 160.
46. జి. హెచ్. సబ్బైన్ : అంతే పే 126.
47. అంతే పే. 127.
48. అంతే.
49. అంతే పే. 126.
50. ఉదాహరణ జి హెచ్ సబ్బైన్. ప.చె. పే. 127–128.
51. అంతే పే. 128.
52. అంతే పే. 129.
53. అంతే.
54. కె. పి. జయస్వాల్ : ప. చె. పే. 162.
55. ఎ. ఎస్. అల్టేకర్ : ప. చె. పే. 138.
56. రొమిల్లా థాపర్. ఎ హిస్టరీ ఆఫ్ ఇండియా—1. 1976, పే. 51.
57. కె. ఎ. నీలకంఠశాస్త్రి, జి. శ్రీనివాసాచారి ఎడ్వాన్స్‌డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా, బొంబాయి, 1970, పే. 53.
58. రొమిల్లా థాపర్ : ప. చె పే. 75, 84.
59. అంతే పే 70.
60. కె. పి. జయస్వాల్ ప. చె. పే 376.

[ఈ వ్యాస రచనలో తోడ్పడిన మిత్రులు — డా జి. హరగోపాల్, రీడర్ ప్రభుత్వ పాలనా శాస్త్రము, కాకతీయ విశ్వ విద్యాలయము, మరియు, శ్రీ జగన్‌మోహన్. సి. ఏ, ఆంగ్లోప న్యాసకుడు. కాకతీయ యూనివర్సిటీ, గార్లకు కృతజ్ఞతలు.]

ఆ ఆది దేవుడే అతని వాడు

శ్రీ రంధి సోమరాజు

ఒకడిక్రింద పడి ఉన్నప్పుడు
అంతకన్నా చాతకానప్పుడు
చూస్తూ చూస్తూ ఊరుకోవాలి
చులాగ్గా అంతా బ్రెయిన్‌లో బతీ చేసేసుకోవాలి
కాని ...
వాడి వాడి అపరాధాల మిగులు గాథలు
నీలి నీలి కళ్ళతో పెద్ద పెద్ద కళ్ళద్దాలతో
పాలిటిక్స్ కృష్ణుణ్ణి కొనేసి
సాధించిన పర్మిట్ వరాలు నరాలు
పొందిన అష్టోష్ట వంకరల విరహాలు
రాల్చుకున్న వజ్రాల వర్షాలు
ఎలాగో ఎలాగో దొంగచాటున
కోటు 'జోబి' చెరువులో దాచేసి
దోచుకోగూడదయ్యా ఓ గుమాస్తా ...
నీ లేమిమాట దేముడెరుగు
ఆ ఆనకట్ట కోర్కెలు పెరక్కుండా పడగట్టి
చిన్నారి పొన్నారి చిట్టి సముద్రం పొట్టప్రాణాలు
అంతా తిరిగి కాజేయక మానదు
అక్కడక్కడ చిన్ని చిన్ని గుంటల్లా మిగిలిచూస్తూన్న
పాలాలకెళ్లి కళ్ళునీళ్ళుపోస్తే పోస్తాడు
అంతే ... అంతే ...
నిన్నుమాత్రం క్షమించడు
గాజు పెంకుల గెస్పైర్‌లో నీ బుర్రగోరిగి సరే
ఉండు అనడు
ఫెర్టిలైజర్ తిట్లు తిట్టి నిన్ను పనిలో
పెట్టుకొని 'జాగ్రత్త' అనడు
ముల్లుగర్ర భాష్యాలు వినిపించి వినిపించి
కాస్త అదలించి మందలించి
అమర్యాదగా అయిన చూస్తూ నిన్ను ఉంచుకోడు
రంకుతనం అంటగట్టి నిన్ను వీధిలో నిలబెడతాడు
ఆఫీసరు చిట్టి దేవుడిముందు నిలచి నువ్వు
కుత్రిమ సూర్యుణ్ణి బుట్టలోపెట్టి
హాట్ హాట్ రేట్ల ఎండలో ప్రజల్లోని
చమురును ఎండబెట్టి
అతగాడు కురిపించుకున్న వజ్రాల బొగ్గువానలు
దాగిఉన్న నల్ల సముద్రం ఇనప్పెట్టెల్లో
చూడమంటావో ...
పిచ్చివాడా నీకు తెలియదేమో !
ఆ ఆది దేవుడే అతనివాడు !

కే ఎస్వీ

నా మోనాలిసా

అధివాస్తవి కథ

కంపెషన్ హైహీల్స్ తొడుక్కుంటుందామె. పేరు హైమవతి. కారు దిగితే తివాచీలపై తప్ప కాలు మోపదు. సృష్టిలో చెట్లన్నీ ఆమె కోసమే పుష్పిస్తాయి, రాల్చి తివాచీలు పరచటానికి.

ఆమెను నేను ఎప్పుడు చూశానో గుర్తులేదు పసితనంలో కావొచ్చు. ఆమెను చూడటం చేత పసితనం పసితనంకాక పోయింది బ్రతుకంతా పసితనమే అయిపోయింది

ఆమె పలువరుస చుక్కలకు వెలుగులిస్తుంది. ఆమె పగటి నవ్వులు — రాత్రి చుక్కల కోసం. ''ప్రేమ—'' అని గొణుక్కునే వాణ్ణి అప్పుడు నేను. పేరు తెలియని తెల్లటి పువ్వులు రాలి వుండి మంచుతో పలకరించేవి నన్ను. పువ్వుల్ని బాకాలుగా చేసి వూదే వాణ్ణి. అవి ''పీ—పీ—'' అని సన్నాయిల్లా మ్రోగేవి. ఆమె నవ్వేది కాదు.

తల్లి దండ్రులామెను అల్లారు ముద్దుగా పెంచారు. నన్ను చంపారు చావంటే నిర్భయం అప్పుడే నాకు. క్షణం క్షణం చస్తూ కూడా ఇంకా బ్రతికేస్తున్నాను.

వొక సాయంత్రం విదూషకుడిలా నేను అనర్గళంగా, అసందర్భంగా ప్రసంగిస్తోంటే పగలబడి నవ్విందామె పెద్దలు చప్పట్లు చరిచారు. స్కూలు భవనంలో ఆ చప్పట్లు ఇప్పుడు వినిపించవు. ఆ నవ్వులు మాత్రం ఎక్కడికి వెళ్ళినా వినిపిస్తాయి.

ఎరువూ పసుపూ అంటే హేమవతికి లాగే నాకూ ఇష్టమైంది. దీర్ఘసుమంగళిగా ఆమె వర్ధిల్లాలని నా ఆశ. కాబట్టే ఆవిణ్ణి పెళ్ళాడే ప్రయత్నం చెయ్యలేదు

ఆ దశలో వేణుగోపాలం నా కలల విలన్, గంటు ముక్కుతో పరమ భీకరంగా వుండేవాడు. హైమవతిని ప్రేమిస్తున్నానని కబుర్లు చెప్పేవాడు. వాడికి టెన్నిస్ బాగా వొచ్చు. హైమవతిని కొందరప్పుడు బాడ్మింటన్ కోర్ట్ అనేవారు. నిజమే. ఆవిడకి నూనూగు మీసాలు కూడా వుండేవి. కాని ఆవిడ కళ్ళు గొప్ప కావ్యాలని అప్పుడే గుర్తించాను.

తరువాత హైమవతి దూరమైపోయింది. పెళ్ళయే వుంటుందని నా అంచనా. బిడ్డలెందరో మాత్రం తెలియదు. హైమవతి ఇంకొకరికి తల్లి కావటం నాకు ఇష్టం లేదు.

మనోరమకీ హైమవతికీ మంచి స్నేహం వుండేదిట. నాకు తెలీదు. మనోరమ నా వెంటపడటం జీవితంలో గొప్ప దురదృష్టం. కాని — ఎలా మరవను — బ్రతుకులో మొదట తాకిన స్త్రీ. కాని చాలా వికారంగా వుండేది. హోటెల్ సర్వైజ్ (తిలోత్తమ — మారుపేరు) లో పదిదినాలకి సరిపడా ఆవురావురుమంటూ తినేది. స్త్రీలకి తినిపించటంలో వున్న సరదా బిల్లు పే చేసేప్పుడు వుండేది కాదు.

'ఇలా అయితే జీవితంలో నువ్వు చాలా కష్టపడతావు —' అనేవాడు పాండురంగం మేష్టారు ఇప్పుడాయన తల ముగ్గుబుట్ట అడ్డపంచెతో, కూరగాయల సంచీతో ఎప్పుడైనా బజార్లోనో, టౌన్ బస్సులోనో కనిపిస్తాడు.

కూరగాయల మార్కెట్టంతా బురదగా వుంటుంది. అయినా నా కిష్టమే. అక్కడ జనాభా అంతా తిండికోసం నిశ్శబ్దంగా యాతపడుతున్నట్లనిపిస్తుంది. లలితకి మాంసాహారం మహా యిష్టంట. లలిత నావొకప్పటి మిత్రుడు శర్మయొక్క ప్రియురాలు వాళ్ళమధ్య వున్నత ప్రేమ తప్ప మిగతంతా వుండేదని గొప్పగా చెప్పుకునేవాడు. లలిత తర్వాత శర్మ ముప్పైవేల కట్నంతో మరదల్నే చేసుకున్నాడు.

కాలేజీ దినాల్లో నేను అనుభవించిన నరకం అంతా యింతా కాదు. అప్పుడీ గోపాలం అంటే చాలా మందికి గొప్పే. అయినా అదో శకాన్యం. కో — ఎడ్ లేని విద్యావిధానం అతి హేయమని అప్పట్లో నా అమూల్యాభిప్రాయం గోపాలం అభిప్రాయాన్ని ఎవరూ పట్టించుకోలేదనుకోండి —!

చంద్రగిరి పిక్నిక్‌కి బోయిస్ అందరితో తనూ వెళ్ళాడు గోపాలం హిస్టరీ లెక్చరర్ సాంబశివానికి ఘోరమైన మెల్లకన్ను. గుర్రపు శాలా రాణీమహలా అని ఆయన చర్చిస్తోంటే ఎవరూ పట్టించుకోలేదు. కోనేటి గట్టుమీద కూచుని నీటిలోకి రాయిరాయీ విసురుతూ హైమవతిని గూర్చి తలపోశాడు గోపాలం. ఆవిణ్ణి మరిచిపోలేనా అనుకున్నాడు. మరపు రాదా అని ఆశ్చర్యపడ్డాడు హైమవతి పూర్వ జన్మలో రాణి అయివుండాలని నిశ్చయించుకున్నాడు. ఆ రాత్రి కలలో శూన్యపు చీకటి మహల్లో మెట్లవెంట తనొక్కడూ మెల్లిగా దిగుతున్నాడు గోపాలం బాగా పొడగరే, కాని అతనిలో రాజలక్షణాలేవీ లేవు.

యూనివర్శిటీ దశలో కాలక్షేపానికి కొరత లేకున్నా — ఆ తపనా, అశాంతీ వొదల్లేదతన్ని వినాడో డ–ఐన్స్టీ మీద పుస్తకం చదివాడు. పెద్దగా ప్రభావితం చేసింది మాత్రం నేపోయనే. మొదటిసారిగా యుద్ధాల గురించి సీరియస్‌గా పట్టించుకోవటం మొదలెట్టాడు కాకాని వెంకట రత్నం మరణం అతణ్ణి కలచి వేసింది నిరంకుశ పాలనను ఎదుర్కొనే స్థయిర్యం నిజాయితీకి వుంటుందో అనుకున్నాడు. క్లాస్‌మేట్ శ్యామల అతణ్ణి ఎప్పుడూ ఏదో రకంగా ఎగతాళి పట్టిస్తూ వుండేది. పు. పు. అనేది. పుస్తకాలంటే అతనికి ప్రాణం కావటం బ్రతుకులో అతను చేసిన గొప్ప నేరం. 'నాకు లోకం తెలియదు' అని చాలా రోజులకు గాని తెలుసుకోలేకపోయాడతను. రీడర్ గారికి మాత్రం అతనంటే గొప్ప గురి వుండేది. క్లాసులో ప్రతి విషయానికీ అతణ్ణే కదిలిస్తూ వుండేవాడు. బ్లాక్‌బోర్డ్ టీచింగ్ అంటే అతనికి సయించేది కాదు. జర్నలిస్టులకూ, కాలేజీ ఉపాధ్యాయులకూ పెద్ద బేదనం లేదనేవాడు మరీ సన్నిహితుల తోటీ.

వుత్తరం రాసింది శ్యామల — కాన్వొకేషన్‌కి వొస్తున్నా — కలుసుకుందాం - అని అతను రిసీవ్ చేసుకోవటానికి బస్‌స్టాండ్‌కి వెళ్ళలేదు. ఆలోచించి కాన్వొకేషన్‌కీ వెళ్ళలేదు. కాన్వొకేషన్ ప్రెస్‌లో శ్యామలను నల్లమేకలా వూహించుకున్నాడు

మాడ్ — మాడ్ — మాడ్ — మాడ్ -- వరల్డ్... అనుకునే అతను — ఎప్పుడూ వూహించను గూడా లేదు — చాలా వాటితో సంఘర్షణ తప్పదని. ముసి వాళ్ళను తప్పక తిరిగేవాడు యువతులను చూట్టమే తప్ప వాళ్ళతో ఎక్కువ మాట్లాడేవాడు కాడు. శ్యామల తనని ఆకర్షించిందని అతను ఆక్టే అభ్యంతరం లేకుండా వొప్పుకునేవాడు. కాని — ప్రేమ వేరూ పెళ్ళివేరూ అతనికి సారీ శ్యామలా అని కూడా అనలేదతను శ్యామల గ్రహిస్తుందనుకున్నా — శ్యామల గ్రహించిందో లేదోగాని —

లైబ్రరీల్లో ఆలోచనల వాసన కూడా విసుగెత్తించటం మొదలెట్టింది. మహారచయితల సంపూర్ణ సాహిత్య సంపుటాలూ— వికర్షించసాగేయి. అయినా — పుస్తకాలు — మూసి వాటిని గురించి వూహించగలిగినా చాలు అనుకొనే వాడు. సీరియస్‌గా అప్పుడో బృహన్నవల మొదలుపెట్టి — నాలుగో భాగం (అయిదు వందల పేజీల పై చిలుకు) రాశాక -- వొక రాత్రి లేని వోపిక తెచ్చుకుని ఆ కాగితాలన్నీ తగలబెట్టేశాడు. నవలలోనైనా శ్యామల ఛాయలు కనిపించటం అతనికి సుతరామూ ఇష్టం లేదు.

సెరిబ్రల్ న్యుమోనియా (!) — అని పేరు పెట్టుకున్నాడు తన తలనొప్పికి. అదో విచిత్రమైన నొప్పి. సినిమా చూస్తే మాత్రం గొప్ప రిలీఫ్‌గా ఫీలయేవాడు.

ఎందుకో అతని కలల్లోకి మహాబలిపురం షోర్ టెంపుల్ వొచ్చేది. డిటెక్టివ్ పుస్తకాలు చదువుతూ వుండి నిద్రలు చెడగొట్టుకునే వాడు. గెడ్డం పెరిగి మాసి కళ్ళు లోపలికి పీక్కుపోయి చాలా అసహ్యంగా తయారయాడు. పేకాట అలవాటయింది

అలవాటు చేసుకున్నాడు. మురళీమోహన్ అతన్నుంచి చెప్పకో దగినంత మొత్తం లాగేశాడు - స్నేహ ధర్మంగానే! కాని — ప్రయత్నించినా అతను తాగలేక పోయాడు.

మురళీధరే పరిచయం చేశాడు వసుంధరని. ఆవిడ నుదురు చాలా ఆకర్షణీయంగా వుండేది. నవ్వులు అతి సహజం బొట్టూ పువ్వులూ పెట్టుకునేది కాదు — ఫ్యాషన్‌ట. గాజులూ అంతే. వసుంధరకుమాత్రం అతనిమీద - వుండేది. ఆ రోజుల్లో అతనూ—ఆలోచిస్తూ వుండేవాడు. కాని—ఎందుకో సరిపడేదికాదు. ఏదో—తక్కువ? అనిపించేది. ఏదో కురి. సానుభూతికేం — ఆవిడ దగ్గిర చాలానే దొరికేది. శ్యామల సంగతి కూడా చెప్పాడు. కావాలనే. నవ్వుతూనే—సహజమేకదా—అంది. అది మాత్రం నచ్చిందతనికి.

ఒంటరిగా తిరిగాడు చెట్లమ్మట, పుట్లమ్మట. అక్కడ ఆలోచనలు అవసరంలేదు ఆ ఆరోగ్యం నచ్చింది. కొండలూ బండలూ ఎంతో ఉపశాంతి నిచ్చాయి. వసుంధరతో చెబితే నవ్వింది వసుంధరలో గొప్ప సుగుణం అదే—అర్థం చేసుకుంటుంది. నిశ్శబ్దంగానూ, తనూ వొస్తానంది. యూకలిప్టస్‌లమధ్య సూర్యుడస్తమిస్తూ ఆమె బుగ్గలు మెరిశాయి. ఏ పాదరసం పూసిన అద్దమైనా అంత గొప్పగా మెరవలేదు. చెక్కినట్టున్న ఆమె ముక్కుకొసని చిరు చెమటలు. ఆమె పళ్ళు—పగటి వేడిని పీల్చటానికే పెరిగాయి. ఆమె పైట తొలగినా అతని దృష్టి చెదరలేదు. చెట్ల పచ్చదనం మధ్య వసుందర సింప్లిసిటీ గలగలా నవ్వే స్వభావం చాలా నచ్చాయి. అక్కడి జలపాతం ఇంకిపోయిన చారబండలవెంట చరిత్ర జ్ఞాపకంలా వుంది. పాచిమీద పురుగులు జిమ్మంటూ రొదచేశాయి కోనలో వాలునీడ హాయిగా అనిపించింది. ''నాకు బోంబే అంటే యిష్టం—'' అంది వసుంధర. భంగమైన నిశ్శబ్దంలో ఆలోచనలో పడ్డాడు మళ్ళీ. మాటలాపి ఆమె అతని వేపు చిత్రంగా చూసింది. కొంతసేపు మౌనంగా వుంది ''చిత్రమైన మనిషివి నువ్వు''—అంది. ఆవిడా అన్నిమాటలు మాట్లాడుతుందనుకోలేదు ఆకాసం చాలా ఆత్మీయంగా వున్నా ఎందుకో అసహనంగా అనిపించిందతనికి.

''నిజం చెప్పు—ఎవర్నయినా ప్రేమించావా నువ్వు ?...'' అంది వసుంధర కళ్ళలో వెదుకుతూ.

''నేనా?...'' అన్నాను. ఎవర్నయినా—అని అడిగి ఏం లాభం? దేన్నయినా—అని అడిగి వుండాలేమో వసుంధర!

ఆమాటతో—దూరమైపోయింది వసుంధర.

నే నెరుగుదును — ఆమెలో జెలసీలేదు. అయినా — నాకు సయించలేదు. రాజీ మనస్తత్వంకాదు నాది—ఎంత సంకటస్థితిలో—దివాలా దశలో—వున్నా.

చెప్పా చెయ్యకుండా ట్రెయినెక్కేశాను. వసుంధర ఏమనుకుంటుందో అనే ధ్యాస రైలు కదులుతుండగా వొచ్చింది. కాని, లక్ష్యం చెయ్యటం మానేశాను. శ్వాస స్వేచ్ఛగా సాగుతున్నంత కాలం—కలల్లో ఘోరాలు జరగనంతకాలం—ఫరవాలేదు.

రాజమండ్రిలో దిగటానిక్కారణం — శోభనాద్రిని కలుసుకోవచ్చనే. దూరపు బంధువే కాదు, స్నేహపాత్రుడు కూడా వాడు. అయితే — చాలా మారిపోయాడు కాలం అలా మార్చేస్తుంది కాబోలు. ఉద్యోగ పయత్నంమీద వొచ్చానని తెలియగానే ధోరణి మరీ కృతకంగా మారిపోయింది.

—ఎవరు చెప్పి మాత్రం ఏముంది? మా మామయ్య వుండగా పరిస్థితి వేరు.. యిప్పుడు ఆ బోర్డు మెంబర్లంతా మారిపోయారు ...చెప్పినా వింటారో లేదో—అయినా వొమాట చెప్పి చూస్తాననుకో ...అయినా పెద్దగా వుపయోగి ముంటుందనుకోను...

సానుభూతి అంటే మాత్రం గిట్టదు—మరీ మొగమాటపు సానుభూతి శోభనాద్రిని అసహ్యించుకునీ లాభంలేదు. లాభనష్టాల ప్రసక్తిలేకుండా అసహ్యించుకుందామన్నా...ఎందరినని—ఎన్నిటినని—

డబ్బుతోనే రాజీపడగా లేనిది—రక్తమాంసాలనా—సంస్కృతినా అసహ్యించుకోవటం—మానవ ప్రకృతిని!

చాలా అలుపొచ్చేసింది. తిరక్కున్నా అలుపే ముసలివాణ్ణయిపోతున్నాననే భావన! వెంట్రుకలు రాలటమూ మొదలైంది. ఆలోచనలు వొదిలించుకుందామనుకున్నా వొదలవు.

కాని — వెదకటం మానినా — ఎదురుచూడటం మానలేదు.

చాలా విచిత్రమైన నిర్లిప్తతలోనూ అతి పవిత్రమైన నిరీక్షణ!

స్ఫుమాటో (SFUMATO) :

జీవితంలో ఆఖరి అధ్యాయాలు ఎప్పుడొస్తాయి ? ఎప్పుడు రావు ? దేనికదే— ఏ సంఘటనకా సంఘటన — ఏరోజు కారోజు — ఏ నిమిషానికా నిమిషం —

రాజగోపాలం హఠాత్తుగా పరిచితుడయాడు. —మీ గురించి విన్నాను..., అని అతనన్నప్పుడు వొక గొప్ప జోక్‌లా తోచింది.

అతని కంపెనీలో చేరాడు. గొడ్డుపని అని మొదట్లో అనిపించినా రానురాను రాజీపడిపోయాడు. ఫుల్ భోజనాలతో ఆత్మను వూరుకోబెట్టటం అసాధ్యం అని తెలిసినా — కడుపులో మాత్రం ఆత్మలేదా అని సవరణలు చేసుకున్నాడు.

వల్లభరావు అనబడు ముసలి గుంటనక్క 'వృత్తిశత్రువు'గా ఎన్ని ఇబ్బందులకు గురిచెయ్య దలచినా — ఏమాత్రమూ పట్టించుకోకుండా ముక్కుమూటిగా వ్యవహరించటం కొనసాగించాడు.

రాజగోపాలం చాలా మెచ్చుకున్నాడు. మెప్పులతో పెద్దగా అవసరం లేకున్నా అదో శాంతి. గుంటూరు హెడ్డాఫీసు చేస్తూ—

ఈ బ్రాంచ్‌కి నన్ను జి. ఎమ్ చేసేశాడు. అందరూ — అదో గొప్పన్నా — కాబోలని కూడా అనలేదు. ముసలి నక్క తోక తిప్పటం మాత్రం పూర్తిగా ఆగిపోయింది. పాడలోకానికి — ఇవీ విజయాలే!

చాలా రోజుల తర్వాత — సంవత్సరాల తర్వాత — హైమవతి కనిపించింది. హైమవతిని చూశాను పచ్చకార్‌లో క్రేం కలర్ చీరెలో...ముఖం కాస్త మారింది, కొంచెం లావయింది, కారు దూరమై మాయమైంది.

వ్రేళ్ళతో పెకలించుకొన్న చెట్లు తలక్రిందులుగా నాట్యం చేసినట్లనిపించింది.

కాని—తరువాత సందేహమే, హైమవతేనా — కాదా—అని, అయినా — కాకున్నా రెండూ ఒకటే. ఆమెకు పిల్లలేమో! ఏదో జెలసీ లాంటిది అన్నదమ్ముల మధ్య — తల్లిని గ్గూర్చిన జెలసీ వుంటుందా?

బ్రిటానికా నుంచి తలెత్తి చూసి నవ్విందామె. చదువు కుంటూ నవ్వుతూండి—తలెత్తిందేమో. ఖెడ్డాల్లో ఏనుగులు పడే దృశ్యం పచ్చటి వూబి గుంటలా? ఆమె కళ్ళు చాలా బల్లపరువుగా వున్నాయి. కాని ఏదో జరిగిపోయింది. లేక — ఏదో జరిగిందని గుర్తొచ్చిందేమో.

అమృతమో హాలాహలమో అనుకున్నాను. అష్టకష్టాలు పడాల్సొచ్చింది. ఆమె చుట్టూ తిరగాల్సొచ్చింది. అదేమిటో మరి అర్థంకాకుండానే. చివరికెలాగైతేనేం — ఆవిడతో మాట్లాడేక—

ఏదో హిందీ సినిమాలోని గిటార్ నేపథ్యపు ప్రేమగీతిక గుర్తొచ్చింది.

కళ్ళలోంచి వసంతాలు రాలొచ్చా ఇంకా, ప్రియురాలో మరొకరో—ఏదైనా ఎవరైనా—అనంత జీవితకాలంలో—మళ్ళీ మళ్ళీ స్పందనలా—

సరేనంది ఆవిడ—భవాని.

జగణం అంటే జగడం గుర్తొచ్చేది. అయినా—తప్పకుంటే—

సంతోషమూ కాదు దుఃఖమూ కాదు,

ఎందులోనూ ఏకాభిప్రాయమే కుదరదు. ఔనంటే కాదూ — వైస్‌వెర్సా, అయినా జరుగుతాయి కొన్ని—ఎలాగో.

పెళ్ళికి ముందురోజు కలుసుకున్నప్పుడు — దిగులుగా వుంది భవాని —

— మా క్లాస్‌మేట్ వొకతను...సూసైడ్ చేసుకున్నాట్ట... వారం రోజుల క్రితం — పాపం ... చాలా మంచివాడు – ఎందుకో, మరి...

భవానికి హృదయం –

పెళ్ళికి చాలామందే వొచ్చారు.

హనీమూన్ ఏకాంతాలు ఎంత నిండో అంత వెలితిగానూ అనిపించాయి.

హార్స్‌లీహిల్స్—అనుకున్నంత గొప్పగా ఏమీ అనిపించలేదు —

అప్పుడప్పుడూ ఆత్మహత్య ఆలోచనలు వొస్తున్నా బలవంతాన నొక్కిపెట్టేస్తున్నాను.

ఎలాగో కాని—ఏదో జరిగిపోయింది.

విడిపోయిన వాళ్ళందర్నీ — మళ్ళీ వొక్కసారి — మునుపటి ఆత్మీయతతో పలకరించాలని...కాని, అదెలా వీలవుతుంది?

మాటిమాటికీ గుర్తొస్తుండగా బెజవాడ ప్రయాణమయ్యాను—వొక్కణ్ణీ, వొస్తానందిగాని, భవానిని వేనేవొద్దన్నాను.

కృష్ణ, బారేజీ, దుర్గ — ఏమీ మారలేదు. సోడాలు కీచుమంటుండగా లోపల ఏదో పలికింది. సూర్యాస్తమయం చర్మాన్ని తిప్పి తొడిగేశాను.

రైల్లోపడి తెల్లారేసరికి ఇల్లు చేరాను

కాల్‌బెల్ నొక్కి నొక్కగానే తలుపు తెరుచుకుని...

— వొచ్చేరా?..., అంది భవాని.


ఆ మాటతో చాలా బోధపడింది నాకు.

— అలా చూస్తారేం? నేనండీ...భవాన్ని...మీ భార్యని..., అంది చిల్లగింపుగా, అపూర్వంగా నవ్వుతూ.

తేరుకుని నేనూ నవ్వాను. అలా అంతకు ముందెప్పుడూ నవ్వలేదు.

లోపలికి నడుస్తుండగా పచ్చటి గొంతేదే లోపల్నుంచి వినిపించింది.

— ఈమే, పేరేదైతేనేం? ... ...



శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

ఆరవ ప్రణాళిక: కనీస సదుపాయాలు

1947 లో స్వాతంత్ర్యం సముపార్జించుకొన్న భారతదేశం 1951 నుండి ప్రణాళికా విధానం ద్వారా సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధించ వలెనని నిర్ణయించింది. తదనుగుణంగా 1951 లో ప్రథమ పంచవర్ష ప్రణాళిక రూపొందింపబడింది. 1956 లో ద్వితీయ పంచవర్ష ప్రణాళిక తయారు చేయబడింది. 1961 లో తృతీయ పంచవర్ష ప్రణాళిక అమలులోనికి వచ్చింది తృతీయ ప్రణాళిక 1966 తో ముగిసింది. దేశములోని రాజకీయ ఆర్థిక పరిస్థితుల కారణంగా తరువాత మూడు సంవత్సరాలు (1966–67, 1967–68, 1968–69) ప్రణాళికా విధానానికి సెలవు సంవత్సరాలుగా పరిగణింపబడ్డాయి. 1969 నుండి చతుర్థ ప్రణాళిక ఆచరణలోనికి వచ్చింది. అయిదవ పంచవర్ష ప్రణాళిక కొంచెం ఆలస్యంగా తయారయినా 1974 నుండి ప్రారంభమయినట్లు లెక్క. 1977 లో స్వతంత్ర భారత దేశ చరిత్రలో కొత్త పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. మూడు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న అఖిల భారత జాతీయ కాంగ్రెసు పార్టీ సార్వత్రిక ఎన్నికలలో ఘోర పరాజయం పొందింది. అపుడే వెలసిన జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోనికి వచ్చింది. నూతన ప్రభుత్వమునకు సంబంధించిన జాతీయ ప్రణాళిక సంస్థ గత 27 సంవత్సరాల ప్రణాళికా విధానాన్ని సూక్ష్మావలోకనం గావించింది. ప్రణాళిక విధానం సాధించిన విజయాలు, అపజయాలే కాక మౌలిక విధానంలోని కొన్ని ముఖ్యమయిన బలహీనతలను గమనించింది. మామూలు నిశ్చితకాల ప్రణాళికలు కంటె అనంత ప్రణాళికా పద్ధతి (రోలింగ్ ప్లాన్ మెకానిజమ్) మన దేశ సామాజిక ఆర్థిక పరిస్థితులకు అనువయినదని భావించి, అనంత ప్రణాళికా పద్ధతిని చేపట్టింది. నూతన ప్రభుత్వము యొక్క ధ్యేయములు, ఆశయములు త్వరలో ఆచరణలోనికి తెచ్చుటకు వీలుగా అయిదవ పంచవర్ష ప్రణాళికను నాలుగు సంవత్సరాలలో (1977–78 కు) ముగింప జేసింది. తరువాత అయిదు సంవత్సరాలకు క్రొత్త ప్రణాళికను తయారు చేసింది. ఈ క్రొత్త ప్రణాళికను ఆరవ ప్రణాళిక అని పిలుచుట నేరం కాదు; కాని పూర్వ ప్రణాళికలువలె దీనిని ఆరవ ప్రణాళిక అని భావించడం సాంకేతికంగా తప్పు. దీనిని 1978–83 పంచవర్ష ప్రణాళిక అనాలి. అయినప్పటికి సౌకర్యార్థం క్లుప్తంగా ఆరవ ప్రణాళిక అని పిలవడం అందరకు అలవాటయింది. ఇది అనంత ప్రణాళికా విధానంలో రూపొందింపబడిన ప్రథమ పంచవర్ష ప్రణాళిక. ఈ క్రొత్త ప్రణాళికా విధానంలో ప్రతి సంవత్సరము ప్రణాళికా ధ్యేయములు అనుసరించి ప్రణాళిక సాధించిన విజయములు అపజయములను అవలోకన చేయటం జరుగుతుంది. తదనుగుణంగా ప్రతి సంవత్సరం తరువాత అయిదు సంవత్సరాలకు ప్రణాళికా ధ్యేయాలలోను, నిధుల కేటాయింపులలోను, పెట్టుబడులలోను మార్పులు చేయటం జరుగుతుంది. ఇది అనంత ప్రణాళికా విధానం యొక్క మౌలిక తత్త్వం. అనంత ప్రణాళికా విధానాన్ని సరిగా అవగాహన చేసికొనకుండా మన జాతి నిర్మాతలు ప్రవేశపెట్టిన ప్రణాళికా విధానాన్ని పూర్తిగా విడనాడి క్రొత్త ప్రభుత్వం ప్రణాళికా రహితంగా సాగాలని కాంక్షిస్తున్నదని, ఇది దేశాభివృద్ధికి వెన్నుపోటని కొందరు విమర్శించటం జరుగుతున్నది. కాని ఈ విమర్శలలో నిజం ఏ మాత్రం లేదు. కొత్త ప్రభుత్వం ప్రణాళికా విధానాన్ని విడనాడలేదు. పూర్వ ప్రణాళికా పద్ధతిలోని బలహీనతలను తొలగించి, ప్రణాళికా పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉండు విధంగా రూపొందించింది [1]

దేశ సామాజిక ఆర్థిక విభిన్న రంగాలలో ఆరవ ప్రణాళికలో కేటాయించిన నిధులు (అవుట్‌లేస్), నిర్ణయింపబడిన అభివృద్ధి ధ్యేయాలు (గ్రోత్ టార్జెట్స్), ఆశయాలు (అబ్జెక్టివ్స్) మొదలయిన వాటినన్నిటిని సమగ్రంగా అవలోకనం చేయటం ఈ వ్యాసోద్దేశ్యం కాదు; ఆరవ పంచవర్ష ప్రణాళికా ప్రారూపము (డ్రాఫ్ట్ ఫయివ్ ఇయర్ ప్లాన్ 1978–83) గురించి ఈ చిన్న వ్యాసంలో సమగ్రంగా, సంతృప్తికరంగా చర్చించటం సాధ్యం కాదు. అయితే జాతీయ కనీస సదుపాయ కార్యక్రమం (నేషనల్ ప్రోగ్రామ్ ఆఫ్ మినిమమ్ నీడ్స్) పేరిట మన ప్రభుత్వం ఆరవ ప్రణాళికా ప్రారూపములో వెల్లడించిన ఆశయాలు, ధ్యేయాలు గురించి సూక్ష్మావలోకనం చేయటం మాత్రమే ఈ వ్యాసంయొక్క ముఖ్యోద్దేశ్యం.

జాతీయ నమూనా సర్వే (నేషనల్ శాంపిల్ సర్వే) 27 వ రౌండు (27వ రౌండ్) పరిశీలనల ననుసరించి 1972–73 లో మనదేశంలో దాదాపు 39 లక్షల మంది దుర్భర నిరుద్యోగులు (క్రానికల్లీ అన్‌ఎంప్లాయిడ్) గను, 101 లక్షల మంది తీవ్ర నిరుద్యోగులు (సివియర్‌లీ అన్‌ఎంప్లాయిడ్) గను, 186 లక్షల మంది నిరుద్యోగులు (అన్‌ఎంప్లాయిడ్) గను ఉన్నట్లు తెలియుచున్నది. [2] ఈ సంఖ్యలు 1978 మార్చి నాటికి వరుసగా 44 లక్షలుగను, 112 లక్షలుగను, 206 లక్షలుగను అభివృద్ధిచెంది యుండునని ప్రణాళికా సంస్థవారు అంచనా వేసిరి. ఆరవ ప్రణాళిక ఆరంభమగు నాటికి దేశములో నిరుద్యోగ సమస్య ఈ విధముగా ఉన్నది.[3]

ఇక దారిద్ర్య సమస్య గురించి పరిశీలించెదము. గ్రామీణ ప్రజలకు రోజుకు 2400 కాలరీల ఆహారము, పట్టణ ప్రజలకు 2100 కాలరీల ఆహారము అవసరమని భావించి జాతీయ ప్రణాళికా సంస్థవారు 1976–77 ధరల ప్రకారము గ్రామ ప్రజలలో నెలకు రు. 61–80 లు, పట్టణ ప్రాంతములో రు. 71–30లు వ్యయము చేయలేనివారు దారిద్ర్య పరిధిలో నున్నట్లు పరిగణింప వచ్చునని నిర్వచించిరి. ఆ ప్రకారముగా 1977–78 లో దేశము లోని గ్రామ ప్రజలలో 47.85 శాతము ప్రజల, పట్టణ ప్రజలలో 40 71 శాతము ప్రజలు మొత్తము మీద దేశములో 46.33 శాతము ప్రజలు దారిద్ర్య విషవలయములో చిక్కుకొని యున్నట్లు అంచనా వేసిరి. ఇది ఈ నాటి పరిస్థితి.[4]

నిరుద్యోగ సమస్యా పరిష్కారము, దారిద్ర్య నిర్మూలన, అసమానతలను రూపుమాపుట ఆరవ ప్రణాళిక ప్రధాన ధ్యేయము లుగా పేర్కొనబడినవి తదనుగుణముగా ప్రణాళికలో అభివృద్ధి ధ్యేయములు, పెట్టుబడుల కేటాయింపులు చేయబడినవి.

మన జాతీయాదాయము గత 16 సంవత్సరములనుండి (1961–62 నుండి 1976–77 వరకు) సగటున 3.3 శాతము చొప్పున అభివృద్ధి చెందినది. కాని పూర్వ ప్రణాళికలలో పేర్కొన్న ధ్యేయముల కంటె సాధించిన రేటు చాల తక్కువ. నాల్గవ, అయిదవ ప్రణాళికా కాలములలో జాతీయాదాయము 5–8 శాతములో నభివృద్ధి చెందవలెనని కాంక్షించిరి. కాని సాధించిన అభివృద్ధి రేటు 3.5 శాతమునకు మించలేదు. కావున వాస్తవిక శక్తి సామర్థ్యములను దృష్టిలో నుంచుకొని ఆరవ ప్రణాళికా కాలములో 4.7 శాతము చొప్పున జాతీయాదాయము అభివృద్ధి చెందవలెనని తలపెట్టిరి విభిన్న రంగములలో సాధించ దలచిన అభివృద్ధి గురించిన వివరములు పట్టిక సంఖ్య 1 లో పొందుపరుప బడినవి.

పట్టిక సంఖ్య 1

అభివృద్ధి రేట్లు : ధ్యేయములు

	పరిష్కృత అయిదవ ప్రణాళిక (Revised Fifth Five year plan)	1978–83 పంచవర్ష ప్రణాళిక ప్రారూపము (Draft Five year plan 1978–83)
	(సం. నకు	శాతములలో)
వ్యవసాయము	3 9	4.0
గనులు, ఉత్పత్తి పరిశ్రమలు	7.1	6.9
విద్యుచ్ఛక్తి	10.1	10.8
నిర్మాణము	5.9	10.6
రవాణా	4.8	6.2
సామాజిక సేవాకార్యక్రమములు	4.9	6.0
జాతీయ ఉత్పత్తి	4.4	4.7

మూలము : డ్రాఫ్ట్ ఫయివ్ ఇయర్ ప్లాన్ : 1978—83

విభిన్న రంగములలో పై పట్టికలో పేర్కొన్న విధముగా అభివృద్ధి సాధించుటకు పబ్లికు రంగము (Public Sector)లో విభిన్న శాఖలకు పట్టిక సంఖ్య 2లో చూపిన విధముగా నిధులు కేటాయించబడినవి.

పట్టిక సంఖ్య 2

పబ్లికు రంగములో నిధుల కేటాయింపులు

రు. లు కోట్లలలో

	పరిష్కృత అయిదవ ప్రణాళిక	ఆరవ ప్రణాళిక ప్రారూపము	అభివృద్ధి శాతము
వ్యవసాయము, నీటిపారుదల మొ॥	8528	18250	114
గ్రామీణ & చిన్న పరిశ్రమలు	510	1410	176
భారీ పరిశ్రమలు	6852	8940	30
విద్యుచ్ఛక్తి	9783	20150	1[illegible]6
రవాణా, కమ్యూనికేషన్లు మొ॥	6917	10562	53
సామాజిక సేవాకార్యక్రమములు	6224	9355	50
సాంకేతిక విజ్ఞానము	436	650	49
మొత్తము	3932	69380	76

మూలము : డ్రాఫ్ట్ ఫయివ్ ఇయర్ ప్లాన్
1978-1983 PP. 17-18

ఆరవ ప్రణాళికలోని ప్రధానాంశములను ఇంతవరకు అతి సూక్ష్మముగా పేర్కొనడమైనది.[5] ఇక ఈ వ్యాసముయొక్క ప్రధాన విషయమయిన జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము గురించి అవలోకింతము.

అయిదవ ప్రణాళిక కాలముతోనే ఈ జాతీయ కనీస సదుపాయ కార్యక్రమమును తొలిసారిగా ప్రారంభించిరి. అయిదవ ప్రణాళిక ప్రారూపములో ఈ కార్యక్రమము పేరిట ఈ క్రింది అంశములు పేర్కొనబడినవి :

1. మంచినీటి సౌకర్యము
2. గృహములేని పేదలకు గృహసౌకర్యము
3. గ్రామ ప్రాంతములలో రోడ్లు
4. ప్రాథమిక విద్య
5. ఆరోగ్యము
6. గ్రామ ప్రాంతముల విద్యుదీకరణ
7. మురికివాడల పారిశుధ్యము
8. పౌష్టికాహార సరఫరా

అయిదవ ప్రణాళికలో ఈ కార్యక్రమునకు రు. 1200 కోట్లు కేటాయింపబడినవి. కాని 1973-75 సం.లలో ధరల పెరుగుదల, అయిదవ పంచవర్ష ప్రణాళిక కేవలము నాలుగు సంవత్సరములకు పరిమితమగుట కారణములుగా కేవలము రు. 800 కోట్లు మాత్రమే వెచ్చింపబడినవి.

ఆరవ ప్రణాళికలో ఈ జాతీయ కార్యక్రమములో వయోజన విద్య మరొక ప్రధానాంశముగా చేర్చబడెను. దానితో కలిసి ఈ కార్యక్రమమును పరిష్కృత జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము (రివయిస్డ్ నేషనల్ ప్రోగ్రామ్ ఆఫ్ మినిమమ్ నీడ్స్) అని పిలువబడెను ఈ కార్యక్రమమునకై మొత్తము రు. 4180 కోట్లు కేటాయింపబడినవి. ముఖ్యముగా బలహీన వర్గముల అందునా గ్రామీణ ప్రజల స్థితిగతులను మెరుగుపరచవలెనని ప్రభుత్వము ఈ జాతీయ కార్యక్రమము నారంభించినది. దారిద్ర్య దేవత విలయతాండవమునకు గురియగుచున్న ప్రజలను దారిద్ర్య పరిధి నుండి బయటకు తీసికొని రావలెననుట ఈ కార్యక్రమముయొక్క ప్రధానోద్దేశ్యము.

ఈ జాతీయ కనీస సదుపాయ కార్యక్రమమునకు సంబంధించిన నిధుల కేటాయింపు వివరములు పట్టిక సంఖ్య 3లో పొందుపరుపబడినవి.

పట్టిక సంఖ్య - 3

ఆరవ ప్రణాళిక : పరిష్కృత జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము.
నిధుల కేటాయింపు వివరములు

	పెట్టుబడి కేటాయింపు (రు కోట్లలో)
ప్రాథమిక విద్య	రు 900
వయోజన విద్య	200
గ్రామీణ ఆరోగ్యము	490
గ్రామ ప్రాంతములలో నీటి సరఫరా	675
గ్రామములలో రోడ్లు	800
గ్రామముల విద్యుదీకరణ	250
గృహ నిర్మాణము	500
మురికివాడల పారిశుధ్యము	190
పౌష్టికాహార సరఫరా	175
మొత్తము	4180

మూలము డ్రా. ఫ ప్లా. 1978-1983 P. 109

ఈ జాతీయ కార్యక్రమములోని విభిన్న అంశములను సమగ్రముగా పరిశీలించెదము :[6]

1. ప్రాథమిక విద్య : 6-14 సం. ల వయసుగల పిల్లలు నూటికి నూరు శాతము 1960 నాటికి ప్రాథమిక విద్య నభ్యసించుచు నుండవలెనని మన రాజ్యాంగములో పేర్కొనబడెను కాని ఈ ఆశయము నేటికి కూడ నెరవేరలేదు. 1975-76 నాటికి కేవలము 67.04 శాతము పిల్లలు ప్రాథమిక విద్య నభ్యసించు చున్నారు మన రాజ్యాంగములో వెల్లడించిన ఆశయము ఏ నాటికి నెరవేరునో ! [7]

నేటి నుండి మరో 10 సం. లలో ఈ ఆశయము నెరవేరవలెనని ప్రభుత్వ సంకల్పము. తదనుగుణముగా 6-14 సం. ల వయసు గల పిల్లలలో 90 శాతము 1983 నాటికి ప్రాథమిక విద్య నభ్యసించుచున్నట్లు చేయవలెనని, 1988 నాటికి నూటికి నూరు శాతము ప్రాథమిక విద్య నభ్యసించు చుండవలెనని ఆరవ ప్రణాళిక ప్రారూపములో పేర్కొనబడినది..

ఇక నుండి అదనముగా చేరు విద్యార్థులలో సగము మంది పిల్లలకు సాంప్రదాయేతర పద్ధతి (నాన్ ఫార్మల్ సిస్టమ్ ఆఫ్

ఎడ్యుకేషన్) లో విద్యా బోధన గావించవలెనని తలపెట్టిరి. సాంప్రదాయేతర పద్ధతి వలన చాలా లాభములున్నవి.

I) సాంప్రదాయ పద్ధతి (ఫార్మల్ సిస్టమ్ ఆఫ్ ఎడ్యుకేషన్) లో అగు వ్యయము కంటె సగటున విద్యార్థికి సాంప్రదాయేతర పద్ధతిలో చాలా తక్కువ ఖర్చగును.

II) సాంప్రదాయేతర పద్ధతిలో విద్యార్థులు పగలు తమ గృహ కార్యక్రమములు, కూలిపనులు వగైరాలు చేసికొన వీలగును. సాయం సమయములందు, రాత్రులందు విద్యాభ్యాసము చేయవచ్చును.

III) 6–14 సం. ల వయసు లోపుగల పిల్లలు సాంప్రదాయ పద్ధతిలో వలె కాక వయసు, తెలివి తేటలుబట్టి ఏ క్లాసు నందయినను చేరవచ్చును.

IV) సాంప్రదాయేతర పద్ధతిలో పిల్లలకు నిర్ణీతము అయిన పాఠములేకాక ముఖ్యమైన ఇతర విషయముల గురించి, వారి పనులకు అవసరమగు విషయముల గురించి కూడ బోధింపవచ్చును. వారిలో సామాజిక వైజ్ఞానిక దృక్పథములు కలిగించుటకు సాంప్రదాయ పద్ధతిలో కంటె సాంప్రదాయేతర పద్ధతిలో ఎంతయినా వీలుకలదని పలువురు భావించుచున్నారు.[8]

ఈ విధముగా ప్రాథమిక విద్యా వ్యాప్తికి జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో ప్రాధాన్యత ఈయబడెను.

2. వయోజన విద్య: మనదేశములో 15–34 సం. ల వయసుగల యువకులలో నిరక్షరాస్యు లధికముగా ఉన్నారు. 15–19 సం. ల వయసుగల వారిలో 51 శాతము, 20–24 సం. ల వయసుగల వారిలో 44 శాతము, 25–34 సం. ల వయసుగల వారిలో 34 శాతము 1971నాటికి నిరక్షరాస్యులు.[9] ఈ వయసులో నుండు యువకులు దేశమునకు వెన్నెముక వంటి వారు. వారి ఉత్పాదక శక్తి (ప్రొడక్టివిటీ) తక్కిన వయసులో కంటె అధికముగా నుండును. కావున వారిలో నిరక్షరాస్యతను రూపుమాపుట ఎంతయినా ఆవశ్యకము. అపుడు వారి ఉత్పాదకత ఇంకను పెరగవచ్చును. ఈ జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో ఆరవ ప్రణాళికలో తొలిసారిగా వయోజన విద్యకు స్థానము కల్పించుటయే కాక మిక్కిలి ప్రాధాన్యత కూడా ఈయబడినది వయోజనులలో అక్షరాస్యత వ్యాప్తికై చాలా రకముల పద్ధతులు అవలంబించుటకు నిర్ణయించడమైనది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజనులు, పదవీ విరమణ చేసిన వారు, ప్రభుత్వ సంస్థలు, సమాజ సేవకులు మొదలగు సమాజములోని అందరి కృషిపై ఈ కార్యక్రమము విజయవంతమగుట ఆధారపడి యున్నది. ఈ సంవత్సరము అక్టోబరు 2 నుండి ఈ కార్యక్రమము పెద్ద ఎత్తున ఆరంభము కానున్నదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రకటించినారు.[10]

3. గ్రామీణ ఆరోగ్య కార్యక్రమములు: సమీపములో వైద్య సౌకర్యములు లేక మనదేశములో అసంఖ్యాక ప్రజలు అవస్థలు పడుచున్నారన్న విషయము, ఎందరో మృత్యు దేవతకు లోబడిపోవుచున్నారన్న విషయము సర్వవిదితములు. కావున జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో వైద్య సదుపాయములు కూడ ఒక ముఖ్య భాగమైనది. అయిదవ ప్రణాళికలో భావించినట్లు లక్ష మంది ప్రజలకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రము చొప్పున కాక 50 వేల మందికి ఒక కేంద్రము, 5 వేల మందికి ఉపకేంద్రము నెలకొల్పవలెనని ఆరవ ప్రణాళిక ప్రకారము మన ప్రభుత్వము వారు కాంక్షించుచున్నారు. ఈ కార్యక్రమములో వ్యక్తుల కులమత సామాజిక స్థితిగతులతో సంబంధము లేకుండా అందరకు ఆరోగ్య వసతులు కల్పించబడును. ముఖ్యముగా నిమ్న వర్గముల వారికి ఈ కార్యక్రమము వలన లాభము అధికముగా చేరవలెనని ప్రధాన ఆశయము.

4. నీటి సరఫరా: 1972–73 లో చేసిన సర్వే ప్రకారము మనదేశములో దాదాపు 1.6 కి. మీ. లోపు దూరములో మంచినీటి సౌకర్యము లేని గ్రామములు 9,07656 కలవనియు, 37,041 గ్రామములలో ఆరోగ్యకరమగు నీటి వసతులు లేవనియు (అనగా ఆ గ్రామములలో దొరకు నీటి వలన కలరా వంటి అంటు రోగములు వ్యాపించుననియు), 27,778 గ్రామములకు అనారోగ్యకరమగు లవణములతో కూడిన నీరు లభించుచున్నదనియు, మొత్తము 1, 52,475 గ్రామములలో ప్రజలు మంచి నీటి సరఫరా లేక బాధపడుచున్నారనియు తెలియుచున్నది. దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించిన 30 సం. ల పిదప కూడా కనీసము త్రాగుటకు మంచి నీరు లేక ప్రజలు అవస్థలు పడుట చాలా శోచనీయమయిన విషయము. ప్రస్తుతము ఆచరణలో నున్న నీటి సరఫరా పథకముల వలన 95,653 గ్రామములకు ఆరవ ప్రణాళిక ప్రారంభము కానున్న నాటికి మంచినీటి వసతులు కల్పింపబడి యుండవలయును. మరికొన్ని గ్రామములలో మంచినీటి వసతులు సరిగా లేవని ఇటీవల వెల్లడయ్యెను. ఇక మొత్తము 1.03 లక్షల గ్రామములకు మంచినీటి సౌకర్యములు కలిగించవలసియున్నది. ఈ కార్యక్రమము ఆరవ ప్రణాళికలో పూర్తి గావింపవలెనని ఆశయము.

5. గ్రామ ప్రాంతములకు రోడ్లు: సరియగు రోడ్లు లేక మన దేశములో గ్రామ ప్రజలు ఎన్నో అవస్థలు పడుచున్నారు. వ్యవసాయమునకు కావలసిన ఎరువులు, పనిముట్లు వగైరాలు సరియగు సమయములో తీసికొని వచ్చుటకు, వ్యావసాయిక ఉత్పత్తి విక్రయ స్థలమునకు చేరవేయుటకు రోడ్లు చాల ఆవశ్యకము. గ్రామముల సర్వతోముఖాభివృద్ధికి రోడ్లు అత్యంతావశ్యకము. అయిదవ ప్రణాళికలో 1500 జనాభా కలిగిన ప్రతి గ్రామమునకు రోడ్లు నిర్మించవలెనని తలపెట్టగా ఆరవ ప్రణాళికలో కనీసము 1000 జనాభా కలిగిన ప్రతి గ్రామమునకు 3 కి. మీ. పొడవు చొప్పున (అనగా 25,690 గ్రామములకు మొత్తము 77,094 కి. మీ. పొడవు) రోడ్లు నిర్మించవలెనని తలపెట్టిరి.

6. గ్రామముల విద్యుదీకరణ : ప్రస్తుతము మైజోరమ్ వంటి రాష్ట్రములలో 3.9 శాతము గ్రామములు, పంజాబు, హర్యానా మున్నగు రాష్ట్రములలో నూరు శాతము గ్రామములు దేశము మొత్తముమీద 36 శాతము గ్రామములకు మాత్రము నేడు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడుచున్నది. మరో 10 సం.లలో (అనగా 1988 నాటికి) ప్రతి రాష్ట్రములోను కనీసము 50 శాతము (1.03 లక్షల) గ్రామములను విద్యుదీకరణ చేయవలెనని ఆరవ ప్రణాళిక ధ్యేయము ఇందువలన విద్యుదీకరణములో అసమానతలు కూడ తగ్గింపవచ్చును.

7. గృహ నిర్మాణము : ఆరవ ప్రణాళికలో గృహములు లేని పేదవారికి ముఖ్యముగా బడుగు వర్గముల వారికి గృహసౌకర్యము కల్పించుట ఈ కార్యక్రమములో ఒక ప్రధాన అంశము. దాదాపు 1.7 కోట్ల గృహములు నిర్మించి గృహములులేని గ్రామీణ కార్మికులందరకు గృహ సౌకర్యము కల్పించవలెనని అందుకుగాను ఈ ప్రణాళికా కాలములో రు. 500 కోట్లు వెచ్చించవలెనని నిర్ణయించటమైనది.

8. పారిశుధ్య కార్యక్రమము : మురికివాడల పారిశుధ్య కార్యక్రమములో మంచినీటి సరఫరా, మురికినీటి పారుదల, వీధుల శుభ్రత, మల విసర్జన దొడ్లు — ఈ నాల్గింటికి ప్రాధాన్యత ఈయబడెను. మురికివాడలలో నివసించు దాదాపు 1.3 కోట్ల మందికి ముఖ్యముగా షెడ్యూల్డు కులముల వారికి ఈ వసతులు కల్పించవలెనని ఆరవ ప్రణాళిక ఆశించుచున్నది. తదనుగుణముగా రు. 190 కోట్లు ఈ కార్యక్రమమునకై కేటాయింపబడినవి.

9. పౌష్టికాహార సరఫరా: ఎదుగుతున్న వయసులోనున్న పిల్లలకు పుష్టికరమైన ఆహారము లభించక పోవుటవలన వారు భావి జీవితములో తీవ్ర అనారోగ్యమునకు గురియగుచున్నారు. కావున వారికి మంచి ఆహారము సరఫరాచేయవలెనని ప్రభుత్వము సంకల్పించినది. నిమ్న వర్గములకు చెందిన 6 సం.ల వయసులోపు కలిగిన పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతరాళ్ళకు మంచి పుష్టికరమైన ఆహారము సరఫరాచేయుట ఈ కార్యక్రమములోని మొదటి అంశము. రెండవ అంశము ప్రకారము 6–11 సం.ల వయసు కలిగి ప్రాథమిక పాఠశాలలకు పోవుచున్న విద్యార్థులకు మధ్యాహ్నకాలమందు 15 గ్రాముల మాంసకృత్తులు, 300 కాలరీలు కలిగిన ఆహారము సంవత్సరములో దాదాపు 200 రోజులు సరఫరా చేయబడును. 6 సం.ల లోపు వయసు కలిగిన పిల్లలకు 8–12 గ్రాముల మాంసకృత్తులు, 200–300 కాలరీలు కలిగిన ఆహారము సంవత్సరములో దాదాపు 300 రోజులు సరఫరా చేయబడును.

జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో వెనుకబడిన జాతులకు, షెడ్యూల్డు కులములవారికి, సమాజములో అట్టడుగున త్రొక్కివేయబడిన బలహీన వర్గముల వారికి అధిక ప్రాధాన్యత ఈయబడెను. వారెల్లరకు కనీస సౌకర్యములు చేకూర్చి, వారి స్థితిగతులను కొంచెము మెరుగుపరచి దారిద్ర్య పరిధినుండి వారిని రక్షింపవలెనని ప్రభుత్వము దీక్షబూని యున్నట్లు తెలియుచున్నది.

ఈ కార్యక్రమమువలన నిరుద్యోగ సమస్య చాలా వరకు తీరునని భావించుచున్నారు. గృహనిర్మాణము, రోడ్ల నిర్మాణము, విద్యుదీకరణ, మురికివాడల పారిశుధ్యము మొదలగు కార్యక్రమముల వలన నైపుణ్యములేని కార్మికుల (అన్ స్కిల్‌డ్ లేబరర్స్) లో ఉద్యోగావకాశములు బాగుగా మెరుగుపడవచ్చును. విద్య, ఆరోగ్య కార్యక్రమముల వలన నైపుణ్యము కలిగిన కార్మికుల (స్కిల్‌డ్ లేబరర్స్) లో కూడా నిరుద్యోగ సమస్య చాలా వరకు తీరును. ఈ జాతీయ కార్యక్రమములో ప్రాథమిక విద్య, వయోజన విద్య, పౌష్టికాహార సరఫరా — ఈ మూడు కార్యక్రమముల వలన గ్రామ, పట్టణ ప్రజల స్థితిగతులు మెరుగుపడును. తక్కిన కార్యక్రమములు కేవలము గ్రామ ప్రజల అభివృద్ధికై ఉద్దేశింపబడినవి. ఈ జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము పేరిట మాత్రమే కాక ప్రత్యేక రంగమునకు సంబంధించిన వేరు వేరు ప్రణాళికలలో ఈ జాతీయ కార్యక్రమములోని అంశములన్నిటికి పెద్ద మొత్తముల నిధులు కేటాయింపబడినవి.

అనంత ప్రణాళికా విధానములో ప్రథమ భాగమయిన ఈ పంచవర్ష ప్రణాళిక ఏప్రిల్ 1, 1978 నుండి ఆరంభమైనది. ప్రణాళికా ధ్యేయములు ఎంతవరకు విజయవంతమగునో వేచి చూడవలసియున్నది. ఈ పంచవర్ష ప్రణాళికలో కనీసము కనీస సదుపాయ కార్యక్రమము విజయవంతమగు గాక!

అధోజ్ఞాపికలు

1 అనంత ప్రణాళికా విధానం గురించిన సమగ్ర వివరాలకు

i) D. T. Lakdawala : "Rolling Plan", Yojana (16 July 1978) PP. 5–7.

ii) V. Shanmuga sundaram: "Rollingplan: Chance for Basic changes in Attitudes", Yojana (1 Nov. 1977) PP. 18–20.

iii) "Rolling Plan : New Responsibilities and challenges", Yojana (1 Oct., 1977).

iv) Ghanashyam Purbey : "Blind Spots in Rolling Plan", Mainstream (13 May 1978) PP. 5–6, 33, చూడుడు.

మన ప్రణాళికా విధానం గురించిన ముఖ్య విషయాలకు

i) Ashok Rudra : Indian Plan Models (Allied. Bombay, 1975).

ii) C. T. Kurein : Poverty, Planning and Social Transformation: Alternatives in Development Planning (Allied, Bombay, 1978).

iii) C. N. Vakil : Poverty, Planning and Inflation (Allied, Bombay, 1978)

iv) S. D. Tendulkar : Planning Process, Planning Commission, and Rolling Plan : Some Basic Issues", Economic and Political Weekly (15 Oct 1977) PP. 1777-82.
చూడుడు.

2 దుర్భర నిరుద్యోగులు (Chronically unemployed) అనగా సంవత్సరములో ఏ దినము కూడా ఉద్యోగము లేని వారు; తీవ్ర నిరుద్యోగులు (Severely unemployed) అనగా జాతీయ నమూనా సర్వే సంస్థవారు సర్వే చేయు వారములో ఏ ఒక్క గంట కూడ ఉద్యోగము లేక 'పని' లేని వారని అర్థము. దీనినే 'Weekly unemployment' లేక unemployment estimated on the basic of weekly status criterion' అని అందురు; నిరుద్యోగులు (unemployed) అనగా సర్వేచేయు వారములో ఏ ఒక్క రోజు కూడా ఉద్యోగము లేనివారని నిర్వచనము. ఇట్టి నిరుద్యోగుల సంఖ్యను నిరుద్యోగ శ్రామిక దినములు (unemployed mandays) అనియు లేక unemployment estimated on the basic of daily status criterion అనియు అందురు.

3 నిరుద్యోగ సమస్య : ప్రణాళికా పథకముల గురించిన వివరములకు—

i) M. L. Dantwala : Some Neglected Aspects in Employment Planning", Economic and Political Weekly (Feb. 1978), Annual Number PP. 291-4.

ii) K. Putta Swamaiah : Unemployment in India: Policy for Manpower (Delhi, Oxford & IBH., 1977).
చూడుడు.

4 దారిద్ర్య సమస్య తీవ్రత, విభిన్న అంచనాలు, కారణాలు, నిర్మూలనోపయాలు గురించిన వివరాలకు—

i) జంధ్యాల బాలగంగాధర తిలక్: "భారతదేశములో దారిద్ర్య సమస్య" 'భారతి' [జులై 1978] పు. 32-38.

ii) V. M. Dandekar & N. Rath : "Poverty in India", Economic Political Weekly (Jan.1971) PP. 25-48; 100-46.

iii) P. Choudhry : The Indian Economy : Poverty and Development (Vikas, Delhi, 1978).
చూడుడు.

5 ఆరవ ప్రణాళిక గురించిన యితర వివరములకు

i) Draft Five Year Plan : 1978 - 1983, (Planning Commission, Govt. of India, New Delhi, 1978).

ii) "Sixth Plan : 1978-1983" Seminar (Aug.1978).

iii) C. N. Vakil : Draft Sixth Plan (Forum of free Enterprise, Bombay, 1978).

iv) "Planning Priorities for Next Five Years". Yojana (26 Jan 1978).
చూడుడు.

6 ఈ జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములోని ముఖ్యాంశము లయిన విద్య, ఆరోగ్యము, గృహ నిర్మాణము మున్నగు రంగములలో స్వతంత్ర భారతదేశము సాధించిన ప్రగతి, వాటి ప్రణాళికా రచనలో ఉత్పన్నమగు సమస్యలకు

D. T. Lakdawala: "Planning of Social Services in India - Some Aspects", 10th Lal Bahadur Sastry Memorial Lectures (New Delhi, 1978) Mimeo. చూడుడు.

జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము గురించి సూక్ష్మముగా తెలిసికొనవలెనన్న

"Planning for Minimum Requirements", Commerce (April 1978) PP. 479-80 చూడుడు.

7 స్వతంత్ర భారతదేశములో ప్రాథమిక విద్యావ్యాప్తి తదితర విద్యా సంబంధ విషయములకు

i) Jandhyala B G Tilak : "Education in the Five Year Plans", Eastern Economist (April 15, 1977) PP. 697-703.

ii) జంధ్యాల బాలగంగాధర తిలక్: 'స్వతంత్ర భారతదేశములో విద్యాభివృద్ధి" భారతి [ఫిబ్రవరి, 1978] పు. 49-54
చూడుడు.

8 సాంప్రదాయేతర విద్యా పద్ధతి గురించి క్షుణ్ణముగా తెలిసికొనుటకు J. P. Naik: Some Perspectives on Non - Formal Education, (Allied, Bombay, 1977) చూడుడు.

9 మన దేశములో నిరక్షరాస్యతా సమస్యగురించిన వివరములకు

i) జంధ్యాల బాలగంగాధర తిలక్: "అక్షరాస్యత : అభివృద్ధి", భారతి [జూన్ 1977] పు. 25-28.

ii) Jandhyala B. G. Tilak : "Regional Inequality in Literacy in India", Indian Journal of Adult Education (Jan., 1978) PP. 14-22 చూడుడు.

10 ఆరవ ప్రణాళికలో విద్యా రంగమున కిచ్చిన ప్రాధాన్యత గురించిన ఇతర వివరాలకు

i) "Social Transformation through Education", Yojana (1 July 1978).

ii) Jandhyala B. G. Tilak : "Education in the Sixth Plan" (unpublished manuscript) చూడుడు

డాక్టర్ కాశీభట్ట సేతురామేశ్వర దత్త

అపరమమ్మటు

శ్రీ వట్టిపల్లి నరకంఠీరవశాస్త్రి

అలంకారశాస్త్రములో ఆనందవర్ధన, అభినవగుప్తుల తరువాత మమ్మటాచార్యునికి చాల గొప్ప స్థానము కలదు. మమ్మటుని 'కావ్యప్రకాశము' పరమ ప్రమాణమైన యలంకారశాస్త్ర గ్రంథము. మమ్మటుడు నిర్వచించిన "తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" యను కావ్యలక్షణమును, తరువాత వచ్చిన యాలంకారికులలో కొందరు తప్ప యందరును ఆమోదించిరి. కాని ఈ కావ్య లక్షణమును ఖండించినవారిలో సాహిత్య దర్పణకారుడగు విశ్వనాథుడును, రసగంగాధర కర్తయగు జగన్నాథుడును ముఖ్యులు. వీరిద్దరి వాదములు అసాధువులని సోపపత్తికముగ న్యాయశాస్త్ర శైలిలో నిరూపించుచు మమ్మటుని కావ్యలక్షణమే సాధువు, నిర్దుష్టమని ముక్తకంఠముగ చాటినది నవీన మహాపండితులగు స్వర్గీయ వట్టిపల్లి నరకంఠీరవశాస్త్రిగారు. వీరి యలంకారశాస్త్ర పాండిత్యమును, ఇతర శాస్త్ర వైదుష్యమును, కవిత్వపటిమను చర్చించుటకు మునుపు శ్రీ శాస్త్రిగారి జీవిత విశేషములు తెలుసుకొనుట యసంగతము కాదు.

"సర్వతంత్ర స్వతంత్ర", "తర్కాలంకార వాగీశ", "కవికుల చూడామణి" ఇత్యాది బిరుదాంకితులగు శ్రీ శాస్త్రి న్యాయశాస్త్రమునకు ప్రసిద్ధిచెందిన పండిత వంశములో చిత్తూరు జిల్లా, పుత్తూరు తాలూకాలోని కార్వేటి నగర సమీపమున పావన "కుశస్థల" నదీతీరమునయున్న కత్తెరపల్లె యను గ్రామమున 1869 సంవత్సరము (ప్రమోదూత) లో జన్మించిరి. వీరు కాశ్యప గోత్రమునకు చెందిన ములకనాటి బ్రాహ్మణులు. ఇంటి పేరు వట్టిపల్లివారు. కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలోని "వట్టిపల్లి" యను గ్రామమును శ్రీ నరకంఠీరవశాస్త్రి పూర్వీకులలో నొకరు కర్నూలు నవాబునుండి దానముగ బడసిరట. అప్పటి నుండి ఈ వంశము వారందరికిని "వట్టిపల్లి" వారను పేరు వచ్చెను.[1]

తమ యాభిజాత్యమునుగూర్చి శ్రీ శాస్త్రి తమ కృతులలో నిట్లు చెప్పుకొనిరి:

శ్లో. శ్రీమత్కాశ్యప గోత్ర మండనమణేః శ్రీ వట్టిపల్ల్యన్వయే
జాతః సాంబశివాభిధాద్బుధమణేః సాహిత్య చూడామణేః।
తర్కాలంకృతి కావ్యకేళి రసికశ్చక్రే న్నకంఠీరవో
బాల్యే వీరరసానురూప రచనాం శ్రీ శంకరార్యస్తుతిమ్॥
(యతి సార్వభౌమోపహారః, శ్లో. 77)

శ్లో. సోఽయం వేంకటలక్ష్మ్యాం నరకంఠీరవమజీజనత్తనయమ్।
తనుతే స ఏష సుహృదాం ప్రేరణయా న తు కవిత్వదర్పేణ॥
(అభినవ వాసవదత్తా, పీఠికా శ్లో. 29-30)

శ్రీ శాస్త్రి వంశీయులందరును అహోబిల నృశింహస్వామి భక్తులు. అతి ప్రాచీనులయిన వీరి పూర్వీకులలో సమస్తశాస్త్ర పండితులైన వీరరాఘవభట్టాచార్యులనువారు కాశికి వెళ్ళి, యచ్చట విద్యాభ్యాసము చేసి, తుదకు కాశీరాజు నాస్థానమున బండితులుగా నియమింపబడిరి. వీరి పాండిత్యప్రకర్షకు కాశీరాజు "భట్టాచార్య" యను బిరుదము నొసగెనట. వీరరాఘవ భట్టాచార్యులు శాస్త్రప్రవచనము చేయుచు తమ జీవితకాలమునంతటిని కాశీలోనే గడపిరి.

భట్టాచార్యులకు నల్గురు పుత్రులు. వారిలో ప్రథముడు కాశీనాథశాస్త్రి. తర్కాలంకారవాగీశ బిరుదాంకితుడు, సకల దిగంతములయందు దన పాండిత్యముచే బ్రసిద్ధినొందినవాడు. ఈయన తర్కశాస్త్రములో చాలా గొప్ప పండితుడు, తక్కిన తార్కికుల గర్వము నణచినవాడు. గంగాప్రవాహ సదృశమైన వాక్ధాటి కలవాడు.[2] ఇక ద్వితీయ పుత్రుడు సకలశాస్త్ర పారంగుడగు సాంబశివశాస్త్రి. ఈయన పుత్రుడు సర్వవిద్యా నిష్ణాతుడయిన వీరేశ్వరశాస్త్రి. ఇతని కుమారుడే సాహితీవేత్తయైన సాంబశివ శాస్త్రి. ఈయన భార్య వేంకటలక్ష్మి వీరిద్దరికి జన్మించిన పుత్రుడే శ్రీ నరకంఠీరవశాస్త్రి. ఈ విషయము నంతటిని శ్రీ శాస్త్రి తమ "అభినవ వాసవదత్త" లో నిట్లు చెప్పుకొనిరి :

శ్లో. శ్రీమదహోబల నరహరి కరుణాపాంగైస్తరంగితాభ్యుదయే
శ్రీ వట్టిపల్లి వంశే విఖ్యాతే క్షితితలే మహావిమలే॥
అజనిష్ట వీరరాఘవ భట్టాచార్యస్సమస్త శాస్త్రజ్ఞః।
వారాణస్యాం జీవితమనయచ్ఛాస్త్ర ప్రవచనమాతన్వన్॥

(1) వట్టిపల్లి మల్లినాథశర్మ : శంకర శతకము, జీవిత చరిత్ర సంగ్రహము, పుట 3.

(2) వీరు గొప్ప శ్రీ విద్యోపాసకులు, శ్రీ లలితాంబిక వీరికి పూజాంతమందు నిత్యము ప్రత్యక్షమయ్యెడిదట.

నాగోజీ వితరమహోపాధ్యాయ ప్రాణినాథ ఆచార్యైః।
హనుమత్త్ర్యంబక ముఖ్యా యస్య చ శిష్యప్రశిష్య పదభాజః॥
తత్తనయేషు ప్రథమస్య కలదిగన్త ప్రసిద్ధ పృథుకీర్తిః।
ఆసత్కాశినాథస్తర్కాలంకార వాగీశః॥
దుర్వాదము ఖరతార్కిక గర్వోదయ పర్వతే ఘదంభోళిః।
గీర్వహతి స్మ తదీయా గీర్వాణ తరంగిణీ తరంగతులావ్॥
తస్యాఽభూదనుజన్మా సాంబశ్శివ స్సకలశాస్త్ర నిష్ణాతః।
వీరేశ్వర ఇతి తనయస్తస్యాఽజని తాదృశః కాళానివయే॥
తస్మాజ్జాతోఽస్తి బుధ స్సాంబశివో విదిత సాహితీసారః।
సోఽయం వేంకటలక్ష్మ్యాం నరకంఠీరవమజీజనత్తనయమ్॥
(శ్లో. 23-29)

శ్రీ నరకంఠీరవశాస్త్రి తమ స్వగ్రామములో శ్రీ ఆలూరి శేషశాస్త్రి వద్ద కొంత విద్యనభ్యసించి పిదప తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో చదువుచు తన మేనమామ యగు శ్రీ సాధు వేంకటరామశాస్త్రి గారి పోషణలో నుండిరి. కళాశాలలో సుప్రసిద్ధ తర్కశాస్త్ర పండితులగు మహామహోపాధ్యాయ శ్రీ కపిస్థలం దేశికాచార్యుల వద్ద తర్కశాస్త్రమును క్షుణ్ణముగ చదివిరి. ఆ కాలములో తిరుపతి యందు వ్యాకరణ శాస్త్రములో మహాపండితులని పేరుబడసిన శ్రీముష్ణం సుబ్బరాయాచార్యుల వద్ద వ్యాకరణమును చదివిరి. శ్రీ శాస్త్రి తిరుపతి కళాశాలలో చదువు సమయమున కాశీ నుండి వచ్చిన ఇద్దరు సాధువులు ఆయన కొక మంత్రము నుపదేశించిరట. ఆ మంత్ర జపముచే నాయన కసాధారణమైన ప్రజ్ఞ, మేధస్సు, ధారణాశక్తి, కవిత్వ పటుత్వము లభించెను.[3]

శ్రీ శాస్త్రికి త్రిపురసుందరి యను కన్యతో వివాహము జరిగెను కాని దురదృష్టవశమున మన్మథ సంవత్సరములో (1893-1894) నామె గతింపగా మరుసటి సంవత్సరము (దుర్ముఖిలో) సుబ్బలక్ష్మమ్మ యను నామెను ద్వితీయ వివాహము చేసుకొనెనట ప్రథమ భార్యా వియోగమునకు వారిట్లు వగచిరి:[4]

శ్లో: ఇయం త్రిపురసుందరీ కథయవత్సరే మన్మథే
సమున్మిషతి యౌవనే బత కథం నృకంఠీరవే,
అఘటి విఘటయ్య తామహహ మాధవే దుర్ముఖే
విధిస్స శుచి పక్షతా ఘటయతి స్మ లక్ష్మం మయి॥

శ్రీ శాస్త్రికి మొదటి భార్య యందు సుందర నరహరియను కుమారుడును, రెండవ భార్య యందు కాశీనాథశాస్త్రియను కుమారుడును జన్మించిరి తమ పూర్వులలో కాశీనాథశాస్త్రియను మహాపండితుడుండుటచే తమ కుమారునికదే పేరు పెట్టిరి. శ్రీ శాస్త్రి తమ ప్రపితామహులగు కాశీనాథశాస్త్రి వైదుష్యమును స్తుతించుచు నిట్లు సగర్వముగా తమ "కావ్యలక్షణ వాదము"లో నుడివిరి:

శ్లో: తర్కాలంకార వాగీశ కాశీనాథ విపశ్చితామ్।
అస్మద్వంశావతంసానాం మహిమానం విచింతయే॥
(పదికా శ్లో. 3)

శ్రీ శాస్త్రి గురుభక్తి యనితర సాధారణమైనది. తమ తర్క గురువుల నిట్లు ప్రస్తుతించిరి:

శ్లో: ప్రణమామి దేశికార్యాన్ కౌశికవంశ్యానశేష తంత్రజ్ఞాన్।
యత్కరుణా తదిమేత్య ప్రాయశ్శాస్త్రార్ణవో మయా తీర్ణః॥
(కావ్య లక్షణ వాదము, పీఠికా శ్లో 2)

తిరుచానూరులోని మధ్వ మఠములో తమకును, తమ గురువులగు శ్రీ దేశికాచార్యులకు జరిగిన శాస్త్ర చర్చలో శ్రీ దేశికాచార్యులోడి పోయినను శ్రీ శాస్త్రి తమ గురువులకే సన్మానము జరిపించిరట.[5] ప్రతి వారము తమ పరమ గురువులగు శ్రీపురిశైరంగాచార్యులతో తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి దేవాలయములో పత్రికా వాదము చేసెడివారట. శ్రీ కాళహస్తిలో శ్రీ కురువాడ రాఘవయ్య యాధ్వర్యమున నద్వైత సభలో శాస్త్ర చర్చలలో పాల్గొని సువర్ణ కంకణమును బడసిరి తమ చిన్న తనమున భరతనాట్యము చక్కగా నభ్యసించి శ్రీ కాళహస్తి సంస్థానాధీశ్వరుల వద్ద పారితోషికమును బడసిరి

శ్రీ శాస్త్రికి యలంకార శాస్త్రమనిన మిక్కిలి యభిమానము. కావుననే వారు సుమారు 22 సంవత్సరములు విద్యార్థుల కలంకార శాస్త్రము, న్యాయశాస్త్రము బోధించిరి. మమ్మటుని కావ్యప్రకాశమనిన వీరికి మిక్కిలి యభిమానము. కావుననే దానిని నవవిధ వ్యాఖ్యానములతో విద్యార్థులకు బోధించిరి. ఒక్కొక్క దినమున నొక్కొక్క వృత్తములో పాఠములు చెప్పెడివారు. ఒకప్పుడు శ్రీ శాస్త్రి విద్యానాధకృతమగు ప్రతాపరుద్రీయ మను పాఠము జెప్పచుండ, యందు సౌకుమార్యమునకుదహరింపబడిన—

శ్లో॥ అమందానంద నిష్యంద సుందరీ వదనేందుభిః।
నగరే కాకతీయస్య దివాప్యాభాతి చంద్రికా॥
(గుణప్రకరణం శ్లో. 10)

అనేడి యనుష్టుప్ శ్లోకములో సౌకుమార్యము కొంత కొరవడినదనియు, శార్దూల విక్రీడితములో సౌకుమార్యమున కుదాహరణ శ్లోకము నివ్వమని విద్యార్థులు కోరగా గంగాప్రవాహ సదృశమగు యాశుకవిత్వము చెప్పగల్గిన శ్రీ శాస్త్రి సౌకుమార్యమున కుదాహరణముగా నొకశ్లోకము నిట్లు చెప్పిరి:

---

(3) నాకీ విషయమును శ్రీ నరకంఠీరవశాస్త్రిగారి మేనల్లుడు, సహాసమాన జీవి, గొప్ప చరిత్ర పరిశోధకులగు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపిరి.

(4) ఈ శ్లోకమును శ్రీ శాస్త్రిగారి ప్రశిష్యులును, నా పెద్ద నాయనగారగు బ్రహ్మశ్రీ కాశీభట్ట రామకృష్ణశాస్త్రి నాకు తెలియజేసిరి.

(5) వట్టిపల్లి మల్లినాథశర్మ: శంకరశతకము, జీవిత చరిత్ర సంగ్రహము. పుట 6.

శ్లో॥ మాకంద ప్రసరన్మరందలహరీ సందోహ మాందోలయన్
విందన్మందరకందరోదరన్ముగీ రోమంథ గంధోత్కరాన్।
కుందానస్స్మర మందిమానను బలాబృందస్య కుందావళీః
భిందన్ గంధవహస్తనంధయ ఇతో మందం పరిస్పందతే॥

అపార శాస్త్రవైదుష్యము కల్గిన శ్రీ శాస్త్రి పెక్కు గ్రంథములు రచించిరని తెలియుచున్నది కాని వారి రచనలన్నియు మనకిప్పుడు లభించుటలేదు. వీరి రచనలలో కొన్ని స్వతంత్రములు, మరికొన్ని పరిష్కరణలు, పీఠికా రచనలు. స్వతంత్రకృతులలో కావ్యలక్షణవాదము, రసలక్షణవాదము యను నలంకారశాస్త్ర గ్రంథములు, అద్వైత చంద్రోదయము, నయమంజరీ, అద్వైతమంజరీ, కర్మందీ యను నద్వైత గ్రంథములు, అభినవ వాసవదత్త యను పద్యకావ్యము, శ్రీ జ్ఞానప్రసూనాంబికా నవరత్నమాలికాస్తుతి, యతి సార్వభౌమోపహారము, శ్రీ కృష్ణాష్టోత్తర శతనామస్తోత్రం, శ్రీ వేంకటేశ్వరాష్టకం, శ్రీ వేంకటేశ్వరస్తుతి, శ్రీ కపిలేశ్వర స్తుతి, శ్రీనివాస సభావర్ణన మాలికా (తెలుగు) మొదలగు నుతులు, ధూమశకటం (తెలుగు, సంస్కృతం) మొదలగు ముక్తకముల ముఖ్యములు ఇవికాక రామచంద్రేంద్ర యతిసార్వభౌమ విరచితమగు "మహావాక్య రత్నావళి", గరుడాచల యజ్వకృతమగు "తప్తచక్రాంకన విధ్వంసనం," అయ్యన్న విద్వన్మణి విరచితమగు "శ్రీ వ్యాస తాత్పర్య నిర్ణయః", వెల్లాల ఉమామహేశ్వర శాస్త్రి ప్రణీతమగు "తత్త్వచంద్రిక"కు పీఠికలు వ్రాసి, పరిష్కరించిరి. శ్రీ శాస్త్రి రచనలను కొన్నింటినిచ్చట పరిశీలింతము.

కావ్యలక్షణ వాదము :

ఇది 95 అరపుటలలో వ్రాయబడిన తర్క-కర్కశమగు యలంకారశాస్త్రగ్రంథము. శ్రీశాస్త్రి విద్యార్థులకు పెక్కు సంవత్సరములు "కావ్యప్రకాశము"ను బోధించిరి. అట్లు బోధించునపుడు మమ్మట కావ్యలక్షణము[6] నిర్దుష్టము, సాధువనియు, మమ్మటుని ఖండించిన విశ్వనాథ, జగన్నాథుల వాదములు సారహీనములనియు భావించిరి. కావుననే శ్రీ శాస్త్రి గ్రంథాదియందు తమ ప్రతిజ్ఞనిట్లు తెలియజేసిరి:

శ్లో॥ నవ్యోద్భావితదోషాణాం ప్రత్యాఖ్యాన పురస్సరమ్।
ప్రకాశ లక్షణస్యైవ స్థాపనాయ మమోద్యమః॥

జగన్నాథుని కావ్యలక్షణమును తరువాతి యాలంకారికులు కొందరు ఖండించినను వారి ఖండనముల సంపూర్ణములు, సారహీనములు. ఏలన జగన్నాథుడు నవ్యతార్కిక శైలిలో కావ్యమునకు లక్షణమును నిర్వచించెను. తర్కబలములేని ఖండనములు రాణింపవుగదా! కావుననే న్యాయశాస్త్ర పండిత వంశమున జన్మించి, న్యాయశాస్త్రమున నసాధారణ పండితులైన శ్రీ శాస్త్రి, జగన్నాథుని తర్కశైలిలోనే జగన్నాథుని కావ్యలక్షణమును, మరియు విశ్వనాథుని కావ్యలక్షణమును ఖండించి అవి సాధువులు కావనియు, వారి ఖండనములు శక్తిహీనములనియు, మమ్మటుని కావ్యలక్షణమే నిర్దుష్టమనియు కంఠోక్తిగ చాటిరి. వీరీ పనికి పూనుటకు మును పెన్నియో ప్రాచీన యలంకార శాస్త్ర గ్రంథములు, న్యాయ, వ్యాకరణ గ్రంథములు పరిశీలించిరి. కావుననే—

శ్లో॥ ప్రాచీనార్వాచీన ప్రబంధ నిచయాన్ విచార్య చార్వధియా।
నితనోమి కావ్యలక్షణవాదం సుధియాం మనోవినోదాయ॥
(పీఠికా శ్లో. 4)

అని చెప్పుకొనిరి. అందుకు తగినట్లుగనే తమ గ్రంథమునందు కావ్యానుశాసనం, కావ్యప్రకాశము, కావ్యప్రదీపము, కావ్యప్రదీపప్రభా కావ్యదర్పణము, రసగంగాధరము, మర్మప్రకాశికా, ప్రతాపరుద్రీయము ధ్వన్యాలోకము, లోచనము, అలంకార సర్వస్వము, వామన సూత్రాలంకారవృత్తి, సరస్వతీ కంఠాభరణము, అలంకారశిరోమణి, సాహిత్య కౌముదీ, వ్యక్తివివేకము, సాహిత్య దర్పణము, అలంకార సుధానిధి యను నలంకారశాస్త్ర గ్రంథములనుండి తమ వాదములకు పోద్బలకములగు విషయములెన్నింటినో యుదహరించిరి. వీటిలో కావ్యదర్పణమునుండి మరియు కావ్యప్రకాశ వ్యాఖ్యలగు కావ్యప్రదీప, కావ్యప్రదీప ప్రభల నుండి పెక్కు వాక్యములను యథాతథముగ నుదహరించుచు మమ్మటుని కావ్యలక్షణమే నిర్దుష్టమైనదని యభిప్రాయపడిరి. దీనికన్నను మిక్కిలి యాశ్చర్యకర విషయమేమన తమ వాదనులకు పోద్బలకములుగ శక్తివాదము, వ్యుత్పత్తివాదము, న్యాయతంత్రము, న్యాయభాష్యము, న్యాయసూత్రము, న్యాయసూత్రవృత్తి, చింతామణి, శబ్దశక్తి ప్రకాశికా, కిరణావళీ, మంజూషా యను న్యాయ శాస్త్రగ్రంథములనుండియు, పతంజలి మహాభాష్యము, కైయటవృత్తి, వైయాకరణ సిద్ధాంతమంజూషా యను వ్యాకరణ గ్రంథముల నుండియు, మాధవవేదభాష్యము, ప్రశస్తపాదభాష్యము, పంచపాదిక యను నితర శాస్త్రగ్రంథములనుండియు పెక్కు విషయములను తమ వాదమున కనుకూలముగ శ్రీ శాస్త్రి యుదహరించిరి. తర్క, వ్యాకరణాదిశాస్త్ర పాండిత్యము లేనివారికీ ప్రౌఢగ్రంథము దుర్బోధమనుటకీ క్రింద నుదహరింపబడిన పంక్తులు ప్రబల నిదర్శనములు.

1. ...... "తత్ర తావత్కావ్య పదశక్యతావచ్ఛేదకం విచార్యతే. నను కిం నామ కావ్యపదశక్యతావచ్ఛేదకం ? న తావత్ కావ్యత్వం, తస్య దుర్నిరూప స్వరూపత్వాత్, తద్ధి న జాతిః, తత్రైవ ప్రమాణాభావాత్, నను శక్త్యాది జన్యతావచ్ఛేదకతయా తత్సిద్ధిః, తథాహి కావ్యత్వావచ్ఛిన్నం ప్రతి శక్తినిపుణతాభ్యాసానాం త్రయాణామపి కారణత్వస్యాన్వయవ్యతిరేక సిద్ధత్వాదనుగతా సతి ప్రసక్తకార్యతావచ్ఛేదకం వినా తదనిర్వాహేణ శక్త్యాది జన్యతా పక్షీకృత్య జన్యతాత్వేన హేతునా కించిద్రూపావచ్ఛిన్నత్వ సాధనే సిధ్యతో ధర్మస్య జాతిత్వే లాఘవమితి లాఘవ జ్ఞాన సహకృతేనానుమానేవ జాతిసిద్ధిః, సా చ కావ్యత్వమేవ అన్యస్యాః దుర్వచత్వాత్" (పుటలు 1–2)

2. ......"న చ దోషజ్ఞానస్యైవాన్వయ వ్యతిరేకాభ్యాం ప్రతిబంధకత్వేన దోషాణాం లేన రూపేణానుగమో న సంభవతి.

(6) తద దోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతే పునః క్వాపి (కావ్య ప్రకాశము, I-4)

ప్రతిబంధకజ్ఞాన విషయత్వేనానుగమే చ సమూహాలంబన దోషా జ్ఞానమాదాయోదాసీన పదార్థేష్వతి ప్రసంగః. తాదృశప్రతిబంధక తావచ్ఛేదక రూపవత్వేనానుగమేపి ఘటాద్యుదాసీన పదార్థ విషయక సమూహాలంబనాత్మక రసప్రతీతి శాబ్దబోధాన్యతరమాదాయ...''
(పుటలు 54-55)

ఇట్లు ప్రతి పంక్తియు తర్కజటిలమై శ్రీ శాస్త్రి యొక్క వాద పటిమను చాటుచున్నది. ఈ గ్రంథము అలంకార శాస్త్ర చరిత్ర కారుల దృష్టిపథమునకు రాకుండుట చాల విచారింపదగినది.

2. రసలక్షణ వాదము[7] :

ఇది యసంపూర్ణముగ నిలిచిపోయిన యలంకార శాస్త్ర రచనము. ఇప్పుడిది సుమారు 22 అర్ధరావు పేజీలలో నున్నది. ''కావ్యలక్షణము''ను ముగించిన పిదప శ్రీ శాస్త్రి రసచర్చను ప్రారంభించిరి కాబోలును కాని వారి హఠాన్మరణము వలన నిది యసంపూర్ణముగ నిలిచిపోయినది. ఇప్పుడు మనకు లభించు భాగ మిట్లు ప్రారంభమగును:

''ఇదమత్ర ప్రాసంగికం కించిదభిధీయతే. రసో నామ విభావానుభావ వ్యభిచారి భావ విషయక సమూహాలంబన ప్రతీతిజన్య ప్రతీతి విషయః స్థాయి భావః''.

పై భాగముల పరిశీలింప ''కావ్యలక్షణ వాదము'' వలె నిది గూడ తర్కమయమైన శైలితో నలరారుచున్నది. దీనియందు ''రసార్ణవ సుధాకరము, ప్రతాపరుద్రీయము, కావ్యప్రకాశము, గదాధరీ, అభినవ భారతీ, రత్నాపణము, భావప్రకాశము, కావ్యాను శాసనము, దశరూపకము, అవలోకము, సాహిత్య దర్పణము, కావ్య దర్పణము'' యను గ్రంథముల నుండి బహు విషయములుదహరింప బడినవి.

3. అభినవ వాసవదత్త

సరస్వతీ వరప్రసాదునిగను, మహాకవిగను ప్రసిద్ధి జెందిన ''సుబంధువు వాసవదత్త'' యను గద్య కావ్యమును రచించెను. తన గద్యము శ్లేష భూయిష్ఠమని సగర్వముగ నిట్లు చెప్పుకొనెను:

శ్లో: సరస్వతీదత్త వరప్రసాదశ్చక్రే సుబన్ధుః సుజనైకబంధుః।
ప్రత్యక్షర శ్లేషమయ ప్రబద్ధ విన్యాస వైదగ్ధ్య నిధిర్నిబంధమ్॥ (ప్రారంభ శ్లో. 13)

కావుననే పండితులకు సహితము దుర్బోధమగు గద్యమిది. శ్రీ శాస్త్రి ''వాసవదత్త''లోని కథకు మార్పులు చేర్పులు లేక 296 ఆర్యావృత్తములలో మూలములోని కథ సులభముగా నవగాహన మగునట్లు పద్యకావ్యమును రచించెను. శ్రీ శాస్త్రి పూర్వుల గూర్చిన వివరములు కూడ నిందుండుటచే శ్రీ శాస్త్రి జీవితము వ్రాయుట కిది మిక్కిలి యుపయోగించుచున్నది. దీనిని వారు తమ 16వ సంవత్సరమున రచించిరట.

శ్లో॥ శ్రీ శేషగురోశ్చరణౌ ప్రణిపత్యా లూరువంశరత్నస్య।
కృపయా సాహిత్యనిధేః షోడశవర్షే కరోమి కృతిమేతామ్॥
(పీఠికా శ్లో. 7)

దీనిని రచించుటకు తమ కౌతూహలము, మిత్రప్రేరణము ముఖ్య కారణములనియు, కవిత్వదర్పము గాదనియు వినయముగా నిట్లు చెప్పుకొనిరి:

శ్లో॥ తమతే స ఏష సుహృదాం ప్రేరణయా నతు కవిత్వదర్పేణ।
అభినవ వాసవదత్తాం పద్యమయీం సుభగ సందర్భామ్॥
(పీఠికా శ్లో. 30)

శ్రీకాశ్యప కుల జనుషా విదుషామేషాకృతిర్విధేయేన।
నరకంఠీరవకృతినా బాల్యే కౌతూహలేన సంగ్రథితా॥
(శ్లో. 295)

మూలగ్రంథములోని పదముల కూర్పుచే చక్కని ధారాశుద్ధి కలిగిన నీ కావ్యము ప్రౌఢయై చదువరులకు మూలగ్రంథమునే చదివినట్లు తోపింపచేయును. అందులకే శ్రీ శాస్త్రి—

శ్లో॥ ప్రాయస్సు బంధువచనా న్యాదాయ మయాముదే రసజ్ఞానామ్।
ఆర్యాభిర్గ్రథితోయం వాసవదత్తా కథాసారః॥ (శ్లో. 296)

అని తమ రచనా విధానమును దెల్పిరి. తామీ కష్టమయిన పనికి పూనుటకు తగినవారమా యను సందేహము నుగ్గడించుచు సరస్వతీ దేవి కటాక్షమువలన తమ కిది యసాధ్యము కాదని తమ వినయము నిట్లు ప్రకటించుకొనిరి:

శ్లో॥ క్వను వచసాముల్లాసః కవికుల చూడామణే స్సుబన్ధుకవేః।
క్వాऽహం జనోऽనభిజ్ఞః క్వనుమతిరల్పీయసీ చ మమ॥

శ్లో॥ యద్వా దయారసార్ద్రైః కటాక్షవీక్ష భరైర్గిరాం దేవ్యాః।
సముపేయుషః ప్రసాదం జగతాం త్రితయేऽపి కిన్వసాధ్యమే॥
(పీఠికా శ్లో—31-32)

సుబంధుని ''వాసవదత్త'' కథను సంగ్రహముగ తెలుసుకొనదలచిన వారికిది మిక్కిలి యుపయోగించును.

4. యతి సార్వభౌమోపహారః

అద్వైతాచార్యులగు ఆదిశంకరులను స్తుతించుచు విభిన్న వృత్తములతో 82 శ్లోకములలో వ్రాయబడిన స్తోత్రమిది[8]. మొదటి 10 శ్లోకములలో సదాశివ — విష్ణు—బ్రహ్మ — వశిష్ఠ శక్తి—పరాశర - వ్యాస—శుక—గౌడపాద—గోవింద భగవత్పాదుల స్తుతి జేసి 11 నుండి 96 శ్లోకములవరకు ఆదిశంకరస్తుతి గావించిరి శ్రీ శంకరుల ప్రతిపక్ష పరాజయము, యవైదికమత ఖండనము ఇందు విస్తరముగ ప్రతిపాదింపబడుటచే కాబోలు ఇది వీరి తొలి రూప రచనయని శ్రీ శాస్త్రి నుడివిరి.

---

(7) ఈ గ్రంథమునకు శ్రీ శాస్త్రిగారు ''రసలక్షణ వాదము'' అని పేరుపెట్టక పోయినను ''కావ్యలక్షణ వాదము'' తరువాత వ్రాయబడినదగుటచే నిదియే 'రసలక్షణవాదము'' అని నేను భావించుచున్నాను.

8 దీనిని మొదట మదరాసులోని The Madras Law Journal Press వారు దేవనాగరిలో ప్రకటించిరి. 1974లో శ్రీ వట్టిపల్లి మల్లినాథశర్మ తమ ''శంకర శతకము''తో కలిపి ఆంధ్ర లిపిలో ముద్రింపించిరి.

శ్లో॥ శ్రీ మత్కాశ్యపగోత్ర మండనమణేః శ్రీ వట్టి పల్లన్వయే
జాతః సాంబశివాభిధాద్బుధమణేః సాహిత్య చూడామణేః।
తర్కాలంకృతికావ్య కేళిరసికశ్చక్రే నృకంఠీరవో
బాల్యే వీరరసానురూప రచనాం శ్రీ శంకరార్య స్తుతిమ్॥
(శ్లో. 77)

అద్వైతతత్త్వమే సకల శ్రుతిసమ్మతము, సర్వజనహితమని ఇట్లు ద్ఘోషించిరి :

శ్లో॥ తథ్యం తథ్యం పునరపి తథ్యం
శ్రుతిగదితం యత్తత్కిల పథ్యమ్।
కథయతి సత్యం శ్రుతిరద్వైతం
గురువర్యైరపి తద్వ్యాఖ్యాతుమ్॥ (శ్లో 18)

శ్రీ ఆదిశంకరులు సర్వసుగుణరాశి యని నిట్లు స్తుతించిరి:

శ్లో॥ వైరాగ్యస్యనిధిః శ్రుతస్యవసతి ర్వాత్సల్య వారాం నిధిః
దాక్షిణ్యస్య విహారభూర్ఘనతపస్సర్వస్వ మంజూషికా।
శాంతేః కేళిగృహం ప్రసూతి భవనం దాంతేః కృపాయాః ఖనిః
భూయాచ్ఛంకరదేశికోఽ ఖలగుణ గ్రామోభిరామో ముదే॥
(శ్లో 45)

ఈ రచనమంతయు శబ్దాలంకార భూయిష్ఠమై శ్లేషమయ మగుటచే సామాన్య పాఠకులకు దుర్బోధమగునని తలంచి శ్రీ శాస్త్రియే అక్కడక్కడ కొన్ని పదములకు లఘువివరణము, యన్వయము వ్రాసిరి. ఈ స్తుతిని కార్వేటి నగర రాజైన శ్రీ బొమ్మ భూపాలుని మంత్రి వర్యుడైన గుండు గురుస్వామిని సంతోషింపజేయుటకు రచించిరట.

శ్లో॥ కార్వేటీ నగరీ పురందరవర శ్రీ బ్రహ్మభూమీభుజః
రాజ్యశ్రీలతికాముపఘ్నఇవ యః పుష్యత్యమాత్యాగ్రణీః।
తస్య శ్రీయుత గుండువంశ శశినః శ్రీమద్గురుస్వామినః
చేతస్తోషకృతే కృతా కృతిరియం శ్రీ శంకరార్యస్తుతిః॥
(శ్లో 78)

ఏ కవి రచన సత్పాఠకుల మనస్సును రంజింపజేసి కదలించివేయునో యదియే రచన యనియు యట్లు రంజింపని, కదలింపని రచన చేసిన కవియొక్క రచన నిష్ఫలమనియు చెప్పుచు తమ కృతి కటువంటి సామర్థ్యము కలదని సగర్వముగా నుడివిరి.

శ్లో. సకల సచేతశ్చేత
శ్చమత్కృతిం యా చరీకరోతి గిరా।
రచనా సైవ చ రచనా
భవతి తదన్యా కవేః శ్రమైకఫలా॥ (శ్లో 80)

ఈ స్తోత్రమునందలి విషయ ప్రాధాన్యమును బట్టి దీనిని మరొక "శంకర విజయ"ముగా వర్ణింపవచ్చును.

5. శ్రీ జ్ఞానప్రసూనాంబికా నవరత్నమాలికా స్తుతి :

దీనిలో అశ్వధాటీ వృత్తములో రచింపబడిన 9 శ్లోకములు గలవు. శ్రీ శాస్త్రి గొప్ప శ్రీవిద్యోపాసకులు. శ్రీ కాళహస్తిలో నొకప్పుడు శ్రీ జ్ఞానప్రసూనాంబికను దర్శించుచుండగా వారికొక భక్త్యావేశము కలిగెనట తత్ఫలితముగా నీ శ్లోకములను యాశువుగ దైవసన్నిధిలో జెప్పిరట. ఇవి యతిప్రౌఢములై శబ్దాలంకారముల నలరారుచు లయబద్ధముగ పాడువారికి భక్తిభావమును ప్రేరేపించి భక్తులకీప్సితార్థము లొసగుచున్నవి. ఇందు ప్రథమ శ్లోకమును బరిశీలింతము.

శ్లో. శ్రీ నాకనాథముఖనానా సహస్రసుర సేనాగ్రమౌళివలభీ
సూనావళీ బహుళలీనాళిని మధురగానాంచితాంఘ్రినళినా
మానాతిలంఘి మహిమాఽనాదిరానత జనానామనేక ఫలదా
జ్ఞానాంబికా భవతు దీనావనీ కుశలదానాయ మే భగవతీ॥

ఇట్లు ప్రతి శ్లోకము శబ్దాడంబరముతోను, క్రమబద్ధమగు లయతోడను నొప్పుచున్నది.

6. శ్రీ వేంకటేశ్వర స్తుతులు, ఇతర రచనలు :

శ్రీ శాస్త్రి పూర్వజులందరును అహోబల నృశింహస్వామి భక్తులయినను శ్రీ శాస్త్రి యేలనో నృశింహ స్తుతులు రచించినట్లు తోపదు. శ్రీ శాస్త్రి బాల్యమునుండి తిరుపతి పట్టణములో తమ జీవితమునంతటిని శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలోనే గడుపుటచే వారికి శ్రీ వేంకటేశ్వరు డిష్టదైవమాయెను. కావుననే వారు శ్రీ వేంకటేశ్వరుని స్తుతించుచు శ్రీ వేంకటేశ్వరాష్టకము,[9] శ్రీ వేంకటేశ్వర స్తుతి[10] రచించిరి ఇంతేకాక కొన్ని స్తుతిరత్నములను[11] రచించిరి. తెలుగున "ధూమశకట"[12] మను ముక్తకమును, "శ్రీనివాస సభావర్ణనమాలికా"[13] యను 45 పాదములు కల యుత్పలమాలా పద్యమును రచించిరి. శ్రీ కాళహస్తి సంస్థాన సామ్రాజ్యధురంధురుడైన శ్రీ తిమ్మభూపాలతిలకుని నిదేశముచే శ్రీ కాళహస్తీశ్వర భక్తుడైన కణ్ణప్పను స్తుతించుచు అష్టోత్తర శతనామావళిని రచించిరి.

ఇతర విశేషములు :

అప్పటి తిరుమల — తిరుపతి దేవస్థాన ధర్మకర్తయగు మహంత్ ప్రయాగ్ దాస్‌జీగారికి శ్రీ శాస్త్రి యనిన మిక్కిలి గౌరవాభిమానములు. కావుననే శ్రీ శాస్త్రి యాధ్వర్యమున శ్రీ శ్రీనివాసోత్సవబలిమూర్తి పీఠబంధన ప్రతిష్ఠా మహోత్సవము 22-1-1909 నుండి 31-1-1909 వరకు జరిగెను. అంతకు మునుపు హాథరాంజీ మఠాధీశుడు శ్రీరామ లక్ష్మణదాసు జరిపించిన శ్రీ శ్రీనివాసానందనిలయ విమాన శిఖర నూతన సువర్ణ కలశప్రతిష్ఠా మహోత్సవమునకు గూడ వీరే మార్గదర్శకులు.

---

9 ఇది **T T D Bulleitin, Vol I, No 4, 1932** నవంబర్ సంచికలో ప్రకటింపబడినది.

10 - do -

(11) ఇవి ఆంధ్రపత్రిక ప్రజోత్పత్తి (1931-1932) సంవత్సరాది సంచికలో ప్రకటింపబడినవి.

(12) - do. -

(13) ఇది భారతి 1963 సెప్టెంబర్‌లో ప్రకటితము.

వీరు జీవితకాలమంతయు యనారోగ్యముతో బాధపడు చుండెడివారట. శ్రీ శాస్త్రి యజీర్ణవ్యాధిచే బీడింపబడుచు తమ 41 ఏట 191) సంవత్సరములో తిరుపతిలో దనువు చాలించిరట. వీరి రచనలన్నియు లభ్యమయ్యెనేని వారి సంస్కృత భాషా సేవ సంపూర్ణముగా నవగతమగును

[ఈ వ్యాస రచన కుపయుక్తమయిన విషయము లెన్నింటినో చెప్పిన శ్రీ శాస్త్రి మేనల్లుడును, సహస్రమాస జీవియు, నిరంతర పరిశోధకులు, బండితులునగు బ్రహ్మశ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారికిని, శ్రీ శాస్త్రిగారి ప్రశిష్యులను, నా పెద్దనాయనగారగు బ్రహ్మశ్రీ కాశీభట్ట రామకృష్ణశాస్త్రిగారికిని ననమస్యులు శ్రీ నరకంఠీరవశాస్త్రి రచనలు గొన్నింటిని నా కందజేసిన శ్రీ శాస్త్రి పౌత్రులు బ్రహ్మశ్రీ బాలకృష్ణశాస్త్రిగారికిని, తద్వంశీయులగు బ్రహ్మశ్రీ వట్టిపల్లి మల్లినాథశర్మగారికిని నా కృతజ్ఞతాంజలులు.]

ప్రకృతి ఒడిలో

శ్రీ ఎల్లూరి శివారెడ్డి

తల్లి ఒడిలోన గుడిలోన తలపురాక
వెదుకబోయిన చిక్కని వెలుగులేవొ
మేలుగ తరతరాలు వరాలు కాగ
ప్రకృతి కౌగిట దాగుట పచ్చినిజము.

విలయగీతిక మొన్నటి పెను తుఫాను
ప్రకృతి చేసిన ప్రళయ గర్జనముకాదు
విశ్వమండలి సమతలో వికృతి సల్పి
మానవుడు సృజించినది దుర్మార్గ మృత్యు.

సృష్టి పరమేష్ఠి కల్పనా దృష్టికాదు
నరులు కోరి నటించెడి నవ్వులాట
మనసు మూలల దాగిన మధురసుఖద.
రమ్య పథముల కేళికి రాచబాట

నరుల కమ్మని కలల బంగారుటలల
ప్రేమ భావాల ఝురులు పర్వెత్తువేళ
నాడు నాడున చైతన్య నదులు పొంగి.
మ్రోడు మ్రోడున చివురులు మొలవగలవు.

నీలిమేఘాలు సరసులు నీలమణులు
అవని పరచిన శాద్వల హరితమణులు
ఎడద గలవాని సొత్తు కవీంద్రుసొత్తు
కనులు వీనులు కరిగిన మనిషిసొత్తు.

పూల నడిగితి మీరేల పుట్టినారు
చెప్ప మంచును మనసుల విప్పమంచు
పలికె పలుకులో తీయని వలపునింపి
కమ్మ కమ్మని తావులు ఘుమ్మనంగ

"పరమముని బుద్ధదేవుని భావములము
ధర్మఖని గాంధి మదిలోని మర్మములము
నంద నందను వేణుగానమ్ములోని
విశ్వమానవ సందేశ బిందువులము.

మేము పుట్టిన నేలకు మేలుకొరకు
నమ్మి అదర్శముల రక్షణమ్ము కొరకు
ప్రాణ ధనముల మనముల పణములొడ్డు
గుణమతుల సమాధుల తీపి గుర్తుమేము"

ఏటి నడుగుము రసపాయి తేటి నడుగు
గాలి నడుగుము మీది ఆకసము నడుగు
తేట వెన్నెల నడుగు పన్నీటి నడుగు
చెప్పగలవు మనోజ్ఞ విచిత్ర కవిత.

ఎన్ని తీయందనాలు ఎన్నెన్ని రుచులు
ఎన్ని ఆనందభావన లెన్నిసిరులు
నేను నేనని మరచి యీ మేను మరచి
తలచి చూచిన ప్రతియొక తరువు గురువు

జన ఘోష

ఖబడ్దార్ ఖబడ్దార్
కాదంకో చూసుకో
కదలబోకు మెదలబోకు
వీలవేస్తాం శిలవేస్తాం

హరించింది మా సహనం
నమ్మము నీను మునుమ్మాటికి.

'గరీబీ హటావో' అంటూ
బీదోళ్ల నోళ్లు కొట్టావు.

చాలీ చాలని జీతాలతో
ఒళ్లు అలసి పోతోంది.
పెచ్చు పెరిగే ధరలతో
ప్రాణాలు కడ గడుతున్నాయి.

రాజ్యాంగం గోరీపై
నియంతృత్వం నిర్మించావు
పౌర హక్కులు మంటగలిపి వు
ప్రాణాలకే చేటు తెచ్చావు.

ప్రజా నాయకులను బంధించావు
విప్లవ కారుల నుగి తీశావు
విప్లవ వీరుల బలిగొన్నావు
పిట్టల్లాగా కాల్చేశావు.

కత్తివల్ల, ఖైదు వల్ల
హత్యా సత్యాల వల్ల
ప్రజాశక్తి నణచ లేవు
పాలన సాగించలేవు.

రట్టు రవ్వ లేకుండా
రాజీనామా ఇవ్వు.
నీ రాజ్యానికి రోజులు
దాపురించాయి.

డాలరు రణ దాహానికి
రూబులు ఋణ దాహానికి
వంగి వంగి సలాం చేసి
చివరకు గులామయ్యావు.

వికసించే విప్లవ కుసుమాన్ని
కుట్ర చేసి పెకలించావు
దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా
వీనులవిందుగా పాలి కేకలు పెడుతున్నావు.

బ్రతుకు తెరువు చూపించటం చేతగాక
వాగ్దానాల తప్పెట్లు వాయిస్తున్నావు.
ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ
పాతసాగా కొత్త సీసా తతంగమే.

'పురోగతి' 'దేశభద్రత'
మన లొంగుబాటుకు మారు పేర్లు

విదేశీ పెట్టుబడి వలలో చిక్కి
మన ఆర్థిక వ్యవస్థ గిలగిలలాడుతోంది.

కుట్రలతో కుహకాలతో
కొద్ది మంది కోటికి పడగెత్తారు.

అంతం లేని అభివృద్ధిని
గాలికి వదిలేశావు
వంశ పారంపర్య
పాలన సాగిస్తున్నావు.

నియంతృత్వాన్ని పదిలపరచటమే
ప్రగతి నినాదాల అంతర్యం
ఊకదంపుడు ఉపన్యాసాల్లో తప్ప
20 సూత్రాలు మరెక్కడా కనిపించవు.

పెచ్చు పెరుగుతోంది అసంతృప్తి
బ్రద్దలవుతోంది జన కోపం
'జాతి సామరస్యం' 'దేశ భద్రత'
నినాదాలు పరిపాటయిపోయాయి.

ఫాసిస్టు పాలన వికృత రూపం
ప్రజాస్వామ్యానికి తిరోదకాలు
ప్రజలంతా తిరగ బడ్డారు.
పాలకుల కాలికి బుద్ధి చెప్పాల్సిందే.

కమ్యూనిస్టు వ్యతిరేక చట్టాలు
రచయితలను మేధావులను
విద్రోహులుగా చిత్రించే
రాజకీయ సాధనాలు.

'చట్టబద్ధ' పరిపాలనలో
కృత్రిమ చట్టాలదే పై చేయి
ప్రజలను పట్టి పల్లార్చడానికే
ఎమర్జెన్సీ ప్రకటించావు.

ఎన్నికల తంతు యావత్తూ
జనాన్ని మాయ చేసే కుతంత్రం
అంతు లేని అవినీతి
అంతం లేని విలాసాలు.

ఇన్నాళ్ళ నీ నిరంకుశ పాలనలో
కొందరు మాత్రం పందుల్లా బలిశారు
చెలరేగే జనాన్ని మభ్యపెట్టేందుకే
'సుపరిపాలన' చవకబారు నాగ్దానం.

రాబందుల రక్షణ
రామచిలకల భక్షణ
ఇప్పటికే మనం శతకోటిడాలర్లబాకీ
ఇక ఎక్కడా మనకుచేటప్పుకూడాపుట్టదు.

భవతి భిక్షాందేహి అంటూ
దేశ దేశాలూ ముష్టెత్తుతున్నాం

ఒకప్పుడు మనం అందలం ఎక్కాం
ఇప్పుడు అంగాంగం తాకట్టుపెట్టాం.

రైలు పట్టాలు కూడా పీకి
ముడి ఇనుమ ఎగుమతి చేస్తున్నాం
మరి కొన్నాళ్ళకు మన పేరే
మనకు మిగులబోదు.

మన ఎగుమతులు
మన దిగుమతులు ముందు
చూస్తూండగానే
దిగదుడుపు పయిపోయాయి.

పి.ఎల్.480చచ్చుపుచ్చు గింజల్నినమ్ముకు
మన పొలాలను బీడుపెట్టాం
పరాయిదేశాల ధాన్యం ధరపెంచేస్తే
పాలుపోక నువ్వు కళ్లు తేలేశావు.

పంటచేలు మొలకెత్తితేనే
పరిశ్రమలు తలలెత్తుతాయి
ముడి సరుకుల కోసమని
పడిగాపులు పడడమన్న
కడలి ఒడ్డు వెంబడినే
ఇసుక ఇళ్ళు కట్టడమే

అంతులేకుండా పెట్రోలు తగలేయడం
అంతా అష్టావక్రపు నడకే
బొగ్గు కాల్చేయి, పెట్రోల్ తగలేయి
అంతా దగా, అంతా వృధా.

ఇనుపముక్కలు కిమ్మత్తుజాస్తి
అందుకే దుక్క ఇనుం అవతలపారేయి.
పూచికపుల్లగూడా
పారేయగూడదని నానుడి.

ఎలుకలుదూరే బొక్కలు పూడుస్తున్నాం
ఏనుగులుదూరే కంతలు వదిలేస్తున్నాం

టాటాబిర్లాలతో లాలూచీ అయి
భారీ పరిశ్రమలు నిర్మించావు
రాజకీయ విరాళాల కోసం
కాయరాజా కాయ అన్నావు.

జాతీయ రహదార్లు వేయడం
ప్రైవేటు లారీలకు పర్మిట్లు ఇవ్వడం
కార్లు అమ్మడం
నా కారని అరవడం

పెట్రోలు తగలెయ్యండి
బొగ్గు తవ్వకండి
ముప్పాతిక మువ్వీసం
అన్నీ భారపరిశ్రమలు

పెట్రోలు లేక పోతే
ఆర్థిక సంక్షోభమే
వ్యాపార ఒడంబడికలు
కుటిలమతుల కటిక దగాలు

చిత్రం చిత్రం మహాచిత్రం
ఈ వ్యాపార సరళి
సరకుల చలామణి కన్నముందే
లాభాలు ఖరారుచేసుకుంటారు.

హద్దూపద్దులేని అన్యాయం
ఆపు అదుపులేని లాభాలు
విదేశీ పరిశ్రమల రాబడి
స్వదేశీ పెత్తందార్ల దోపిడీ.

పన్నుల రాయితీ, లాభాల జిరాయితీ
తాతగాడి ముల్లెలా అనుభవిస్తున్నారు
నీ పారిశ్రామిక విధానం
ప్రజలపాలిట అపచారం
ప్రాంతీయ అసమానతలు
పెంచిపోషించే దురాచారం

పెట్టుబడి పిల్లలను పెడుతుంది
భారీ పరిశ్రమలను పెంచుతుంది
చిన్నమిల్లులు మూతపడతాయి
పెద్దమిల్లుల బలిసిపోతాయి.

అధికపన్నులు వేశావు
లాభాలెన్నో గుంజావు

వ్యవసాయం సజావుగా
సాగితీరాలంటే
ఎరువులు, పనిముట్లు
ఉండాలి దండిగా

పథకం కొద్దీ
చెయ్యాలి మనం వ్యవసాయం
అప్పుడే అది అందరికీ
ఇస్తుందెంతో ఫలసాయం.

అప్పుడే పెట్రోలుగిరాకి
సరుకుల కొరత
ఇక్కట్టుల పాల్జేయవు
ఇబ్బందులు పెట్టవు

ఉన్నబొగ్గు పుట్టిపాలుజేసి
లేని పెట్రోలుకోసం అర్రులుచాచం

తిండిగింజలు పండించుకోకుండా
దిగుమతులపై ఆధారపడడం
పగవాడిని నమ్ముకుని
పాయసం తాగడమే

అభివృద్ధి పేరుమీద
పగవారితో మిలాఖత్
పాలకుల పాటలు
మంచినీటి మూటలు

పగవాళ్ళను మనపంచకు రమ్మంటే
వాళ్ళు మనకొంపకే నిప్పెడతారు
పరిశ్రమలు పెడుతున్నామంటూ
ప్రజల నెత్తురు పీల్చేస్తారు
వాతావరణం కలుషితంచేసి
ప్రజానీకాన్ని పొగపెట్టి చంపుతార:

గద్దెమీదొ వాళ్ళంతా
పెద్దపెద్ద వాళ్ళంతా
శ్రద్ధబూని వినడానికి
చేస్తున్నా హెచ్చరిక

పాటక జనాలపై
నేరాలను మోపవద్దు
అదిమిపటి బెదరగొట్టి
అందరినీ ఏలలేవు

ఏ ఒక్కడూ మోసపోడు
ప్రతినేత్రం శివనేత్రం

జనంపాట వినవువినవు
ఉన్న నిజం కనవు కనవు
గద్దెనుండి దిగవుదిగవు
నీ నైజం తెలుసు తెలుసు
పాపానికి ఒడిగడితే
ప్రజానీకం క్షమించదు.

దేశాన్ని దివాళా తీయించవు
జవాన్ని జోలెకట్టమన్నావు
అందరినీ గుంటచిక్కులు పెట్టావు
బీటలు వారింది నీ పాలన.

మౌలిక మార్పులు రావాలంటే
ధనమదాంధులు పోవాలి

ప్రభుత్వలేబర్ పాలిసీ
కార్మిక హక్కుల రక్షణకేనట

ధనికస్వాముల రక్షించావు
శ్రామికులను భక్షించావు

సమ్మెకట్టడం చట్టవిరుద్ధమంటూ
కనీసపు హక్కులను కాలరాచావు

చూస్తూవుంటే మేస్తూపోయిందని
జీవించేహక్కునే హరిస్తావు మరికొన్నాళ్ళకు

పోరాడి గెల్చుకోందే
పౌరహక్కుల్లో పసలేదు

లేబర్‌లీడర్లను కొనేసి
లేబర్‌ను దగాచేశావు

రాజీబేరాలొద్దు
రాజకీయ పోరాటం సాగిద్దాం
అదే మనకు ముక్తిమార్గం
అదే విముక్తి మార్గం

''ముందు సంపద పెరగాలి
తరవాతే పంపిణీ''

చాలించు మాయమాటలు
ససేమిరా మోసపోము

తమనెత్తుటి చెమటనీరు ధారపోసి
శ్రామిక జనసందోహం
సృష్టించిన సంపదకంతా
వారసులిక వాళ్ళేవాళ్ళే

మిల్లులో ఒళ్ళుహూనం అవుతుంది
ఇంటికాడ పొయ్యిలో పిల్లిలేవదు

అధికధరలకువేతనాలు వాతాపిజీర్ణం
జీతాలు ఎంతపెరిగినా పొట్లుతప్పడంలా

ఏకతాటిపై నిలబడదాం
దోపిడీదొరలను తరిమేద్దాం

వూపిరి పీల్చుకుందాం
విప్లవాన్ని నడుపుకుందాం

చాలుచాలిక పంచదార గుళికలు
మా ఒంటికి సరిపడనివి

ముందుచూపు లేకుండా
కాల్చిపారేస్తున్నావు
బలిదానం ఎవరిది ?
మా నెత్తుటి రాస్తాలే,

గుడిసెలు పీకించావు
గొప్పలు చాటించావు

ఉద్యోగంహుళక్కి సద్యోగం సున్న
జీవయాత్ర సాగడమెలా ?

పూరిగుడిసెల్లో కుక్కిమంచాలపై
చావలేక బతుకుతున్నాం

ముద్దకకూడా దూరంచేసావు
మట్టిపెట్టక వదులుతావా ?

చాకిరీతో వేధించావ్
ఇంతేనా నీ నిర్వాకం ?

ఒళ్ళొంచని పనిదొంగలు
డబ్బున్న బాడకావులే

ప్రజలకేమో పొదుపుమంత్రాలు
పీడకులకు పరమాన్నాలు

మా రెక్కలు ముక్కలుచేశావు
మా డొక్కలు డోళ్ళుకట్టావు

శ్రమైక జీవన సౌందర్యం మాది
స్వేదం ఒలికిస్తాం, సిరులును కురిపిస్తాం

దొంగలు దగాకోర్లు
పోకిరీలు పుండాకోర్లు

కిలాడీలు రౌడీలు
అందరికీ వత్తాసిస్తావు

పరిపాలనా సౌష్టవం
పెరిగి పోయిందంటూ
పోలీసు యంత్రాంగం
ప్రజలను హడలగొడుతోంది

సొంతం బరితెగించావు
నీ భరతం పడతాము

వ్యవసాయం ప్రధానం అంటున్నావు
రైతులు బక్కచిక్కి పోతున్నారు

మిల్లు సరుకుల ఒత్తిడికి
లొంగిపోయాయి మనపంటలు
మన రైతులంతా ఇక
రచ్చకెక్కాల్సిందే

అమ్మబోతే అడవి
కొనబోతే కొరివి

రుణాలు మంజూరవుతున్నాయి
రుణభారం పెరుగుతోంది

''భూమి:సహకార సంఘాలురైతులవే''
అచ్చంగా ఇదింౌచ్చుగుంట ప్రచారమే

కర్షకులను కాల్చుకుతినేందుకు
పాలకులకు సాధనాలు కోకొల్లలు

ఎరువులపై గుత్తాధిపత్యం
గుప్పెట్లో పెట్టుకున్నావు

నల్లబజారు వ్యాపారం
కుడిఎడమల దగాదగా

'స్వయం పోషకత్వం' భేషైన మాటే
తినడానికి తిండిలేదు

పెద్దమొత్తం చెల్లించాం
తిండిగింజలు కొనుక్కున్నాం
దేశవాళీ సరుకులు మాత్రం
కారుచవగ్గా అమ్మేశాం

పుచ్చుగోధుమలను
సొమ్ము చేసుకోవాలని
ఇళ్లిల్లూ తిరుగుతున్నాం
యాతనలెన్నో పడుతున్నాం

అదే రాజకీయ బ్రహ్మాస్త్రం
విరాళాలు రాబట్టే మంత్రాంగం

పంచకూళ్ల కషాయం
కాకుంటే దప్పళం
ఆపైన ఆకలే ఆహారం
అదీ మన వరస

వ్యవసాయ విధానం
విధానమేకాదు

భూములు పంచుతానని
బాజాలు వాయిస్తున్నావు

బక్కరైతుల ఆదాయ ంతరుగుతోంది
మిల్లుసరకుల గిరాకీ పెరుగుతోంది

అన్నెంపున్నెం ఎరక్కపోవడమే నేరం
దగాపడ్డ కర్షకులారా రండి

కడగళ్ళపాలైన కష్టజీవులపక్కన
నిలబడి మాట్లాడుతున్నారు విద్యార్థులు

పోకిరీలని పేరెట్టి
విద్యార్థుల గొంతునొక్కేశావు

మొత్తం జవాబులో
మీది మైనారిటీయేనంటూ

విద్యార్థుల ఉద్యమాన్ని
అణిచి పారేశావు

గెలిచి తీరుతుంది న్యాయం
హతమారుస్తాం అన్యాయం

విద్యార్థి వీరుల్లారా
అదురు బెదురులేక
అడ్డేదీ లేకలేక
సాగించండి ధర్మయుద్ధం

స్కాలర్‌షిప్పులు
ఎన్‌సిసి ట్రైనింగులు
పాలకుల పన్నేవుచ్చులు
మీ కంఠాలకు బిగిసేవురులు

ప్రజాస్వామ్యానికి
కంచుకోట మన విద్యార్థులు
మంత్రులకు మంత్రాంగాలకు
మోసపోవటం కల్ల

ద్రోహులను తూలకొట్టండి
దోషులను తుడిచిపెట్టండి
ధనంజయునిలా సాగండి
దండధరుడిలా కదలండి

మరఫిరంగి విషవాయువు
ఏదీ మిమ్మాపలేదు

విప్లవ సూర్యోదయాన
గుభిల్లుమన్నది అగ్నిపర్వతం

చేలమీద పూలన్నీ
పూరాగా వికసించాయి

అన్నలార తమ్ములార
పునర్జన్మ పొందండి
మునుముందుకు సాగండి
నవలోకం సాధించండి

మేధావులు ఆచార్యులు
కర్తవ్యం మరువకండి
ముండమోపి జీతంకోసం
మౌనం పాటించకండి

డబ్బులకై ఆశయాల
సంగడిలో అమ్మకండి

పోలీసుక బెదిరిపోయి
పాలకులన పొగడకండి

ఉగ్ర నరసింహులై
విద్యార్థులు పురంకంగనె
సంకోచం లేకుండా
వెనకేసుకురండి

ఆపత్సమయంలో
అందరమూ కదలాలి
అందుకోండి చాచి హస్తం
భుజం కలిపి పోరాడండి

విప్లవ రచయితలారా
పనికొచ్చే పాత్రికేయులారా

కలాల విదిలించండి
మురికి వదిలించండి
పాళీలు పదును పెట్టండి

రాయండిక స్వేచ్ఛగా
శక్తివంతంగా
స్వచ్ఛంగా, స్పష్టంగా
గ్రాహ్యంగా, సమగ్రంగా

మనదుస్థితి పోయేటందుకు
అందరమొకటై పోరాడాలి

పత్రికా రంగాన
ఎందుకూ నీ ప్రవేశం

గట్టుబట్టబయలు చేయడానికి
నిర్భయంగా నిజం చాటి చెప్పడానికి

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు
విప్లవ కాగడా వెలిగించు

పుణ్యపాప నిర్ణేతలారా
పాపభీతి కలిగినవారా
పాలకుల కొమ్ముకాయవద్దు
పాపం మూటకట్టవద్దు.

పాలకుల పల్లకీల మోయకండి

భట్రాజులు కాకండి
కాకాలు పట్టకండి
బాకాలు వూదకండి

మీలో మార్పు ప్రభవించాలి

తూర్పు ప్రసవించాలి
రంగులు మార్చవద్దు.
దిక్కులు మార్చవద్దు

నిరపరాధులై దురదృష్టంచే
చెరలో ఎక్కిన సోదరులారా
లేవండోయ్ లెండోయ్ లెండి
రానున్నది నవ్యజగతి

పతితులార భ్రష్టులార
బాధాసర్ప దష్టులార
దీనులార హీనులార
జీవన సమరం సాగించండి

వెర్రివాడా కుర్రవాడా
ఉద్యోగం లేనివాడా
గేటులు కాసినవాడా
పోరులోన చేరరండి

హమాలీలు గుమాస్తాలు
అదో జగత్సహోదరులు
కార్మికులు కర్షకులు
హక్కులకై కదిలిరండి

భజనరాయుళ్ళారా
తేనెపూసిన కత్తులారా
మీ గోయిని తవ్వుతాము
మీ గోరీ కట్టుతాము
రాజకీయ నేతలారా
పెద్ద ఉద్యోగస్తులారా
ప్రజల మనసు తెలుసుకోండి
పాలకులను పసికట్టండి

నక్సల్‌బరి శ్రీకాకుళ
తెలంగాణ తలుచుకోండి

ప్రజాశక్తి నెదిరించి
ఎవరు నిలువలేరు నిజం

బెదిరింపులు సాగబోవు
బందూకులు చేబడతాం

ఆకలితో మాడవద్దు
అప్పులతో చావవద్దు
జనసేనలో చేరుమన్న
పోరుకొరకు కదులుమన్న

లేవాలి విద్యార్థులు
పోరాలి శ్రామికులు.

పట్టణాల్లో కార్మికుడా
పల్లెలోన కర్షకుడా

మీధాటిని పోషించండి
పునాదులు పెకలించండి
సర్వాధికారం చేజిక్కించుకున్నావు
సర్వనాశనం చేసేస్తాం
విజయగర్వంతో విర్రవీగుతున్నావు
పాతాళంలో పాతేస్తాం

రక్తాక్షరాలతో నేడే ఆనాడే
లిఖిస్తాము చరిత్ర

జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని
జయప్రదం చెయ్యాలి

స్వాతంత్ర్యం, సమభావం
సౌభ్రాతృత్వం, సౌహార్దం
శాంతిశాంతి కాంతికాంతి
సకలజనం సకలజగం
సంద్రంలా పొంగాలి
సంగీతం పాడాలి

[మూలం : దక్షిణకొరియా కవి కించిహా. దీనికి "క్రైఅఫ్‌ది పీపుల్" అన్న ఇంగ్లీషు అనువాదం "ఆంపో" అనే జపాను పత్రికలో పడింది. 18.12.75న తెలుగు అనువాదం శ్రీ చలసాని ప్రసాద్ చేశారు.]

కీ. శే. మారేమండ రామారావు

ఇంద్రపాలనగర శాసనంపై సమీక్ష

[మారేమండ రామారావుగారి స్వదస్తూరీతో ఉన్నదానిని కర్నూలు ఎస్. టి. బి. సి. కళాశాల, ఎస్. వి. వి. స్టడీ సెంటరులో రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్రీ టి. ఎస్. ఆనంద రామారావు గారి గ్రంథాలయంలో లభించిన దానిని మాకు ప్రచురణార్థం పంపారు. సం]

భారతి 1965వ సంవత్సరం జూన్ నెల సంచిక 14–28 పేజీలలో విష్ణుకుండిన గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమును, జూలై నెల సంచిక 2 14 పేజీలలో విష్ణుకుండిన విక్రమేంద్రవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమును ప్రకటించి శ్రీ బి. ఎన్. శాస్త్రిగారు ఆంధ్రదేశ చరిత్ర రచనకు అమూల్యమైన ఉపకారం చేశారు.

పై రెండు శాసనములను ఇంతవరకు ప్రకటితములైన విష్ణుకుండిన రాజుల ఇతర శాసనములతో సమన్వయించి శ్రీ శాస్త్రిగారు విష్ణుకుండిన వంశ వృక్షము రాజ్యకాలములను ఒకవిధంగా నిర్ణయించారు.[1] ఈ నిర్ణయములను జాగ్రత్తగా పరిశీలించగా నాకు ఇవి మరియొక విధంగా ఉండవలెను అనే అభిప్రాయం కలిగింది. నా అభిప్రాయమును ఈ వ్యాసంలో వ్యక్తపరుస్తున్నాను.

వంశవృక్షము

శ్రీ శాస్త్రిగారు ప్రకటించిన విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనంలో అతని ముత్తాత అయిన మహారాజ మాధవవర్మ ఏకాదశాశ్వమేధ బహు సువర్ణ పౌండరీక వాజపేయ క్రతు సహస్ర సర్వమేధ రాజసూయ పురుష మేధాది యాగములను చేసినవాడుగా వర్ణించబడినాడు. విష్ణుకుండినులచే వేయించబడిన పొలమూరు, రామతీర్థం, చిక్కుళ్ళ, తాండి తామ్రశాసనములలోను, రెండవ ఈపూరు తామ్రశాసనంలోను పై యాగములను చేసిన ఒక మాధవవర్మ పేర్కొనబడినాడు. ఈ శాసనను లన్నింటిలోనూ కనిపించే ఈ వర్ణనని ఆధారం చేసుకొని వీటిలో ఈవిధంగా వర్ణించబడిన మాధవవర్మ ఒకడే అని నిర్ణయించవచ్చును. ఈ మాధవవర్మ కుమారుడయిన విక్రమేంద్రుడు వాకాటక మహాదేవి సూనుడని పై ఇంద్రపాలనగర శాసనంలో చెప్పబడి ఉన్నది. రామతీర్థం శాసనంలో ''వంశ ద్వయాలంకృత జన్మ'' అనిన్నీ, చిక్కుళ్ళ శాసనంలో ''విష్ణుకుండి వాకాటక వంశాలంకారుడ''నిన్నీ, బహుక్రతువులు చేసిన మాధవవర్మ కుమారుడనిన్నీ, ఒక విక్రమేంద్రవర్మ పేర్కొనబడి ఉన్నాడు. ఈ విక్రమేంద్రవర్మపై ఇంద్రపాలనగర శాసనంలోని విక్రమేంద్రుడే అని నిర్ణయించవచ్చును. అలాగే ఈ విక్రమేంద్రవర్మ కుమారుడు ఇంద్ర భట్టారకవర్మ 'అనేక చతుర్దంత విజయాధిగతు''డని ఇంద్రపాల నగర శాసనంలో చెప్పబడియున్నది. రామతీర్థం, చిక్కుళ్ళ, తుండి శాసనములున్నూ ఈ రాజును ఈవిధంగానే వర్ణిస్తున్నవి. అందువల్ల ఈ నాలుగు శాసనములలోను పేర్కొనబడిన ఇంద్రభట్టారకవర్మ ఒక్కడేనని నిర్ణయించవచ్చును. అప్పుడు విష్ణుకుండిన వంశంలో మాధవవర్మ, అతని కుమారుడు విక్రమేంద్రవర్మ, కుమారుని కుమారుడు ఇంద్రభట్టారకవర్మ అనే మూడు పురుషాంతరముల రాజులు ఉండినట్లు స్పష్టం అవుతుంది. ఈ అంశాన్ని విష్ణుకుండిన వంశవృక్ష నిర్ణయానికి ప్రాతిపదికగా పరిగణించవలసి ఉంటుంది. మొదటి ఈపూరు శాసనము, పొలమూరు శాసనము పై మాధవవర్మకు గోవిందవర్మ తండ్రి అనీ, విక్రమేంద్రవర్మ తాత అనీ తెలుపుతున్నవి. పై ఇంద్రపాలనగర శాసనముకూడా మాధవవర్మ తండ్రి మహారాజ గోవిందవర్మ అనీ తెలుపుతున్నది. అప్పుడు విక్రమేంద్రవర్మ, గోవిందవర్మ, మాధవవర్మ, విక్రమేంద్రవర్మ, ఇంద్రభట్టారక వర్మ అనే ఐదు పురుషాంతరముల వంశక్రమం ఏర్పడుతుంది

పై ఇంద్రపాలనగర శాసనంలో ఇంద్రభట్టారకవర్మ కుమారుడు విక్రమేంద్రవర్మ, పౌత్రుడు మాధవవర్మ పేర్కొనబడినారు. వీరిలోని విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ, తుండి శాసనములలో ఇంద్రభట్టారకవర్మ పుత్రుడుగా చెప్పబడిన విక్రమేంద్ర వర్మ ఒక్కరే అవుతారు అప్పుడు ఈ ఇంద్రపాల నగర శాసనం చిక్కుళ్ళ, తుండి శాసనములలో లేని మరి ఒక పురుషాంతరాన్ని పేర్కొంటోంది అని స్పష్టం అవుతుంది.

ఇక మిగిలినది గోవిందవర్మ ఇంద్రపాలనగర శాసనం. దీనిలో ఇంద్రవర్మ, అతని కుమారుడు మాధవవర్మ, పౌత్రుడు, శాసనదాత అయిన గోవిందవర్మ పేర్కొనబడినారు. ఈ మూడు పురుషాంతరముల రాజుల పేర్లకును, వారి వర్ణనకును, విక్రమేంద్ర వర్మ ఇంద్రపాలనగర శాసనంలోను, విష్ణుకుండినుల యితర శాసనములలోను గల రాజుల పేర్లకును, వారి వర్ణనలకును ఏ విధమైన సామ్యము కనిపించదు. విక్రమేంద్రవర్మ 11వ రాజ్యకాల సంవత్స

రము శా: శ 488 గతించిన తర్వాత అనగా క్రీ. శ 566 లో వచ్చినదని ఆతని ఇంద్రపాల నగర శాసనంలో చెప్పబడినది. ఈ రాజు పరిపాలన క్రీ. శ. 570 ప్రాంతంలో అంతమయి ఉండవచ్చును. విష్ణుకుండినుల తర్వాత పరిపాలించిన వేంగీ చాళుక్యుల ఏలుబడి క్రీ. శ. 624 నుంచి సాగినది. వారు వేంగిని, దుర్జయులను జయించి స్వాధీనము చేసుకొన్నారు ఈ దుర్జయులపాలన 615–620 వరకు సాగిందని ఊహిస్తే విష్ణుకుండినుల పరిపాలన 615–620 నాటికి ముగిసిందని చెప్పవలసి వస్తుంది. అప్పుడు క్రీ. శ. 570–615–620 మధ్య 45–50 సంవత్సరముల ఖాళీ ఏర్పడుతుంది పై విక్రమేంద్ర వర్మ కుమారుడు మాధవ వర్మ తండ్రి తర్వాత రాజ్యముచేశాడో లేదో తెలియదు. ఈ 45–50 సంవత్సరముల కాలం ఇద్దరు రాజుల రాజ్యకాల పరిమితికి సరిపోతుంది. అందువల్ల ఈ రెండు శాసనములలోని పురుషాంతరములను ఊహామూలకంగానే సమన్వయించవలసి వస్తుంది. తాత్కాలికంగా రెండవ మొదటి ఇంద్రపాల నగర శాసనంలోని ఇంద్రవర్మ ఇంద్రపాలనగర శాసనంలోని ఇంద్రవర్మ, ఒక్కరేనని ఊహించి, పై రెండు శాసనములలోని పురుషాంతరములను విష్ణుకుండినుల ఇతర శాసనములలోని పురుషాంతరములను సమన్వయిస్తే విష్ణుకుండిన వంశ వృక్షం ఈ క్రింది విధంగా ఏర్పడుతుంది:

విక్రమేంద్ర వర్మ 450–460
|
గోవింద వర్మ 460–470
|
మాధవ వర్మ I 470–520
|
దేవవర్మ — విక్రమేంద్రవర్మ 520–25 — మంచన్న భట్టారకుడు

దేవవర్మ → మాధవవర్మ II
విక్రమేంద్రవర్మ → ఇంద్ర భట్టారకవర్మ 525–555

ఇంద్ర భట్టారకవర్మ → విక్రమేంద్రవర్మ II 555–570 — మాధవవర్మ IV 570–595

విక్రమేంద్రవర్మ II → మాధవవర్మ III
మాధవవర్మ IV → గోవిందవర్మ II 595–615

ఈ వంశక్రమం శ్రీ శాస్త్రిగారు కూర్చిన వంశక్రమానికి భిన్నంగా ఉన్నది[2] శ్రీ శాస్త్రిగారు గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనాన్ని ప్రాతిపదికగా తీసుకొని మొదటి మూడు పురుషాంతరముల రాజులను ఏర్పరచారు. ఇందులో కడపటివాడైన గోవింద వర్మ విక్రమేంద్రవర్మ ఇంద్రపాల నగర శాసనంలో మొదటివాడైన గోవిందవర్మ ఒకరేనని ఊహించి, విక్రమేంద్రవర్మ ఇంద్రపాల నగర శాసనంలోని గోవిందవర్మ తరువాత గల నాలుగు పురుషాంతరములను పై మూడు పురుషాంతరాలకు కలిపి ఏడు పురుషాంతరాలు ఏర్పరచారు. కాని ఈ శాసనంలోనే విక్రమేంద్రవర్మ కుమారుడుగా చెప్పబడిన మాధవవర్మను వదలివేసి, పాలమూరు మొదటి ఈపూరు శాసనములలోని విక్రమేంద్రవర్మనీ, ఇంద్రపాల నగర శాసనంలోని రెండవ విక్రమేంద్రవర్మనీ ఒకే రాజుగా ఊహించి, ఈ విక్రమేంద్ర వర్మ తరువాత మరి మూడు పురుషాంతరములను చేర్చినారు అప్పుడు ఇంద్రపాల నగర శాసనంలో విక్రమేంద్రవర్మ కుమారుడు మాధవవర్మకు ఈ వంశ వృక్షంలో స్థానం లేకుండా పోతుంది. అదికాక శ్రీ శాస్త్రిగారు పాలమూరు, మొదటి ఈపూరు శాసనములలో పేర్కొనబడిన మూడవరాజు విక్రమేంద్రవర్మ పౌత్రుడూ, గోవిందవర్మ పౌత్రుడూ అయిన మాధవవర్మని మూడవ మాధవవర్మగా నిర్ణయించారు. కాని వారు ఇచ్చిన వంశవృక్షంలో ఈ మూడవ మాధవవర్మ దేవవర్మ పుత్రుడుగానూ, రెండవ మాధవవర్మ పుత్రుడుగాను ఉదహరించబడినాడు. పైగా మంచన భట్టారకుడు శ్రీ శాస్త్రిగారి అంచనా ప్రకారము మూడవ మాధవ వర్మ కుమారుడయితే ఈ రాజును వంశవృక్షంలో నాలుగవ మాధవ వర్మ కుమారుడుగా ఉదహరించారు. ఈ రెండు ఊహలును పాలమూరు, మొదటి ఈపూరు శాసనములకు విరుద్ధంగా ఉన్నవి. అశ్వమేధాది బహుక్రతుయాజి అయిన మాధవవర్మ ఎవరో శ్రీశాస్త్రిగారు ఇచ్చిన వంశవృక్షంలో చెప్పబడలేదు. అయినా రెండవ ఈపూరు శాసనంలో మాధవవర్మ, దేవవర్మ., మాధవ వర్మల క్రమం శ్రీ శాస్త్రిగారి వంశ వృక్షములోని క్రమానికి సరి అయి, వారు రెండవ మాధవవర్మగా నిర్ణయించిన మాధవవర్మ రెండవ ఈపూరు శాసనంలోని మొదటి మాధవవర్మ ఒక్కరే అని తేలుతుంది· కాని పాలమూరు, మొదటి ఈపూరు శాసనములను బట్టి ఈ మాధవవర్మ గోవిందవర్మ కుమారుడని, విక్రమేంద్ర వర్మ పౌత్రుడనీ స్పష్టం అవుతుంది. శ్రీ శాస్త్రిగారి ఏర్పాటును అనుసరించి ఈ మాధవవర్మ మరి ఒక మాధవవర్మకు పౌత్రుడు అవుతాడు. ఈ ఊహ పాలమూరు, ఈపూరు శాసనములకు విరుద్ధముగా ఉన్నది. పైగా ఈ శాసనములలోని గోవిందవర్మకు విక్రమాశ్రయుడనీ, అతని కుమారుడు మాధవవర్మకు జనాశ్రయుడనీ బిరుదులు ఉన్నవి. శ్రీ శాస్త్రి గారు ప్రాతిపదికగా తీసుకున్న ఇంద్రపాల నగర శాసనంలో రాజులకు ఈ బిరుదులు లేవు. శ్రీ శాస్త్రిగారు జూన్ నెల 'భారతి' సంచిక పే. 27 లో చరిత్ర పరిశోధకులు నిర్ణయించినారు అని ఒక వంశక్రమ కాల నిర్ణయ పట్టికను ఇచ్చినారు. ఈ పట్టిక శ్రీ భావరాజు వెంకట కృష్ణ రావుగారు ఏర్పరచినది.[3] ఇది కొంతవరకు శ్రీ లక్ష్మణరావుగారు ఇచ్చిన వంశక్రమానికిన్నీ సరిపోతుంది.[4] శ్రీ కృష్ణరావు గారు అశ్వమేధాది యాగములు చేసిన మాధవవర్మని విష్ణుకుండిన వంశానికి మూలపురుషుడిని చేసి, పాలమూరు, మొదటి ఈపూరు శాసనములలో ఆ రాజు తండ్రి, తాతలుగా చెప్పబడిన గోవిందవర్మ విక్రమేంద్రవర్మలను వదలివేశారు. విక్రమేంద్రవర్మ ఇంద్రపాలనగర శాసనంలో కూడా అశ్వమేధాది క్రతుయాజి అయిన మాధవవర్మ గోవిందవర్మకు కుమారుడని చెప్పబడి ఉన్నది. ఈ కారణములను బట్టి శ్రీ కృష్ణరావుగారు మాధవవర్మను మూల పురుషుడుగా నిర్ణయించడం ఉచితం కాదని స్పష్టం అవుతుంది. అలాగే విక్రమేంద్రవర్మ ఇంద్రపాలనగర శాసనంలో ఆ రాజుకు

గోవిందవర్మ అనే కుమారుడు ఉన్నట్లు చెప్పబడి ఉండగా శ్రీ కృష్ణారావుగారు పొలమూరు శాసనంలోని మొదటి రాజు అయిన విక్రమేంద్రవర్మని వదలివేసి, ఆ శాసనంలో తర్వాత చెప్పబడిన గోవిందవర్మని పై రెండవ విక్రమేంద్రవర్మ కుమారుడుగానూ, మాధవవర్మ, మంచన్న భట్టారకులను పౌత్ర ప్రపౌత్రులుగాను చేర్చినారు. శ్రీ కృష్ణారావుగారి ఈ ఊహలు అన్ని శాసనములకు విరుద్ధములైనవి. ఇతర పరిశోధకులు వీటిని విమర్శించి అప్రమాణములని వ్రాసి ఉన్నారు.[5]

విష్ణుకుండినుల శాసనముల నన్నింటిలోనూ అశ్వమేధాది క్రతు కర్తగా వర్ణించబడిన మాధవవర్మ అనే రాజు ఒక్కడే అని చెప్పడం న్యాయం. ఈ ప్రాతిపదికను ఆధారం చేసుకొని శాసనములను అన్నింటినీ పరిశీలిస్తే పొలమూరు, మొదటి ఈపూరు శాసనములు మాధవవర్మ పూర్వీకులను రెండవ ఈపూరు, రామతీర్థం, చిక్కుళ్ళు, తుండి శాసనములు మాధవవర్మ తరువాత వచ్చిన రాజులనీ తెలియ చేస్తాయని, విక్రమేంద్రవర్మ ఇంద్రపాలనగర శాసనం ఈ క్రమాన్ని బలపరుస్తుందనీ స్పష్టం అవుతుంది.

కాల నిర్ణయం

శ్రీ శాస్త్రి గారు ప్రకటించిన రెండు ఇంద్రపాలనగర శాసనములను బట్టి విష్ణుకుండిన రాజుల రాజ్య కాలములును మారుతాయి. ఈ కాల నిర్ణయమును ఎవరు ఏ విధంగా చేసినా కొన్ని పరిధులను మాత్రం అంగీకరించవలసి ఉంటుంది. కొంచెం అటు ఇటుగా క్రీ. శ. 4 వ శతాబ్ది ఆరంభానికే పరిపాలన ప్రారంభించి, శాలంకాయన గోత్రికులైన రాజులు సుమారు క్రీ.శ. 475 వరకు వేంగిపైన ఏలుబడి సాగించినారు. వారి తర్వాతనే విష్ణుకుండినులు వచ్చినారు. అలాగే క్రీ. శ. 615 – 20 నాటికి వేంగి దుర్జయులకి స్వాధీనం అయినది. దీనిని బట్టి స్థూలంగా విష్ణుకుండినుల ఏలుబడి క్రీ శ. 475 – 615–20 మధ్య జరిగినట్లు ఏర్పడుతుంది.[6] అలాగే ఇంద్రపాల నగర శాసనం దాని దాత అయిన విక్రమేంద్రవర్మ క్రీ. శ. 555–570 మధ్య రాజ్యం చేసినట్లు తెలుపుతుంది. ఈ రెండు అంశములను గుర్తుంచుకొని, విష్ణుకుండిన రాజుల వంశ వృక్షంలోని క్రమాన్ని ఆధారం చేసుకొని వారి కాలములను సూక్ష్మంగా నిర్ణయించవలసి ఉంటుంది. నేను ప్రతిపాదించిన వంశ వృక్షంలోని రెండవ, మూడవ మాధవవర్మలూ దేవవర్మ, మంచన్న భట్టారకుడూ రాజ్యం చేసినట్లు కనిపించదు.[7] అప్పుడు ఈ వంశంలో ఎనిమిది మంది రాజులు పరిపాలించినట్లు ఏర్పడుతుంది. పొలమూరు శాసనములను బట్టి మొదటి మాధవవర్మ 48 సంవత్సరములు, రామతీర్థం శాసనాన్ని బట్టి ఇంద్రవర్మ లేక ఇంద్ర భట్టారకవర్మ 27 సంవత్సరమూలూ, ఇంద్రపాలనగర శాసనాలలో ఒకదానిని బట్టి రెండవ విక్రమేంద్ర వర్మ 11 సంవత్సరములు రాజ్యం చేసినట్లు తెలుస్తుంది. గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనం అతని 37 వ రాజ్య సంవత్సరం నాటిది. ఈ మొత్తం 123 సంవత్సరములు అవుతుంది. రెండవ విక్రమేంద్రవర్మ ఏలుబడి (566–11) క్రీ. శ 555 లో ఆరంభం అయింది అనేది నిర్వివాదాంశం. అప్పుడు అతనికి ముందు రాజ్యం చేసిన ఐదు పురుషాంతరముల రాజులనూ క్రీ. శ. 475–555 మధ్య ఉండినట్లు పరిగణించవలసి వస్తుంది. ఈ అంతరాన్ని శాసనముల నుంచి తెలియవచ్చే రాజ్య కాలపరిమితులను పురస్కరించుకొని మొదటి ఆరు పురుషాంతరముల రాజ్యకాల పరిమితులను నిర్ణయించవలసి ఉంటుంది. అలాగే రెండవ విక్రమేంద్రవర్మ రాజ్యాంత్య సంవత్సరం అయిన క్రీ. శ 570 కిన్నీ, విష్ణుకుండిన వంశం ఏలుబడికే ఆఖరి సంవత్సరం కాదగిన క్రీ. శ. 615 కిన్నీ మధ్య గల 35 సంవత్సరాల కాలంలోనూ, ఏడు, ఎనిమిది పురుషాంతరముల రాజులను సరిపెట్టవలసి ఉంటుంది. వీటిలో 37 సంవత్సరములు గోవిందవర్మవి.

పైన చేయబడిన సూచనల ననుసరించి విష్ణుకుండిన రాజుల రాజ్యకాల పరిమితులను ఈ క్రింది విధంగా నిర్ణయించ వచ్చును:

	క్రీ. శ.
విక్రమేంద్రవర్మ	450–460
గోవిందవర్మ	460–470
మొదటి మాధవవర్మ	470–520
మొదటి విక్రమేంద్రవర్మ	520–525
ఇంద్రభట్టారక వర్మ	525–555
రెండవ విక్రమేంద్రవర్మ	555–570
నాల్గవ మాధవవర్మ	570–578
రెండవ గోవిందవర్మ	578–615

శ్రీ శాస్త్రిగారి కాల నిర్ణయ పట్టికలో విష్ణుకుండిన రాజ్యాంతం క్రీ. శ. 624 లో అయినట్లు తెలుపబడింది. ఇది క్రీ. శ. 624 లో వేంగీ చాళుక్యుల ఏలుబడి ప్రారంభం కాక పూర్వము కొంతకాలము వేంగీ దుర్జయుల పరిపాలనలో ఉండినది అనే చారిత్రికాంశానికి విరుద్ధంగా ఉన్నది అలాగే అధమము 47 సంవత్సరముల కాలం అయినా రాజ్యం చేసినవాడు బహు క్రతు యాజి అయిన మాధవవర్మను నాలుగవ మాధవవర్మగా పరిగణించి, అతడు క్రీ. శ. 576–623 నడుమ పరిపాలించి నట్లు శ్రీ శాస్త్రిగారు నిర్ణయించినారు. క్రీ. శ. 624 కు పూర్వమే బాదామీ చాళుక్య వంశీయుడైన రెండవ పులకేశీ మహారాజూ, అతని తమ్ముడు విష్ణువర్ధనుడు ప్రాక్తీరం మీద దండెత్తి వచ్చి గుంటూరు జిల్లా నర్సారావుపేట తాలూకా వరకూ గల భాగాన్ని జయించడం, ఈ భాగాన్ని అంతటినీ విష్ణువర్ధనుడు ఒక రాజ్యంగా ఏర్పరచడము జరిగి ఉండవలెనని పులకేశి కొప్పరం శాసనం నుంచి తెలియవస్తుంది. పై మాధవవర్మ క్రీ. శ. 623 వరకు పాలించి ఉంటే ఈ చాళుక్యుల దండయాత్ర అతని రాజ్య కాలంలో జరిగి ఉండాలి. శాసనములు ఈ రాజును గొప్ప విజేత గానూ, రాజ్య విస్తారకుడుగానూ వర్ణిస్తాయి. వాకాటకులు తమ

బిడ్డను ఇతని కిచ్చి వివాహం చేసి ఇతని సౌహార్దాన్ని సంపాదించారు. ఇతడు విష్ణుకుండిన రాజు లందరిలోనూ అగ్రగణ్యుడు. పైగా యావదుత్తరా పథ పాలకుడై తనచేత నిర్జింపబడిన శ్రీహర్షుడిని తన అయ్యావొళె శాసనంలో పేర్కొన్న పులకేసి ప్రాక్తీరంలో మహాబలశాలిగా ఉండిన మాధవ వర్మ తన చేత నిర్జితుడైతే ఆ విషయమును కూడా శాసనస్థం చేసి ఉండవచ్చును గదా! ఇందు వల్ల అశ్వమేధాది యాగములను చేసిన మాధవ వర్మ క్రీ. శ. 7వ శతాబ్దంలో ఉండి ఉండడానికి అవకాశం లేదు. శ్రీ శాస్త్రిగారు విష్ణుకుండినుల పరిపాలన క్రీ. శ. 358 లో ప్రారంభం అయినట్లు నిర్ణయించారు. అప్పుడు విష్ణుకుండినులకు ముందు వేంగిని పాలించి, శాలంకాయన గోత్రికుల పరిపాలన ఆ సంవత్సరములో అంతం కావాలి. శాలంకాయనుల వంశంలో కనీసము ఏడుమంది రాజులయినా పాలించారు. వీరి పరిపాలన కనీసము 150 సంవత్సరము లయినను సాగి ఉండాలి. అప్పుడు వీరి ఏలుబడి క్రీ. శ. 238 లో ప్రారంభం కావాలి. ఇది సాతవాహన సామ్రాజ్యం పతనము అయిన 18 వ సంవత్సరము అవుతుంది. ఈ కాలంలో శ్రీ పర్వతం వద్ద గల విజయపురిని రాజధానిగా చేసుకొని, దక్షిణాపథ ప్రాగ్భాగాన్ని ఇక్ష్వాకు రాజ వంశీయులు పరిపాలన సాగించిన కాలం అని అనేక శాసనములు తెలియజేస్తున్నవి. క్రీ.శ 220–240 మధ్య అశ్వమేధాగ్నిష్టోమ వాజపేయయాజీ, అప్రతిహత సంకల్పుడూ, సమ్రాట్టు అయిన మొదటి ఇక్ష్వాకు శ్రీ చాంతమూల మహారాజు పరిపాలించాడు[8] ఇతని కాలంలో శాలంకాయనులు వేంగిని స్వతంత్రులుగా పరిపాలించి ఉండడం అసంభవము ఈ విధంగా శ్రీ శాస్త్రిగారు ప్రతిపాదించిన విష్ణుకుండిన రాజ్యారంభ, అంత్య సంవత్సరములు రెండున్నూ కూడా సరియైనవి కావని చెప్పవలసి వస్తుంది. అలాగే పరిపాలించినట్లు నిశ్చింతగా తెలియని దేవవర్మ, మాధవ వర్మ [III] గోవిందవర్మ [II] లు మొత్తం 38 సంవత్సరములు పరిపాలించినట్లు పరిగణించడము నన్ను సరి కాదని తోస్తుంది.

పై కారణములను బట్టి శ్రీ శాస్త్రిగారు చేసిన విష్ణుకుండినుల రాజ్యకాలనిర్ణయమున్ను పునరాలోచనీయముఅవుతుంది.

విక్రమేంద్ర వర్మ శాసనం-మూలము

శ్రీ శాస్త్రిగారు ఇచ్చిన శాసన మూలములో ఎన్నో తప్పులు ఉన్నవి. వారు వాటిని సంస్కరించి, రేఖాధో భాగములలోనో, మరియొక చోటనో తప్పుగా ఉన్న మాటలకు సరియైన పాఠములను ఇచ్చి ఉంటే శాసనమూలం సులభంగా అర్థం అయ్యేది అలాచేయక

పోవడంవల్ల కొన్ని మాటలకీ, భాగాలకీ అర్థం తెలియడం లేదు. వాటికి ఇతర భాగాలతో సమన్వయం కుదరడం లేదు

మొదటి రేకు - రెండవ ప్రక్క

1వ లైను — 'శ్రీ మాత్స జయతి'కి బదులు 'శ్రీ మాన్స జయతి' అని ఉండవలెను.

3వ లైను — 'విష్ణుకుణ్డీనాం'కు బదులు 'విష్ణుకుండినాం' అని ఉండాలి.

7వ లైను — 'క్రతుం సహస్ర' కి బదులు 'క్రతు సహస్ర' అని ఉండాలి.

రెండవ రేకు – మొదటి ప్రక్క

1వ లైను—'పార్థక్షిణా పరామ్మేర్ నిధి'కి బదులుగా 'పార్థక్షిణా పరాంబో నిధి' అని ఉండవలెను.

7వ లైను — 'రాజరిషి' కి బదులు 'రాజర్షి' అని ఉండాలి.

రెండవ రేకు - రెండవ ప్రక్క

1వ లైను — 'శేశ(ష) వచవారోపిత' కు బదులుగా 'శైశవేచ్చైవారోపిత' అని ఉండాలి.

2వ లైను — 'విక్రమేన్ద్ర భట్టారక వమ్మర్ణ' లో 'ణ' అనవసరం 'వర్మా' అని ఉండాలి.

3వ లైను — 'రాజరిషి'కి బదులుగా 'రాజర్షి' ఉండాలి.

మూడవ రేకు - మొదటి ప్రక్క

2వ లైను — ''విచ్ఛురితం'' కు బదులు ''విచ్ఛురితి'' అని ఉండాలి.

3వ లైను — 'మణరమో'కు అర్థం లేదు.

మూడవ రేకు - రెండవ ప్రక్క

2వ లైను — ''ముచ్చేరలంకర్తు''కు బదులు''ముచ్చైరలంకర్తు'' అని ఉండాలి.

నాలుగవ రేకు - రెండవ ప్రక్క

2వ లైను — ''సింహత్యయం'' కు బదులు ''సింహాహ్వాయం'' అని ఉండాలి.

''పల్లవం'' తర్వాత మూడు అక్షరములు లేవు. కడపటి అక్షరం 'త్యా'గా ఉంటే అర్థం కుదరదు. అందువల్ల ఈ భాగం 'పల్లవం జిత్వా' అని దిద్దుకోవలసి ఉంటుంది.

4వ లైను — ''సాష్టాశీతి శీతూః'' కు బదులుగా ''సాష్టాశీతి చతుః'' అని ఉండాలి.

''శకయుతే స్వంవ''కు బదులు 'సంవ'అని ఉండాలి.

5వ లైను — ''రథఘ్నతన్త్రీ'' కి బదులు ''రథహ్వాతన్త్రీ'', అని ఉండాలి.

6వ లైను — ''సత్రపేషు''కు బదులు 'సన్యపేషు' అని ఉండాలి.

ఇవే కాకుండా శాసనమూలంలో ఇంకా అనేక లోపములు ఉన్నవి. రెండవ రేకు రెండవ ప్రక్క 4వ పంక్తిలోని ''ఇద్దం అవబోధమతి''కి తర్వాతగల భాగం సరిగా అర్థం కావడంలేదు. ఈ భాగంలో మాధవరాజు, గోవిందరాజు, పరమ భట్టారికా మహాదేవి అనే ముగ్గురు వ్యక్తుల ప్రసంస ఉన్నది. ఈ ముగ్గురికీ పరస్పరంగల సంబంధం ఏమిటో స్పష్టంగా తెలియడంలేదు.

''ప్రథిత ప్రభావులైన అన్యరాజుల వంశములకు సాత్మీభూతమైన పృథివీపతి పదమును బలిమిచేత లాగుకొనుటవలన వ్యక్తమైన మహిమ గలవాడును, మనోహరాకారుడును, నయ పరాక్రమాది గుణములు కలవాడును, అభి ప్రజాతమైన విష్ణుకుండిన కులములో బహుమతులయిన వారితో సంబంధము కలుగుటవలన ప్రశంసింపబడిన మహాత్మ్యము కలవాడును, గుణగణములచేత వ్యాపింపబడిన దిగన్తరాలము కలవాడును, అన్ని సామంత రాజ వంశములకును తిలకాయమానమగు పేరు గలవాడును అగు శ్రీ మాధవరాజు అనే పేరుగల వానిని సుతునిగా'' అని ఈ మాధవరాజు ప్రశంస ఆగిపోతుంది. పైన చెప్పిన విశేషణములన్నీ ద్వితీయ ఏకవచనాంతములుగా ఉన్నవి. ఈ మాధవరాజును విక్రమేంద్రవర్మ సుతునిగా స్వీకరించాడని చెప్పే క్రియాపదం శాసనంలో లేదు. దానిని మనం చేర్చుకొని ఈ రాజులిద్దరికీ పితాపుత్ర సంబంధం ఏర్పరచుకోవలసి ఉన్నది.

ఆ మీద ''లక్ష్మీ సాగరమునువలె తన జన్మచేత శ్రీ పృథ్వీమూల రాజ వంశమును అలంకరించినదీ, అద్భుత మూర్తి విగ్రహోధులచే అలంకరించబడిన ప్రతి విషయమునుగల దక్షిణాపథముయొక్క శ్రీ పార్వతేయులకు పూర్వాపరములందుగల రాజ పరంపరమధ్య నిరుపమముగా విరాజిల్లునదీ, గోవిందరాజుయొక్క సంపదను ప్రత్యక్షము చేయవలెననే కోరిక కలదీ, ఇంద్రపురమును గొప్పగా అలంకరించవలెనని కోరినదీ అయిన పరమ భట్టారికా మహాదేవిచేత'' అనే భాగం ఉన్నది. ఇందులో విశేషణములు అన్ని తృతీయ ఏకవచనములోనే ఉన్నవి.

గోవిందరాజును గురించి ''కౌస్తుభమువలె కీర్తికరమైన జన్మ కలవాడు, గోవిందుని అనుసరించే గుణరూప సంపద కలవాడు'' అని చెప్పబడి ఉన్నది. హఠాత్తుగా ''కౌస్తుభాయమాన యశోజన్మః'' అని ఈ రాజుయొక్క ప్రశంసని ప్రారంభించడం

సమంజసంగా కనిపించదు. కౌస్తుభము ఒక మణి. అది ఒక హారం మధ్యన ఉంటుంది. దీనికిముందే ''క్షితిపతి పరంపరాహారమధ్య నిరుపమ విరాజితయా'' అనే విశేషణం ఉన్నది. అందువల్ల 'కౌస్తుభ' శబ్దాన్ని ఈ హారంతో సమన్వయించి ''శ్రీ పార్వతేయ పూర్వాపరక్షితిపతులనే హారంలో కౌస్తుభంవలె ప్రకాశించే గోవింద రాజు'' అనే అర్థం వచ్చేటట్లు శాసనమూలాన్ని సంస్కరించు కోవడం ఉచితం అవుతుంది

శాసనానువాదము

శ్రీ శాస్త్రిగారు ఇచ్చిన శాసనాను వాదమును కూడా చాలా చోట్ల సంస్కరించవలసి ఉన్నది. మొదటి పంక్తిలో చివర వచ్చే ''ఉత్తమాశ్రయః'' అనే మాటకు ''ఉత్తమ శరణ్యుండును'' అనే అర్థం సరియయినదే కాని ఆమాట ''ఉత్తమాశ్రయ'' అనే బిరుదును తెలుపుతుంది. ఆ పంక్తిలోనే విక్రమేంద్రవర్మ తండ్రికి ''సత్యాశ్రయ'' అనే బిరుదు ఇయ్యబడి ఉన్నది. ఈ శాసనం చివరి భాగంలో నాలుగవరేకు రెండవప్రక్క 3వ పంక్తిలో ''ప్రాదాచ్ఛాసన ముత్తమాశ్రయః'' అనే భాగం శాసనదాత అయిన విక్రమేంద్ర వర్మకి ''ఉత్తమాశ్రయుడనే బిరుదు లేక ప్రతినామము ఉన్నట్లు తెలియచేస్తుంది. ఈ వంశీకులే అయిన గోవిందవర్మ, మాధవ వర్మలకి 'విక్రమాశ్రయ', 'జనాశ్రయ' అనే ప్రతి నామములు ఉండినట్లు ఇతర శాసనములనుంచి తెలుస్తున్నది.

''భగవచ్ఛ్రీ పర్వతస్వామి'' అన్న భాగానికి ''భగవంతుడైన శ్రీ పర్వతస్వామి'' అనే అర్థంకాని ''భగవత్స్వరూపులగు శ్రీ పర్వత స్వామి'' అని కాదు. ''పాదానుధ్యానా వాప్త'' అనగా పాదములను ధ్యానించుట వలన లభించిన అని అర్థము. దీనిలో ''పాద కమలములు'' ప్రసక్తి లేదు. ''విష్ణువిక్రమ నయ సంపదాం'' అంటే ''విష్ణువుయొక్క విక్రమము,నయమువంటి సంపద గలిగినవారు''అని అర్థం కాని. ''పరాక్రమము అను సంపద కలిగినవారు'' అని కాదు.

శాసనంలోని ''షడభిజ్ఞ ప్రతిహార దర్శనానుగ్రహ జనిత సుగత శాసనాభి ప్రసాదస్య'' అనే భాగానికి ''షడభిజ్ఞ ప్రతిహారి యొక్క దర్శనానుగ్రహము వలన సుగత సిద్ధాంతమునందు గౌరవము కలవాడును'' అనే అర్థం సమంజసంగా లేదు. షడభిజ్ఞ ప్రతిహారి అనే వ్యక్తిపేరు దురూహ్యం. అతనిని దర్శించడానికి, సుగత సిద్ధాంతం యందు గౌరవం కలగడానికీ సంబంధం ఏమిటో తెలియదు. షడభిజ్ఞ అనేది బుద్ధునికి మరి ఒక పేరు. ప్రతిహార అంటే మంత్రం అని అర్థం. దర్శనం అంటే సిద్ధాంతం అని అర్థం. సుగత శాసనము అంటే బుద్ధుని బోధన అని అర్థం. అప్పుడు ఈ శాసన భాగానికి బౌద్ధ మంత్రములను, సిద్ధాంతములను తెలుసుకోవడం వల్ల బుద్ధ బోధన అవగతం చేసుకొన్నవాడు'' అని అర్థము ఏర్పడుతుంది.

అలాగే మొదటిరేకు రెండవ ప్రక్క మాధవవర్మను గురించి చెప్పే భాగంలో అతడు సర్వమేధ రాజసూయాది క్రతువులను 'నిత్యము యథావిధిగా నాచరించిన వాడును' అని చెప్పబడ లేదు. అతడు నిత్యమును ఆచరించినవి శృతి విహితములైన కర్మలు. రాజసూయాది యాగములు కొన్ని దినముల పాటు సాగేవి. కాని ఒక్కరోజులో అయిపోయేవి కావు. అలాగే తూర్పు, దక్షిణ, పడమటి భాగములందు రేవానది నీటిచేత అలంకరింపబడిన భూభాగమునకు ప్రభువు అనే అర్థమున్ను సరియైనది కాదు. రేవా లేక నర్మదానది తూర్పునుంచి పడమటికి ప్రవహిస్తుంది. కాని దక్షిణానికీ, తూర్పుకు వంకలు తిరుగదు. శాసన పాఠాన్ని సరిగ్గా సంస్కరించుకుంటే తూర్పు పడమరలను దక్షిణమునను సముద్రతీరమున్ను (ఉత్తరమున) రేవానది వరకును వ్యాపించి ఉన్న భూభాగానికి ప్రభువు అనే సబబైన అర్థం ఏర్పడుతుంది. మొదటి విక్రమేంద్ర వర్మ ''మహాకవియై బౌద్ధమతావలంబియైనవాడును'' అని అనడం సమంజసం కాదు. ఈ రెండు అంశాలకూ సంబంధం లేదు. శాసనంలో ఈ రాజు మహాకవి అనీ, పరమ సౌగతుడనీ చెప్పబడి ఉన్నది. ఈ పరమ సౌగత శబ్దం ఇతర శాసనములలో కనిపించే పరమ మహేశ్వర, పరమ భాగవత అనే శబ్దములను పోలిఉన్నది. ఇంద్రభట్టారకవర్మని ''అనేక చాతుర్దంత విజయాధి గతాశేష చక్రవర్తి క్షేత్రాది పత్యస్య'' అని వర్ణించే శాసన భాగానికి ''బహు పర్యాయములు దిగ్విజయమొనర్చుట వలన సమస్త చక్రవర్తులయొక్క రాజ్యముల పైన నాధిపత్యము గలిగియున్నవాడు'' అనే అర్థం సరియైనది కాదు. ఈ భాగానికి ఈ రాజు నాలుగు దంతములుగల ఏనుగుల బలంతో అనేక యుద్ధములు చేసి, విజయం పొంది అందరు చక్రవర్తుల భూములమీదను ఆధిపత్యం పొందిన వాడు అని అర్థం. ఈ చాతుర్దంత సమరముల ప్రశంస విష్ణుకుండినుల ఇతర శాసనములలో కూడా కనిపిస్తుంది.

రెండవ విక్రమేంద్రవర్మను గురించి రెండవ రేకు మొదటి ప్రక్కగల కడపటి పంక్తికీ, రెండవ రేకు రెండవ ప్రక్కగల మొదటి పంక్తికీ శ్రీ శాస్త్రిగారు చెప్పిన అర్థం సరియైనదిగా కనిపించదు. ''..... గుణ సంపద్యోగ సామర్థ్యః'' అని ఈ పంక్తిని విడదీయాలి. అప్పుడు ఈ రాజు రాజర్షి గుణసంపద్యోగ సామర్థ్యములు కలవాడు అని చక్కని అర్థము ఏర్పడుతుంది. తర్వాత ఉన్న భాగానికి మంత్రులందరు చేరి శిశువుగా ఉండగానే ఈ రాజు మీద రాజ్య భారాన్ని ఆరోపించారు అని అర్థం ఏర్పడుతుంది. ''ధర్మ విజయ్'' అనే మాటకు ''విజయవంతుడును'' అనే అర్థము సరియైనది కాదు. ఆ పదానికి ''ధర్మము వలన లేక ధర్మముతో విజయ అయినవాడు అని అర్థం. ఈ పదం 'ధర్మ మహారాజ,' 'ధర్మ మహారాజ', 'ధర్మోద్ధరణ దీక్షితః' అనే ఇతర శాసనములలోని పదములను స్ఫురింప జేస్తుంది. అలాగే ఈ రాజు యొక్క ప్రశంసలో వచ్చే ''ఇత్థమవ బోధయతి'' అనే భాగానికి ''ధర్మ బోధనము'' చేయడము అనే అర్థం పొసగదు. దీనికి ''ఈ విధంగాతెలియపరుస్తున్నాడు''అని అర్థం. ఇది ఇతర శాసనములలో వచ్చే ''ఇద్దమ జ్ఞాపయతి'' అనే భాగానికి పాఠాంతరం అవుతుంది. తర్వాతవచ్చేమాధవరాజు ప్రశంసకున్ను శ్రీ శాస్త్రిగారుచెప్పిన

అర్థం సరియైనది కాదు. దానికి "ఇతర రాజవంశీకులు తమది గా చేసుకున్న పృథ్వీపతి పదాన్ని బలత్కారంగా లాగుకొనుట వల్ల వ్యక్తమయిన మహిమ కలవాడు" అని అర్థం. తర్వాత వచ్చే "సూతత్వృతేన" అనే మాటను శ్రీ శాస్త్రి గారు వదలివేశారు. దీనికీ, తర్వాత భాగానికీ విక్రమేంద్రవర్మ ఈ మాధవవర్మని సతుడుగా, అనగా దత్తుడుగా స్వీకరించాడనీ, దానికి విష్ణుకుండిన వంశంలో పెద్దలు అంగీకరించారనీ, మొదట ఈ మాధవవర్మ ఒక సామంత కులానికి చెందిన వాడనీ ఒక అర్థం స్ఫురిస్తుంది.

మూడవ రేకు మొదటి ప్రక్క రెండవ పంక్తిలోని "శ్రీ పృథ్వీమాల......", ఆరవ పంక్తిలోని "విరాజితయా" వరకూ గల భాగానికి శ్రీ శాస్త్రిగారు చెప్పిన అర్థం సరియైనదిగా కనిపించదు. ఈ భాగానికి పై మాధవవర్మకు ఏమీ సంబంధం కనిపించదు. ఇందులోని రెండు వాక్యాలు స్త్రీలింగ శబ్ద తృతీయ ఏకవచనంతో అంతమవుతాయి. ఇవి మూడవ రేకు రెండవ ప్రక్క రెండవ పంక్తిలోని "పరమ భట్టారికా మహాదేవ్యా" అనే భాగానికి అన్వయిస్తాయి, అప్పుడు ఈ భాగానికి ఆ మహాదేవి శ్రీ పృథ్వీయుల రాజవంశంలో జన్మించినదనీ, శ్రీ పార్వతేయులకు ముందూ వెనకా ఉండిన రాజులలో నిరుపమంగా విరాజిల్లినది అని అర్థం ఏర్పడుతుంది లేదా శాసన భాగంలోని ఆరవ పంక్తిలో "విరాజితయా" లోని "యా" లేఖక ప్రమాదమని వదలివేస్తే "గోవిందరాజు దక్షిణా పథంలో శ్రీ పార్వతేయులకు పూర్వపరములలో ఉండిన రాజులనే హారంలో కౌస్తుభమణివలె ప్రకాశించాడు" అనే అర్థం ఏర్పడుతుంది. లేదా శాసన మూలమును ఇంకా సంస్కరించి ఈ గోవిందరాజు శ్రీ పృథ్వీమూల రాజ వంశీయుడనిన్నీ చెప్పవచ్చును.

అలాగే "సర్వబాధా పరిహారేణ" అనే పదానికి అన్ని విఘ్నములను తొలగించి అనే అర్థం సరియైనది కాదు. ఈ బాధా శబ్దానికి ప్రభుత్వం కలిగించే ఇబ్బందులు అని అర్థం. "అఖేట ప్రవేశ్యం, అలోణ ఖాదకం" మొదలైన ఇలాటి బాధలని ఇతర శాసనములద్వారా తెలుస్తున్నది. అదేవిధంగా శాసనాంత్య భాగములో 2, 3 పంక్తులలో విక్రమేంద్రవర్మ "మొదటగా శక్రాభిదానము అను పట్టణమును...దానము చేసెను" అని ఎక్కడా చెప్పబడలేదు. పల్లవుని జయించి తిరిగివస్తూ మొదట శక్ర లేక ఇంద్రనగరానికి వచ్చి, విక్రమేంద్రవర్మ ఈ శాసనాన్ని ఇచ్చాడు అని ఈ భాగానికి అర్థం. ఈ శాసనములోనే ఈ రాజు బౌద్ధ విహారానికి "ఇరెణ్డరో" అనే గ్రామాన్ని దానం చేసినట్లు చెప్పబడి ఉన్నదికదా !

కొన్ని సమస్యలు

పై ఇంద్రపాలనగర శాసములు రెండూ ఎన్నో సమస్యలను బయలుదేర తీస్తున్నవి.

1. రెండవ విక్రమేంద్రవర్మ ఒక సామంత రాజవంశంలోని వాడయిన మాధవరాజును తన కుమారునిగా స్వీకరించాడా? అనేది ఒక సమస్య.

2. ఈ గోవిందరాజు బలిమిచేత లాగుకొనిన పృథివీపతి పదము ఏ అన్యరాజులది?

3. పరమ భట్టారికా మహాదేవి పుట్టిన వంశములోని శ్రీ పృథివీ మూలరాజు ఎవడు? విజయకొండలి పురంనుంచి తన 25వ పరిపాలన సంవత్సరములో తాను పాక విషయంలోని చూయపాక గ్రామాన్ని దానం చేసిన పృథివీ మూలడనే ఒక రాజు ఉండేవాడు. ఈ పృథివీ మూలులు ఇద్దరూ ఒకరేనా?

3 ఏ. ఈ మహాదేవికీ విక్రమేంద్రవర్మకుగల సంబంధం ఏమిటి ?

4. ఈ మహాదేవితో కలిపి చెప్పబడిన గోవిందరాజు ఎవడు? వీరిద్దరికీ ఏమైనా బాంధవ్యం ఉన్నదా? ఒక విష్ణుకుండిన రాణి ఈ రాజు వైభవాన్ని వ్యక్తపరచవలెననీ కోరిందీ అంటే ఈ రాజుకీ, విష్ణుకుండినులకీ ఏదో సంబంధమో, బాంధవ్యమో ఉండాలి అని తోస్తున్నది.

5. విక్రమేంద్రవర్మ తన 11వ రాజ్య సంవత్సరములో జయించిన సింహాఖ్యుడైన పల్లవరాజు ఎవడు ?

6 గోవిందవర్మ శాసనములోని మూడు పురుషాంతరముల రాజులకీ, విక్రమేంద్రవర్మ శాసనమునుంచి తెలియవచ్చే ఐదు పురుషాంతరముల రాజులకు గల సంబంధం ఏమిటి ?

7. ఈ గోవిందవర్మ స్వభుజ బలంచేత స్వరాజ్యమును ఎందుకు సంపాదించవలసి వచ్చింది ? దీనినిబట్టి ఇతడు విష్ణుకుండినుల మూలవంశానికి చెందినవాడు కాడనీ, అందువల్లనే ఆ మూలవంశంయొక్క రాజ్యాన్ని బలిమిచేత లాగుకొన్నాడనీ అనుమానము కలుగుతుంది.

8. ఈ గోవిందవర్మ అన్యసామంతులనుంచి తన ప్రతాపంవల్ల ఒక రాజ్యాన్ని సంపాదించాడని శాసనంలో ఉన్నది ఆ రాజ్యం ఏది? ఆ సామంతులు ఎవరు?

సూచికలు :

1) భారతి జూన్ 1965. పుట 17, 2) అదే పుట 28. **3) Early Dynasties of Andhra Desa P. 421 4) Calcutta University. Dept of letters. P. 404. 5) Gopalachari P. 200-206, DCS 98-104, JIH XL-3 P. 570-575 (MRR),** 6) అదే. పుట 580, 7) అదే. పుట 574–576 8) అదే పు. 365 **9) Nagarjunakonda Souvenir (MRR)**

గ్రామాల్లో గంగావతరణం...

త్రాగేందుకు పరిశుభ్రమైన మంచినీరు మన ప్రాథమిక అవసరాల్లో ఒకటి.

ఆంధ్రప్రదేశ్ ప్రణాళికల్లో గ్రామీణ నీటిసరఫరా పథకాలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది.

ఈ పథకాలను చురుకుగా అమలు జరిపేందుకే **1978-79** బడ్జెట్‌లో రు. **7.25** కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరిగింది.

ఈ మొత్తంలో రిగ్గుల సేకరణ, బోరింగు బావుల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థకు ఒక కోటి రూపాయలు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న బావుల్లో నీటి సరఫరాను మెరుగుపర్చడానికి కొన్ని ప్రాంతాలలో తటాకాలను నిర్మిస్తున్నారు.

మన ఆంధ్రప్రదేశ్‌లోని కోట్లాది ప్రజానీకం మంచినీటి అవసరాన్ని తీర్చడానికే ఈ భగీరథ కృషి.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హైదరాబాదు.

20/78-79

లూ సన్ కథ

రేపు

"చడీ చప్పుడూ లేదు. కుర్రాడి కేమైంది?"

సారా గ్లాసు చేతపట్టుకుని, పక్కింటి వైపు చూస్తూ అన్నాడు కుంగ్.

పక్కనేవున్న ఆహ్-వూ తన గ్లాసు కిందపెట్టి, కుంగ్ వీపులో ఒక్కటి చరిచి,

"చాల్లేవోయ్, నీ ఆదుర్దా" అన్నాడు.

లూచెన్ వెనకటి తరానికి చెందిన చిన్న వూరు. జనం పెందరాళే నిద్రపోతారు. అర్ధరాత్రికి ఆవూళ్లో రెండే రెండిళ్లల్లో దీపాలు వెలుగుతుంటాయి. ఒకటి: తాగుబోతులు గ్లాసుమీద గ్లాసు ఖాళీచేసే ప్రాస్పరిటీ టావెర్న్. మరోటి: దాని పక్కనే నాల్గోషాన్ విధవ పెళ్లాం నివసించే యిల్లు. రెండేళ్లక్రితం భర్తను పోగొట్టుకున్న ఈవిడకు, తననూ, తన మూడేళ్ల కొడుకునూ పోషించుకోటానికి నూలు వడకటం తప్ప మరే ఆధారమూ లేదు. ఆవిడకూడా అంతర్రాత్రిదాకా మేలుకుని వుండటానికి అదీ కారణం.

గత కొద్ది రోజులుగా ఆ యింట్లో రాట్నం చప్పుడు వినిపించటం లేదన్నది వాస్తవమే. ఆ పరిసరాల్లో ఆవేళప్పుడు మెలకువగా వుండేవికూడా ఆ రెండిళ్లే కావటంతో కుంగ్, అతనిమిత్రులు మాత్రమే ఆ యింట్లో అలికిడి వుందో లేదో గమనించగలరు.

వీపుదెబ్బతో ఈ లోకంలోకి వచ్చిపడ్డ కుంగ్ గ్లాసు ఖాళీచేసి కూనిరాగం అందుకున్నాడు.

ఈ లోకంలో మిగిలిన తన సర్వస్వం — కొడుకు పావో — మెర్‌ను చేతుల్లో పెట్టుకుని పక్కింటి నాల్గోషాన్ విధవ భార్య పక్క చివర్న కూచుంది. నేలమీద రాట్నం నిశ్చలంగా వుంది. చిన్న దీపపు గుడ్డి వెలుగు జబ్బుతో ఎర్రబడిన ఆ కుర్రాడి మొహంమీద పడుతోంది.

"పూజలుచేయించాను. దేవుళ్లకు మొక్కుకున్నాను. మంచి వైద్యులకు చూపించాను. ఐనా వీడికి తగ్గకపోతే నేనేం చెయ్యను? ఇంక డాక్టర్ హో దగ్గరకు తీసికెళ్లాలి....కాని, వీడు రాత్రివూటే యిలా చేస్తున్నాడేమో — తెల్లారితే జబ్బు తగ్గి మళ్లీ మామూలుగా వూపిరి తీసుకోగలడేమో — చాలా జబ్బులు యిలాగే వుంటాయి. రాత్రివూట హైరానా చేస్తారు పిల్లలు" అనుకుంటోంది ఆవిడ.

ఆమె అమాయకురాలు. 'కాని' అనే ఆ పదం ఎంత కీలకమైనదో, ఎంత భయంకరమైనదో ఆమెకు తెలియదు. ఈ 'కాని' వల్లే మంచి, చెడుగానూ చెడు, మంచిగానూ మారుతుంది. వేసవి రాత్రుళ్లు పొట్టి. కుంగ్ కూనిరాగం ముగిసేసరికి తూర్పు తెల్లబడింది.

ఉదయం కోసమైన నిరీక్షణ అందరికి మల్లే సులభంగా లేదామెకు. ప్రతీ నిమిషమూ భారంగా, బాధగా గడిచింది. పిల్లాడు ఒక్కొక్కసారి శ్వాస తీసుకోవటమే ఒక్కొక్క యుగాది లాగా తోచింది. కాని, చివరికి ఎలాగైతేనేం, తెల్లారింది. ఉదయపుఎండ వచ్చి దీపం వెలుగును మింగేసింది. ఊపిరి తీసుకున్నప్పుడల్లా ఆ పిల్లాడి ముక్కు పుటాలు అదురుతున్నాయి.

ఏడ్వబోయి, అశుభ సూచకమని, లోపలే అణచుకుంది. కాని తనేం చెయ్యగలదు? ఒకే ఒక్క ఆశ. పిల్లాణ్ణి డాక్టర్‌హో దగ్గరకు తీసికెళ్లాలి.

అమాయకురాలే ఐనప్పటికీ ఆమెకూడా నిర్ణయాలు తీసుకోగలదు. లేచి, అల్మైరా తెరిచి, తను దాచుకున్న, పొదుపు చేసిన సంపాదనంతా — పదమూడు డాలర్లపై చిల్లర—తీసుకుని, ఇంటికి తాళంవేసి, కొడుకును బుజానేసుకుని డాక్టరింటి కెళ్లింది.

అప్పటికే డాక్టరుకోసం మరో నలుగురు కాచుకుని వున్నారు. మొదట ఓ నలభై చిల్లర నాణాలిచ్చి డాక్టరును చూడ్డానికి టోకెన్ తీసుకుంది. డాక్టర్ పిల్లాడి నాడి పరీక్షించాడు.

"వీడికేమైంది డాక్టర్?"

"జీర్ణకోశంలో నలత"

"సీరియస్‌గా వుందా? వీడు..."

"మొదట ఈ రెండు మందులూ వాడు"

"ఊపిరి తీసుకోడంలో యిబ్బంది వుంది."

"గుండె జబ్బుతో వూపిరి తిత్తులుకూడా పాడైనాయి..."

ఆ వాక్యం ముగించకుండానే డాక్టరు కళ్లుమూసుకున్నాడు. ఆమె మాట్లాడలేదు. ఎదురుగా కూర్చున్న కాంపౌండరు మందు చీటీ రాసిచ్చాడు.

"ఇదిగో ఈ మాత్రలు కొనుక్కో. వీటితో పిల్లాడు కోలుకుంటాడు. ఇవి చియావాళ్ల మందుల కొట్లో దొరుకుతాయి."

ఆ కాగితం తీసుకుని ఆలోచిస్తూ నడిచిందామె.

ఆమె అమాయకురాలే కావచ్చుగాని తనకు డాక్టరిల్లూ, మందుల కొట్టూ, తనిల్లూ కలిసి ఓ త్రికోణంలాగ తయారైనాయని తెలుసు. అందువల్లే మందు కొనుక్కొని యిల్లు చేరటం మంచిదనుకుని, గబగబా నడిచి కొట్టు చేరుకుంది. కొట్టతను చీటీ చదివి తిరిగ్గా మందులు పొట్లం కట్టాడు. కొడుకును చేతుల్లో అదుముకుని ఆమె నిరీక్షించింది ఉన్నట్టుండి, ఆ పిల్లాడు చివాలున తన బలహీనమైన చెయ్యి వెనకకుచాచి జుట్టు పీక్కున్నాడు. ఇలా వాడిదివర కెప్పుడూ ఛెయ్యలేదు ఆమె భయంతో వణికి పోయింది

పొద్దెక్కింది మందునూ, కొడుకునూ చేతుల్లో పట్టుకుని నడుస్తున్న ఆమెకు తన చేతుల మీద బరువు పెరుగుతున్నట్టనిపించింది. కుర్రాడి చిరాకూ, అవస్థా కలిసి ఆమెకు ఆ కాస్త దూరమూ రెట్టింపుచేశాయి చివరకు నడవలేక దారిలో ఓ యింటి అరుగు మీద కాసేపు కూర్చుని సేద తీర్చుకుంది ఒళ్లంతా చమటపట్టి గుడ్డలు ఒంటి కతుక్కుపోయాయని తను అప్పుడుగాని గ్రహించలేదు. పిల్లాడు నిద్రపోతున్నట్టుగా వున్నాడు నడవటానికి లేచే సరికి మళ్లీ బరువు పెరిగింది.

“ఆ పిల్లాణ్ణిటివ్వు నేనెత్తుకుంటాను.” పక్కన నిద్ర కళ్లతో ఆహ్—వూ.

ఏ దేవుడైనావచ్చి తననీ ఆపద నించి రక్షించాలని మనసులో మొక్కుకుంటూనే వున్నప్పటికీ, తన దేవుడీ ఆహ్ — వూ రూపాన రావటం ఆమెకు నచ్చలేదు. కాని ఆహ్ — వూ సహాయం చెయ్యాలనుకున్నప్పుడు ఎదటివాళ్ల అంగీకారం కోసం ఆగడు. వద్దని ఎంత మొత్తుకున్నా చివరికి అంగీకరించక తప్పలేదు. ఆమె రొమ్ముకీ, పిల్లాడికీ మధ్య చెయ్యి పెట్టి మరీ పిల్లాణ్ణి తీసుకున్నాడు ఆహ్వూ. ఆమెకు తన రొమ్ము మీద చురక పెట్టినట్లైంది. మొహం ఎర్రబడింది.

ఆమె సరిగా జవాబులు చెప్పకపోయినా, దారిలో ఆహ్—వూ చాలా ప్రశ్నలు వేశాడు. కాస్త దూరం నడిచాక, కుర్రాణ్ణి తిరిగి యిచ్చేసి, “ఇక్కడో మిత్రుడింట్లో విందున్నది” అంటూ వెళ్లిపోయాడు. ఇల్లు దగ్గిర పడింది. దూరంనించే వాంగ్ పిన్ని కేకేసింది

“ఎలా వుంది నీ కొడుక్కి ? డాక్టరు చూశాడా?” “ఆఁ చూశాడు. పిన్నీ నువ్వు పెద్దదానివి. ఎంతో అనుభవ మున్నదానివి కదా, వీణ్ణి చూసి ఒక్కమాట చెప్పు. ఎలావున్నాడంటావు?”

“ఊఁ”

“అంటే ?”

“హుఁ.”

వాంగ్ పిన్ని పిల్లాణ్ణి పరీక్షించి రెండుసార్లు అడ్డంగానూ, రెండుసార్లు నిలువుగానూ తలపంకించింది.

పిల్లాడికి మందేసేసరికి మధ్యాహ్నమైంది. కొడుకును పరికించి చూసింది. ప్రశాంతంగా వుంది మొహం. కాసేపటికి వాడు అకస్మాత్తుగా కళ్ళు తెరిచి, ‘మ్మా’ అని మళ్లీ కళ్ళు మూసుకున్నాడు. త్వరలోనే వాడి నుదిటిమీదా, ముక్కుమీదా చమట పట్టింది. తాకితే జిగటగా వుంది. భయంతో ఛాతీమీద చెయ్యేసి చూసి, బిగ్గరగా ఏడ్చింది.

పిల్లాడి వూపిరి క్రమంగా తగ్గి ఆగిపోయింది. ఆమె ఏడుపు శోకమైంది. జనం పోగయ్యారు—వాంగ్ పిన్ని, ఆహ్వూలాంటి వాళ్లు గదిలోనూ, సారాకొట్టు యజమానీ, కుంగ్‌లాంటివాళ్లు గది వెలుపలా.

చైనీస్ ఆచారం “నోట్లను హారంకట్టి కాల్చాలి” అంటూ వాంగ్ పిన్ని యింట్లోవున్న కర్రసామానూ, గుడ్డలూ మదుపు పెట్టుకుని, వచ్చి సహాయం చేస్తున్న వాళ్లకు భోజనాలు పెట్టటానికి రెండు డాలర్లు అప్పిచ్చింది.

మొదటి సమస్య: శవపేటిక. అందుగ్గాను, ఆ తల్లి తన దగ్గర యింకా మిగిలివున్న వెండి చెవిపోగులజతా, బంగారుపూత పూసిన వెండి జడపిన్నూ సారాకొట్టు యజమానికిచ్చి, అతడి హామీతో, సగం ఖరీదు నగదూ, మిగతాసగం అప్పుపెట్టి శవపేటిక కొనుక్కుంది. ఆహ్—వూ సహాయం చెయ్యటానికి ముందుకొచ్చాడు గాని, వాంగ్ పిన్ని తెల్లారి శవపేటికమోసే సహాయంతప్ప, వేరే ఏ సహాయమూ అతడు చెయ్యటానికి ఒప్పుకోలేదు.

“ముసల్లంజ...” అంటూ తిట్టుకున్నాడు ఆహ్వూ.

కాసేపటికి సారాకొట్టు యజమాని తిరిగివచ్చి, శవపేటికను ప్రత్యేకంగా తయారుచేస్తున్నారనీ, మర్నాటి వుదయానికి గాని అది సిద్ధం కాదనీ చెప్పాడు. కాని అప్పటికే మిగతావాళ్ల భోజనాలై పోయాయి. పెందరాళే గూళ్లకుచేరే ఆ జనం వెళ్లిపోయారు. కూనిరాగాల కుంగ్‌కు జతగా ఆహ్వూ మాత్రం సారాకొట్టు గుమ్మంలో తాగుతూ కూర్చున్నాడు.

ఈలోగా తల్లి ఏడుస్తూనే వుంది. పక్కమీద కొడుకు శవం. నేలమీద నిశ్చలంగావున్న రాట్నం. చాలా సేపటికి, కార్చటానికి యింక కన్నీళ్లంటూ మిగలనప్పుడు, కళ్లు తెరిచి చుట్టూ పరికించింది ఆశ్చర్యంతో.

‘ఇది అసంభవం’ అనుకుంది. ‘ఇదంతా కేవలం కల. ఈ కలలోంచి మేల్కొనేసరికి రేపుదయం పక్కమీద పడుకునే వుంటాను. నా పక్కనే పావో—ఎర్ ముడుచుకుని వుంటాడు. కాసేపట్లోనే వాడు లేచి ‘మ్మా’ అంటూ మీదపడతాడు. చిరుత పులి లాగ గంతులేస్తాడు.’

కుంగ్ పాట ఆపేశాడు. సారాకొట్టులో దీపాలు తీసేశారు. తల్లి కళ్లు తెరుచుకుని చూస్తూ కూర్చుంది. కాని జరిగిందంతా నమ్మలేకపోతోంది. కాకులరిచాయి. మూసిన కిటికీ పగుళ్లలోంచి తూర్పు వెలుగు దూసుకుని వచ్చింది.

ఆ తొలివెలుగు, ఎర్రబడి, మరి కాసేపటికి సూర్యుడే కప్పు మీదికి వచ్చాడు. అప్పటిదాకా అలాగే కూర్చున్న ఆమె తలుపు చప్పుడైతే వెళ్లి గొళ్లెం తీసింది.

ఎవరో కొత్తవ్యక్తి. వెనక వాంగ్ పిన్ని.

శవపేటిక వచ్చింది.

శవపేటికమీద మూత బిగించటం మధ్యాహ్నందాకా వీలుపడలేదు. ప్రతిసారీ ఏడుపు. ఆ మూత పెట్టెయ్యడం భరించలేదు. చివరికి వాంగ్ పిన్నికి విసుగొచ్చి, కోపంగా ఆమెను వెనక్కు లాగి మరీ మూత పెట్టించేసింది.

తను కొడుకోసం ఏం చెయ్యలేదని ? — ఏదీ యింకా మరచిపోలేదు. నిన్ననేకదా ఆ నోట్లహారం కాల్చింది? ఈ వుదయం మరణించిన వాళ్ల ఆత్మ స్వర్గానికి చేరుకోటానికి అవసరమైన తతంగమంతా తు.చ. తప్పకుండా చేసింది. చివరికి కొడుక్కు కొత్త దుస్తులు వేసి మరీ శవపేటికలో పడుకోపెట్టింది. ఇంకా అందులో తలగడా, పక్కన వాడి కిష్టమైన బొమ్మలు—ఓ మట్టిబొమ్మా, రెండు చెక్కపిడతలూ, రెండు గాజుసీసాలూ—కూడా పెట్టింది వాంగ్ పిన్ని. ఏమైనా మరచిపోయావేమో జ్ఞాపకం చేసుకొమ్మంది. కాని, తనేం మరచిపోయిందని?

ఆహ్‌—వూ రాకపోవటంతో, సారాకొట్టు యజమాని ఒక్కొక్కరికీ రెండువందలపది రాగి నాణాల చొప్పున యిద్దరు కూలీలను మాట్లాడి (డబ్బులు ఈవిడే యిస్తుంది), వాళ్లే శవపేటిక స్మశానానికి తీసికెళ్లి, గొయ్యితీసి, పూడ్చే ఏర్పాటు చేశాడు

వాంగ్ పిన్ని భోజనాలు వండటంలో సహాయం చేసింది. ఆ భోజనాలకు—చిల్లిగవ్వ సాయమైనా చెయ్యని, ఒక్క సానుభూతి వాక్యమైనా పలకని వాళ్లతోసహా—ఎందర్నో ఆహ్వానించారు. మరి కాసేపటికి సాయింత్రమైంది. ఇంకా త్రేన్పులు తీస్తూనే జనం యిళ్లకెళ్లిపోయారు.

మొదట ఆమెకు తల తిరిగినట్లైంది గాని నెమ్మదిగా స్తిమితపర్చుకుంది. ఆ క్షణాన, పరిసరాలు, వస్తువులు వింతగా, విచిత్రంగా కనిపించాయి. ఇదివరకెన్నడూ జరగనిది, ఎప్పుడూ జరగదు అనుకున్నది జరిగింది. ఆలోచించినకొద్దీ ఆశ్చర్యం పెరిగింది. ముఖ్యంగా గది. ఆ గది అకస్మాత్తుగా యింత నిశ్శబ్దంగా మారిపోవటం ఆమెకు మరీ ఆశ్చర్యం కలిగించింది.

లేచి దీపం వెలిగించింది. గదిలో నిశ్శబ్దం పెరిగింది. ఇబ్బందిగా తలుపుదాకా నడిచి, వెనక్కువచ్చి పక్కమీద వాలింది పక్కనే నేలమీద నిశ్చలంగా, నిశ్శబ్దంగా పడివున్న రాట్నం. కూర్చోవటానికీ, నించోవటానికీ కూడా శక్తిలేక చుట్టూ పరికించి చూసింది. గది నిశ్శబ్దంగానే గాదు, విశాలంగానూ, పెద్దదిగానూ, గదిలోని వస్తువులన్నీ ఖాళీగానూ కనిపించాయి. ఈ అతి పెద్ద గదిలో చిక్కుకుపోయిన తనను, చుట్టూ వ్యాపించిన శూన్యం మింగివేయగా, ఊపిరి తీసుకోలేనట్లనిపించింది.

తన కొడుకు యిక లేడన్న విషయం గ్రహించింది. ఖాళీ గదిని చూడదలుచుకోక, దీపం ఆర్పేసి, ఏడవటానికీ, ఆలోచించటానికీ పక్కమీద వాలింది. తను నూలు వడికేటప్పుడు, కొడుకు మిఠాయి తింటూ ఎలా పక్కన కూర్చునేవాడో జ్ఞాపకం వచ్చింది. నల్లటి చిన్ని చిన్ని కళ్లతో తనను చూస్తూ సాలోచనగా,

'మామ్మ, నాన్న తాయిలాలమ్ముకొచ్చేవాడుగదూ! నేనూ పెద్దైం తర్వాత అవే అమ్మి బోలెడు డబ్బు తెస్తాను. ఆ డబ్బులన్నీ నీకే యిస్తాను'' అనేవాడు పావో—ఎర్.

అలాంటప్పుడు, తను వడికే ప్రతీ అంగుళం దారం కూడా, ఎంతో ముఖ్యంగా, అవసరంగా, అర్థవంతంగా కనిపించేది. కాని యిప్పుడు? ఆమె యిప్పటి గురించి ఆలోచించటమేలేదు. నేను చెప్పలేదూ, ఆమె అమాయకురాలని. ఆమె పరిష్కారాన్ని గురించి ఏమాలోచించగలదు? గది నిశ్శబ్దంగా, విశాలంగా, ఖాళీగా వుందని మాత్రమే ఆమెకు తెలుసు.

ఎంత అమాయకురాలైనా, చచ్చినవాళ్లు తిరిగి రారనీ, తన కొడుకును మరెప్పుడూ తను చూడలేదనీ ఆమెకు తెలుసు. ఒక నిట్టూర్పు విడిచి, 'బాబూ, నువ్వింకా యిక్కడే వుంటావు. నా కలల్లోనైనా నిన్ను చూడనీ' అంది అలా, కలలోనైనా కొడుకును మళ్లీ చూడొచ్చునని, నిద్రపోయే ప్రయత్నంలో కళ్లు మూసుకొంటే, నిశ్శబ్దమూ, విశాలమూ, శూన్యమూ ఐన ఆ గదిలో ఆమెకు తన భారమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలే వినిపించాయి.

చివరికామె క్కాస్త కునుకుపట్టింది. గదంతా స్తబ్దంగా మారిపోయింది. కుంగ్ కూనిరాగం ఆపి,

'నీమీద జాలేస్తోంది, నా ప్రేయసీ, ఒంటరిగా...' అంటూ అందుకున్నాడు.

ఆహ్‌వూ, తూలుతూ అతడి రెక్క పట్టుకుని నడిచిపోయాడు.

ఆమె నిద్రపోతోంది. కుంగ్, ఇతర్లూ వెళ్లిపోయారు. సారాకొట్టు తలుపులు ఆ రోజుకు మూతబడ్డాయి. లూ చెన్ గ్రామం నిశ్శబ్దపు ఒడిలో ఒదిగిపోయింది. 'రేపు'గా మారాలనే కోరికతో రాత్రి నెమ్మదిగా కదుల్తోంది. చీకట్లో దాగి కుక్కలు అరుస్తున్నాయి.

స్వేచ్ఛానువాదం : శ్రీ ఎమ్. పార్థసారధి

కన్యాశుల్కంలో అసభ్యత ఉన్నదా?

ఆగస్టు 1978 'భారతి'లో ''వేమన సూక్తులు'' అనే గ్రంథాన్ని సమీక్షిస్తూ, శ్రీ పులిచెర్ల సాంబశివరావుగారు ''కన్యాశుల్క'' నాటకంపై క్రింది విసురు విసరినారు :

''మృచ్ఛకటికంలాంటి నాటకాలు ప్రాచీనాలైనా కన్యాశుల్కంలాంటి ఆధునిక నాటకాలు వెయ్యి అయినా చెప్పలేని క్లిష్టమైన సాంఘిక పరిస్థితులను వర్ణించి వున్నాయి. ఇక కన్యాశుల్కం సంగతి చూద్దాం. కన్యాశుల్కంలో అసభ్యకర విషయాలే ప్రాధాన్యం వహించాయి. అదీ సార్వకాలికమైన సమస్యకాదు. ఇప్పుడెవరైనా కన్యాశుల్కం యథాతథంగా ప్రదర్శిస్తే సామాన్య జనంకూడా అందులోని బూతులను చూచి తుపుక్కున ఉమ్మేస్తారు! సరే గురజాడ సంగతి అటుంచండి.''

పై వాక్యాలు రెండు విషయాలను స్పష్టం చేస్తున్నవి. ఒకటి, శ్రీ పులిచెర్లవారికి ''కన్యాశుల్కం'' అంటే ఈసడింపు అనీ (''కన్యాశుల్కం...వెయ్యి అయినా'') రెండు, అందుకే వారు దానిని చదువలేదనీ. శ్రీ పులిచెర్ల గారికి గురజాడ రచనలంటేనే సరిపోదనే సంగతి నాకితః పూర్వమే తెలుసు. అచ్చమైన ఈసడింపు (Genuine prejudice) ఉన్నవాడే పెద్దమనిషి (Gentleman) అని చెస్టర్‌టన్ అన్నట్లు జ్ఞాపకం. గురజాడపై అయిష్టం శ్రీ పులిచెర్లగారి కుండడంలో నా అభ్యంతరంలేదు. అయినా వారు తమ అభిప్రాయాన్ని అంత ఖరాఖండిగా చెప్పడానికి ముందు ''కన్యాశుల్కం'' చదివి ఉండాల్సింది అని నా అభ్యంతరం.

''మృచ్ఛకటికం'' గొప్పది కావడానికి ''కన్యాశుల్కం'' తక్కువది కానక్కరలేదు. ''మృచ్ఛకటికం''లో ఆ కాలపు సాంఘిక పరిస్థితులు వర్ణించబడడం నిజమే. అది గొప్పనాటకం కావడానికీ, ఇతర సంస్కృత నాటకాలవలె మూలబడక ప్రాచ్యపాశ్చాత్యదేశాలలో ఆదరింపబడడానికీ, ఈ అంశం ముఖ్యం. మధురవాణి పాత్ర, వసంతసేన పాత్రకు కొంతవరకు అనుకరణమే అయినా వసంతసేన ఉండి వున్న సాంఘిక పరిస్థితులూ, మధురవాణి ఉండిన సాంఘిక పరిస్థితులూ వేర్వేరు. వసంతసేన ధనికురాలు. స్వేచ్ఛా స్త్రీయేకాని మధురవాణివలె పణ్యాంగనకాదు. మధురవాణి జీవికకై దేహాన్నమ్ముకునే ఆడుది. వసంతసేనను చేరదీయడానికి కులీనుడు చారుదత్తుడున్నాడు. తాను కుటుంబీ అయినాసరే! మరి మధురవాణిని ఎవరూ చేసుకోరే! మధురవాణి అంటె ఎంతో ఎడ్మిరేషన్‌వున్న సౌజన్యారావు పంతులులాంటి సౌజన్యుడు కూడా వెనుకాడుతాడే! చారుదత్త వసంతసేనలు కలియడంతో మృచ్ఛకటికం ''ప్రకరణం'' ముగిసింది. కన్యాశుల్కంలో మధురవాణి కానీ, సౌజన్యారావు పంతులుకానీ తమ తమ వ్రతాలను వదలలేదు. ఈ వారి సంభాషణ వినండి :

''మధు : నా ఫీజు (ముద్దు) యిచ్చి మరీ నిద్రించండి.
సౌజ : బీదవాణ్ణి యిచ్చుకోలేనే.
మధు : నాకు లోకంలో ధనవంతా అదే అనుకొన్నానే.
సౌజ : నీవు సొగసరివి. ముద్దు చేదనికాదు. వ్రతభంగం కదా అని దిగులు (ముద్దు పెట్టుకొన బోవును)
మధు : ఆగండి.
సౌజ : ఏమి ?
మధు : నా వ్రతమో ?
సౌజ : యేమిటది ?
మధు : చెడని వారిని చెడగొట్టవద్దని మా తల్లి చెప్పింది.
సౌజ : చెప్పితే
మధు : అందుచేత మిమ్మల్ని ముద్దు పెట్టుకోనివ్వను
సౌజ : కృతజ్ఞుడనై వున్నాను.''

దేవలోకం నుంచి దేవతలువచ్చి పొంచి వినదలచుకొనే సంభాషణ ఇది. ఇందు మధురవాణీ సౌజన్యారావులు ధర్మనిష్ఠావ్రతులుగ చిత్రింపబడ్డారు. ప్రాచీన సంస్కృత మహా నాటకాలలో ఎచ్చట కూడా ఇంతటి గొప్పదైన సన్నివేశంకనబడదు. శకుంతలా దుష్యంతుల కంటే, ఊర్వశీ పురూరవుల కంటే, వాసవదత్తా ఉదయనుల కంటే, మలయవతీ జీమూతవాహనుల కంటే మధురవాణీ సౌజన్యారావులే ఎక్కువ ఆదర్శప్రాయులుగా కనబడుతున్నారు. మధురవాణికీ, సౌజన్యారావు పంతులుకూ మొదటి నుండి ప్రేమాయణం కల్పించి వుంటే (నాటకమున ఇది అసాధ్యం ఏమీకాదు), ''కన్యాశుల్కం'', ''మృచ్ఛకటికం'' వలె ''ప్రకరణం'' అనే రూపకభేదం అయి వుండేది. అప్పుడు శ్రీ పులిచెర్లగారి వంటి వారికి తృప్తిని ఇచ్చి వుండేది. వారికప్పుడు ''కన్యాశుల్కం''లో అసభ్య విషయాలు కన్పించి వుండవు కానీ ''కన్యాశుల్క'' రచనోద్దేశం వేఱు. శ్రీ పులిచెర్లవారు నిస్పృహ చెందాల్సిందే. ఆక్షేపణ చేయవలసిందే. ఏ రూపక భేదం కాక కన్యాశుల్కం ఒక భయంకర సాంఘిక ప్రహసనం అయింది. పై పై హాస్యం, చమత్కారం వెనుక అగాధ విషాదం వుంది నాటకంలో. మధురవాణి వేశ్యావృత్తి వదిలేసి ఎలా బ్రతుకుతుందట? బుచ్చమ్మ మీనాక్షి లేమవుతారు? ఎవరికీ తెలియకుండ సుబ్బిని అగ్నిహోత్రావధాని ఇంకొక ముసలివాడికి కట్టబెడితే? లుబ్ధావధాని అగ్నిహోత్రావధానుల వంటి నక్కలు, గిరీశం రామప్పంతుళ్ల లాంటి తోడేళ్లు, బుచ్చమ్మ సుబ్బులు అనే భీతహరిణాల్ని వదలతాయా? అనే ఆందోళనకర విషయాలు మనల్ని కలవరపెడుతూనే వుంటాయి. ''కన్యాశుల్కం''లో ఉండే అగాధత, క్రాంతదృష్టి, ''మృచ్ఛకటికం''లో ఎక్కడిదీ? అందుకే ''కన్యాశుల్కం''తో తులదూగే ప్రాచీన రూపకం ఒక్క మృచ్ఛకటికమే అంటే రెండు నాటకాలకూ న్యాయం చేకూర్చినట్లవుతుంది.

''కన్యాశుల్కం''లో ''అసభ్యకర విషయాలే ప్రాధాన్యంవహించాయి'' అని శ్రీ పులిచెర్ల వారంటారు. నేనూ ''కన్యాశుల్కం'' చదివి

నాను. దానిపై కొంత వ్రాసినానుకూడా (**చూ**. నా ''కన్యాశుల్క నాటక కళ'') నాకెక్కడా అసభ్యతకన్పడలేదు. వేశ్య, ముండమోపి వంటలక్క, పడుచు విధవాడ బడుచులు, మిండగాండ్లు, కోర్టు పక్షులు, అగ్గిపుల్ల మాస్టర్లు, వక్కాకు వకీళ్లు, లంచగొండి అధికార్లు, హాస్య వేసగాడు, లోఫరు, తాగుబోతులు, దొంగ సన్నాసులు, ఆశాపాతకులు, **మూఢులు** మొదలైన పాత్రలు ఒక రూపకంలో వున్నాయనుకోండి. అది భాణం కావచ్చు. వీథికావచ్చు. ప్రహసనం కావచ్చు. ఏ ఒక్క లేక రెండు పాత్రలుంటే చాలు **ఈ** మూడింటిలో ఏదైనా కావచ్చు. అన్నీ వున్నాయనుకోండి! ఇంక అసభ్యతకూ, అశ్లీలతకూ అడ్డేమిటి? ఎంతయినా వుండవచ్చు. ఉంటే అభ్యంతరం చెప్పే హక్కు మనకుండదు. ఈ జుగుప్సాకరమైన పాత్రలున్నాయి కాబట్టి నాటకంలోని నాటకీయత లోపిస్తుందా? నాటకానికి ఇదే వస్తువుగా ఉండాలని వుందా? ''దశ రూపకం''తుదిలో ధనంజయు డేమంటాడు? (చూ. ''రమ్యం జుగుప్సితం...'') రమ్యమైనా, జుగుప్సాకరమైనా, ఉదారమైనా, నీచమైనా, ఉగ్రమైనా, ప్రసన్నమైనా, గంభీరమైనా, వికృతమైనా కవి భావ భావ్యమానమైన తర్వాత రసభావప్రాప్తి పొందని వస్తువే లోకంలో వుండదట. జుగుప్సాకరమైన పాత్రలు, గురజాడ కవితా రసాయన ప్రక్రియలో రసభావప్రాప్తిని పొందినాయి. ఇన్ని నీచ పాత్రలున్నా 'కన్యాశుల్కం'లో అసభ్యత కానీ, అశ్లీలత కానీ ఎక్కడా కనిపించవే అనే నా కంప్లయింటు. సన్నివేశంలో కానీ, ఇతివృత్త పరిణామంలోకానీ, పాత్రోన్మీలనంలో కానీ, సంభాషణలో కానీ, కాకువులో కానీ, పదజాలంలో కానీ, ఎక్కడా అసభ్యతా స్పృహే లేదు. పరిశుభ్రతకూ, నాటకం సాగినకొల్లా ప్రతీ పాత్రా నకారాత్మకత నుండి సకారాత్మకతకు దగ్గరగుటకూ (గిరీశం పాత్ర మినహాయింపు), సారళ్యానికీ, హుందాతనానికీ, ''కన్యాశుల్క'' నాటక శిల్పం లక్ష్యప్రాయం.

అసభ్యత, అశ్లీలతల వివేచనం మనల్ని కొంత ఇబకాటంలో పడవేయగలదు. అయినా నా చిన్నమట్టుకు బాధ్యతాయుతంగా వ్రాయ ప్రయత్నిస్తాను. అసభ్యత నిర్వచనం ఇలా ఇస్తాను: ''తాత, తల్లి, అక్క, అయ్యవారు, అప్పుడే మాటలాడ నేర్చిన పసిపాప ఎదుట ఏ మాటలుచ్చరించరాదో, ఏ చేష్టితములు చేయరాదో, ఆ మాటలు, ఆ చేతలు అసభ్యములు'' బూతుమాటలు, వీనినే జానపదులు 'రోతకూతలు' అంటారు. ఉదాహరణాలు—ఇట్టివి ''కన్యాశుల్కం''లో వున్నాయా? మన సభ్యత అంతా మధ్యమ తరగతి మర్యాద (**Middle class respectability**) విక్టోరియన్ సంఘ మర్యాద. హాస్యపు కబుర్లు చెప్పికొనే తన రాచకుటుంబంలోని పిల్లలవైపు మిర్రిగుడ్లతో చూస్తూ, ''మాకు నచ్చలేదు'' (**''We are not pleased''**) అని గదమాయించి నోర్మూయించే ''వికటేశ్వరి'' (భవిష్య పురాణంలో విక్టోరియా మహారాణి పేరు) ప్రభావంనుండి మనం విడుదల పొందలేదనిపిస్తుంది. ఈ మధ్యమ తరగతి మర్యాద కేవలం ఆత్మప్రతారణ, మాటలచేత మసిబూసి మారేడుకాయ చేయుటేకాని వేరుకాదు. చూడండి ''అమేధ్యం'' సభ్యత ''పీయ'' అసభ్యత. ''ఆయుష్కర్మం'' సభ్యత. ''క్షవరం'' అసభ్యత. ''మూత్రం'' సభ్యత. 'ఉచ్చ' అసభ్యత. సభ్యతా పదాలకు అసభ్యతా సూచక పర్యాయ పదాల్లో ఒకకోశం వ్రాయవచ్చు. అప్పకవి ''శుకవాణి బుగ్గలు ముకురంబులనరాదు'' అనే పద్యంలో ఇదే చేసెను. సంస్కృతం సభ్యత. అచ్చతెలుగు అసభ్యత. కుచౌడప్ప పద్యాలుసంస్కృతంలోకి తర్జుమాచేస్తే వాటిఅసభ్యత కోల్పోతాయి. పట్నవాసపు విద్యాధికుల (Urban elite) 'స్నాబరీ'యే సభ్యతా సభ్యతలకు కొలమానమా? ఒక అసభ్యపదమున్న లేడీ ఛాటర్లీస్‌లవర్ బహిష్కరింపబడ్డది ఆ నాల్గక్షరాల పదం ఇంగ్లీషు వచ్చేవాళ్లంతా వాడుకలో ఊతపదంగా, ''ఎక్స్‌ప్లెటివ్''గా వాడేదే. ఉచ్చరణీయమైన పదం ముద్రితమైతే అసభ్యత! మనిషి అంతరంగపు అంతరాంతరాల్లో (**Sub-Conscious**) అసభ్యతాశ్లీలాలు ప్రవహిస్తూ వుంటాయి అనేసత్యాన్ని చైతన్య స్రవంతి (**Stream of Consciousness**) ప్రక్రియద్వారా బహిర్గతంచేసిన జేమ్సు జాయిస్‌వ్రాసిన యులిసెస్ అనే నవలకు అసభ్యతాముద్ర తప్పలేదు. ఉత్తమకళను కమిస్సార్ (రక్షకభటుడు) దృక్పథంలో, సెన్సార్ రూల్సుతో చూస్తే అజంతా చిత్రాలకు కూడా తారు పూయవలసి వస్తుంది.

అశ్లీలత అసభ్యతకంటే వేఱు. సాహిత్యంలో అశ్లీలతకు నిర్వచనం ఇస్తాను. ''శీలరాహిత్యాన్ని ప్రకటితంచేసే లేక సూచించే శబ్దార్థం అశ్లీలత''. బూతుమాటలు లేకున్ననూ, ఏర్చికూర్చిన చక్కని పదాలే వున్ననూ అవినీతి సూచక వాక్యాలు అశ్లీలాలు. అది నిత్య జీవనంలో కావచ్చు. కావ్యం కావచ్చు. ఉదాహరణాలు: ఒక మనవడికి (6 ఏండ్లవాడు) అవ్వంటే ఎంతో ప్రీతి. పెండ్లి అనేది మంచిదని వేఱేసందర్భంలో తెలుసుకుంటాడు. అమాయకత్వంతో, మంచి ఉద్దేశంతోనే అవ్వతో 'అవ్వా నిన్ను పెండ్లిచేసుకొంటాను''అని అవ్వనవ్వు, అమ్మ నుండి తన్నులు అనుభవించినాడు. వానికి తానన్న దాన్లోని అవినీతి తెలియదు. మంచిదే చేస్తూవున్నాను అనే వాని ధీమా. ఇది అశ్లీలత కుదాహరణం. ''అభిజ్ఞాన శాకుంతలం''లో వివాహితుడూ బాధ్యతకల దేశపాలకుడూ అయిన దుష్యంతుడు శకుంతల అనే పరాయి స్త్రీ, అందునా ఋషి కన్యను చూచి ''ఈమె వాసనచూడబడని పూవు, గోళ్లతో గిల్లబడని చిగురుటాకు, బెజ్జం వేయబడని పూస, జుర్రబడని కొత్త కల్లు, కొరకబడని పండు'' అనే అర్థం వచ్చేటట్లు చెప్పిన ''అనాఘ్రాతంపుష్పం'' శ్లోకం బూతుమాటలు లేకున్నా, ఏర్చి కూర్చిన పదాలేవున్నా అశ్లీలం కలది. కనీసం నీచరుచి (**Bad taste**) అయినా ఇస్తుంది. ఇది విని గ్రామీణ స్త్రీ కూడా, ఈ శ్లోకం కాళిదాసు వ్రాసింది, దుష్యంతుడు చెప్పిందని అన్న వినక మెటికలు విరిచి, శాపనార్థం పెట్టే ప్రమాదంవుంది. ఈ శ్లోకం విని లొట్టలువేసే మనభావుకులు ఏలాటి **Vulgarism** లేని, స్వచ్ఛంగా వుండే ''కన్యాశుల్కం''లో లేని అసభ్యత ఉందంటున్నారే! అసభ్యకర విషయాలుండడం వేఱు. విషయాలను అసభ్యంగా తీర్చిదిద్దడం వేఱు. అసభ్యత కంటె అశ్లీలత గరీయసి. అటువంటి అశ్లీలతగల కాళిదాస శ్లోకాన్ని మనవారు ఖండించగలరా? అసభ్యత అవి నీతి కానక్కరలేదు. 'గురజాడ నాడు,

ఇంగ్లాండులో అసభ్యంగా భావింపబడే 'డావ్‌'అనే పదాన్ని బెర్నార్డుషా 'పిగ్మాలియన్' అనే నాటకంలో వాడినాడు. "కన్యాశుల్కం" గిరీశం ఉచ్చరించే "డామిట్"తోనే ముగుస్తుంది. ఇదేనా శ్రీ పులిచెర్ల వారి కగపడ్డ అసభ్యత? కవి చౌడప్ప పద్యాలు అసభ్యాలే అయిన, అతనిది నీతి తప్పని కవిత్వం. నేటి మన దిగంబరుల కవిత్వంలో అసభ్య పదజాలం వున్నా అశ్లీలతలేదు.

సంఘంలోని కుళు ను బట్టబయలు చేసి, సంఘపుటాత్మకు అద్దంపట్టి, ఆ వికృత సంఘాన్ని సురూపంగా దిద్దేందుకు వ్రాయబడి, కొంతవరకు కృతకృత్యమైన మహా నాటకం "కన్యాశుల్కం." ఏ నాటకమూ పూర్తిగా సఫలం కాలేదన్నది వేరేమాట. "కన్యాశుల్కం" ను యథా తథంగా ప్రదర్శిస్తే ప్రజలు తుపుక్కున ఉమ్మేస్తారు అని శ్రీ పులిచెర్లవారి జోస్యం. నిజమే. ఎందుకు? కాగడాతో వెతికినా కనబడని బూతులను చూచికాదు. మనిషి ఎంతటి అగాధపు లోతుల్లోకి (Lower depths) పోగలడో చూచి అసహ్యించుకొని! గిరీశం, రామప్పంతులు, అగ్నిహోత్రావధాని, లుబ్ధావధాని, రామానాయుడు మున్నగు పాత్రల బింబాలుగా సంఘంలో ఘరానా ఆద్మీలుగా చెలామణి అవుతున్న బద్మాషులను తలంచుకొని!! డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ నాటక రంగ పరిధుల్ని దాటి నేపథ్యంలోకి పోకుండా ఆడిటోరియం లోనికి వచ్చే (ఇది నేను "కన్యాశుల్క నాటక కళ"లో రక్తికట్టించేందుకు చేసిన సూచన) గిరీశం పాత్రవైపు ప్రేక్షకులు థూథూ అం ఉమ్మివేస్తే నాటకీయత ఇనుమడిస్తుంది కూడా.

"కన్యాశుల్కం"లోంది సార్వకాలికమైన సమస్య కాదన్నారు శ్రీ పులిచెర్లగారు. "కన్యాశుల్కం"లో కన్యాశుల్కసమస్య ఒక్కటే కాదు. చాలా ప్రతిపాదింపబడినాయి. అవి :

చిన్న బాలికలకు పెండ్లి చేయుట
చిన్న బాలికలను ముసలివారి కిచ్చుట.
కన్యాశుల్క పద్ధతి
వేశ్యావృత్తి
స్త్రీల దుస్థితి

చిన్న బాలికలకు పెళ్లిచేసే పద్ధతి యిప్పటికీ పోలేదనే సత్యంను నా "కన్యాశుల్క నాటక కళ"లో ఋజువు పరచినాను. చిన్న బాలికలను ముసలివాళ్ల కిచ్చే పద్ధతి పోయిందనుకోవలె. కన్యాశుల్క పద్ధతి బ్రాహ్మణులలో పోయింది. కాని మారుమూల పల్లెలలో ఇంకా కొనసాగుతూనే ఉంది "ఓలి" పేరుతో. అతి ప్రాచీన వృత్తిగా పేర్గాంచిన వేశ్యావృత్తి పోయిందా? కొత్త కొత్త రూపాలతో తామరతంపరగా వృద్ధిపొందుతూనే ఉంది. సంసార స్త్రీల దుస్థితీ అట్లానే ఉంది. ప్రభుతవారి హింసాకాండ "కనిష్టీబు", "డిపిటీ కలెక్టరు," కోర్టులద్వారా అమలుచేయడం కూడా "కన్యాశుల్కం"లో ప్రదర్శితం. దీన్నే టిరానీ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అంటారు. ఇరవయ్యో శతాబ్దంలో ఇది మరీ విశ్వరూపం దాల్చుతా వుంది. ఫ్రాంజ్ కాఫ్కా "ది ట్రయల్" అనేగ్రంథంలో భయంకరంగా చిత్రిస్తాడు. కానీ అన్ని సాంఘిక రుజలకూ మూలకారణాలు దోపిడి, ధనశక్తి (Exploitation and Money power) అనే విషయాన్ని "కన్యాశుల్కం"లో అంతస్యూతంగా చూడగలం. దోపిడి ధనశక్తి అను రెండు ఫెూరాల్ని రకరకంగా వర్ణించినాను "కన్యాశుల్క నాటకకళ"లో. విశ్వవ్యాప్తోద్యమాలన్నీ ఈరెంటిని పరిహరించడానికే గదా? "కన్యాశుల్క" నాటకేతివృత్తా వే. ఇందసభ్యతకు తావేలేదు.

ప్రాచీన గ్రీకు నాటకాలనుండి బెకెట్‌వరకూ, భాసునినుండి బాదల్ సర్కార్‌వరకూ వెలసిన నూరు గొప్ప నాటకాల జాబితా తయారుచేస్తే, అందులో "కన్యాశుల్కం" ఉంటుంది అని నా అంచనా.

ఇంతకీ "కన్యాశుల్కం"లో అసభ్యత ఎక్కడుందో చూపించడని శ్రీ పులిచెర్ల వార్నడగడమే మరచిపోయినాను. "కన్యాశుల్కం" కడపటి భాగాల్లో సంఘ పుటతలం (Society's under world)'లో జరిగే దృశ్యం వుంది. ఆ సీను అసభ్యం అంటారేమో శ్రీపులిచెర్లగారు. "కన్యాశుల్కం" భాణం,వీథి, ప్రహసనాల మిశ్రణం అంటే ఒప్పుకొంటారా శ్రీ పులిచెర్లగారు? నాటకం Avant garde అంటే "అగ్రగామి." దీని సరణిని తర్వాతి యూరోపియన్ నాటకకర్తలే వెలయించినారు. అందుకే "కన్యాశుల్కం" వరల్డ్ డ్రామా కోవకి చేరుతుంది. అయినా శ్రీ పులిచెర్ల సాంబశివరావుగారేమంటారో వినాల్సి వుంది. వారు నాకు పరిచితులు, స్నేహితులు. వారి చిరునామా నాకు తెలుసు. వారు 'భారతి'లో వ్రాసినారు కాన నేనూ వారిని 'భారతి' ముఖాన్నే అడుగుతున్నాను, "కన్యాశుల్కం"లో అసభ్యత ఎక్కడుందీ అని!

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

శ్రీనాథుని జన్మస్థలము
పాఠాంతరము - ఛందోదోషము

"శ్రీనాథుని జన్మస్థలము" అను శీర్షికతో జూన్, సెప్టెంబరు నెలల "భారతి"లో "కలగూరగంప" పెక్కు లేఖలను ప్రచురించినది. అందు శ్రీ విద్వాన్ కొమాండూరి రామానుజాచార్యులవారి లేఖ యొకటి. వారు శ్రీనాథుని జన్మస్థలము "పాకల" యని నిర్ణయించుచు "శ్రీ వాసా లక్ష్మీనారాయణ రెడ్డిగారు" 1977 లో తమ గ్రామమున శ్రీనాథకవీంద్రుని జయంతి జరిపి నట్లును, అందు శ్రీ శేషయ్యగారు తమకడనున్న పురాతనమైన వ్రాతప్రతిలో నున్న "కనకక్ష్మాధరధీరు వార్ధితట పాకలే పట్టణాధీశ్వరున్" అను పాఠము ననుసరించి, "పాకల" శ్రీనాథు జన్మభూమి యని చెప్పిరనియు తెలిపి—ఈ ఆధారము నూతనగా తాము శ్రీనాథ మహాకవి జన్మస్థలమును "పాకల" గ్రామముగా నిర్ణయించుకొని, అందుకు తగిన ఇతర ఆధారములను [శ్రీ తలపనేని చెంచయ్యగారి కందుకూరు తాలూకా పాకనాటి చరిత్ర — శ్రీమాన్

నవులూరి మాలకొండయ్య పంతులుగారి నెల్లూరు మండల సర్వ(?)ము మొదలగు గ్రంథములను] ప్రోదిచేసికొనిరి. వీ. రిచ్చిన ఈ పాఠాంతరము ఛందోభంగ మను దోషమును కలిగియున్నదని చదివినంతనే నాకనిపించినది. ప్రసిద్ధ పాఠము "కనకక్ష్మాధరధీరు వారిధితటీ కాల్పట్టణాధీశ్వరున్" అని లోకవిదితము. శ్రీ భీమేశ్వర పురాణ ప్రథమాశ్వాసారంభమున పురాతన కవీంద్ర గుణకీర్తనమున "మ॥ కనకక్ష్మాధరధీరువారిధి తటీ కాల్పట్టణాధీశ్వరున్; ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళా కావ్య ప్రబంధాధిపున్, వినమత్కాకతి సార్వభౌముఁ గవితా విద్యాధరుం గొల్తుమా, యనుఁగుందాతఁ బ్రదాత శ్రీ కమలనాభామాత్య చూడామణిన్" (10 వ పద్యము) అని యున్నది.

మ॥	కనక	క్ష్మాధర	ధీరువా	రిధిత	టీకాల్ప	ట్టణాధీ	శ్వరున్
	I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
	స	భ	ర	న	మ	య	లగ(వ)

ఇందు మొదటి యక్షరమగు "క" కారమునకు పదునాలుగవ యక్షరమగు "కా" అను వర్ణముతో యతిమైత్రి (ప్రాణి విరామ మని అప్పకవి) సరిపోయినది. శ్రీ ఆచార్యులవారిచ్చిన "పాకలే" పాఠాంతరమున్న

మ॥	కనక	క్ష్మాధర	ధీరువా	రిధితట	పాకలే	పట్టణా	ధీశ్వరున్
	I I U	U I I	U I U	I I I	U I U	U I U	U I U
	స	భ	ర	న	ర	ర	ర

—ఈ పద్యపాదమును గ్రహించినచో "మత్తేభవిక్రీడత" వృత్త లక్షణమిందెట్లు పొసగును? మొదటి అక్షరమగు "క" కారమునకు 14 వ అక్షరము "హ్రస్వ" 'క' కారమే యున్నను యతి సరి పోయిన దనుకొందమన్నను — మ గణమునకు బదులు ర గణ ముండుటచే (పాకలే) గణమెట్లు సరిపోవునో తెలియదు. ఒకవేళ
UIU
హ్రస్వ "క"కారమును దీర్ఘముగఁ జేసి (పాకాలే)మ గణ మనిపించి
UUU
నను "య"గణము "పట్టణా" అనునదెట్లగును? అదియు రగణమే యగుచున్నది గదా! మత్తేభవిక్రీడిత వృత్తమున చివరిగణము లగము - లేదా—వగణముండవలెను (IU) గదా! "ధీశ్వరున్" అని మూఁడక్షరగణమైన "ర" గణ మున్నదే!, ఈ గణభంగము నెట్లు పరిహరింపనగును? ఇట్లు ఈ పాఠాంతరమును గ్రహించి, ఛందోదోషము అంగీకరించి, కవిసార్వభౌముని జన్మస్థలమును "పాకల" అని గ్రహించుట వలన మనకు లాభమేమి? "పాకల" అనునది శ్రీనాథుని జన్మభూమిగా "సర్వజన సమ్మతమైన — వివాదా స్పదము గాని" —నిర్ణయము కాదుగదా! "శ్రీనాథుని పద్యమునకు ఛందో దోషము నంటఁగట్టుటయే (యొక్కటి) ఈ పాఠాంతరము నకు సద్యఃప్రయోజనమా? శ్రీనాథ మహాకవి కింతమాత్రమైనను ఛందః పరిజ్ఞానము లేదని యనిపించుట విజ్ఞతయా?" అని ఆలోచింపవలసియున్నది. కనుక పై పాఠాంతరము పురాతనమైన దైనను (పురాణ మిత్యేవన సాధు సర్వమ్) దోషభూయిష్ఠమగుట స్పష్టము. కావున గ్రాహ్యము కాదు. "కాల్పట్టణ" మను
న
పాఠమే సాధువును, ప్రసిద్ధమునై యున్నది. ఈ "కాల్పట్టణ" మెక్కడిదో? ఎప్పటిదో? అది ఇప్పుడేపేర వ్యవహరింపఁబడు చున్నదో? — అను నంశములను పెద్దలింకను తఱచి చూచి పరిశోధించి నిర్ణయింపవలసి యున్నది. ఇందులకు సమర్థులైన విద్వజ్జనులే ప్రమాణము. ఈ లేఖ ద్వారమున ఆంధ్రవిద్వల్లోక మును "శ్రీనాథుని జన్మభూమి"ని నిర్ణయించుటకు నిర్మత్సరముగా, నిష్పాక్షికముగా, కూలంకషముగా పరిశోధనలు జరిపి నిర్ణయింపనగునని ప్రార్థించుచు – ఈ వ్రాతలో శ్రీ ఆచార్యుల వారిని నొప్పించి యున్నచో క్షంతవ్యుఁడనని సవినయముగా ప్రాంజ లించుచున్నాను.

— *విద్వాన్ టి. రామకోటేశ్వరరావు*

వేగుఁజుక్క

'అరుణాంశు పటలి యను వా
సరరాజ పురోధృత ధ్వజంబు కొనన్ వి
స్ఫురితమగు రత్నమో యన
సురపతి దిశయందు వేగుఁజుక్క వెలింగెన్.'

పై పద్యము పింగళి సూరనార్యుని ప్రభావతీ ప్రద్యుమ్నము (5–51) లోనిది. ఈ పద్యమునకు శ్రీ వెంపరాల సూర్యనారా యణశాస్త్రి గారి వివరణ యిది: "వేగుఁజుక్క యెఱ్ఱగానుండును. కాన రత్నముగా నుత్ప్రేక్షింపబడినది నవరత్నములలో మాణిక్య మొక్కటే మిగుల నెఱ్ఱనిది. తక్కినవి భిన్నకాంతులు గల వగునప్పుడు మాణిక్యము లేక కెంపు అనక రత్నమని సామాన్య ముగా నందు గ్రహింపఁబడుటకుఁ గారణము కవి సమయము ...'

పారిజాతాపహరణ కర్తయు "పొలిచెన్ వేగురుఁజుక్క కాలఫణ భృత్ భోగోల్లసద్రత్నమై" యని రత్నముగనే ఉత్ప్రేక్షించి నాడు.

పై మహాకవుల సమకాలీనుడగు అల్లసాని పెద్దన వేగుఁ జుక్కను వర్ణించిన విధమిది:

"సకుటుంబముగ వీఁగి చరమశైలముఁజేరు
తుహినాంశు దుముదారు దొరయనంగ
నాసీరమై వచ్చు నళిన బాంధవు టెక్కి
యంబుపై దీపించు నద్దమనఁగ
నరుణాగ్రనిబిడ వాద్యములలోఁ గనుపట్టు
సమయ శాంఖికు చేతి శంఖమనఁగ
నినుఁడప్డ డఱుఁ ఔట మున్నుమున్న పడివాగె
గొని వచ్చు రాయంచ కొదమ యనఁగ
......వేగుఁజుక్క పొడిచె (మను. 3–54)

తిమ్మన సూరన వర్ణనలకు భిన్నమైనదీ వర్ణన. సూరన తిమ్మనలు వేగుఁజుక్కను రత్నముగా, ఎఱ్ఱనిదిగా, వర్ణించిరి. పెద్దన దానిని శంఖాదులతో సమానమైనదిగా, తెల్లనిదిగా, వర్ణించినాడు. పెద్దనగారి పద్ధతిలో నడచిన మరికొందరి కవుల వర్ణనలివి:

''దొడ్డ ముత్తియంబు తోరంపుఁబటికంబు
వెండిగుండు మొల్లవిరుల చెండు
రసము గులిక కప్పురంబు నకరుడు నా
సొంపు మిగిలి వేగుఁజుక్క వొడిచె.''

గంగరాజు చౌడయ్య — నందన చరిత్ర.

గాఢతర కాంతికై మ్రింగు కాంక్షనంత
రిక్షకాపాలికుడు సంతరించి నట్టి
గొప్పయగు శుద్ధ పారద ఘుటికయనఁగఁ
జొక్కమగు కాంతి వేగురుఁజుక్క దనరె

ఫణిధపు మాధవుడు—ప్రద్యుమ్న విజయము

యామినీ గోపకామిని యాకసంబ
నెడి ఘటమ్మున జ్యోత్స్నయనియెడు పెరుగు
దరచి చేర్చిన వెన్నముద్దయన నంత
నెడలెఁ దెల్లని కాంతితో నేగుఁజుక్క

శ్రవణానందము (3-87) తిరుపతి వేంకట కవులు.

వేగుఁజుక్క — శుక్రగ్రహము — నవగ్రహ స్తోత్రములో 'హిమకుందమృణాళాభం' అని, శుక్రకవచమున 'మృణాళకుందేందు పయోహిమప్రభం' అని తెల్లనిదిగనే వర్ణింప బడినది

సంప్రదాయ సిద్ధమైన యీ వర్ణనలను విడిచి సూరన తిమ్మనలు పై రీతిగా వేగుఁజుక్కను రత్నముగా నూహించుటలో గల స్వారస్యమును వివరింప విద్వాంసులు ప్రార్థితులు.

శ్రీ సూర్యందేవర రవికుమార

దెబ్బకు రెండు పిట్టలు

1978 మార్చి 'భారతి'లో వెలువడిన నందిని సిధారెడ్డి గారి ''ఇద్దరు కవితా సూర్యుళ్ళు'' ఒక కవిని తూలనాడాలి మరో కవిని పొగడాలి (ఒకే దెబ్బకు రెండు పిట్టలు) అనే రీతిలో ఉంది. ఇరువురి కవితలపై సిధారెడ్డిగారూ తమ పరిశీలన కవిత్వదృష్టితో ఉంటే బాగుండేది. పరిశీలనా రీతిని విడనాడి ఈ కవిత చప్పగా ఉంది, ఉప్పగా ఉంది, చచ్చుగా ఉంది, వాడిగా ఉంది, ఆవేశంతో చెప్పాడు, అని తమంతట తామే తీర్పు విన్పిస్తున్నారేకాని కవిత ఎందువల్ల బాగుంది లేక దెబ్బతినడానికి గల కారణాలేవి వివరిస్తే బాగుండేది.

మార్క్సియ సిద్ధాంతాన్ని స్వీకరించే ఇద్దరు కవితా సూర్యుళ్ళూ ఆస్తికత నుండి దూరం కాలేకపోయారు. వాస్తవిక దృష్టితో, శాస్త్రీయ అవగాహనతో సైద్ధాంతికంగా ముని ముందుకు పయనిస్తూ మానవుడు ప్రకృతినే శాసిస్తున్న ఈ రోజుల్లో కూడా ఒక కవి గుంటూరి

ఈ దేశపు గర్భగుడిలో
దేవుడు జీర్ణమై పోయాడు
ఆకలి వేస్తుంది మరో దేవుడి కోసం

అంటూ వెంపరలాడితే ''మండే సూర్యుడు''

మరోకవి శివారెడ్డిగారు కూడా దేవున్ని ప్రస్తావించకుండా ఊర్కోనలేక పోయారు పాపం.

దేవున్ని పిలు!
నిలబెట్టి గుండెల్లో దిగేస్తా కత్తి
మనల్ని వెదవల్ని చేసినందుకు

అంటారు. ఇది తీవ్ర నిరసనగా ధ్వనించిందా సిధారెడ్డిగారూ? ఆవేశ ప్రేరితుడై కవి ముందు వెనకలు ఆలోచించకుండా రాస్తే పరిశీలకుడై ఉండి మీరూ ఆవేశంలో ఊగిసలాడి అది తీవ్ర నిరసన అనేశారు. కవి మనలో ఒకడే కావున తనను వెదవను చేసేంతవరకూ ఎదురు చెప్పలేని కవి చేతగానితనాన్నే ప్రస్ఫుటీక రిస్తున్నాయా పంక్తులు.

సిధారెడ్డిగారి ఉద్దేశ్యములో ప్రజలంటే ఎవరు? ఈ దేశ జనాభాలో వారి శాతమెంత? ఈ సూర్యుళ్ళు జనంలో ఎంత వరకు చొచ్చుకొని పోగలిగారో తెలియపర్చగలరా? కాకుంటే తమర్లాంటి నల్గురు కవుల్లో నానిన పేర్లు వారిద్దరివి. అంత మాత్రాన సరా?

నువ్ దేనైనా ప్రేమించు
కాని దుఃఖాన్ని మాత్రం కాదు
ఆరిపోయిన కొలిమి కది చిహ్నం
(దుఃఖమంటే పరమ అసహ్యం నాకు)

(దుఃఖాన్ని మాత్రం పిలువకు)

అని భావోద్రేకంతో పలికిన శివారెడ్డిగారే

నన్ను సోదా చేస్తావూ
దోచాలని చూస్తావూ
నావద్గర
నీకేమి దొరుకుతుంది
ఒక గాయం దొరుకుతుంది
ఒక గేయం దొరుకుతుంది
... ...

ఒక దోసెడు కన్నీళ్ళు
తప్పకుండా దొరుకుతాయి

(నా జాతి రాత)

అని ఎలా అనగలిగారంటారూ ? పై రెండు ఖండికల్లో భావ వైరుధ్యం తొంగిచూడలేదూ ? అందుకే ఒక సంపుటిలో వివిధ కవితా ఖండికల భాగాల్ని పరిశీలిస్తే భావ వైరుధ్యాలు పొడ సూపడం సహజం.

'కన్నీళ్ళతో కల్పవృక్షాలు
పెంచుకున్న చేతులు'

అనడం కంటే, సామాన్య పదాల్లో గొప్ప భావాన్ని వ్యక్తీకరించిన గుంటూరి

''గ్లాసుతో నా చెమట తాగి తేన్చేవాడు
నున్నగా టొమాటొ పండు లా ఉన్నాడు''

లో గొప్పదనము కానరావడము లేదూ ? ఏ వర్ణనలో సహజత్వం ఉంది ? సామాజిక స్పృహ ఉట్టిపడుతుంది. తేల్చుకోవాల్సిన భాధ్యత పఠితలకు ఎంతైనా ఉంది లెండి !

జన జీవితాల్లోని చీకటి తొలగించడానికి విప్లవ సూర్యుడు ఉదయించాలనేది ఈ తరం కవితాధ్యేయమైతే కావచ్చు. కాని ఈ కవితా సూర్యుళ్ళిద్దరూ ఆ ధ్యేయంలోనే పయనిస్తున్నారంటే అధి మీ భ్రమగా భావించక తప్పదు. జన జీవితాల్లో ప్రవేశించలేని కవిత్వాన్ని సృజిస్తూ తామూ ప్రజాకవులమని చెప్పుకునే బాపతే ఈ కవితా సూర్యుళ్ళిద్దరూ.

ఈ దేశము ఈనాడు నిరాశా నిస్పృహల మధ్య చెడుగుడాడుతుందంటే, ప్రజల్లో ప్రవహించకుండా ప్రతీకలంటూ, ఊహా చిత్రాలంటూ, ఇజాల గారడీలు చేసే రచయితలే ముఖ్యకారకులనక తప్పదు. ఈ సమ్మెత్తులే ఛేయదల్చుకున్నపుడు పద్య కవిత్వము రాస్తే వీళ్ళసొమ్మేం పోయింది. రాయలేనితనమా ? చంధస్సుల నడుములు విరగతన్నింది ఇందుకొరకేనా ? ప్రజల కోసమే తమ కవిత్వమని చాటుకునేవాళ్ళు జవాబులకై తడుము కొనక తప్పదు. అందుకే నాడు వేమన తరువాత ఈనాడు ప్రజల కోసం కవిత్వం రాసే కవులుగా వి. బి. గద్దర్‌లాంటి వారిని గుర్తించడము మంచిది. లేదూ తాపట్టిన కుందేటికి మూడే కాళ్ళంటే వీరందర్ని కవులుగా గుర్తించండి !

ఒక చిన్న తారతో దినమవుతుందా
మండే సూర్యుడు కావాలి

అన్నట్లు పీడిత జనంలో నివసిస్తూ వారి కష్టనష్టాల్లో పాలు పంచుకుంటూ, పీడిత లోకాన్ని ఉద్ధరించే కవి కావాలి నేడీ దేశాన్కి.

— అం కె.

యాదగిరి ఆదిగిరి అనే జైనక్షేత్రమా?

చాళుక్యులు మొదటినుండి శైవ వైష్ణవాలతోపాటు జైన మతాన్ని కూడా ఆదరించినారనుటకు బాదామి, ఐహోలెల్లోని జైన ఘాలయాలే సాక్ష్యాలు. బాదామి చాళుక్యులవలెనే అర్వాచీన (కళ్యాణి) చాళుక్యులు సైతం జైనమతాన్ని ఆదరించినారు. సమయానుకూలంగా మారుతూ ఒకసారి కళ్యాణిచాళుక్యులకు, మరొకసారి రాష్ట్రకూటులకు సామంతులుగా ఉన్న కాకతీయులు మొదట్లో జైనమతాన్ని మిక్కిలి ఆదరించినారు. 11, 12 శతాబ్దాలలో తెలంగాణంలో జైనమతం విశేషంగా రాజాదరణను, ప్రజాదరణను పొందింది. శ్రీ జవహర్‌లాల్‌గారు ''ఆంధ్రదేశమున అర్వాచీన చాళుక్యుల కాలమున జైనమతము'' (అక్టోబరు 1978 సంచిక) అన్న వ్యాసంలో పఠన్‌చెర్వు, కొలనుపాక, హనుమకొండ మొదలైనవి జైనక్షేత్రాలుగా వెలసినవని తెల్పినారు. అదేవిధంగా ఈనాడు లక్ష్మీ నరసింహస్వామికి నిలయమైన యాదగిరి సైతం జైన క్షేత్రంగా ఉండేదని నా అభిప్రాయం. యాదగిరి అనే పేరును యాదవుడనే ఋషికి అంటగడుతున్నారు. కాని 23గురు జైన తీర్థంకరులలో మొదటివాడైన ఋషభునికి అదినాథుడు, ఆధినాథుడు అని పేర్లు. ఆతని పేరుమీదుగా ఈ గుట్టపై జైనాలయం వెలసి ఉండేది కావచ్చును. దాన్నిబట్టి ఆ గుట్టకు 'ఆదిగిరి' అనే పేరు ఏర్పడి ఉండవచ్చును. ఆ ఆదిగిరియే ప్రజల నోళ్ళలో 'యాదగిరి' అని ఉచ్చారణా సౌలభ్యంగల శబ్దంగా మారి ఉంటుంది. యాదగిరిలోని గిరి శబ్దానికి గుట్ట అని అర్థమైనా యాదగిరిగుట్ట అనడం కూడా కలదు. ఇప్పటికిని తెలంగాణంలో ఆదయ్య, ఆదెమ్మ అనే పేర్లు పెట్టుకోవడం (యాదయ్య, యాదమ్మ అనే పేర్లు కాక) కనిపిస్తుంది. యాదగిరి జైనక్షేత్రాలైన కొలనుపాక, హనుమకొండలకు దగ్గరగా ఉండడం కూడ గమనించదగింది.

విశేషంగా రాజుల, ప్రజల ఆదరణను సంపాదించిన జైన మతంయొక్క స్థానాన్ని బసవన్నచేత ఆరంభింపబడిన వీరశైవం ఆక్రమించుకొన్నది. జైనమతాన్ని ఆదరించిన కళ్యాణి చాళుక్యుల దగ్గరనే బసవన్న ఉన్నాడు వీరశైవ విజృంభణతో జైనమత ప్రాబల్యం తగ్గింది. జైనమతావలంబులెందరో శైవమతానికి మారిపోయినారు. అట్లాగే మొదట జైనులుగా ఉన్న కాకతీయులు శైవులుగా మారిపోయినారు. అదీగాక జైన శైవ మతాలు జైన వైష్ణవాలవలె అధికవైరంగల మతాలుగా కాక కొంత పరస్పర సహన సఖ్యాలతో మెలగినాయని చెప్పాలి. జైనమతం తగ్గుముఖం పట్టడంతో ఒకప్పుడు జైనక్షేత్రాలైన యాత్రాస్థలాలు వైష్ణవ శైవ క్షేత్రాలుగా మారినవనుట తథ్యం. అట్లాంటి సమయంలోనే జైనక్షేత్రంగాఉన్న ఆదిగిరి వైష్ణవక్షేత్రంగా మారింది. దీనికేమైనా ఆధారాలు దొరుకుతాయేమో చూడాలి !

డా ముదిగంటి సుజాతారెడ్డి

గూడూరు శాసనములోని విశేషాంశములు

78 జులై సంచిక 'భారతి'లో ప్రచురించబడిన నా 'గూడూరు శాసనములోని విశేషాంశములు'' వ్యాసముపై సెప్టెం బరు 'భారతి'లోని విమర్శకు నేనెక్కడనుండి సమాధానము వ్రాయాలా అని తర్జన భర్జన పడుచుండగా వారు నేనే బయ్యారం శాసనము చదవలేదని ఆరోపించారో అదే ఆరోపణను ఆ విమర్శకు నిపై చేస్తున్నాను. దానికి సంబంధించిన వివరాలు, ఇంకా కొన్ని వివరాలు ఆకునూరు శాసనము ద్వారా యీ వ్యాసములో పొందు పరుస్తాను.

ముదిగొండ చాళుక్యులకు, కాకతీయులకు విరోధమున్నదని. పదవ శతాబ్దపు దేశచరిత్ర అనుసరించి చూస్తే ప్రతి ఒక్కరికి తెలుసును.

ఈ గూడూరు శాసనము గురించి క్షుణ్ణంగా పరిశీలించే ముందు నాటి చరిత్ర కాకుండా అంతకుముందు చరిత్ర తదనంతర చరిత్రద్వారా తేటతెల్లం కాగలదు.

కాకతీయులు ఏ ప్రాంతాన్ని పాలించారు? అన్న విషయానికి విమర్శకులు సరైన సమాధానం చెప్పగలరా? దానిమీద సునిశిత పరిశీలన, పరిశోధాత్మక దృష్టితో ఆలోచిస్తూపోతే దానికి సమాధానం యీ చిన్ని వ్యాసంలో పొందుపరుస్తాను. నేను ఒక్క బయ్యారం శాసనం పరిశీలించలేదన్నారు: కాని వారు ఒక్క బయ్యారం శాసనమే ఇటీవల భారతి, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలు అసలు ఏ మాత్రం పరిశీలించలేదని, తద్వారా ఆయన ప్రచురించే పుస్తకం తప్పుల తడకగా తయారౌతున్నదని వారి విమర్శ ద్వారా గోచరమౌతున్నది.

కాకతీయులులకు, ముదిగొండ చాళుక్యులకు వైరము లేదన్నది పూర్తిగా అబద్ధమే. ముదిగొండ చాళుక్యులు తూర్పు చాళుక్యులకు మొదటి చాళుక్య భీముని కాలము నుండి సహాయం చేయుచున్నారని, వారికి ప్రతిగా రాష్ట్రకూటులు, కాకర్త్యగుండ తాత, తండ్రి గుండన ఎఱ్ఱయలు పోరాడుచుండిరని, గుండన, ఎఱ్ఱయ రాష్ట్రకూట చక్రవర్తులవద్ద దండనాయకులుగా వుండి కుఱ్ఱవాడి దేశమును పాలించుచుండిరని తెలియుచున్నది. (ఈ పోరాట వివరాలు చాళుక్యభీముని నుండి దానార్ణవుని వరకు గలవి రాబోయే నా గూడూరు శాసనములోని విశేషాంశములో చదువ వగును.) పై విషయమును కాకతి మైలాంబ బయ్యారం శాసనము తెలియజేస్తున్నది.

అదే శాసనములో పెండ్లిగుండన ''పిండిగుండ నృపతి స్తతోభవత్కండి తారినరనాథమండల్లి'' అన్న వాక్యముబట్టి గుండనకూడ రాష్ట్రకూట 3వ కృష్ణచక్రవర్తివద్ద దండనాయకుడేమోనని భావించవలసి వుంటుంది.

రాష్ట్రకూటులకు, తూర్పు చాళుక్యులకు తరతరాలుగా వున్న విరోధ భావము గుండన ముదిగొండ చాళుక్యులపై ప్రసరించియున్నది. వారే విధముగా మిత్రులైరి. దానికొక కారణము వారు చూపవచ్చును. క్రీ॥ శ॥ 950 నాటి (మూడవ) అమోఘవర్ష చక్రవర్తి పాదపద్మారాధకుడు మహాసామాన్తాధిప సత్యాశ్రయ భీమరుసు కొఱవి ప్రాంతాన్ని పాలిస్తున్నట్లు ఆకునూరు శాసనము తెలియచేస్తున్నది

ఆయన పరిష్కరించిన పద్యముల నాధారముగా చేసుకుని ఈ ప్రశ్నలకు సమాధాన మీయగలరా? ''బొట్టుబేతవసుధాధిపు చేకొని వాని వైరినుద్ధృతముగ జంపి యా కొఱవిదేశమునందు ప్రతిష్ఠజేసి'' అన్నప్పుడు ఆ శత్రువెవరు? నాల్గవ పద్యమున పేర్కొన్న ''బేతభూవిభుని కాకతి వల్లభుపిన్నవాని'' అన్నప్పుడు, ఐదవ పద్యములో ''కాడయ నాయకు జంపి సూరడవ్వేలుపుకొండ రవ్వన్నపు వేలుపు గొండన నిల్పి'' అన్నప్పుడు రవ్వన్నపు డెవ్వరు?

మాటేడు శాసనములోని విశేషాలు, గూడూరు శాసనములోని విశేషాలు ఒక్కటేనని నేను ఘంటాపథముగా చెప్ప సాహసిస్తున్నాను.

ఒకే ప్రాంతాన్ని ఇద్దరు పాలించరుగదా! క్రీ॥ శ॥ 950 నుండి కొరవి ప్రాంతాన్ని ఆర్మకొండెయ భీమరుసు పాలిస్తున్నాడు ఆయన తైలపుని తండ్రి. ఆయనను ఆర్మకొండయ భీమరుసు, అనుమకొండ భీమరుసుగాను ప్రజావ్యవహారమైనది. ఆయన మహాసామన్తాధిపతి అని, కొరవిదేశాధిపతి అనికూడా ఆకునూరు శాసనము తెలియజేస్తున్నది.

గూడూరు శాసనములోని మూడవ పద్యములో నుదాహృతమైన బొట్టువసుధాధిపుని వైరి ఈ భీమరుసు. క్రీ॥ శ॥ 956 నాటికి భీమరుసు కొరవిదేశాన్ని పాలిస్తున్నాడు ఇరుగు పొరుగు అధికారుల సహాయ సహకారాలు పొందుతున్నాడు భీమరుసు. కాకర్త్య గుండన అతనితో సహకరించలేదు తమ మధ్యగల విరోధభావం కారణంగా. ఒకే చక్రవర్తి సామన్తులుగా వున్నా వారి విరోధం మాత్రం పోలేదు.

క్రీ॥ శ॥ 956 లో దొమ్మనకు దానార్ణవుచేత దానమిప్పించిన నాటినుండి క్రీ॥ శ॥ 957 లో తైలపుడు తర్దవాటిసీమ పాలనకు మూడవ కృష్ణచక్రవర్తిచే పంపబడినాడు. ఈ మధ్య కాలములోనే కాకర్త్యగూడన, తదుపరి విరియాల ఎఱ్ఱనబొట్టు (చిన్న) బేతనికి సహాయముగా వచ్చి ఆర్మకొండయె భీమరుసును చంపినాడు. అప్పటికి బేతని వయస్సు పన్నెండు సంవత్సరము లుండవచ్చును. బేతని సామ్రాజ్య స్థిరత్వం చేకూర్చే యత్నంలో ఎఱ్ఱయకూడ మరణించినాడు.

తరువాత పద్యములో ఎఱ్ఱయ భార్య కామసాని బేతరాజును తన సహాయముతో వల్లభరాయునితో యుద్ధముచేసి, తదుపరి తైలప చక్రవర్తికి సామన్తునిగా చేసినది. వరంగల్ సమీప-

ప్రాంతమున దొరికిన ఒక శాసనము బట్టి క్రీ॥ శ॥ 975 కు పూర్వమే పైన చెప్పిన ప్రాంతములన్నీ కళ్యాణి చాళుక్య తైలప చక్రవర్తి సేనాధిపతి స్వాధీనం చేసుకున్నటు తెలియజేస్తున్నది. దాన్నిబట్టి ఆనాటికే కాకతి బేతడు కళ్యాణ చాళుక్య చక్రవర్తి తైలపుని సామన్తుడై తన చివరి రోజులలో బేతరుసైనాడు.

ఐదవ పద్యము మూరడు కాటయ నాయకు జంపి చిన్న రాజున వేల్పుకొండన నిల్పి ఆయనచేత బహూకృతులందినాడు.

మాటేడు శాసన ప్రదాత తన పూర్వీకులు చిన్నబేత భూపతిని రక్షించి ఆయనచేత దానములు, తామ్ర శాసనముల గ్రహించినట్లు తెలియజెప్పిరి

— శ్రీ ఐ వై. ఢ మల్లికార్జున

"సీమోల్లంఘన" పై విమర్శకు సమాధానం

నా పుస్తకం "సీమోల్లంఘన" పై 'భారతి' (మే) లో వచ్చిన రివ్యూ మొన్ననే నా దృష్టికి తీసుకురాబడింది. (నేను పుస్తకాన్ని రివ్యూ కోసం సంవత్సరం కిందట పంపాను — కాని అది ఏ నెల సంచికలో రివ్యూ అవుతుందో తెలీక పోవటంవల్ల, మొన్నటిదాకా ఈ రివ్యూ చూడలేదు). చూశాక, దానికి ప్రత్యుత్తరం యివ్వటం అవసరమనిపించింది.

ప్రప్రథమంగా చెప్పవలసిందేమిటంటే, ఆ రివ్యూలో విమర్శకుడు వాడిన భాష తెలుగేనా అనిపించేటంత అపసవ్యంగా వుంది. రివ్యూలోని భాషపై కూడా కామెంటు చెయ్యటం ఎందుకు — అంటారేమో; తెలుగు నుడికారాన్ని గురించి ప్రాథమిక జ్ఞానమైనా లేని యీ విమర్శకుడు, నా పుస్తకంలో 'నుడికారం చాలా చోట్ల కుదుట పడలే'దని వాపోయాడు. ఆ సందర్భంలోనే, తన "భాషా ఫక్కీ" ప్రదర్శించటానికేమో, 'దాడి గుర్రాల గిట్టల కింద భాష నలిగి పోయిం'దంటూ ఒక 'మెటఫర్' కూడా వెలిగించాడు. కాని అలా నుడికారం కుదటపడని చోటు ఒక్కటి చూపినా సంతోషించే వాణ్ని. అలా చూపాలంటే, ఆయా చోట్ల నా భావంతో నా నుడి కారం ఎలా సహకరించలేదో వివరించాలి. పుస్తకం తనకు 'సులభం'గా అర్థం కావటం లేదని విమర్శకుడే ఒప్పుకున్నందుకు సంతోషమే కాని, ఆయన ఆ శ్రమ తీసుకోనవసరం లేదు. ఆయన రివ్యూలో బయట పెట్టుకున్న ఆలోచనా శక్తిని గమనించగానే తెలుస్తుంది, ఏ మాత్రం 'కాంప్లెక్సిటీ' వున్న ఆధునిక కవిత్వమైనా, యీ విమర్శకుడి మేధాశక్తికి అందుబాటులో వుండదని.

నోబెల్ బహుమతి పొందిన ఇలియట్, ఏట్స్, ఎజ్రాపౌండ్ ప్రభృతులే కాక (మరి వాళ్ల కవిత్వం కూడా, అర్థం కాలేదని కోప్పడి, 'నుడికారం కుదుట పడలే' దంటాడేమో ఈయన), తెలుగులో కూడా శ్రీ శ్రీ మొదలు వేగుంట మోహన ప్రసాద్ వరకూ గల ఆధునికులు — సుమతి శతకానికీ, రెండో తరగతి వాచకానికీ మాత్రం అలవాటు పడిన పాఠకుడికి 'సులభంగా' అర్థం కావటం కోసమని రాయలేదు కవిత్వం; విభిన్న ఆధునిక కవితా సంప్రదాయాల అధ్యయనంతో సుశిక్షితుడైన పాఠకుని కోసమే రాశారు వాళ్లు. అలాంటి శిక్షణా, అధ్యయనమూ తనకు గిట్టని విషయాలని శ్రీ రెడ్డిగారే రివ్యూలో ఒప్పుకున్నారు, "ఎక్కువ చదువుకొన్నా బెడదే" నంటూ. అవునుమరి అలాంటి అధ్యయనం ఏ మాత్రం లేకున్నా కితాబులూ, అకాడమీ గౌరవాలూ వచ్చిపడే యీ రోజుల్లో, ఆపాటి లౌక్యం నేర్చుకోకుండా చదువుకుంటూవుండే నాలాంటి వాళ్లపై రెడ్డిగారు జాలి చూపవలసిందే.

"నిప్పు రవ్వలు ఊరటం", "స్రవించే ఇంధనం" లాంటి ప్రయోగాలు ఆధునిక కవితా శైలిలో ఒక భాగమని తెలియకపోతే అది కేవలం అజ్ఞానమని సరిపెట్టుకోవచ్చు. కాని అవి ఏ ఎఫెక్ట్ కోసం రచయిత వాడుతున్నాడా అని ప్రాథమికంగానైనా ఆలోచించ లేని బుర్ర (లిటరల్ మైండ్) తో ఈ రెడ్డిగారు ఆధునిక కవిత్వాన్ని చదవటం, అది చాలనట్లు విమర్శించబోవటం మాత్రం దుస్సాహసం. ఇదే ధోరణిలో ఈయన, 'హిమజ్వాల' అనే నవల రాసిన ప్రసిద్ధ నవలా రచయితను పట్టుకుని, "మంచు రాజుకోదు గదంటయ్యా?" అని ముద్దుగా అడిగేటట్లున్నాడు.

'నీరెండ' లోని 'చురుకు'ను గురించే నేను రాసింది. గీతం లోని భావం ఆవిష్కృతం కావటానికి ఆ సూచనే ముఖ్యం. నీరెండలో చురుకును గురించి సందేహమా? మరి, మాంచి రోహిణి కార్తెలో నిప్పులు చెరిగే ఎండలో తప్ప 'చురుకు' తగలదేమో కొన్ని శరీరాలకు! అది గమనించక పోవటం నా తప్పే.

శ్రీ ఉణతుల రామచంద్రయ్య

లేఖలు

భారతి సెప్టెంబరు నెల సంచికలో శ్రీ పి. వి పరబ్రహ్మ శాస్త్రి గారు శుంగ కాణ్వవంశ రాజుల గూర్చి వ్రాయుచు కాణ్వ వంశములో కట్టకడపటి రాజగు సుశర్మను సిముక శాతవాహనరాజు చంపి యుండునని అభిప్రాయపడిరి (నిర్ణయము 4–55–56 పుటలు). 8 వ నిర్ణయములో మౌర్యుల అనంతరం శుంగకాణ్వ వంశీయులు 112+45 సం॥ లు పరిపాలించినట్లు, స్వతంత్ర శాతవాహన రాజ్యస్థాపనము క్రీ. పూ. 40 తర్వాత జరిగి యుండునని కూడా అభిప్రాయపడిరి. (56 పుట).

చరిత్ర ప్రకారము అశోకుడు క్రీ. పూ. 272 నుండి 231 వరకు పరిపాలించెను. తరువాత అతని మనుమడు దశరథుడు (సుయశుని కుమారుడు), అతని తరువాత మరి ముగ్గురు, తరువాత బృహద్రథుడు (మౌర్య వంశములో కట్టకడపటిరాజు) రాజ్యమునకు వచ్చెను. ఈతని సైన్యాధిపతి పుష్య

మిత్ర శుంగుడు. బృహద్రథునకు సైన్యమంతటిని చూపు మిషతో బలముల నన్నిటిని నిల్పి, చూచుటకు వచ్చిన బ్రహద్రథుని పుష్యమిత్రుడు సంహరించెనని బాణకృత హర్ష చరిత్రమునందున్నది (క్రీ. పూ. 184). దీనితో మౌర్యవంశ మంతరించెను.

తరువాత శుంగవంశములో పుష్యమిత్రుడు, వసుమిత్రుడు, సుజ్యేష్ఠుడు, సుమిత్రుడు మొదలగా గల తొమ్మిది మంది రాజ్యమేలిన పిదప దేవభూతి రాజ్యమేలునపుడాతని మంత్రి వసుదేవుడు దేవభూతిని చంపి మగధ సింహాసనమాక్రమించెను (క్రీ.పూ. 63). ఇంతటితో శుంగవంశమంతరించెను.

వసుదేవుడు కణ్వగోత్రోద్భవగుటచే ఈతనితో కాణ్వవంశ మారంభమయ్యెను. వసుదేవుడు, భూమి మిత్రుడు, నారాయణుడు పరిపాలించిన తరువాత, కడపటి రాజగు సుశర్మను క్రీ. పూ. 27 లో ఆంధ్రరాజు ఓడించి చంపెను. కాని యీ ఆంధ్రరాజు సిముకుడు కాడు. 13–15 వ రాజులలో (కుంతల శాతకర్ణి, శాతకర్ణి, మొదటి పులోమాయి) ఒకడు. ఏలన సిముకుని రాజ్య స్థాపన అంతకు ముందు 200 సం॥ లకు పూర్వమే అని నిర్ణయించిరి.

చరిత్ర విషయమిట్లుండ బృహద్రథుని కుమారుడు జరాసంధుడని (బార్హద్రథి), అతనిని ధర్మరాజు, భీముడు, శ్రీకృష్ణుడు హస్తినాపురము నుండి వచ్చి, మల్లయుద్ధమునకు పురిగొల్పి, మల్లయుద్ధములో భీమునిచే చంపించిరని మహాభారతములో ఉన్నది. చరిత్ర ప్రకారము బృహద్రథుడు (మౌర్యవంశములో కడపటివాడు) క్రీ. పూ. 184 వరకు ఉన్నచో, శ్రీకృష్ణుడు క్రీ. పూ. 184 సం॥ ము తరువాత జీవించియుండవలెను. జరాసంధుడు తన కుమార్తెను శిశుపాలునకిచ్చి వివాహము చేసెను— రుక్మిణీ కృష్ణుల రాక్షస వివాహమైన తరువాత – శిశుపాలుని శ్రీకృష్ణుడు చంపిన తరువాత, అల్లుని చంపినాడన్న కోపముతో జరాసంధుడు మథురా పట్టణముపై 17 మార్లు దండెత్తి కొల్లగొట్టెనని మహాభారత, భాగవతములందున్నది. ఈ విషయము చరిత్రకందుటలేదు— మగధ రాజ్య చతుర్విధ ఘోర వాహినీ హంతకుడనీ శ్రీకృష్ణుని ప్రశంసించుట తప్ప –.

ఆ విషయ మట్లుండ కురుక్షేత్ర యుద్ధము క్రీ. పూ. 15 వ శతాబ్దమునకు పోయినది. నాటికి పాండవులు, శ్రీకృష్ణుడు జీవించియున్నారు కదా. బార్హద్రథియున్న క్రీ. పూ. 2 వ శతాబ్దమెక్కడ ?, కురుక్షేత్ర యుద్ధము జరిగిన క్రీ. పూ. 15 వ శతాబ్ది యెక్కడ ? ప్రాజ్ఞులీ తారతమ్యము సరిచేయుదురని నా ప్రార్థన

ర. వి రావు

పై లేఖ యందలి యంశములు :

I. సిముక సాతవాహనుని రాజ్యారంభకాలమును ఇప్పుడు ఈ నాణెములను బట్టి చెప్పదలచిన క్రీ పూ. 40–30 మధ్య కాలమునకు సుమారు 200 ఏండ్లు పూర్వమని చరిత్రకారులు నిర్ణయించిరి గనుక ఈ నూతన కాలనిర్ణయమెట్లు సరిపోవును ?

కొందరు చరిత్రకారులు సిముకుని రాజ్యారంభమును క్రీ. పూ. 260–270 ప్రాంతము వరకు నిర్ణయించిన మాట వాస్తవమే. వారు కాణ్వసుశర్మను తొలగించియో, చంపియో రాజ్యమాక్రమించినది సిముకుడు కాజాలడు 15 వ వాడగు పులుమావి కాదగునని చెప్పినమాటయు సత్యమే. కాని పురాణములలో సుశర్మను చంపినది సిముకుడనియే యున్నది. ప్రస్తుతము లభించిన నాణెములను ముద్రించిన సిముకుడు ఆ నాణెముల తీరును, లిపిని బట్టి యెట్టి పరిస్థితిలోను క్రీ. పూ. 40 కి దాటి పూర్వుడని చెప్పవీలగుటలేదు. కావున సుశర్మను తొలగించి స్వతంత్ర సాతవాహన రాజ్యమును స్థాపించినవాడే సిముకుడగుటలో అభ్యంతరం లేదు. క్రీ. పూ. 260 ప్రాంతంలో వేరొక సిముకుడున్నట్లు సాక్ష్యము లేదు. 30 మంది రాజులను సరిపెట్టుటకు చెప్పినది ఆ వాదము.

మౌర్యుల అనంతరము శుంగులు, కాణ్వులు సుమారు 157 యేండ్లు రాజ్యమేలినట్లు పురాణాలు చెప్పుచున్నవి కనుక క్రీ.పూ. 188 తో పూర్తియైనదనుకొను మౌర్య రాజ్యకాలము తర్వాత 157 యేండ్లు తీసివేయగా సుమారు క్రీ.పూ. 30 ప్రాంతములో సిముకుడు రాజ్యమునకు వచ్చెనని పురాణముల నుడివిని ఆధారాంతరములతో లోగడ డి.సి సర్కారు వంటి కొందరు చరిత్రకారులు నిరూపించిరి. ఇంచుమించు వారి మాటనే యీ నాణెములు స్వతంత్రముగా అంటే నాణెముల తీరు, లిపి మున్నగు విశేషములు నిరూపించుచున్నవి. కనుక కాణ్వ సుశర్మను చంపినది 15 వ సాతవాహన రాజగు పులుమావి కానక్కరలేదు. సిముకుడే కావచ్చును.

ఈ విషయమును నేను పూజ్యులు గుర్తి వెంకటరావు గారికి తెలుపగా వారు సంతోషించుచు

'వాదే వాదే జాయతే సత్యశోధః' అని ప్రాస్తావ్య వాదములు చేయగా చేయగా నిజము బయల్పడగలదను ఆశయమును తెలిపిరి. క్రొత్త సాక్ష్యమును పరిశీలించవలెనని వారి తాత్పర్యము.

ఈ నాణాలను బట్టి సిముకుని రాజ్యారంభాన్ని క్రీ. పూ. 40–30 మధ్యకు తెచ్చునో అనేక క్రొత్త సమస్యలు తలయెత్తుచున్నవి. ముఖ్యమైనదిగా నానాఘాటు శాసనముల సాక్ష్యము. వాటిని పరిష్కరించుటకు చరిత్రకారులు ప్రయత్నించుచుండిరి. నేనుకూడా చేతనైనంత ప్రయత్నించుదును. సిముకుని రాజ్యారంభ కాలమును గూర్చి కొందరు చరిత్రకారులు చేసిన క్రీ పూ. 260 ప్రాంతమను నిర్ణయమును ఈ నాణెములను బట్టి మార్పు చేయవలసి యున్నది.

II వారి లేఖలోని రెండవ అంశము.

అశోకుని వంశములో తుదివాడైన బృహద్రథుడు క్రీ. పూ. 188 వరకు రాజ్యమేలెనచో భారతములోని జరాసంధుని కాల మెప్పుడనునది

అశోకుని మునిమనుమడైన బృహద్రథుడు మౌర్య బృహద్రథుడు. జరాసంధుని తండ్రియగు బృహద్రథుడు వేరొకడు. పౌరవంశములో మరియొక బృహద్రథుడు భారతయుద్ధము తర్వాత పరీక్షిత్తుకి తర్వాత చాలా తరములు గడచిన పిదప రాజ్యమేలెను. ఇక్ష్వాకులలో మరొక బృహద్రథుడున్నట్లు కూడ చెప్పబడింది. కనుక మన చరిత్రకారులు చెప్పే బృహద్రథుడు మౌర్యబృహద్రథుడే కాని, భారత, భాగవతములందు వేరే సందర్భములలో చెప్పబడిన వాడుకాదు. మౌర్య బృహద్రథుడు క్రీ. పూ. 2 వ శతాబ్దిలోని వాడు.

చరిత్రకారులు పురాణములందు భవిష్యద్వ్యాజేతిహాసములో పేర్కొనబడిన రాజవంశములను పురావస్తు సాక్ష్యములు లభించి నంతవరకు నిరూపించుచున్నారు. ఈ పురావస్త్వవశేషములు శాసనములు, నాణెములు, త్రవ్వకాల్లో లభించే యితర విశేషములు. అశోకుడి శాసనాలున్నవి గనుకను, గ్రీకు రాజుల నాటి కొన్ని సాక్ష్యములున్నవి గనుకను మౌర్యవంశమునకు నిదర్శన పూర్వకముగా చరిత్ర లభించిందంటున్నారు. అట్లే యిప్పుడు దొరకిన నాణాలు శుంగవంశము, కాణ్వవంశము, సిముకుడిని గూర్చిన సమాచారాన్ని నిరూపిస్తున్నవి గనుక ఇవి కూడా చరిత్ర కాధారమంటున్నాము. కాణ్వులను గూర్చి ఇంతవరకు పురాణ కథనమే మనకు ప్రమాణ ముగ స్వీకరించవలసి యుండెడిది. అట్లే జైన వాఙ్మయంలో కూడా కొన్ని చరిత్రాంశములు వ్రాయబడియున్నవి. ప్రమాణాంత రాన్ని బట్టి ఆ కథలను నిరూపించుటకు చరిత్రకారులు యత్నించు దురు. అట్లే భారత కథకు సంబంధించిన నిదర్శనములు కను గొనుటకు అనేక ప్రయత్నములు చేయుచున్నారు. ఆ ప్రయత్న ములు ఫలించి, భారత సంస్కృతికి జీవగఱ్ఱయైన భారత కథ చరిత్రకే యితిహాసమై భారతీయ విశిష్టతను పెంపొందించగలదని ఆశించుదము.

— శ్రీ పి వి. పరబ్రహ్మశాస్త్రి

వైష్ణో దేవి

కాశ్మీర వైష్ణోదేవినే శ్రీ త్రైకూటక భగవతీ అంటారు. సెప్టెంబర్—నవంబరు నెలలమధ్య లక్షలాదిగా యాత్రీకులరద్దీ. వారు మోకాటిలోతు నీటిలో వంగి నడుస్తూ గుహలోకి వెళ్లి దేవిని దర్శిస్తారుట. ఈ దేవినే 'ముగురమ్మల గన్నయమ్మ'గా మహా సర స్వతీ, మహాకాళీ, మహాలక్ష్మీరూపంగా; ఆది కన్యాదేవిగా భావిస్తారు.

ఈ కన్యాదేవిని భైరో (భైరవ) వెంబడించగా వానిని సంహరించి కొండమీది గుహ నివాసం చేసుకొన్నదట. దేవిని దర్శించ బోయేవారు భైరోను చూడరాదు. తిరిగి వచ్చేటప్పుడు దర్శిస్తారు. గుడిబైటగల గండశిలయే భైరో.

వాయువ్యంలో శక్తిపీఠమున్నది. భైరవుడున్నాడని చీనా యాత్రీకుని వివరణ. ఇదే సంబంధమైతే వైష్ణోదేవి క్షేత్రం శక్తిపీఠం—తాంత్రిక బౌద్ధాలయమై యుండునా?

శ్రీ జి. ఆర్. వర్మ

మరుపూరిగారి విమర్శలు

దాదాపు ముఖ్య తెలుగు పత్రికలన్నీ విజయవాడలోనే వున్నాయి గనుక, అందరూ కృష్ణా మాండలిక పదాల్నే వాడాలా? మరుపూరు వారు నెల్లూరు దేశ్యం వాడడం వింతగా వుండవచ్చు కొందరికి. కాని అది అలా వుండాల్సిందే. ఎందుకంటే అందరూ ఒకేమూస పదాల్ని వాడితే, యితర మండలాలలోని, ఆయా దేశ్యపదాలు చదివి, విని ఆనందించేదెప్పుడు? వారుపయోగించే 'మాండలిక' పదాల్లో ఒక చెణుకు, ఒకహాస్యం, ఒక వింతశబ్దం చెవుల్లో మార్మోగు తుంటుంది. కాబట్టి ఆయన రాసే రీతిలోనే ఆయన రాయాలి.

నన్నడిగితే యింకా యితర మాండలిక పదాలతో గూడా విమర్శలు ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా కడపజిల్లా. ఆ పదాలు చదివి, అర్థం చేసుకొని మనం ఆనందించాలి. మరి సమైక్యత ఎల్లా వస్తుంది?

శ్రీ యలమూడి ప్రసాదరావు

సెప్టెంబర్ 78 'భారతి'లో మరుపూరి విమర్శపైన వ్యాఖ్యానం చేయబోయి శ్రీ అంజయ్యగారు తమ సంకుచిత మనో భావాన్ని బాహాటం చేసుకొన్నారు. నేను కమ్యూనిస్టు సిద్ధాంతాలపై మేధావిని కాను. కానీ నాకు తెలిసినంతవఱకు కమ్యూనిజమ్ యొక్క ప్రధాన మూలసూత్రం, సాంఘిక సమానత్వం. కమ్యూనిస్టుల దృష్టిలో హెచ్చుతగ్గులు వుండకూడదు. అటువంటప్పుడు తమ ప్రత్యర్థిని పట్టుకొని "ఆడది" అని అభివర్ణించడం అంజయ్యగారి ఫ్యూడల్ మనస్తత్వాన్ని వెల్లడిస్తుంది. శ్రీమతి గాంధీ కేపిట లిస్టు ఏజంటు కావొచ్చు. మొరార్జీవలె సామ్రాజ్యవాదులకు వత్తా పలికుండవొచ్చు. వాజపేయీవలె, కానీ ఆమెను "ఆడది" అని అభివర్ణించడంలోగల ఆంతర్యాన్ని విప్లవవాదులనుండీ తెలుసుకో గోరుతున్నాను. శ్రీమతి గాంధీ జనతాపై విఱుచుకుపడటంలో తప్పేమీలేదు. అది ప్రతి రాజకీయ నాయకులు చేసేపనే. నిన్న మొన్నటివఱకు దేశంలో ప్రతి అనర్థానికి కారణం విధాత పరిపాలనే అని మొరిగిన రాజకీయ నాయకులున్నారు. ఇందులో ప్రత్యేకంగా ఆమెను తప్పు పట్టడంలో అర్థంలేదు—పోనీ అంజయ్యగారి ప్రకారం జనతావారి పాలన రామరాజ్యంగానో (పోనీ మావో రాజ్యంగానో) వుంటే శ్రీమతి గాంధీ, వారిపై విఱుచుకోవడం అర్థంలేని పని అనిపిస్తుంది. కానీ అటువంటిది ఏమీ లేదుకదా! శ్రీమతి గాంధి ఎమర్జన్సీలో కిట్టగౌడ భూమయ్యలను ఉరితీస్తే జనతావారు 'ప్రజాస్వామ్యంలో', విప్లవకారులను చంపారు. ఇటువంటప్పుడు వీరు జనతాను ఎందుకు ఎక్కువగా అభిమానిస్తున్నారో తెలీదు. పోనీ జనతా విమర్శింపదగిందే అయితే ఆ పని చేయవలసింది ఒక్క తామే అనుకొంటే, అది లోకజ్ఞానం లేనిమాట. ప్రతి ఎన్నికల లోనూ డిపాజిట్లు పోగొట్టుకొని, అసలు ఉనికేలేని రాజకీయపక్షాలు అదేపనిగా ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే, తమ పార్టీ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపబడి, రెండు రాష్ట్రాలలోను పరిపాలన

సాగిస్తుండే పార్టీ నాయకురాలు, అధికారపక్షాన్ని ఎందుకు విమర్శించకూడదో నాకు తెలీటంలేదు.

శ్రీ అంజయ్యగారు అదేవిధంగా మరుపూరుగారిని గ్రంథ విమర్శలనుండి తప్పుకోవాలని, విప్లవకారులను విమర్శించకూడదని ఆజ్ఞాపిస్తున్నారు. మీరు ఈ దేశపు ప్రధానమంత్రి అయినప్పటికి? వేరేగాని, ఇప్పుడు మరుపూరుగారు గ్రంథవిమర్శ చేయరాదనడానికి మీరెవరండీ. మీ రచనలు వారికి పంపకండి. కాని ఇష్టమున్నవారు పంపుకొంటారు. ప్రచురించే బాధ్యత సంపాదకులది. విమర్శ మీరూ చదవండి, ప్రతి విమర్శచేయండి. కానీ అసలు ఈ పనికే దిగవద్దనే సలహా యివ్వడం ఎంత దుస్సాహసంతో కూడివుందో యోచించారా?

విప్లవకారులు, వేదాలనుండి వెంగళ్రావును, రామాయణం నుండి, రాజనారాయణ్‌ను ప్రపంచంలో ప్రతివారిని తిట్టవొచ్చు, కాని ఎవరు కూడా వీరిని విమర్శించరాదు. నిజంగా గాజు యిళ్ళలో వుండేవారు ఏవిధంగా బయట వారిపై రాళ్ళు రువ్వుతారో?

డా. మురళీధర్

జనసాహితి'లో సభ్యులుగా వున్నవారేగాక, ఇతరులు కూడా తమ రచనలు పంపవచ్చు.

భూమి సమస్య, ఫ్యాక్టరీ కార్మికుల జీవితం, సమ్మెలు, గని కార్మికుల సమస్యలు, పౌరహక్కులు, నిరుద్యోగం, కుల వ్యవస్థ, గిరిజన సమస్యలు, విద్యార్థుల సమస్యలు, మధ్యతరగతి జీవితం, గ్రామీణ జీవితం లాంటి విషయాల్ని ఇతివృత్తాలుగా తీసుకొన వచ్చును.

రచనలన్నీ 1978 డిశంబర్ 31 తేదీలోగా ఈ క్రింది అడ్రసుకు చేరాలి.

కె రవిబాబు
ప్రధాన కార్యదర్శి
జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్య
నగరంపోస్టు
తెనాలి ఆర్. ఎమ్. ఎస్,
గుంటూరు జిల్లా — 522 268

మ న వి

భారతి మాసపత్రిక కాబట్టి ఒక్కొక్క సంచిక పని ఒక నెలరోజుల ముందయినా ప్రారంభం అవుతుంది. వచ్చిన రచనలని వీలయినంత త్వరలో పరిశీలించి, నిర్ణయం తీసుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉంటాము. ప్రచురణకి స్వీకరించిన రచనలని వీలుని బట్టి అవి వచ్చిన వరుసలో వెయ్యటానికి కూడా ప్రయత్నిస్తూ ఉంటాము. రచనలని స్వీకరించినట్లు లేదా స్వీకరించనట్లు కార్డుల ద్వారా వాటిని పంపిన వారికి తెలుపుతాము. ఈ విషయమయి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపటం కష్టం. భారతికి రాసేవారం దరూ పయి వివరణలని సహృదయంతో గమనించి మాతో సహకరించాలని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు

ప వ ర ణ

హైందవ తర్కశాస్త్ర పరిచయం. ... రచనలో, చివర పేజీలో, భగవద్గీతనుంచి (18వ అధ్యాయం, 63వ శ్లోకం) కోట్ చేసిన దానిలో : అంటే వ్రాత ప్రతిలో, చివరిలైను కాక దాని పై లైనులో :

'విమృశ్యైః తదశేషణ యథేచ్ఛసి తథాకురు' అని ఉన్నది తప్పు. అది

'విమృశ్యైతదశేషణ యథేచ్ఛసి తథాకురు' అని ఉండాలి.

''శ్యైః'' అన్న దాన్ని ''శ్యై'' అని దిద్దాలి అని కోరు తున్నాను. (రచయిత)

వి జ్ఞ ప్తి

కార్మికులకూ, వ్యవసాయ కూలీలకూ, పేద రైతులకూ, మధ్య తరగతి కుటుంబాలకూ, ఇతర ప్రజలకూ, సంబంధించిన జీవితాల్ని వాస్తవికంగా, చైతన్యవంతంగా, కళాత్మకంగా చిత్రించే నాటికలనూ, నాటకాలనూ, పాటలనూ, కథలనూ, సంపుటాలుగా ప్రచురించడానికి 'జనసాహితీ, సాంస్కృతిక సమాఖ్య' నిర్ణయించింది.

గ మ నిక

కాకినాడనుంచి ''సుధీవిధేయః, టిప్పణి'' పేర సంస్కృతంలో ఒక లేఖ మా కార్యాలయం చేరింది. పేరు, చిరునామా పూర్తిగాలేని లేఖలు వెయ్యము కనుక పయి లేఖని పంపినవారు కావలసిన వివరాలని తెలుపుతూ రాస్తే లేఖని ప్రచురించగలము

సం॥

గ్రంథ విమర్శలు

గ్రంథాలయ ప్రచారం

[రచన : శ్రీ ఎ. గోపీనాథ్, సంపాదకులు : శ్రీ వెలగా వెంకటప్పయ్య, డెమ్మీ 156 పేజీలు వెల. 10రూ. ప్రచురణ: వినోద్ పబ్లికేషన్స్, 13–96 ఫోర్ట్, ధర్మవరం–515571.]

విజ్ఞానానికి ప్రధాన సాధనాలైన గ్రంధాలను సేకరించి పాఠకులకు అందజేసేవి గ్రంథాలయాలు. అంతమాత్రం తోనే తృప్తి పడకుండా వివిధ రంగాలలో విజ్ఞానప్రచారానికి పాటుపడడం లక్ష్యంగా పెట్టుకొన్నదే గ్రంథాలయ ప్రచారోద్యమం. ఆ ప్రచారం ఏ విధంగా జరుగుతున్నదీ, గ్రంథాలయ నిర్వహణ ఏ విధంగా ఉండ వలసినదీ గ్రంథాలయ శాస్త్రం (Library Science) అభ్యసించి, అందులో ఆరితేరిన వారికే బాగా తెలియగలదు. అట్టి సమర్థులలో ఏ తద్గ్రంధ రచయిత శ్రీ ఎ. గోపీనాథ్ ఒకరు. ఈయన అనంత పురం జిల్లాలో ప్రముఖ గ్రంథాలయ కార్యకర్తలు. ఆయన తమ అనుభవాల్నీ, గ్రంథాల శాస్త్ర పాండిత్యాన్నీ ఆధారం చేసికొని వ్రాసిన గ్రంథం యిది.

ఇందులో అనుబంధం మినహాగా 14 శీర్షికలు ఉన్నవి అవి ప్రచార విధానం, గ్రంథాలయ పరిచయం, ప్రదర్శన సరంజామా, ప్రదర్శన రీతులు, సభలు – సదస్సులు – గోష్ఠులు, గ్రంథాలయ వారోత్సవాలు, వార్షికోత్సవాలు, సామూహిక ప్రచారం, వినోద ప్రద ర్శనలు, విశేష విభాగాలు, ప్రచారంలో నైతిక విలువలు, ఈనాటి వార్తలు, ఈనాటి సూక్తులు, ఈనాటి విశేషాలు–అనేవి. అనుబం ధంలో ఆంగ్ల పదాలకు సరియైన తెలుగు పారిభాషిక పదాలు ఏ తద్గ్రంధ రచనకు ఉపయోగించిన గ్రంథాల పట్టిక, విద్యా విష యక చలన చిత్రాలు లభించే స్థలాలు ఉన్నవి. ఈ శీర్షికలనుబట్టే ప్ర సామాన్యంలో విజ్ఞానాభివృద్ధికి గ్రంథాలయోద్యమం వారు ఎట్టి పథకాలను అమలులో పెడుతున్నదీ వివరంగా తెలుస్తున్నది. నిరక్షరాస్యులను కూడా ఆకర్షించి విజ్ఞానోన్ముఖులుగా చలచి ఉత్సాహాన్ని కలిగించడానికి ఈ పద్ధతులు ఎంత బాగా ఉపయోగ పడేదీ ఆయా శీర్షికలను చదివితే స్పష్టంగా తెలియగలదు.

'ఈనాటి విశేషాలు' అనే చివరి శీర్షికలో ఒక మహాత్ముడు జన్మించడమో, భౌతికంగా దూరం కావడమో, శాస్త్ర పరిశోధనలో ఒక నూతనావిష్కరణ, ఒక ఒడంబడిక, ఒక దుస్సంఘటన–ఇలా మంచీ చెడ్డా జరగడమో–ఇలాటి విశేషాలు తెలుపబడినవి. ముఖ్యంగా భారతదేశానికీ, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన విష యాలు చాలా ఉన్నవి. ఇదే ఒక సంగ్రహ ప్రదర్శిని అని చెప్ప వచ్చును. దీనిని గ్రంథ సంపాదకులు వెలగా వెంకటప్పయ్యగారు సంగ్రహించారట !

గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్యగారు దీన్ని ఆశీర్వదిస్తూ, విదేశాలలోని గ్రంథాలయోద్యమాలు మానవ మేధస్సును పెంపొందించడానికి ఉద్దేశించగా–భారత గ్రంథాలయో ద్యమం మానవుని సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దడానికి దోహదం చేస్తున్నదనీ, ఈ గ్రంథం గ్రంథాలయ కార్యకర్తలందరికీ కరదీపిక కాగలదనీ చక్కగా చెప్పారు

కడపజిల్లా రచయితల సంఘ కార్యదర్శి జానమద్ది హను మచ్ఛాస్త్రిగారు రచయితను గురించీ, సంపాదకుని గురించీ, కృతి భర్త అయిన మిట్టపల్లి రామిరెడ్డిగారిని గురించీ – వారి వారి ప్రత్యేకతను సంగ్రహంగా చిత్రించారు.

గ్రంథాలయోద్యమాన్ని గురించీ, అది అనుసరించవలసిన పద్ధతులను గురించీ అవసరమైనచోట్ల తగిన సూచనలతో కూడా వివరించి రచయిత గ్రంధాలయ కార్యకర్తగా తమబాధ్యతను చక్కగా నిర్వహించారు. పుస్తక స్వరూపం, ముద్రణ బాగుగా ఉన్నవి

గ్రంథాలయోద్యమాన్ని గురించి వివరంగా తెలిసికొనగోరితే ఈ పుస్తకం చదవడం మిక్కిలి అవసరం.

"అంగీరస"

రెండు స్తోత్ర గ్రంథాలు

1. స్తోత్ర పంచకమ్

[రచన : శ్రీ శ్రీ నృసింహానందభారతీ మహాస్వామి, క్రౌను సైజు 31 పుటలు. వెల రూపాయి. ప్రకాశకులు, సత్తెనపల్లి తాలూకా పెదపాలెం గ్రామశిష్యబృందం. ప్రాప్తిస్థానం : శ్రీ ప్రఖ్య సమీరకుమారదేవ, 17/A(10–3–155) సరోజినీదేవి రోడ్డు, సికిందరాబాదు-26. లేక శ్రీ చిగురుపాటి వేంకటశేషయ్య, పెద పాలెం పోస్టు, సత్తెనపల్లి తాలూకా, గుంటూరు జిల్లా.]

2. శ్రీ వల్లభరాయ దేవస్తోత్రమ్

[రచన : శ్రీ శ్రీ నృసింహానందభారతీ మహాస్వామి. క్రౌను సైజు 8 + 29 పేజీలు. వెల రూ 1–50. ప్రకాశకులు – శ్రీ వల్లభరాయ దేవస్థాన అర్చక బృందం. ప్రాప్తిస్థానం–శ్రీమాన్ దీవి హనుమాచార్యులు, శ్రీ వల్లభరాయ దేవస్థాన ప్రధానార్చకులు, స్వర్ణ, చీరాల తాలూకా, ప్రకాశంజిల్లా.]

(1) శ్రీ శ్రీ నృసింహానంద భారతీ మహాస్వామువారు గుంటూరులోని శ్రీ శృంగేరీ శ్రీ విరూపాక్ష పీఠాధీశ్వరులు. జగ ద్గురువులు ఆధ్యాత్మిక తత్త్వవేత్తలే కాకుండా సంస్కృతాంధ్రా లలో మహావిద్వాంసులు శిష్యకోటికి ఆధ్యాత్మిక ప్రబోధం చేస్తూ, అనుగ్రహిస్తున్న మహనీయులు. సత్తెనపల్లి తాలూకా పెదపాలెం గ్రామంలోని శిష్యుల ప్రార్థనపయి శ్రీ మహాగణపతి, శ్రీ వేంక టేశ్వరస్వామి శ్రీ నీలగ్రీవేశ్వర, శ్రీ సహస్రలింగేశ్వర, శ్రీ కుమార

దేవతలపై స్తోత్రాలు అయిదు రచించారు. ఆ శిష్యులే వీటిని ప్రకటించారు. ఈ స్తోత్రపంచక శైలి రమణీయమై, అందరికీ సులభగ్రాహ్యమై ఉన్నది. ఈ స్తోత్రాలలో మొదటిదానిలో పది, రెండవదానిలో ఇరవైయేడు, మూడవదానిలో ముప్పయి ఎనిమిది, నాల్గవదానిలో పద్దెనిమిది, అయిదవదానిలో పదమూడు శ్లోకాలు ఉన్నవి.

మహాగణపతి స్తోత్రంలో ఒక శ్లోకం —

వరదాభయ కరపల్లవ !
పరమాద్భుత దివ్యరూప ! పాపవిశోష !
మకుటోల్లస దిందుకలా
సుందర ! వందారు బృందనవ మందార !

నీలగ్రీవేశ్వర స్తోత్రం "నీల, గ్రీవం గిరీశం గిరిజా సమేతం" అనే మకుటంతో ఉన్నది—

"దుర్గాపతిం దుర్గతి దుఃఖనాశం
భర్గం త్రివర్గ ప్రదమాది దేవమ్,
స్వర్గిస్తుతాంఘ్రిం ప్రణమామి నీల
గ్రీవం గిరీశం గిరిజా సమేతమ్" (పుట 17)

సహస్ర లింగేశ్వర స్తోత్ర శ్లోకాలకు 'సహస్ర లింగేశ్వర మాశ్రయేఽహం' అన్నది మకుటం.

"సుధాంశు రేఖారచితావతంసం
కుందేందు కర్పూర తుషారగౌరమ్।
కుఠార ఖండం డమరుం దధానం
సహస్ర లింగేశ్వర మాశ్రయేఽహమ్" (పుట 25)

అయిదవదైన శ్రీ కుమార స్తోత్రంలోని

"నీలాలకం సస్మితసుందరాస్యం
భస్మత్రిపుండ్రాంకిత ఫాలభాగమ్,
కౌశేయవస్త్రాన్విత పృష్ఠభాగం
కుమార మీడే గిరిజా కుమారమ్" (పుట 31)

అనే శ్లోకం కుమారస్వామి రూపాన్ని కళ్లకు కట్టిస్తూ ఉన్నది.

(2) ప్రకాశం జిల్లా చీరాల తాలూకా, 'స్వర్ణక్షేత్రం'లోని శ్రీ వల్లభరాయదేవుని స్తుతికదంబం ఇది. దీనిని కూడా — అక్కడి అర్చకుల ప్రార్థనపై శ్రీ శ్రీ నృసింహానందభారతీ స్వామివారే రచించారు ఇందులో శ్రీ వల్లభరాయదేవ సుప్రభాతం, శ్రీ వల్లభరాయదేవ విజయం, శరణాగతి స్తుతించబడినవి. చివర మంగళ శ్లోకాలున్నవి. ప్రతి శ్లోకానికి శ్లోకం క్రింద తాత్పర్యం ఇవ్వబడడం ఒక విశేషం. స్వామివారి రచన చాలా సరళమైనది. అయినా సంస్కృతానభిజ్ఞులకు మూలాన్ని అర్థం చేసుకొనుటకు ఈ తాత్పర్యం ఎంతో ఉపకరిస్తుంది.

దీనిని పరిచయం చేస్తున్న దీవి–రంగాచార్యులు (ఎం. ఏ.) గారు ఈ క్షేత్రాన్ని గురించిన చారిత్రక విషయాలను తెలియజేశారు. 12వ శతాబ్ది మధ్యలో 'సవరయపాలెం' గా ఈ గ్రామ నిర్మాణం జరిగి, తర్వాత 'సవరనపాలెం'గా మార్పుచెంది, కాలక్రమాన 'స్వర్ణ' అయిందట. మొదట ఇక్కడ భోగలింగస్వామి ప్రతిష్ఠ జరిగింది. మరికొన్నేళ్లకు వల్లభరాయదేవుడు ప్రతిష్ఠించబడి, గ్రామానికి క్షేత్రత్వం సిద్ధించింది. వేంకటగిరి ప్రభువులు దీనికి మాన్యక్షేత్రాలు ఇచ్చారు. వెంకటగిరిలో స్వర్ణమ్మ అనే గ్రామదేవత ఉన్నదట! ఇక్కడకూడా స్వర్ణమ్మ గుడి ఉన్నది. అది కాలక్రమాన ఏర్పడి ఉంటుంది. ఆ దేవతనుబట్టి యీ ఊరికి స్వర్ణ అనే పేరు వచ్చి ఉండవచ్చుననికూడా ఊహించవచ్చును.

శ్రీ స్వామివారి రచన చాలా సరళమై రసవంతంగా ఉండుట వల్ల భక్తులను ఎంతో ఆకర్షిస్తుంది. అందరూ కంఠస్థం చెయ్యడానికి ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. ఒక్క ఉదాహరణ—

'త్వన్నామ మంగళ మమంగళ కల్మషఘ్నం
స్మృత్వా నరోఽత్ర లభతేఽనిశ సుప్రభాతమ్,
క్షిప్రం ప్రసారయమయాఽఽఢ్య ! దయార్ద్ర దృష్టిం
శ్రీ వల్లభాఖిల విభో ! తవ సుప్రభాతమ్.' (పుట 2)

తాత్పర్యం : "ఓ అఖిలేశ్వరా ! అమంగళ దోషములను పోగొట్టి మంగళకరమయిన నీ నామమును స్మరించి నరులెల్లెడల, ఎల్లవేళల మఱల తమోనిశ స్పర్శలేని సుప్రభాతమును బడయగలుగుచున్నారు. ఓ వంద్యమూర్తీ ! నాపై దయారసార్ద్రమైన నీ కటాక్షవీక్షణమును బ్రసరింపజేయుము. ఓ వల్లభరాయదేవా ! నీకిదె సుప్రభాతము. నీదర్శనమున మా కిదె సుప్రభాతము."

ఈ స్తోత్రద్వయాన్నీ భక్తజను లందరూ ఆదరించగలరని భావిస్తున్నాను.

శ్రీ బులుసు వేంకటరమణయ్య

బసవేశ్వరుడు

"భారతీయ సాహిత్య నిర్మాతలు" అను శీర్షిక క్రింద కేంద్ర సాహిత్య అకాడెమీవారు ప్రకటించిన గ్రంథములలో 'బసవేశ్వరుడు' అను గ్రంథ మొకటి. ఈ ప్రచురణలన్నియు నాంగ్ల భాషలోనే యుండును. ప్రస్తుత గ్రంథమును నాంగ్లములో రచించినవారు హెచ్. తిప్పేరుద్రస్వామి. ఆంధ్రానువాదకుడు బి.వి. సింగరాచార్య.

బసవేశ్వరుడు బసవన అను పేరు వినగానే మనకు స్ఫురించునది కన్నడ దేశమున నేటికిని సజీవముగానున్న వీరశైవ మతము బసవన. వీరశైవము, ఈ రెండును శరీర ప్రాణములవలె అవినాభావ సంబంధములు గలవి. బసవన వీరశైవ మతోద్ధారకుడుగా నేటి కెనిమిది శతాబ్దముల క్రిందట నుండియు కన్నడాంధ్ర గ్రంథములలో కీర్తింపబడి ఆరాధనీయుడగుచున్నాడు ఆంగ్ల భాషలో, దక్షిణ భారత చరిత్రలో మత చరిత్ర వ్రాయునప్పుడు బసవన వీరశైవ మతోద్ధారకుడుగానే నిర్ణయించియున్నారు. అట్టి సందర్భమున బసవనను, భారతీయ సాహిత్య నిర్మాతలలో నొకనిగా చేర్చుట ఎంత మాత్రము సరికాదు బసవన కన్నడమున బసవన వచనము

బసవేశ్వరుడు : హెచ్. తిప్పేరుద్రస్వామి, సాహిత్య అకాడెమీ ప్రచురణ. రవీంద్ర భవనము, న్యూఢిల్లీ, డెమ్మీ పుటలు 65. వెల రు.2–50.

లను పేర వచనములు చేసి యున్నాడు అవి కన్నడ భాషలో ''వచన సాహిత్యము'' అను పేర వెలసినవి. కన్నడమున నీ వచన సాహిత్యము నవీనము అర్ధ శతాబ్దము క్రిందట మాత్రమే వెలుగులోనికి వచ్చినది. కన్నడ సాహిత్య చరిత్ర యందే పంపాది మహాకవులవలె, వచన సాహిత్య రచయితల నెవ్వరు సాహిత్య నిర్మాతలుగా పరిగణింపలేదు.

ఈ వచనములైనను సాహిత్య దృష్ట్యా కేవలము భక్తికి సంబంధించినవి, మత పరమైనవిగాని రసానందము గలిగించు లౌకిక సాహిత్యమునకు నెంత మాత్రము సంబంధించినవి కావు. ఇందువలన కేంద్ర సాహిత్య అకాడెమీ వారీ గ్రంథమును సాహిత్య నిర్మాతల శీర్షిక క్రింద ప్రకటించుట సుతరాము అసంబద్ధమునై యున్నది.

ఈ గ్రంథము కర్ణాటకమునకు సంబంధించినది. తెలుగు దేశమునకు సంబంధించినంత మట్టుకు కేంద్ర సాహిత్య అకాడమి వారు వేమన, వీరేశలింగం, డా సి. ఆర్. రెడ్డి, పోతన, వేదం వెంకటరామ శాస్త్రిగార్లనుగురించి గ్రంథములను ప్రకటించిరి.

ప్రకృత సమీక్షా గ్రంథము బసవేశ్వరుడు ఈ గ్రంథమున అయిదు అధ్యాయములు గలవు.

1) జీవిత చరిత్ర 2) భక్తి భాండారి 3) విప్లవ భావ మహర్షి 4) కాయక సందేశం 5) మహా కవి— గ్రంథాంతమున నీ సందర్భమున చదువదగిన 33 ప్రాచీన నవీన కన్నడ గ్రంథముల పట్టిక గలదు.

జీవిత చరిత్ర

గ్రంథకర్త కన్నడ గ్రంథములనే పరిశీలించి యిది వ్రాసినట్లున్నది గాని, బసవనను గూర్చి తెనుగు సాహిత్యమున వెలసిన గ్రంథములను నెంతమాత్రము పరిశీలించినట్లు కానరాదు. క్రిందటి యేడు 'బసవన వచనాలు—సమగ్ర సమీక్ష' అను గ్రంథము ప్రకటితమైనది. అది మైసూరు విశ్వ విద్యాలయమునకు సమర్పింపబడి పట్టమును పొందిన సిద్ధాంతగ్రంథము. డాక్టరు బాడాల రామయ్య రచితము.

ఇందు లభించిన మేరకు బసవన వచనము లాంధ్రీకరింపబడినవి.

గ్రంథకర్త తెలుగున నున్న పై గ్రంథమేకాక ఇతర తెలుగు గ్రంథములను కూడ చూడకుండ, ఎంత అస్తవ్యస్తముగా వ్రాసినాడో ఈ క్రింది విషయమును బట్టి తెలియగలదు.

బసవన కాలము

బసవన 36 ఏండ్లు మాత్రమే జీవించెనని ఈ గ్రంథము 15వ పుటలో నిట్లు వ్రాయబడియున్నది: ''బసవన్న బహుశః క్రీ. శ 1167లో 36 సంవత్సరాల వయస్సులోనే బసవన్న లింగాంగ సామరస్యం (సంగమ స్వామితో సమైక్యం పొందాడు''). ఇది శుద్ధముగా సంబద్ధము.

బసవనయే ''ముక్తి కంఠాభరణము'' అను తన వచనమున తాను 36 ఏండ్లు కల్యాణ కటకమున నున్నట్లు తెలిపినాడు.

''అయ్యా భక్తికి బిడారు కల్యాణి
ముప్పత్తారు వరుష
అయ్యా శివ వచన పాధదు కల్యాణి
ఇవుత్తేశు పదునె
కూడలి సంగమ దేవా''.

కల్యాణిలో బసవన తాను 36 ఏండ్లుండినట్లు స్వయముగా చెప్పుచుండగా ప్రస్తుత గ్రంథకర్త బసవన జీవిత కాలము 36 ఏండ్లు అనుటచేత రచయిత కనీసము కన్నడములోని బసవన వచనములనైనను సమగ్రముగా చదువలేదని స్పష్టమగుచున్నది. పరిశోధనలవలన బసవన జీవిత కాలమంతయు తేదీలతో సహా నిర్ణీతమై యున్నది. ఆ పరిశోధనా ఫలితములివి :

జననము	21–1–1140
ఉపనయనము	27–9–1148
సంగమేశ్వర ప్రవేశము జంధ్యమువిసర్జనము	31–8–1154
మంత్రి పదవి	1157
పదవీ విరమణ	1166
అనుభవ మండప నిర్మాణము	1169
లింగైక్యము	3–7–1196

బసవన జీవిత కాలము 56 సంవత్సరములు. పై వివరణము వలన ''జీవిత చరిత్ర'' అను నీ యధ్యాయమంతయు నిరుపయోగమైనది.

బసవన - వీరశైవము

బసవన తన వచనములలో ప్రపంచినది వీరశైవ భక్తిమతము—కాని యీ గ్రంథమున వీరశైవమతము అనుమాటయే కానరాదు. బసవన వైదిక కర్మమార్గమును ఖండించి వర్ణవ్యవస్థ నిర్మూలించి, అష్టాదశ వర్ణముల వారిని నొకేవర్ణముగా, లింగధారణచే బంధించి దైనందిన లౌకిక జీవితము నాధ్యాత్మిక భావనచే సమన్వయించి వీరశైవ భక్తిమతమునకు సాంఘికోత్తేజము గిలిగించిన వంత ప్రవక్త మహాపురుషుడు.

గ్రంథకర్త బసవన కర్మజ్ఞాన భక్తిమార్గములలో భక్తిమార్గమే ఆచరణీయమని ప్రతిపాదించి, ఏకైక వీరశైవ భక్తిచే వీరశైవ మతమును వ్యాప్తము చేసినాడను విషయము విస్మరించి 1) భక్తి భాండారి 2) విప్లవ భావమహర్షి 3) కాయక సందేశము అను నాధ్యాయములలో బసవన వచనములను కేవలము సాహిత్య దృష్టితో పరిశీలించి యీ గ్రంథము రచించినాడు. గ్రంథాంతమున 'మహాకవి' అన్న అధ్యాయమే యిందుకు నిదర్శనము. దీనిచే గ్రంథరచనాధ్యేయము విఫలమైనది.

బసవన - సర్వమానవతావాది

బసవేశ్వరుడు సర్వమానవతావాది. భారతీయ మత చరిత్రలో బుద్ధుని వెనుక సర్వమానవతా వాదిత్యమును ప్రచారము చేసినవాడు యావద్భారతమున బసవన యొక్కడే.

సర్వమానవతావాదిత్యము - ఆస్తికత

సర్వమానవతా సమతావాదము ప్రతిపాదించినది బుద్ధుడే అయినను అతడు నాస్తికుడు. నాస్తికతకు భారతవర్షమున కాస్కారములేదు. సర్వమానవతావాదిత్యమున ఆస్తికతను ప్రవేశపెట్టి సర్వమానవ శ్రేయోదాయకముగా మతము దిద్ది తీర్చిన మహా ప్రవక్త బసవన.

ఇదియే భారతీయ మతోద్ధారకులలో బసవనకు గల లోకోత్తర ప్రత్యేక విశిష్టత.

మహిమలు - మతవ్యాప్తి

బసవన తన మహిమలచేతనే వీరశైవ మతమును వ్యాప్తము చేసినాడనునది నిర్వివాదాంశము. ఇవి బసవ పురాణమున విశదముగా వర్ణితములైనవి. కాని యీ గ్రంథమున నీ మహిమలను గూర్చి ఏమియును లేదు. వానిలో కొన్నింటిని తెలుపుచున్నాను.

1) వంగకాయలు లింగములగుట.
2) జొన్నలు ముత్యములుగా మారుట.
3) దూరమున కాలుజారి పడిన వ్యక్తిని అచటకు వెళ్లకుండగనే లేవనెత్తుట.
4) ఒక హరిజనుని వ్రేళ్లయందు రక్తముగాక పాలు స్రవింపజేయుట.
5) ఘోరమగు విషమును త్రాగుట.

బసవన విషము త్రాగుట

బసవన మూడు కొప్పెరలు నిండిన భయంకర విషమును తానొక్కడే త్రాగి నిశ్చలుడై, నిర్వికారుడై విలసిల్లినాడు.

ఆంధ్రదేశమున బసవని సమకాలికుడగు మల్లికార్జున పండితుడు తన శివతత్త్వసారము అను కృతియందు బసవని — విషము త్రాగిన వృత్తాంతము, ఒకటిగాదు, మూడు పద్యములలో ప్రశంసించినాడు.

''పోసపోరై బంధారువు
బసవన విషమెత్తి త్రావి బ్రతుకడెరుద్రా''

అని వాని మకుటము —

విషము త్రాగి బసవన ప్రదర్శించిన మహిమ, కల్యాణ కటకమున ప్రజానీకమును నాశ్చర్యచకితులనుజేసి, అయస్కాంతము వలె నాకర్షించినది — వేలాది ప్రజలు వీరశైవ మతమును నవలంబించిరి — బసవని కాలమున వీరశైవ మత వ్యాప్తికి మహిమ యొక ముఖ్యసాధనము —

వీరశైవమత వ్యాప్తి

బసవని కాలముననే వీరశైవము విస్తారముగా కన్నడ దేశమున వ్యాపించినది. బసవన తన కాలమున 218000. రెండు లక్షల పదునెనిమిది వేలమందిని వీరశైవులనుగా రూపొందించినట్లు పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర తెలుపుచున్నది.

ఒక మత ప్రబోధకుడు తన జీవిత కాలములో తన మతము ననుసరించినట్లునింత ప్రజానీకమును త్రిప్పిన సంఘటన భారతీయ మత చరిత్రలో అరుదు.

పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రమునగల బసవన చరిత్ర — కన్నడ వీరశైవ చరిత్ర కారులకు తెలియకపోవుటచే నీ విషయము లోకమునకు వెల్లడికాలేదు.

''పట్టుభక్తి స్వామ్రాజ్య పట్టవర్ధనులు
ఎన్నంగలక్షయు నెను బదివేలు'' —

వీరుగాక నింకను వీరశైవ భక్తి వ్రతమును ప్రత్యేకముగా నడుపువారు గలరు —

వ్రతస్థులు 9000, వీరగణములు 7700, మిండజంగములు 12000, శీలవంతులు 10000, 180000 — పై — 180000 కలిపిన మొత్తము 218700 మంది కలరు. బసవని కాలమున 218700 మంది వీరశైవ మతస్థులు కలరని స్పష్టము.

బసవన యోగసిద్ధి

బసవన యోగ సాధనచే సిద్ధి పొందిన మహనీయుడు — ఇంద్రియ నిగ్రహము, యోగసాధన సామాన్య మానవునకు నావశ్యకమని వీరశైవ మతముగాలమున నిరూపించి, ఆచరణలో పెట్టి

సంఘమును, వీర్యవంతము చైతన్యవంతముగా నొనర్చినాడు ఈ బసవన యోగసిద్ధి బసవపురాణ పండితారాధ్య చరిత్రలలో వర్ణితమై యున్నది.

బసవన - గాంధి

రాజకీయ స్వాతంత్ర్యమునకు ముంటు సాంఘిక స్వాతంత్ర్యము రూపొందవలెనని — సాంఘిక స్వాతంత్ర్యమును ప్రకటించినవాగు భారత వర్షమున బసవనయే.

19 4 లో కన్నడ దేశమున బెల్గామునందు జరిగిన 39వ దేశీయ మహాసభ సందర్భమున గాంధీమహాత్ముని కన్నడ రాష్ట్ర ప్రజలు సందేశము నీయమని కోరినప్పుడు ఆతడిట్లు వారికి తెలియజేసినాడు—

"ఈనాడు నేను కర్ణాటకులకు ప్రత్యేకముగా నీయదగిన సందేశమేమియు లేదు.

మీ దేశమున బసవన యుదయించి, నాకంటె ఎనిమిది శతాబ్దములకు పూర్వమే — నే నీయదగిన సందేశమును మీకు ప్రసాదించినాడు. అహింస, అస్పృశ్యతా నివారణ, సత్యము, స్వకాయికము మున్నగు సిద్ధాంతములను నాచరణలో పెట్టినాడు. మీరవి తూచా తప్పక అనుసరించుటయే నా సందేశము"

పై విషయము లేవియు ప్రస్తుత గ్రంధమున కలికమునకైన గానరావు. కావున కేంద్ర సాహిత్య అకాడెమీ వారు ప్రకటించిన ఈ గ్రంధము నిష్ప్రయోజనము.

బసవపురాణ పండితారాధ్య చరిత్రలలో బసవని గూర్చిన విషయములను నవీన పరిశోధనలచే సమన్వయించి, సమగ్రము, సప్రమాణికమునైన 'బసవనిచరిత్ర' ప్రకటించిన బసవన స్వాతంత్ర్య జ్యోతిర్మయ స్వరూప మింకను విరాజిల్లగలదు.

బసవేశ్వరునిపై పరిశోధన కావించు వారికి ప్రథామావసరము లయిన బసవపురాణ పండితారాధ్య చరిత్రల రెండింటిని ఆంధ్ర పత్రికాధిపతులే ప్రకటించినారు

— కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

"అరుణోదయం" (అరుణకిరణ్)

అరుణోదయం అని పేరున్న యీ పుస్తకంలో మొత్తం తొమ్మిది కథలున్నాయి. శాకుంతలంలో చతుర్థాంకంలో పదిహేడో శ్లోకం ప్రథమ పాదం "అస్మాన్ సాధు విచింత్య సంయమధనాన్, ఉచ్చైః కులం చాత్మనః" లో లాగ యీ పుస్తకానికి ప్రఖ్యాత రచయిత బాసో, ఆచార్య రోణంకివారి ముందు మాటలున్నాయి.

కథలన్ని బాగున్నాయి. శైలి చక్కగా వున్నది కథలలో నాన్నుడి లేదు. "అరుంధతి నవ్వింది" అనే కథ మాత్రం రచయిత వుద్దేశ్యాన్ని చదువరికి చక్కగా చెప్పలేకపోతుంది. పెళ్ళిలో వో చిన్న పిల్ల, బంగారు గాజులు వో ముష్టివాడు దొంగిలించాడు అన్న అనుమానంతో ఆ ముసిలివాణ్ణి పందిరి రాటకు కట్టి కొట్టాం టారు. కథానాయకుని కాతనిమీద జాలివేస్తుంది. అతను దొంగ కాదేమోననే నమ్మకం కలుగుతుంది. అక్కడది అందరితో వాదిస్తాడు. చివరికి ఆ తాత మనుమరాలు తెచ్చి యిచ్చేస్తుంది. కథానాయకుని నమ్మక మేమవుతుంది .... పెళ్ళిలో నూతన వధూవరులకు చూపుతున్న అరుంధతీ నక్షత్రం తతనికేసి చూసి నవ్వుతోందట.

ఇహ పుస్తకం సమీక్షకు వచ్చిన కాపీలో కొన్ని పేజీలు లేవు. కొన్ని పేజీలు రెండు రెండున్నాయి. ఈ తప్పు బహుశా అన్ని ప్రతులకూ జరిగివుండి వుండచ్చు. 101 వ పేజి వెనుక భాగంలో అదే కథ వుండడానికి బదులు మరోకథ ఆరంభమయినది. 97 వ పేజి వెనుక 100 వ పేజి ముద్రయివున్నది. తత్ఫలితంగా "చీకటి" అనే కథ అంతమే చదువరికి తెలియదు.

ప్రకాశకులిలాటి విషయాలలో కాస్త జాగ్రత్త వహించడం చాలా అవసరం.

"స్పందన వాణి" (మాస పత్రిక)

[ప్రారంభ సంచిక, వెల : రూపాయిన్నర]

తొమ్మిదేళ్ళుగా పాఠకుని ఎదుట నిలచి, సాహితీ లోకంలో ఒక్కో మెట్టూ ఎక్కుతూ రస హృదయు లందరికి ఆహ్లాదకరంగా సారక్షిత గవాక్షాలను తెరుస్తూ ... అన్ని పవనాల్నీ ఆహ్వానిస్తూ, నేడు తనకంటూ వున్న వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, తనదైన బాణీని నిలబెట్టుకుంటూ ఈనాటి సాహితీ ప్రపంచంలో వినూత్న రాగం పలికేందుకు ఆవాడుద్భవించిన స్పందన యీనాడు "స్పందన వాణి"గా గొంతు విప్పుతోందని మా మాటలో ఎడిటర్(!) సరస్వతీ బాబూరావు పలికారు. ఇదిచదువరి చదివి తేల్చాల్సిన విషయం.

ఈ ప్రారంభ సంచికలో కథలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు, నాటికలు, సినిమా (సమీక్ష)లు వగైరాలున్నాయి. ప్రారంభ సంచికైన యీ జూలై సంచికలో చివుకుల పురుషోత్తం వ్రాసిన "చిన్న ప్రేమకథ", వి. కె విశ్వనాధశర్మ వ్రాసిన "కొత్త తరం" కథ బాగున్నాయి.

ముఖపత్ర అలంకరణ బాగులేదు. కొత్తరకంగా అంతకన్నా లేదు. స్పందనవాణి అన్న పేరును కాస్త చక్కగా వ్రాయిస్తే బాగుంటుంది. మాసపత్రిక ఆకారాన్ని చేసుకోడానికి సంపాదక వర్గం యీ పత్రికలో కొన్ని మార్పులు చేయాల్సివుంటుంది.

ఫాలాక్షుడు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.